www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

పాక్‌లో కుర్చీలాట!

పొత్తుపై నవాజ్ పీఎంఎల్-ఎన్, బిలావల్ భుట్టో పీపీపీ చర్చలు
ప్రధాని పదవి కావాలన్న బిలావల్ భుట్టో.. అంగీకరించని నవాజ్
ఫలితాల్లో ఇమ్రాన్ పార్టీ మద్దతున్న ఇండిపెండెంట్లకే అధిక సీట్లు
పార్టీ లేకపోవడంతో వారు అధికారానికి వచ్చే అవకాశాల్లేనట్లే
పీఎంఎల్-ఎన్‌లో చేరిన ఓ స్వతంత్ర అభ్యర్థి 2
తమనే ప్రభుత్వ ఏర్పాటుకు పిలవాలంటూ పీటీఐ డిమాండ్

నైరుతి ఆశాజనకం! 2

గతేడాది కంటే మెరుగ్గా వర్షాలు
జూన్ నాటికి ఎల్‌నినో బలహీనం
ఆగస్టు నుంచి లానినా పరిస్థితులు
ఎండల తీవ్రత కొనసాగే అవకాశం
వాతావరణ నిపుణుల విశ్లేషణలు

సోమవారం | 12-2-2024 | పేజీలు: 12 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 64 సంచిక (Issue) : 298 | శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, మాఘమాసం, శుక్లపక్షం; తిథి: తదియ సా. 5.46 తదుపరి చవితి; నక్షత్రం: పూర్వాభాద్ర మ 2.57 తదుపరి ఉత్తరాభాద్ర; వర్జ్యం: రా. 11.36-1.03; దుర్ముహూర్తం: మ. 12.53-1.38, మ. 3.10-3.55; అమృతఘడియలు: ఉ. 7.51-9.16; రాహుకాలం: ఉ. 7.30-9.00; సూర్యోదయం: 6.48; సూర్యాస్తమయం: 6.12 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

జగన్ భక్త ఐపీఎస్‌లు

విపక్షాల్ని తొక్కి వైసీపీని గద్దె ఎక్కించడమే టార్గెట్



కొల్లి రఘురామిరెడ్డి

నిఘా విభాగం చేతిలో ఉన్నపుడు టీడీపీ అధినేత చంద్రబాబును కొల్లి రఘురామిరెడ్డి అరెస్టు చేశారు. ఇప్పుడు... విజిలెన్స్, డ్రగ్ కంట్రోల్‌కు మారగానే, మాజీ మంత్రి నారాయణ మెడికల్ కాలేజీ, నివాసంపై అటాక్ చేశారు. ఎన్నికలు దగ్గరపడుతున్న వేళ ఇంకేం చేస్తారోననే చర్చ పోలీస్ వర్గాల్లోనే వినిపిస్తోంది.


పరమేశ్వర రెడ్డి

తిరుపతి ఉప ఎన్నికల్లో నమోదైన కేసుల దర్యాప్తులో ఎస్పీ పరమేశ్వర రెడ్డి వ్యవహరించిన తీరు, ఎఫ్ఐఆర్‌లు ఏకపక్షంగా మూసేసిన వైనాన్ని ఎన్నికల కమిషన్ తీవ్రంగా తప్పుబట్టింది. పనిష్ చేయాల్సిన ఈ అధికారిని ప్రకాశం జిల్లా ఎస్పీగా పంపారు. ఒంగోలు ఎంపీగా చెవిరెడ్డిని గెలిపించే డ్యూటీ వేశారని చెబుతున్నారు.


అన్బురాజన్

కడప జిల్లాలో వివేకా హత్యకేసులో నిందితుడిని విచారించేందుకు తీసుకెళుతున్న సీబీఐ అధికారులపై కిడ్నాప్ కేసు నమోదు చేసిన ఘనత ఎస్పీ అన్బురాజన్‌ది. అదే విశ్వాసాన్ని మరోసారి చూపించేందుకు టీడీపీకి బలమైన అడ్డా అనంతపురం ఎస్పీగా వేసినట్లు అంటున్నారు.


ఆనంద్ రెడ్డి

ఎన్నికల నిబంధనల ప్రకారం విశాఖపట్నం శాంతిభద్రతల డీసీపీ ఆనంద్ రెడ్డిని అక్కడినుంచి బదిలీచేసి గత నెల 29న విజయవాడ డీసీపీగా తొలుత నియమించారు. ఆయన 'విశ్వాసం' గురించి వైసీపీ నేతలు చెప్పడంతో ఆ వెంటనే ఇంటెలిజెన్స్‌కు బదిలీ చేశారు. ఉద్యోగులను తొక్కేసే పని అప్పగించారని సమాచారం.



వ్యూహాత్మకంగా కీలక విభాగాల్లోకి 'సొంత వర్గం'
పెద్దలకు చూపిన కృతజ్ఞతకు బదిలీలతో కొందరికి నజరానా
పక్కాగా దండోపాయ రచన.. టీడీపీ ప్రాంతాలపై గురి
వారి వ్యాపారాలు, నివాసాల్లో సోదాలకు స్కెచ్
కొల్లి రఘురామిరెడ్డికి విజిలెన్స్ డీజీ పోస్టు అందుకే
బాబును అరెస్టు చేసిన కొల్లి.. మొన్న నారాయణపై అటాక్
ఎస్పీ రిశాంత్‌రెడ్డికి ఐజీ ర్యాంకు ఆర్ఎస్‌టీఎఫ్ పోస్టు
చెవిరెడ్డిని ఎంపీగా గెలిపించేందుకే
ఒంగోలుకు పరమేశ్వర రెడ్డి?

(అమరావతి - ఆంధ్రజ్యోతి)
అధికారం అండతో తాము చేసే అరాచకాలకు వంత పాడే అధికారులను వైసీపీ ప్రభుత్వం కీలక స్థానాల్లో నియమించుకుంది. 'ఎస్ బాస్' అనే పలువురు ఐపీఎస్‌లను ఎంపిక చేసి... ఎన్నికల్ని దృష్టిలో పెట్టుకుని వారిని 'అవసరమైన' చోట సర్దుబాటు చేసింది. ప్రతిపక్షాలను తొక్కి పడేయడం, ఎన్నికల సమయంలో వైసీపీకి సహకరించడమే వీరి బాధ్యతగా చెబుతున్నారు. అంటే దండోపాయాన్ని ఖాకీలతో అమలు చేయిస్తారన్నమాట. అందుకోసం మొదట రెడ్డి సామాజిక వర్గీయులను, ఆ తర్వాత తమకు నమ్మకస్థులైన అధికారులను

మిగతా 12వ పేజీలో...

తిరుపతి ఉప ఎన్నిక తంతులో.. ఈసారి ఖాకీలపై ఈసీ వేటు

ఇద్దరు సీఐలు, ఎస్ఐ, హెచ్‌సీ సస్పెన్షన్
ఇంకో ఇద్దరు సీఐలు వీఆర్‌కు 11
అక్రమాలపై దర్యాప్తు జరపని వైనం
ఆనక కేసుల మూసివేతపై ఈసీ ఆగ్రహం
త్వరలో మరిన్ని సస్పెన్షన్లు!


ఇచ్ఛాపురం సభకు హాజరైన జనం.. ప్రసంగిస్తున్న లోకేశ్

నాలుగేళ్ల పది నెలలు ఒక ఎత్తు, ఈ రెండు నెలలూ ఒక ఎత్తు. సూపర్‌సిక్స్ కార్యక్రమాన్ని ప్రతి గడపకూ తీసుకెళ్లే బాధ్యత మనపై ఉంది. -లోకేశ్

మేమొస్తే ఏటా డీఎస్సీ

జగన్ నాలుగేళ్లు పడుకొని టీచర్ ఉద్యోగాలపై దగా: లోకేశ్

ఇక ఉత్తరాంధ్ర నుంచి వలసలు ఉండవ్!
ఊరికో ప్యాలెస్ కట్టుకున్న జగన్.. ఈ ప్రాంతానికి ఏం చేశాడు?
శ్రీకాకుళం జిల్లాకు ఇచ్చిన 60 హామీల సంగతేంటి?
ఈ సీఎం ఉత్తరాంధ్రకు పట్టిన శని.. గంజాయికి రాజధానిగా మార్చేశారు
కేసుల గురించి భయపడొద్దు.. ఎక్కువ కేసులున్నవారికి నామినేటెడ్ పదవులు
పేటీఎం బ్యాచ్ కామెంట్లకు స్పందించొద్దు.. వారి కుట్రలను తిప్పికొట్టాలి
విశాఖ ఉక్కును ప్రైవేటుపరం కానివ్వం.. అవసరమైతే రాష్ట్రమే కొంటుంది
టీడీపీ యువ నేత హామీ.. ఇచ్ఛాపురం, పలాస, టెక్కలి 'శంఖారావం' సభలు

శ్రీకాకుళం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): టీడీపీ-జనసేన ప్రభుత్వం ఏర్పడితే ఏటా డీఎస్సీ నిర్వహిస్తామని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్ ప్రకటించారు. ఊరికో ప్యాలెస్ కట్టుకున్న జగన్.. ఉత్తరాంధ్రకు ఏం చేశాడని నిలదీశారు. తామొచ్చాక ఈ ప్రాంతం నుంచి వలసలు లేకుండా చేస్తామని స్పష్టం చేశారు. 'శంఖారావం' పేరుతో శ్రీకాకుళం జిల్లాలో

మిగతా 11వ పేజీలో...

జగన్‌ను గద్దె దించుతాం

అప్పటి వరకు పోరాటం ఆగదు
ఓటుకు 10 వేలిస్తే తీసుకోండి
కానీ జగన్‌కు ఓటేయద్దు 11
దగాపడ్డ దళితుడు తిరగబడాల్సిందే
దళిత సింహగర్జనలో హర్షకుమార్

'బెరైటీస్'లో మరో గోల్‌మాల్!

కీలక ఫైళ్లు, సమాచారం గల్లంతు
డేటా, ఆన్‌లైన్ రికార్డుల్లేవ్
బినామీల లావాదేవీలు బయటకు రాకుండా అన్నీ మాయం
మంగంపేట అక్రమాల్లో కొత్త కోణం
విజిలెన్స్ పరిశీలనలో వెలుగులోకి
దర్యాప్తు సంస్థకు సహకరించని ఎండీసీ 3

ఆరోగ్యశ్రీ ప్యాకేజీ ధరల తగ్గింపు?

రక్త పరీక్షలు, టెస్టులు తగ్గించే ఆలోచన 2

ఏపీ గంజాయి.. గుప్పు గుప్పు


ఏవోబీలో గంజాయి తోట (ఫైల్)

దేశ ఆర్థిక రాజధాని ముంబై పబ్బుల్లో ఏపీ గంజాయే! కోల్‌కతా పాన్ షాపుల్లో ఏపీ గంజాయే!! తెలంగాణలోని పలు జిల్లాల్లో గల్లీ గల్లీలో ఏపీ గంజాయే!! భారతదేశంలో అటు హస్తిన నుంచి ఇటు తమిళనాట చెన్నై దాకా.. ఎందెందు వెదికి చూచిన అందందు ఏపీ గంజాయి జాడలే! దీనికి కారణం.. ఆంధ్రా-ఒడిశా సరిహద్దు ప్రాంతాల్లో పండించే అత్యంత నాణ్యమైన 'శీలావతి' రకం గంజాయి. గతంలో హిమాచల్‌ప్రదేశ్‌లో పండే మలానా క్రీమ్ రకానికి, కేరళలో ఎక్కువగా పండించే ఇడుక్కి గోల్డ్ రకం గంజాయికి దేశవ్యాప్తంగా ఎక్కువ డిమాండ్ ఉండేది. కానీ.. నాణ్యతలో ఆ రెండింటికన్నా మెరుగ్గా ఉండడం, ధర తక్కువ కావడంతో శీలావతి రకానికి గిరాకీ విస్తృతంగా పెరిగిపోయింది. ఎంతగానంటే.. నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో గడిచిన నాలుగేళ్లలో దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో పట్టుకున్న 23 లక్షల కిలోల గంజాయిలో 70 శాతం.. అంటే దాదాపుగా 16 లక్షల కిలోలకు పైగా ఏపీ నుంచి సరఫరా అయిందే! ఇదంతా దొరికిన గంజాయి లెక్క.. దొరకనిది ఇంకెంతో?

హిమాచల్ ప్రదేశ్ మలానా క్రీమ్, కేరళ ఇడుక్కిగోల్డ్ రకాలను తోసిరాజని 'శీలావతి' గంజాయికి గిరాకీ



శీలావతి రకం ఎండు గంజాయి

నాలుగేళ్లలో 23 లక్షల కిలోల గంజాయి పట్టివేత
అందులో 70 శాతం గంజాయి.. శీలావతి రకమే!
ఆంధ్ర-ఒడిశా సరిహద్దుల్లో గంజాయి విశ్వరూపం
అక్కడి నుంచి దేశంలోని వివిధ రాష్ట్రాలకు రవాణా
స్థానికంగా కిలో గంజాయి విలువ రూ.పది వేలే
రాష్ట్రాలు మారేకొద్దీ దాని విలువ రూ.1.2 లక్షలకు
ఎకరా సాగుతో ఆరు నెలల్లో రూ.9 లక్షల లాభం!
విశాఖ సెంట్రల్ జైల్లో 70% గంజాయి నిందితులే

(విశాఖపట్నం, పాడేరు-ఆంధ్రజ్యోతి)
శీలావతి రకం గంజాయి రారాణిగా చలామణి అవడానికి కారణం.. ఏవోబీ ప్రాంతంలోని వాతావరణం, నేల స్వభావం. అవే ఈ గంజాయికి ఓ రకమైన ప్రత్యేకతను తెచ్చాయి. శీలావతి గంజాయి మొక్క చూడడానికి అచ్చం బంతి పూల మొక్కలా ఉంటుంది. అంతే ఎత్తు పెరుగుతుంది. ఈ పంటకు నీరు ప్రధానం. గెడ్డలు, వాగులు ఉన్న ప్రాంతాల్లోనే సాగు చేస్తారు. రబీ సీజన్‌లో సమీపంలోని గెడ్డల నుంచి నీటిని మళ్లిస్తారు. శాస్త్రీయంగా ఎకరానికి 200 చోట్ల చిన్నపాటి గోతులు తవ్వుతారు. ఒక్కో గోతిలో 15-20 విత్తనాలు నాటుతారు. అవి వారంలో మొలకెత్తి నెల రోజుల్లో మొక్క దశకు చేరుకుంటాయి. చీడపీడలు పట్టిన ఆకులను వెంటనే తొలగిస్తారు. పురుగుల మందు పిచికారీ చేస్తారు. ఏటా జూలైలో పంట వేస్తే.. ఆ తర్వాత ఐదు నెలలకు (డిసెంబరుకు) పంట చేతికి వస్తుంది. జనవరిలో కోత కోస్తారు. పంట కోతకు వచ్చినప్పుడు

మిగతా 11వ పేజీలో...

అవినీతి రామ.. కృష్ణ కృష్ణా!




'ఊరు మనదే' తరహాలో దోపిడీ

పొలం.. స్థలం.. కాదేదీ అనర్హం
నియోజకవర్గంలో ఎటు చూసినా అవినీతి ఊడలు.. అక్రమాల జాడలు
ప్రత్యర్థులపై దాడులు చేస్తే పదవులు
అక్రమాలకు దన్నుగా ఉంటే వీరతాళ్లు
పోలీసు అండతో ప్రజాస్వామ్యమూ ఖూనీ
వెరసి.. వరుస విజయాలతో చెలరేగుతున్న అక్రమాల రాముడిది అంతులేని చరిత్ర



పల్నాడు జిల్లాలో అదో మారుమూల నియోజకవర్గం. అభివృద్ధి అనే మాటను పక్కన పెట్టేసి అధికారమే పరమావధిగా.. ఆదాయమే మార్గంగా అధికార పార్టీ నాయకుడు చెలరేగిపోతున్నారు. పొలాలు.. స్థలాలు.. ప్రకృతి వనరులు.. కాదేదీ సొంతానికి అనర్హం అన్నట్టుగా దోచేస్తున్నారు.. దాచేస్తున్నారు!

తనకు నచ్చిన వారిని, తాను మెచ్చిన వారిని దండాలో భాగం చేసుకోవడం ఈ నాయకుడి నైజం. అంతేకాదు, వారికి పదవులు ఇచ్చిమరీ.. అవినీతి, అక్రమాలు చేయించడంలో ఆయనది అంతులేని విజయం! కాదూ.. కూడదంటే.. వారి అంతుచూసేందుకూ రెడీ! 12


నగరి సభలో ప్రసంగిస్తున్న వైఎస్ షర్మిల

బీజేపీపై పంజా ఎప్పుడు?

ఒక్కసారైనా పంట నష్టపోయిన రైతులను ఆదుకున్నారా?
ఎన్నికల హామీలు మద్యం బ్రాండ్లలోనే అమలు
ఈ నియంత మళ్లీ వస్తే ప్రజాస్వామ్యం బతకదు
జగన్‌పై షర్మిల ఫైర్.. రోజాది 'జబర్దస్' దోపిడీ అని విసుర్లు

నగరి/పుత్తూరు అర్బన్, ఫిబ్రవరి 11: ఈ నియంత మళ్లీ అధికారంలోకి వస్తే రాష్ట్రంలో ప్రజాస్వామ్యం బతకదని సీఎం జగన్‌పై పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల సంచలన వ్యాఖ్యలు చేశారు. రాష్ట్ర విశాల ప్రయోజనాల దృష్ట్యా ఆలోచించి ఓటు వేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. చిత్తూరు జిల్లా నగరి పట్టణంలోని టవర్ క్లాక్ వద్ద ఆదివారం సాయంత్రం నిర్వహించిన బహిరంగ సభలో సీఎం జగన్ పాలనా వైఫల్యాలు, ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు కాకపోవడంపై ఆమె నిప్పులు చెరిగారు. 'మీరు పులి, సింహం అని

మిగతా 11వ పేజీలో...

మహీ.. మనోడే!

హార్సిలీహిల్స్‌కు చేరిన 'యాత్ర'లో కొత్త కోణం



అసలు పేరు వారణాసి మహేందర్ రెడ్డి
తల్లిది పులివెందుల.. తండ్రిది పుంగనూరు
2019 ఎన్నికల ముందే జగన్‌తో డీల్
'యాత్ర'కు దర్శకత్వం.. ప్రచారానికి పంచ్ డైలాగులు
'నేను విన్నానూ... నేను ఉన్నానూ' అనిపించింది ఆయనే
ఇప్పుడు 'యాత్ర-2' దర్శకత్వంతోపాటు నిర్మాణం కూడా
వచ్చే ఎన్నికలకూ సేవ అందించేలా 'ప్యాకేజీ'

(అమరావతి - ఆంధ్రజ్యోతి)
వారణాసి మహేందర్ రెడ్డి సన్ ఆఫ్ రాఘవరెడ్డి! ఈ పేరు ఎప్పుడైనా.. ఎక్కడైనా విన్నట్లు గుర్తుందా? పోనీ... 'యాత్ర-2' దర్శక, నిర్మాత మహీ వి.రాఘవ అంటే తెలుసా? నిన్నటిదాకా తెలియకపోయి ఉండొచ్చుకానీ... 'హార్సిలీహిల్స్' కథ విన్నాక కచ్చితంగా తెలిసే ఉంటుంది. అసలు విషయం ఏమిటంటే... మహీ వి.రాఘవ అసలు పేరు వారణాసి మహేందర్ రెడ్డి! అన్నమయ్య జిల్లాలోని ప్రముఖ పర్యాటక ప్రాంతమైన హార్సిలీహిల్స్‌లో 'మినీ సినీ స్టూడియో' పేరిట రెండెకరాలు కట్టబెడుతున్నది ఆయనకే! అసలు ఎవరీ 'మహీ వి.రాఘవ' అని ఆరా తీస్తే... ఆయన ఇంకెవరో కాదని, ముఖ్యమంత్రి జగన్‌కు 'మనోడే' అని తెలిసింది. ఆయనకు పులివెందుల మూలాలు కూడా ఉన్నాయి. మహీ తండ్రిది పుంగనూరు నియోజకవర్గం సదుం. తల్లిది పులివెందుల. ఎటు చూసినా మనోడి కిందే లెక్కే. సినీ పరిశ్రమలోకి

మిగతా 12వ పేజీలో...



అయోధ్యలో యూపీ 'అసెంబ్లీ'

» సీఎం యోగి పూజలు..పాల్గొన్న 325 మందికి పైగా శాసన సభ్యులు

అయోధ్య/లఖ్‌నవూ, ఫిబ్రవరి 11: అయోధ్యలోని రామమందిరాన్ని ఆదివారం 325 మందికి పైగా ఉత్తరప్రదేశ్ శాసనసభ్యులు సందర్శించి పూజలు నిర్వహించారు. లఖ్‌నవూ నుంచి 10 బస్సుల్లో రాష్ట్ర ఉభయ సభల సభ్యులు అయోధ్యకు చేరుకున్నారు. మందిరం అంతా 'జై శ్రీరామ్' నినాదాలతో మార్మోగింది. ఆలయంలో పూజలు నిర్వహించామంటూ సీఎం యోగి ఆదిత్యనాథ్ 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. మందిరం మెట్ల వద్ద ఫొటోలు దిగారు.

ఆరోగ్యశ్రీ.. ప్యాకేజీ ధరల తగ్గింపు?

» రక్త పరీక్షలు, టెస్టులు తగ్గించే ఆలోచన

» ట్రస్టులో చక్రం తిప్పుతున్న డిప్యుటేషన్ అధికారి

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ఆరోగ్యశ్రీ ట్రస్టు మళ్లీ గతి తప్పుతోంది. ఇప్పటికే ప్యాకేజీలపై జరుగుతున్న రచ్చ చాలదన్నట్లు ట్రస్ట్ అధికారులు ప్యాకేజీల రివిజన్ పేరుతో మరో వివాదానికి శ్రీకారం చుట్టారు. సాధారణంగా ట్రస్టులో ఏటా ప్యాకేజీల రివిజన్ జరుగుతుంది. కార్డియాలజీ, న్యూరాలజీ, గైనకాలజీ ఇలా విభాగాల వారీగా ఉన్న ప్యాకేజీలను పరిశీలిస్తారు. ఈ ఏడాది కొన్ని ప్యాకేజీలకు సంబంధించి కొత్త వాటిని కలపకపోగా ట్రస్టుకు డిప్యుటేషన్‌పై వచ్చిన ఓ అధికారి ఉన్న వాటిని తొలగించే ప్రయత్నం చేస్తున్నారు. ప్యాకేజీల్లో కొన్ని టెస్టులు, వైద్య పరీక్షలు తొలగించే ప్రయత్నాలు సాగుతుండడంతో నెట్‌వర్క్ ఆసుపత్రుల నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతోంది.

అధికారులను పక్కన పెట్టి

ఆరోగ్యశ్రీ ట్రస్టుకు డిప్యుటేషన్‌పై వచ్చిన అధికారి డాక్టర్ కాకపోయినా ట్రస్ట్ అధికారులను పక్కన పెట్టి మరీ ప్యాకేజీల రివిజన్‌లో జోక్యం చేసుకుంటున్నారు. సదరు అధికారి ట్రస్టులోని అన్ని విభాగాల్లో జోక్యం చేసుకుని, 'అంతా నేనే' అన్నట్లు వ్యవహరిస్తున్నారు. సీఎంవో, మంత్రి పేరు చెప్పి విభాగాధిపతులు, చివరికి సీఈవోపై కూడా పెత్తనం చెలాయిస్తున్నారు. కొన్ని ప్యాకేజీల్లో రక్త పరీక్షలు, ఇతర టెస్టులను తొలగిస్తున్నా ఏమీ మాట్లాడడం లేదు. ముఖ్యంగా కార్డియాలజీకి సంబంధించిన కొన్ని వైద్య పరీక్షలు, టెస్టులు అవసరమా? అంటూ వాటిని తొలగించే ప్రయత్నం చేస్తున్నారు. నిబంధనల ప్రకారం ప్యాకేజీల రివిజన్ వ్యవహారం మొత్తం ట్రస్టులోని వైద్యుల పర్యవేక్షణలో జరగాలి. కానీ, సదరు అధికారి అన్ని విషయాల్లో జోక్యం చేసుకుని తానే సీఈవో అన్నట్టు వ్యవహరిస్తున్నారు.

మెడికల్ ఆడిట్‌లో జోక్యం

ఆరోగ్యశ్రీ ట్రస్టులో 'మెడికల్ ఆడిట్' విభాగం అత్యంత కీలకం. దీనిలో సీనియర్ వైద్యులు, అత్యంత అనుభవమున్న వైద్యులు మాత్రమే ఉండాలి. నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో జరిగిన శస్త్ర చికిత్సలకు సంబంధించి చోటు చేసుకున్న పొరపాట్లు, తప్పులపై ఈ విభాగం దృష్టి పెడుతుంది. ఇంతటి కీలక విభాగాన్ని కూడా సదరు అధికారి తన గుప్పిట్లోకి తీసుకున్నారు. తనకు నచ్చని కొన్ని ఆస్పత్రులకు మెడికల్ ఆడిట్ చేయిస్తూ, ఆయా ఆస్పత్రులను బెదిరిస్తున్నారు. ఇటీవల విజయవాడ, గుంటూరు, కడపలోని కొన్ని ఆస్పత్రుల్లో మెడికల్ ఆడిట్ నిర్వహించారు. వీటిలోని కొన్ని ఆస్పత్రులతో ముందే బేరాలు కుదుర్చుకున్నట్టు తెలిసింది.

ఈ ఏడాది 'నైరుతి' ఆశాజనకం!

» గతేడాది కంటే మెరుగ్గా వర్షాలు.. వాతావరణ నిపుణుల విశ్లేషణ

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా భావించే వ్యవసాయ రంగానికి మేలుచేసే నైరుతి రుతుపవనాల సీజన్ ఆశాజనకంగా ఉంటుందని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు. వచ్చే జూన్ నుంచి సెప్టెంబరు వరకు గతేడాది సీజన్‌లో కంటే మెరుగైన వర్షాలు కురుస్తాయని విశ్లేషిస్తున్నారు. పసిఫిక్ మహాసముద్రంలో గతేడాది నుంచి కొనసాగుతూ, ప్రస్తుతం బలంగా ఉన్న ఎల్‌నినో క్రమేపీ బలహీనపడనుంది. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి తటస్థ పరిస్థితులు ప్రారంభమవుతాయి. తరువాత జూన్ నాటికి ఎల్‌నినో బలహీనపడుతుందని, ఆగస్టు నాటికి లానినా ఏర్పడుతుందని నిపుణులు వివరించారు. ముఖ్యంగా భారత ఉపఖండంపై ఎల్‌నినో ప్రభావం ఎక్కువగా ఉంటుంది. గతేడాది నైరుతి సీజన్ నాలుగు నెలల్లో సాధారణ వర్షపాతం 868.6 మి.మీ.కు గాను 820 మి.మీ. నమోదైంది. గతేడాది దేశ వ్యవసాయ రంగాన్ని దెబ్బతీసిన ఎల్‌నినో... 2024లోనూ కొనసాగుతోంది. వచ్చేనెల వరకు దీని తీవ్రత కొనసాగి తరువాత ఏప్రిల్ నుంచి తటస్థ పరిస్థితులు ప్రారంభమవుతాయని నిపుణులు చెబుతున్నారు. ఈ ఏడాది ఏప్రిల్, మే నాటికి ఎల్‌నినో నుంచి తటస్థ పరిస్థితులు రావడానికి 79శాతం అవకాశం ఉందని, జూన్- ఆగస్టు నాటికి లానినా అభివృద్ధికి 55శాతం అవకాశం ఉందని అమెరికా వాతావరణ సంస్థ నేషనల్ ఓషియోనిక్ అట్మాస్ఫిరిక్ అడ్మినిస్ట్రేషన్ (నోవా) పేర్కొంది. గతేడాది కంటే వచ్చే నైరుతి సీజన్‌లో మంచి వర్షాలు కురుస్తాయని వెల్లడించింది.

వర్షాలు పడినా.. ఎండలూ ఎక్కువే

పలు వాతావరణ మోడళ్లను పరిశీలించిన మీదట.. త్వరలో ఎల్‌నినో ముగిసి తటస్థ పరిస్థితులు ఏర్పడతాయని, తరువాత లానినా ఏర్పడే అవకాశాలున్నాయని భారత వాతావరణ శాఖ సీనియర్ అధికారి డి.శివానందపాయ్ అభిప్రాయపడ్డారు. ఎల్‌నినో తీవ్రత నేపథ్యంలో గత వేసవి కంటే ఈ ఏడాది వేసవి మరింత తీవ్రంగా ఉంటుందని ఇప్పటికే ప్రపంచ వాతావరణ సంస్థ వెల్లడించిందని, అయితే రానున్న నెలల్లో తటస్థ పరిస్థితులు ఏర్పడిన తరువాత లానినా వస్తే ఎండలు అంత తీవ్రంగా ఉండకపోవచ్చని అభిప్రాయం వ్యక్తం చేశారు.


ప్రజా రచయిత్రుల వేదిక నూతన కార్యవర్గం

ట్రోలింగ్ భూతాన్ని తరిమికొడతాం

» 'ప్రరవే' రాష్ట్ర మహాసభల్లో వక్తల శపథం

ఖమ్మం సాంస్కృతికం ఫిబ్రవరి 11: అభ్యుదయ శక్తులను, సామాజిక కార్యకర్తలను కలవరపెడుతున్న ట్రోలింగ్ భూతాన్ని తరిమికొడతామని పలువురు వక్తలు శపథం చేశారు. ఈ విష సంస్కృతిని మనో ధైర్యంతో ఎదుర్కొనాలని, సంఘటితమై పోరాడాలని బాధితులకు సూచించారు. ఖమ్మంలోని వేదిక ఫంక్షన్ హాల్‌లో శని, ఆదివారాల్లో ప్రజా రచయిత్రుల వేదిక(ప్రరవే) రాష్ట్ర ఏడో మహాసభలు నిర్వహించారు. ప్రముఖ యాంకర్ ఉదయభాను, జర్నలిస్టు తులసి చందు, ప్రముఖ సామాజిక కార్యకర్త అరుణ గోగులమండ, నాస్తికవాది బైరి నరేష్ తదితరులు ట్రోలింగ్‌కు గురైన సందర్భంలో తమ పరిస్థితిని, దానిని ఎదుర్కొన్న తీరును సభలో వివరించారు. ప్రముఖ కవయిత్రి శీలా సుభద్రాదేవి అధ్యక్షతన జరిగిన సభలో కవయిత్రి కాత్యాయినీ విద్మహే సంకలనం చేసిన 'నారి సారించిన నవల' పుస్తకాన్ని స్త్రీవాద కవయిత్రి శిలాలోలిత ఆవిష్కరించారు. కేంద్ర సాహిత్య అకాడమీ జనరల్ కౌన్సిల్ సభ్యుడు ప్రసేన్ తదితరులు ప్రసంగించారు. ట్రోలింగ్ బాధితుల కథనాలతో ముద్రించిన 'ట్రోల్' పుస్తకాన్ని స్త్రీవాద రచయిత్రి ఓల్గా ఆవిష్కరించారు. ప్రరవే జాతీయ అధ్యక్ష కార్యదర్శులుగా అనిశెట్టి రజిత, ఎండ్లూరి మానసను ఎన్నుకున్నారు. సమన్వయకర్తగా పి.రాజ్యలక్ష్మి, కోశాధికారిగా కొమర్రాజు రామలక్ష్మి, ఏపీ అధ్యక్షురాలిగా పి.అమరజ్యోతి, కార్యదర్శిగా కేఎన్ మల్లీశ్వరి, తెలంగాణ అధ్యక్ష, కార్యదర్శులుగా తిరునగరి దేవకీదేవి, కాత్యాయిని విద్మహేలను నియమించారు.

నేడు డీఎస్సీ నోటిఫికేషన్... 22 వరకు దరఖాస్తులు

అమరావతి, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి ప్రభుత్వం సోమవారం డీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేయనుంది. 6,100 ఖాళీలను ఈ నోటిఫికేషన్ ద్వారా భర్తీ చేయనున్నారు. షెడ్యూలు ప్రకారం సోమవారం నుంచి ఈ నెల 22 వరకు దరఖాస్తులను స్వీకరించనున్నారు. మార్చి 15 నుంచి 30 వరకు డీఎస్సీ పరీక్షలు జరుగుతాయి. ఏప్రిల్ 7న తుది ఫలితాలు విడుదల చేస్తారు.

నేడు బిహార్ సీఎం నితీశ్ బలపరీక్ష

పట్నా/శంషాబాద్/ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): బిహార్ సీఎం నితీశ్‌కుమార్ నేతృత్వంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం సోమవారం అసెంబ్లీలో బలపరీక్షను ఎదుర్కొనబోతోంది. విశ్వాస పరీక్షకు అనుకూలంగా ఓటు వేయాల్సిందిగా జేడీయూతోపాటు ఎన్‌డీఏ సర్కారుకు మద్దతిస్తున్న, మాజీ సీఎం జీతన్ రాం మాంఝీకి చెందిన హెచ్‌ఏఎం తమ ఎమ్మెల్యేలకు విప్ జారీ చేశాయి. మొత్తం 243 స్థానాలు కలిగిన బిహార్ అసెంబ్లీలో ప్రస్తుతం నితీశ్‌కు చెందిన జేడీయూకు 45 మంది సభ్యులు ఉండగా, బీజేపీకి 78 మంది, మాంఝీ పార్టీకి నలుగురు ఎమ్మెల్యేలు ఉన్నారు. మొత్తంగా మ్యాజిక్ ఫిగర్ (122)ను దాటి ఎన్‌డీఏకు బలం (127) ఉంది. మరోవైపు మహా గట్‌బంధన్‌లోని ఆర్జేడీ, కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీలకు కలిపి 114 మంది ఎమ్మెల్యేలే ఉండగా.. వారెవరూ గీత దాటకుండా ఆయా పార్టీలు క్యాంపు రాజకీయాలు కొనసాగిస్తున్నాయి. ఆర్జేడీ సభ్యులంతా ఆ పార్టీ నేత తేజస్వి యాదవ్ నివాసంలో ఉన్నారు. కాగా, వారం రోజులుగా తెలంగాణలో శిబిరంలో ఉన్న కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఆదివారం రాత్రి బిహార్‌కు చేరుకున్నారు. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం సమీపంలోని కాగజ్‌ఘాట్‌లో సిరి నేచర్ వ్యాలీలో ఉన్న ఎమ్మెల్యేలు పోలీసు బందోబస్తు మధ్య ఆదివారం మధ్యాహ్నం శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరుకున్నారు. అయితే వారి ప్రత్యేక విమానంలో సాంకేతిక లోపం తలెత్తడంతో కొన్ని గంటలు ఎయిర్‌పోర్టులోనే ఉన్నారు. చివరికి రాత్రి 7:30 గంటల ప్రాంతంలో విమానం ఎయిర్‌పోర్టు నుంచి టేకాఫ్ అయింది. ఇదిలా ఉండగా.. ఆర్జేడీకి చెందిన అసెంబ్లీ స్పీకర్‌పై ఎన్‌డీఏ పక్షాలు అవిశ్వాసాన్ని ప్రతిపాదించాయి.


ఇబ్రహీంపట్నం నుంచి బయల్దేరే ముందు బిహార్ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు

సొంతంగా 370 దాటేస్తాం!

మాకు 400 ఎంపీ సీట్లు వస్తాయని విపక్షాలే అంటున్నాయి: మోదీ

» కాంగ్రెస్ అధికారంలో ఉంటే దోపిడీ

» బయట ఉంటే కులమతాల చిచ్చు

» ఝాబువా సభలో ప్రధాని

ఝాబువా, ఫిబ్రవరి 11: వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ సొంతంగా 370 సీట్లకు పైగా గెలుస్తుందని ప్రధాని మోదీ ధీమా వ్యక్తంచేశారు. పార్లమెంటులో విపక్ష నేతలు సైతం ఎన్డీయేకి ఈ దఫా 400 స్థానాలకు మించి వస్తాయని చెబుతున్నారని గుర్తుచేశారు. ఆదివారం మధ్యప్రదేశ్‌లోని ఝాబువాలో గిరిజనులతో జరిగిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. ప్రతి పోలింగ్ బూత్‌లో గత ఎన్నికల్లో బీజేపీకి వేసిన ఓట్ల కంటే అదనంగా 370 ఓట్లు వేయించాలని.. అప్పుడు తేలిగ్గా 370 స్థానాలు వస్తాయని చెప్పారు. కాంగ్రెస్ గిరిజనుల వ్యతిరేకి అని మండిపడ్డారు. గ్రామాలు, రైతులు, పేదలు కేవలం ఎన్నికల సమయంలో మాత్రమే ఆ పార్టీకి గుర్తుకొస్తారని అన్నారు. 'అధికారంలో ఉంటే దోపిడీ చేయడం.. బయట ఉంటే కులం, మతం, భాష పేరిట విభజన చిచ్చు పెట్టడం దాని నైజం. తాను చేసిన పాపాల ఊబిలో తానే కూరుకుపోతోంది. గత ఏడాది అసెంబ్లీ ఎన్నికల్లో దారుణంగా ఓడిపోయింది. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లోనూ ఇదే పరిస్థితి' అని దుయ్యబట్టారు. ఝాబువాకు తాను ఎన్నికల ప్రచారం కోసం రాలేదని.. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీకి అద్భుత విజయం అందించినందుకు 'సేవకుడి'గా కృతజ్ఞతలు తెలియజేయడానికి వచ్చానని అన్నారు. 2047కల్లా దేశంలో..ప్రధానంగా గిరిజనుల్లో తలసేమియా వ్యాధి నిర్మూలన/నివారణకు చేపట్టిన జాతీయ మిషన్ గురించి చెబుతూ.. దీనిని ఎన్నికల కోసం ప్రారంభించలేదని.. గిరిజనుల ఆరోగ్యం కోసమే చేపట్టామని వివరించారు. 2014కి ముందువరకు కాంగ్రెస్ ఏలుబడిలో గిరిజనులకు దేశవ్యాప్తంగా వంద గురుకుల పాఠశాలలు మాత్రమే ఉండేవని.. గత పదేళ్లలో నాలుగు రెట్లకు పెంచామని చెప్పారు. కనీస మద్దతు ధర కల్పించే అటవీ ఉత్పత్తులను ఈ పదేళ్లలో పది నుంచి 90కి పెంచామని.. వన్ ధన్ కేంద్రాలను ఏర్పాటు చేశామని.. 'జన్-మన్ యోజన' అమలు చేస్తున్నామని తెలిపారు. 'భూహక్కుల పరిరక్షణకు 1.75 లక్షల మందికిపైగా లబ్ధిదారులకు 'స్వామిత్వ పత్రాలు' అందించాం. గిరిజనులకు భూహక్కులను తిరిగిచ్చాం' అని వివరించారు. రాష్ట్రంలో డబుల్ ఇంజన్ ప్రభుత్వం రెట్టింపు వేగంతో పనిచేస్తోందన్నారు. ఆదివారం ప్రారంభించిన రూ.7,550 కోట్ల అభివృద్ధి ప్రాజెక్టుల గురించి ప్రధాని ప్రస్తావించారు. 3 కోట్ల మంది మహిళలను 'లఖ్‌పతి దీదీలు'గా తయారుచేయడం తన గ్యారెంటీగా పేర్కొన్నారు. మహిళా రైతులకు డ్రోన్లు సమకూరుస్తామని.. వారంతా 'నమో డ్రోన్ దీదీలు'గా వ్యవసాయ విప్లవం తీసుకొస్తారని ఆశాభావం వ్యక్తంచేశారు.


విల్లంబులతో ప్రధాని మోదీ

బీజేపీ-ఆరెస్సెస్‌తో
విద్వేష వ్యాప్తి

జోడో న్యాయ్ యాత్రలో రాహుల్ గాంధీ

రాజ్‌గఢ్, ఫిబ్రవరి 11: బీజేపీ, ఆరెస్సెస్ విద్వేషాలను వ్యాప్తి చేస్తున్నాయని, అయితే ప్రేమ అనేది ఈ దేశ డీఎన్‌ఏలోనే ఉందని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ అన్నారు. రెండు రోజుల విరామం తర్వాత భారత్ జోడో న్యాయ్ యాత్ర ఛత్తీస్‌గఢ్‌లో ఆదివారం పునఃప్రారంభమైంది. రాయ్‌గఢ్‌లోని కెవ్డాబాడీ చౌక్‌లో నిర్వహించిన సభలో రాహుల్ ప్రసంగించారు. భావితరాల కోసం ద్వేషం, హింస లేని హిందుస్థాన్ కావాలని కాంగ్రెస్ పార్టీ కోరుకుంటోందని చెప్పారు. "ప్రస్తుతం దేశం ప్రతి మూలలోనూ విద్వేషం, హింస వ్యాపిస్తున్నాయి. భాష ఆధారంగా, ప్రాంతం ఆధారంగా ఇతరులంటే ఇష్టం లేదని కొందరు చెబుతున్నారు. ఇలాంటి ఆలోచనలు దేశాన్ని బలహీనపరుస్తాయి. బీజేపీ, ఆరెస్సెస్ విద్వేషాన్ని వ్యాప్తి చేస్తున్నా కూడా దేశంలో వివిధ మతాలకు చెందిన, విభిన్న ఆలోచనలు కలిగిన ప్రజలు ప్రేమతో ప్రశాంతంగా కలిసిమెలిసి జీవిస్తున్నారు" అని రాహుల్ పేర్కొన్నారు. గతేడాది మే నెల నుంచి గృహదహనాలు, హత్యాకాండలతో అట్టుడుకుతున్న మణిపూర్‌ను ప్రధాని మోదీ ఒక్కసారి కూడా సందర్శించకపోవడాన్ని ఆయన తప్పుబట్టారు. మణిపూర్ కాలి బూడిదైనా అక్కడ ప్రభుత్వ ఉనికే లేదన్నారు. సాయుధ దళాల్లో సైనికులను స్వల్ప కాలానికి నియమించే అగ్నివీర్ ప్రక్రియను రాహుల్ తప్పుబట్టారు. మిలటరీలోకి ఎంపికైనా రిక్రూట్ చేసుకోని 1.50 లక్షల మంది యువతకు నష్టపరిహారం చెల్లించడమో లేదా వారిని విధుల్లోకి తీసుకోవడమో జరిగే వరకూ కాంగ్రెస్ పోరాడుతుందని చెప్పారు. వీరందరికీ న్యాయం జరిగేలా తమ పార్టీ కృషి చేస్తుందని హామీ ఇచ్చారు.

లోకం తీరు



20 మంది మహిళలపై సామూహిక అత్యాచారాలు

» అంగన్‌వాడీల్లో ఉద్యోగాలంటూ మునిసిపల్ చైర్మన్, కమిషనర్ కీచక పర్వం

జైపూర్, ఫిబ్రవరి 11: ఉన్నత స్థాయిలో ఉండి అధికారాన్ని అడ్డం పెట్టుకొని అంగన్‌వాడీల్లో ఉద్యోగాలిప్పిస్తామని నమ్మించి దాదాపు 20 మంది మహిళలపై సామూహిక అత్యాచారాలకు పాల్పడిన మునిసిపల్ కౌన్సిల్ చైర్మన్, మాజీ మునిసిపల్ కమిషనర్లపై కేసు నమోదైంది. రాజస్థాన్‌లోని సిరోహిలో చోటుచేసుకున్న ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. హైకోర్టు ఆదేశాలతో సిరోహి మునిసిపల్ కౌన్సిల్ చైర్మన్ మహేంద్ర మేవాడా, అప్పటి మునిసిపల్ కమిషనర్‌గా ఉన్న మహేంద్ర చౌదరిపై కేసులు నమోదు చేసినట్లు ఆదివారం పోలీసులు తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉద్యోగాలిప్పిస్తామంటూ చాలామంది మహిళలకు ఇద్దరు నిందితులు ఆశ జూపారు. ఈ క్రమంలోనే నమ్మి వచ్చిన 20 మందికి కొన్నాళ్ల పాటు ఓ చోట భోజన వసతితో పాటు ఆశ్రయం కల్పించారు. వీలు చిక్కినప్పుడల్లా ఆహారంలో మత్తు మందు పెట్టి ఒక్కొక్కరిపై సామూహిక అత్యాచారాలకు పాల్పడుతూ వీడియోలు కూడా తీశారు. అనంతరం ఆ వీడియోలను సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తామని బాధితులను బెదిరిస్తూ లైంగికంగా వాడుకోవడంతో పాటు రూ.లక్షలకు లక్షలు డిమాండ్ చేశారు. దీనిపై పాలీ జిల్లాకు చెందిన ఓ మహిళ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. డీఎస్పీ పరాస్ చౌదరి కేసు నమోదు చేయకుండా తప్పుడు ఆరోపణలంటూ కొట్టిపారేశారు. దీంతో ఆ మహిళ సహా 8 మంది బాధితులు రాజస్థాన్ హైకోర్టును ఆశ్రయించారు. సాక్ష్యాధారాలను పరిశీలించిన కోర్టు.. ఇద్దరు నిందితులపై కేసు నమోదు చేయాలని ఆదేశించింది. కేసుకు సంబంధించి విచారణలు కొనసాగుతున్నాయి.

ఐరాస ఏజెన్సీ కిందే హమాస్ టన్నెల్!

» ఆధారాలతో ఇజ్రాయెల్ ఆరోపణలు

గాజా, ఫిబ్రవరి 11: హమాస్ ఉగ్రవాదులకు ఐక్య రాజ్య సమితి అనుబంధ సంస్థ యూఎన్ ఏజెన్సీ ఫర్ పాలస్తీనియన్ రిఫ్యూజీ(యూఎన్ఆర్‌డబ్ల్యూఏ) సిబ్బంది సహకారంపై ఇజ్రాయెల్ మరోమారు ఆరోపణలు చేసింది. గాజాలోని యూఎన్ఆర్‌డబ్ల్యూఏ హెడ్‌క్వార్టర్స్ కిందే హమాస్ భారీ టన్నెల్ ఉందని ఆధారాలతో సహా వెల్లడించింది. భూగర్భంలో 18 మీటర్ల లోతులో ఉన్న ఆ సొరంగం 700 మీటర్ల పొడవుతో కొనసాగుతోందని, ఆ టన్నెల్‌కు యూఎన్ఆర్‌డబ్ల్యూఏ కార్యాలయం నుంచే విద్యుత్తు సరఫరా జరిగిందని ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్(ఐడీఎఫ్) వివరించింది. ఈ ఆరోపణలను యూఎన్ఆర్‌డబ్ల్యూఏ ఖండించింది. అక్టోబరు 7న ఇజ్రాయెల్‌పై దాడులు జరగ్గా.. హమాస్‌పై ప్రతిదాడులు మొదలైనట్లు గుర్తుచేసింది. ఆ తర్వాత ఐదు రోజులకు-- అంటే.. అక్టోబరు 12న ఇజ్రాయెల్ ఆదేశాలతో తాము ఆ కార్యాలయాన్ని విడిచిపెట్టినట్లు వివరించింది. ఈ ఆరోపణలపై ఐరాస దర్యాప్తు ప్రారంభించింది. ఇజ్రాయెల్‌పై దాడిలోనూ హమాస్ తరఫున యూఎన్ఆర్‌డబ్ల్యూఏ సిబ్బంది పాల్గొన్నట్లు ఇజ్రాయెల్ ఆరోపణలు చేయగా.. పలువురిని తొలగించిన విషయం తెలిసిందే. కాగా.. రఫా శరణార్థి శిబిరంపై ఇజ్రాయెల్ దాడుల్లో 110 మంది మృతి చెందినట్లు గాజా ఆరోగ్య శాఖ ప్రకటించింది. శుక్రవారం అర్ధరాత్రి జరిపిన దాడుల్లో 110 మంది మరణించారని, వారిలో 12 మంది చిన్నారులున్నారు.

అభ్యంతరకరంగా నేతల భాష

మేధావులు, రచయితల అభిశంసనపత్రం

హైదరాబాద్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాల్లో రాజకీయ నాయకులు మాట్లాడుతున్న భాష పట్ల మేధావులు, సామాజికవేత్తలు, న్యాయకోవిదులు, కవులు, రచయితలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రజాక్షేత్రంలో ఉన్నవారు వాడే భాష సభ్యంగా ఉండాలని వారంతా అభిప్రాయపడ్డారు. 'తెలుగు రాష్ట్రాల్లో రాజకీయ పరిభాష' అంశంపై.. హైదరాబాద్‌లో ఆదివారం రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ భేటీలో పాల్గొన్నవారంతా.. ఏపీ, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన రాజకీయ నాయకులు, వారి అనుచరులు వాడుతున్న భాషను నిరసిస్తూ, అభిశంసన పత్రాన్ని విడుదల చేశారు. సీనియర్ జర్నలిస్ట్ కె.రామచంద్రమూర్తి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జాస్తి చలమేశ్వర్, హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ గోడ రఘురాం, విశ్రాంత ఐఏఎస్‌లు కాకి మాధవరావు, సుజాతారావు, ప్రొఫెసర్ హరగోపాల్, సుధ గోపరాజు, కె.శివారెడ్డి, అందెశ్రీ, 'ఆంధ్రజ్యోతి' ఎడిటర్ కె.శ్రీనివాస్, 'ఈనాడు' ఏపీ ఎడిటర్ ఎం.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రేపు ఢిల్లీలో మళ్లీ రైతుల నిరసన

అష్టదిగ్బంధనం చేసిన భద్రతాదళాలు.. పంజాబ్, హరియాణా సరిహద్దులు మూత

» నేటి సాయంత్రం చండీగఢ్‌లో రైతులతో కేంద్రం చర్చలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): వ్యవసాయోత్పత్తుల కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలనే డిమాండ్‌పై మరోసారి ఫిబ్రవరి 13న వేలాది మంది రైతులు ఢిల్లీని చుట్టుముట్టనున్నారు.పంజాబ్, హరియాణా, రాజస్థాన్, యూపీ, కేరళ, కర్ణాటక తదితర రాష్ట్రాల నుంచి రైతులు ఢిల్లీలో ప్రవేశించనున్నారు. సంయుక్త కిసాన్ మోర్చా, కిసాన్ మజ్దూర్ సంఘ్‌తో పాటు 200 రైతు సంఘాల తరఫున కనీసం 20 వేలమందికి పైగా రైతులు 2,500 ట్రాక్టర్లలో ఢిల్లీలో భారీ మార్చ్ నిర్వహించేందుకు సన్నద్ధమవుతున్నారు. ఇప్పటికే రైతుసంఘాలు అనేక రాష్ట్రాల్లో 40కి పైగా రిహార్సల్స్ జరిపారని, 100 సమావేశాలు జరిపారని సమాచారం అందడంతో భద్రతా దళాలు అప్రమత్తమయ్యాయి. ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా నివాసాల ఎదురుగా కూడా వారు నిరసన ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు సమాచారం అందడంతో ఢిల్లీ, ఉత్తరప్రదేశ్, హరియాణా పొలిమేరలను ఇప్పటికే అష్టదిగ్బంధనం చేశారు. సరిహద్దుల్లో బారికేడ్లు ఏర్పాటు చేశారు. అవాంఛనీయ ఘటనలు జరిగితే రైతులను తరలించడం కోసం హరియాణా సర్కారు రెండు పెద్ద స్టేడియాలను తాత్కాలిక జైళ్లుగా మార్చింది. ఏడు జిల్లాల్లో మొబైల్, ఇంటర్నెట్ సర్వీసుల్ని నిలిపివేశారు. కాగా, సోమవారం సాయంత్రం రైతుల డిమాండ్లపై చండీగఢ్‌లో కేంద్ర మంత్రులు అర్జున్ ముండా, గోయల్, నిత్యానంద్‌రాయ్ చర్చలు జరపనున్నారని పంజాబ్ కిసాన్ మజ్దూర్ సంఘర్ష్ కమిటీ జనరల్ సెక్రటరీ తెలిపారు. మరోవైపు, రైతుల నిరసనలకు, మంగళవారం నిర్వహించతలపెట్టిన భారీ మార్చ్‌కు కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే మద్దతు ప్రకటించారు.



పంజాబ్, హరియాణా సరిహద్దులో బారికేడ్లు

పంజాబ్-భారత్ మధ్య సరిహద్దులా: మాన్

రైతులతో కేంద్ర ప్రభుత్వం తక్షణమే చర్చలు జరపాలని, పంజాబ్‌కు భారత్‌కు మధ్య సరిహద్దులు సృష్టించవద్దని పంజాబ్ సీఎం భగవంత్ మాన్ హితవు పలికారు. జాతీయ రహదారులు, ఇతర రోడ్లపై హరియాణా ప్రభుత్వం విధిస్తున్న ఆంక్షల నేపథ్యంలో మాన్ స్పందించారు. 'హరియాణాలో ఏం జరుగుతుంది? పంజాబ్ సరిహద్దు వెంబడి వాళ్లు ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తున్నారు. పాకిస్థాన్ సరిహద్దుల్లో ఉన్నట్లు ఫెన్సింగ్‌లను పంజాబ్ సరిహద్దులో ఏర్పాటు చేస్తున్నారా?' అని మాన్ నిలదీశారు.

అంతరిక్షంలో
భారత్ స్పేస్ సెంటర్

'చంద్రయాన్' ప్రాజెక్ట్ డైరెక్టర్ వీరముత్తువేల్

చెన్నై, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): భారతదేశ కీర్తిప్రతిష్ఠలు ప్రపంచవ్యాప్తంగా చాటేలా అంతరిక్షంలో భారత్ స్పేస్ సెంటర్ ఏర్పాటుకు చర్యలు చేపట్టినట్టు 'చంద్రయాన్-3' ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ వీరముత్తువేల్ తెలిపారు. నీలగిరి జిల్లా ఊటీలో ఓ ప్రైవేటు కళాశాలలో 'అంతరిక్షంలో భారత్' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఆ సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరైన వీరముత్తువేల్ చంద్రయాన్ ప్రాజెక్ట్ గురించి ప్రసంగించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ... భారత అంతరిక్ష పరిశోధన కేంద్రం 'ఇస్రో' ఆధ్వర్యంలో రిమోట్ సెన్సింగ్, సమాచార సాంకేతిక, వాతావరణం, జీపీఆర్ఎస్, సముద్ర గర్భంల గురించి పరిశోధనలు జరుపుతున్నట్టు తెలిపారు. అంతేకాకుండా అంగారక, సూర్య గ్రహాలపై పరిశోధన నిమిత్తం ఉపగ్రహాలను ప్రయోగించామని, ప్రస్తుతం అవి విజయవంతంగా పనిచేస్తున్నాయన్నారు. 2040లోపు చంద్రునిపైకి మానవుడిని పంపే ప్రక్రియ పూర్తిచేస్తామని, చంద్రయాన్ ఉపగ్రహం ల్యాండర్, రోవర్‌లతో రూపొందించామని, దీని ఆయుష్షుకాలం ముగిసిందని, ఏ లక్ష్యంతో దీన్ని ప్రయోగించామో ఆ లక్ష్యం నెరవేరిందన్నారు. ఇస్రో తరఫున అంతరిక్షంలో భారత్ స్పేస్ సెంటర్‌ను ఏర్పాటుచేసే చర్యలు కూడా ముమ్మరం చేసినట్టు వీరముత్తువేల్ పేర్కొన్నారు.

పాక్‌లో కుర్చీలాట!

పొత్తుకై నవాజ్ పీఎంఎల్-ఎన్, బిలావల్ భుట్టో పీపీపీ చర్చలు

ఇస్లామాబాద్, ఫిబ్రవరి 11: పాకిస్థాన్ జాతీయ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు ఆ దేశంలో రాజకీయ అనిశ్చితికి తెరలేపాయి. జైలు శిక్ష అనుభవిస్తున్న మాజీ ప్రధానమంత్రి ఇమ్రాన్‌ఖాన్‌కు చెందిన పీటీఐ (పాకిస్థాన్ తెహ్రీక్-ఎ-ఇన్సాఫ్) పార్టీ మద్దతున్న స్వతంత్ర అభ్యర్థులు అత్యధికంగా 101 స్థానాల్లో విజయం సాధించారు. అయినప్పటికీ, వారు ఇండిపెండెంట్లుగా ఉండటం, కనీస మెజారిటీ రాకపోవటంతో.. నవాజ్‌షరీఫ్ పార్టీ పాకిస్థాన్ ముస్లిం లీగ్-నవాజ్ (పీఎంఎల్-ఎన్), బిలావల్ జర్దారీ భుట్టోకు చెందిన పాకిస్థాన్ పీపుల్స్ పార్టీ (పీపీపీ) చేతులు కలిపి సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయటానికి ప్రయత్నిస్తున్నాయి. పీఎంఎల్-ఎన్ 75 సీట్లు సాధించి దిగువ సభలో అతిపెద్ద పార్టీగా అవతరించింది. పీపీపీ 54 సీట్లు, ఇతర చిన్న పార్టీలన్నీ కలిపి 34 సీట్లు గెలుపొందాయి. పాకిస్థాన్ జాతీయ అసెంబ్లీ దిగువ సభలో 265 స్థానాలకు ఎన్నికలు నిర్వహించగా, అక్రమాలు జరిగాయని ఫిర్యాదులు రావడంతో ఒక నియోజకవర్గం ఫలితాన్ని పాకిస్థాన్ ఎన్నికల కమిషన్ నిలిపివేసింది. మిగిలిన 264 స్థానాల ఫలితాలను ప్రకటించింది. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలంటే కనీసం 133 మంది ఎంపీల మద్దతు అవసరం. ఎన్నికల ఫలితాల నేపథ్యంలో ప్రజా తీర్పును గౌరవించాలని, తమ పార్టీనే ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించాలని పీటీఐ డిమాండ్ చేస్తోంది. అయితే, అది సాధ్యమయ్యేలా లేదు. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించారంటూ ఫిర్యాదులు రావడంతో పీటీఐ ఎన్నికల గుర్తు 'క్రికెట్ బ్యాట్'ను ఆ పార్టీ అభ్యర్థులు వినియోగించుకోరాదని సుప్రీంకోర్టు ఆదేశించడంతో ఆ పార్టీ మద్దతుదారులంతా స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ చేశారు. ఇప్పుడు వారంతా తిరిగి పీటీఐలో చేరాలంటే, పార్టీ అంతర్గత ఎన్నికలు నిర్వహించుకొని, తిరిగి ఎన్నికల గుర్తును పొందాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో, పీపీపీ, ఇతర చిన్నపార్టీల మద్దతుతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు పీఎంఎల్-ఎన్ నేత నవాజ్ షరీఫ్ ప్రయత్నిస్తున్నారు. ఈ మేరకు ఆదివారం పీఎంఎల్-ఎన్, పీపీపీ మధ్య చర్చలు జరిగాయి. అయితే, తనకు ప్రధాని పదవి ఇవ్వాలని పీపీపీ చైర్మన్ బిలావల్ భుట్టో డిమాండ్ చేశారని, దీనికి పీఎంఎల్-ఎన్ అంగీకరించలేదని వార్తలు వెలువడ్డాయి. పీఎంఎల్-ఎన్, పీపీపీ పొత్తు ప్రయత్నాలను పీటీఐ తీవ్రంగా తప్పుబట్టింది. దేశంలో నెలకొన్న ఆర్థిక, పాలనాపరమైన సంక్షోభానికి ఈ పార్టీలన్నీ కలిసి ఏర్పాటు చేసిన గత సంకీర్ణ ప్రభుత్వమే కారణమని, వీళ్లంతా క్రిమినల్స్ అని మండిపడింది.


ఎన్నికల ఫలితాలకు వ్యతిరేకంగా ఇమ్రాన్‌ఖాన్ మద్దతుదారుల నిరసనలు

'మాతృభాష'లో సీఏపీఎఫ్ పరీక్ష!

» తెలుగు సహా 13 భాషల్లో నిర్వహణ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 11: కేంద్ర సాయుధ పోలీసు బలగాల(సీఏపీఎఫ్) కానిస్టేబుల్ నియామక పరీక్షను తొలిసారి హిందీ, ఇంగ్లీషుతో పాటు 13 ప్రాంతీయ భాషల్లో నిర్వహించనున్నట్లు కేంద్ర హోం శాఖ ఆదివారం ప్రకటించింది. దేశవ్యాప్తంగా 128 నగరాల్లో ఫిబ్రవరి 20 నుంచి మార్చి 7వ తేదీ వరకు ఈ పరీక్షలు జరగనున్నాయి. అందులో 48 లక్షల అభ్యర్థులు పాల్గొననున్నారు. హిందీ, ఇంగ్లీషుతో పాటు తెలుగు, అస్సామీ, బెంగాలీ, గుజరాతీ, మరాఠీ, మలయాళం, కన్నడ, తమిళ్, ఒడియా, ఉర్దూ, పంజాబీ, మణిపురి, కొంకణి భాషల్లో ఈ పరీక్ష నిర్వహించనున్నారు.

59వేల మంది భారతీయులకు
అమెరికా పౌరసత్వం

వాషింగ్టన్, ఫిబ్రవరి 12: అమెరికాలో గత ఏడాది 8.7 లక్షల మంది విదేశీయులకు ఆ దేశ పౌరసత్వం లభించగా అందులో భారతీయులు 6.7శాతం మంది ఉన్నారు. మొత్తం 59,100 మంది భారతీయులకు బైడెన్ ప్రభుత్వం అమెరికా పౌరసత్వాన్ని ఇచ్చింది. అమెరికా పౌరసత్వం పొందిన వారిలో భారతీయులు రెండో స్థానంలో ఉన్నారు. 1.10 లక్షల మంది (12.7%)తో మెక్సికన్లు మొదటి స్థానాన్ని పొందారు. 2022తో పోల్చితే ఈ సంఖ్య కొంత తక్కువగానే ఉంది. ఆ ఏడాది మొత్తం 6.69 లక్షల మంది విదేశీయులకు అమెరికా పౌరసత్వం లభించగా అందులో భారతీయుల వాటా 6.8 శాతం.

సూట్‌కేసుల సంస్కృతికి తెరలేపింది కేవీపీయే!

» సోనియా, రాహుల్‌కు ముడుపులు ఎవరి ద్వారా అందేవో అందరికీ తెలుసు

» వైఎస్ ఆత్మ.. షర్మిలకు పరమాత్మ : సత్యకుమార్



సత్యకుమార్

అనంతపురం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో ఎవరికి, ఎవరి ద్వారా ముడుపులు అందేవో దేశ ప్రజలందరికీ తెలుసని బీజేపీ జాతీయ కార్యదర్శి సత్యకుమార్ అన్నారు. కాంగ్రెస్ అగ్ర నేతలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీకి ముడుపులు అందించి, సూటుకేసులు పంపే సంస్కృతికి తెరలేపింది మాజీ ఎంపీ కేవీపీ రామచంద్రరావేనని ధ్వజమెత్తారు. ముఖ్యమంత్రి జగన్.. ప్రధాని మోదీకి ముడుపులు ఇస్తున్నారంటూ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలతో కేవీపీయే ఆరోపణలు చేయిస్తూ కొత్త డ్రామాకు తెరలేపారని ఆదివారమిక్కడ విమర్శించారు. పచ్చ కామెర్లు వచ్చినవారికి లోకమంతా పచ్చగా కనిపిస్తుందన్న చందంగా.. ముడుపులు, సూట్‌కేసుల గురించి కేవీపీ మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. వైఎస్ కుటుంబంతో సాన్నిహిత్యం, స్నేహబంధం ఉన్న కేవీపీ.. మోదీకి, అమిత్‌షా, జేపీ నడ్డాకు ముడుపులిస్తున్నామని సీఎం జగన్‌తో చెప్పించగలరా అని సవాల్ విసిరారు. వైఎస్‌కు ఆత్మగా చెప్పుకొని.. షర్మిలకు పరమాత్మగా మారి.. అంతరాత్మను చంపుకొని కేవీపీ ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నట్లుగా ఉందని ఎద్దేవా చేశారు. తెలంగాణలో పప్పులు ఉడక్కపోవడంతో షర్మిలను ఇక్కడకు తీసుకొచ్చారన్నారు. రానున్న ఎన్నికల్లో ఓడిపోయిన వెంటనే జగన్ విదేశాలకు పారిపోతాడని.. వైఎస్‌తో ఉన్న స్నేహబంధం నేపథ్యంలో ఆ కుటుంబం నుంచి షర్మిలను నిలబెట్టేందుకే కేవీపీ కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు.

మంత్రి కార్యక్రమానికి రాకపోతే ఆసరా కట్

» డ్వాక్రా సభ్యులకు యానిమేటర్ హుకుం.. ఆడియో వైరల్

పెనుకొండ టౌన్, ఫిబ్రవరి 11: శ్రీసత్యసాయి జిల్లా సోమందేపల్లి మండల కేంద్రంలో మంత్రి ఉషశ్రీ చరణ్ ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమానికి హాజరు కాకుంటే డ్వాక్రా సభ్యులకు వైఎస్ఆర్ ఆసరా నగదు పెండింగ్ పెడతామని యానిమేటర్.. పెట్టిన ఆడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది. సోమందేపల్లిలోని హైస్కూల్‌లో ఆదివారం వైఎస్ఆర్ ఆసరా నాలుగో విడత చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ క్రమంలో సోమందేపల్లికి చెందిన పార్వతి అనే యానిమేటర్.. మహిళా సంఘాల గ్రూపులో ఓ ఆడియో పోస్టు చేసింది. 'నేను పార్వతిని మాట్లాడుతున్నా. వైఎస్సార్ ఆసరా పడే ప్రతి సభ్యురాలు కచ్చితంగా (మంత్రి) సమావేశానికి రావాలి. మధ్యాహ్నం 2 గంటలకు వచ్చి కూర్చోండి. ప్రతి మెంబర్ హాజరు కావాలి. అలా హాజరైన మెంబర్‌కే ఆసరా నగదు డ్రా చేసి ఇస్తారు. లేదంటే అధికారులు పెండింగ్ పెడతారు. సంఘానికి ఒక పేపర్ ఇస్తారు. ఆ పేపరులో అందరూ తప్పక సంతకం చేయాలి' అంటూ పేర్కొన్నారు.

రాయలసీమ రాహు కేతువులు జగన్, మోదీ

» రాయలసీమ రాష్ట్ర సమితి విమర్శ

తిరుపతి(తిలక్‌రోడ్), ఫిబ్రవరి 11: రాయలసీమ ప్రాంతానికి పట్టిన రాహుకేతువులు జగన్, మోదీ అని రాయలసీమ రాష్ట్ర సమితి అధ్యక్షుడు డాక్టర్ కుంచం వెంకటసుబ్బారెడ్డి విమర్శించారు. తిరుపతిలో ఆదివారం ఆయన 6 అంశాలతో మేనిఫెస్టోను విడుదల చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ కడప స్టీల్‌ప్లాంట్‌కు నాలుగుసార్లు శంకుస్థాపన చేసిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అని ఎద్దేవా చేశారు. ప్రధానితో రాయలసీమ సమస్యలపై ఏ రోజూ మాట్లాడిన దాఖలాలు లేవన్నారు. వచ్చే ఎన్నికల్లో రాయలసీమవ్యాప్తంగా 52 అసెంబ్లీ, 8 లోక్‌సభ నియోజవర్గాల నుంచి రాయలసీమ రాష్ట్ర సమితి అభ్యర్థులు పోటీ చేస్తున్నారని, తాను కడప పార్లమెంటు నుంచి పోటీ చేస్తున్నానని వెల్లడించారు.

విశాఖ నుంచి ఎంపీగా పోటీ: కేఏ పాల్

విజయవాడ (ధర్నాచౌక్), ఫిబ్రవరి 11: వచ్చే ఎన్నికల్లో విశాఖపట్నం పార్లమెంట్ స్థానం నుంచి పోటీ చేస్తానని ప్రజాశాంతి పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు కేఏ పాల్ పేర్కొన్నారు. విజయవాడలోని ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఆయన మాట్లాడారు. ప్రజాశాంతి పార్టీకి 54 శాతం ఓటు బ్యాంకు ఉందని పేర్కొన్నారు.

'బెరైటీస్'లో మరో గోల్‌మాల్!



(అమరావతి-ఆంధ్రజ్యోతి)

మంగంపేట బెరైటీస్ అక్రమాల్లో కొత్త కోణం వెలుగు చూసింది. కొందరు అధికారులు, అక్రమార్కులు, వారి బినామీ కంపెనీల లావాదేవీలు బయటకు రాకుండా కీలకమైన ఫైళ్లు గల్లంతు చేసినట్లు తెలిసింది. మైన్ ఏరియా నుంచి స్టాక్ యార్డ్‌కు, అక్కడినుంచి కంపెనీలకు వెళ్లిన బెరైటీస్ వివరాలున్న ఫైళ్లను మాయం చేయడంతో పాటు కంప్యూటర్‌లో డేటాను కూడా తొలగించినట్లు సమాచారం. సీసీ కెమెరాలు ఆపేసి మరీ దొంకదారిలో బెరైటీస్‌ను తరలించుకుపోయిన విషయం ఇంతకుముందే వెలుగు చూడగా, ఇప్పుడు ఏకంగా కొన్నేళ్ల అమ్మకాలకు సంబంధించిన ఫైళ్లు, ఆన్‌లైన్ డేటాను గల్లంతు చేసినట్లు చెబుతున్నారు. ఈ బాగోతంపై ఇప్పటికే విజిలెన్స్ విచారణ సాగుతోంది. మంగంపేటలో కీలకమైన ఫైళ్లు కావాలని విజిలెన్స్ అధికారి లేఖ రాయగా, కొన్ని అందుబాటులో లేవని ఏపీఎండీసీ బదులిచ్చినట్లు తెలిసింది. నిజానికి ఆ ఫైళ్లు ఉంటేనే సంస్థకు ఎంత నష్టం వాటిల్లిందో, అక్రమార్కులు ఎంత దోచుకున్నారో అంచనా వేయడం సాధ్యపడుతుంది. ఈ విషయం ముందుగానే పసిగట్టిన ముఠా అక్కడ పనిచేసిన ఓ అధికారి సహకారంతో అన్నింటినీ సర్దేసినట్లు సమాచారం. దీంతో అదనపు వివరాలు కావాలని విజిలెన్స్ కోరినట్లు తెలిసింది.

తప్పిన కొద్దీ అక్రమాలు

ఉమ్మడి కడప జిల్లా మంగంపేటలో ఏపీఎండీసీకి బెరైటీస్ నిల్వలున్నాయి. కొన్నేళ్లుగా అక్కడ మైనింగ్ జరుగుతోంది. అయితే, 2020 నుంచి 2023 వరకు మంగంపేటలో రూ.వందల కోట్ల విలువైన బెరైటీస్‌ను అక్రమంగా తరలించుకుపోయారని, ఇందులో అధికారుల పాత్ర ఉందంటూ ప్రభుత్వానికి ఫిర్యాదులు వచ్చిన విషయం తెలిసిందే. ఈ పరిణామాలపై మంగంపేటలోని ఓ ఉన్నతాధికారితో పాటు మరో ఐదుగురిని సస్పెండ్ చేసిన విషయాన్ని ఇటీవల 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తీసుకొచ్చింది. ఈ వ్యవహారంలో తవ్విన కొద్దీ అక్రమాలు బయటకొస్తున్నాయి. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. మంగంపేట బెరైటీస్ అక్రమాల్లో సస్పెండైనవారిపై శాఖాపరమైన విచారణ చేపట్టాలని ప్రభుత్వం ఆదేశించింది. కానీ ఏపీఎండీసీ మాత్రం ఈ అక్రమాలపై విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విచారణ చేపట్టింది. కీలకాంశాలపై నిశిత పరిశీలన చేస్తోంది. మంగంపేట బెరైటీస్‌కు రమణను చీఫ్ ప్రాజెక్టు ఆఫీసర్‌గా నియమించిన ఫైలు, ఆయన విధులు, బాధ్యతలు ఏమిటో సవివరంగా తెలపాలని, సీపీవోగా ఉన్న సమయంలో ఆయన తీసుకున్న నిర్ణయాలకు సంబంధించిన ఫైళ్లు ఇవ్వాలని విజిలెన్స్ కోరింది. అయితే, ఆయన నియామక వివరాలు మాత్రమే ఇచ్చిన ఎండీసీ, మిగతా వివరాలు ఇవ్వలేకపోయిందని తెలిసింది. దీంతో రెండో దఫా విచారణ సంస్థ వ్యూహాత్మకంగా వ్యవహరించింది. రమణను ఎందుకు సస్పెండ్ చేశారు? అందుకు కారణాలు ఏమిటి? దానికి సంబంధించిన ఫైళ్లు, ఇతర డేటా ఇవ్వాలని కోరింది. కానీ విజిలెన్స్ కోరిన కీలక సమాచారం అందుబాటులో లేదని తెలిపినట్లు తెలిసింది. అంటే, సీపీవో సస్పెన్షన్‌కు దారితీసిన పరిణామాలను వివరించే ఫైళ్లు లేవని చెప్పకనే చెప్పినట్లయిందని సీనియర్ అధికారులు పేర్కొంటున్నారు. శాఖాపరమైన విచారణ చేపట్టకపోవడమే ఇందుకు కారణమని తెలిసింది. ప్రత్యేకమైన ఆడిటింగ్ చేపడితే కొందరు పెద్దల మౌఖిక ఆదేశాలతో జరిగిన అక్రమాలన్నీ వెలుగు చూస్తాయి. కాబట్టి ఆ విచారణ జోలికే వెళ్లలేదని సమాచారం.

అమ్మకాల వివరాలేవీ?

కొందరు అధికారులు, వారి బినామీ కంపెనీలు, బంధుగణం తీసుకొచ్చిన కంపెనీలు అడ్డగోలు ఒప్పందాల పేరిట బెరైటీస్‌ను కొన్నారు. ఏ, బీ, సీ గ్రేడ్ బెరైటీస్‌ను స్టాక్‌యార్డ్ నుంచి తరలించుకుపోయారు. ఓ కంపెనీకి సీ గ్రేడ్ అని చెప్పి ఏ గ్రేడ్ కట్టబెట్టారన్న ఆరోపణలు బలంగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో తమకు 2020-21 నుంచి 2023 వరకు అమ్మకాల వివరాలు అందించాలని విజిలెన్స్ కోరింది. "బెరైటీస్‌ను అక్రమ రవాణా ఆరోపణలున్న వ్యాపారుల వివరాలతో కూడిన జాబితాను మాకు అందించాలి. వారు ఏ కంపెనీ పేరిట ఎంత మొత్తంలో బెరైటీస్ కొన్నారు? ఎక్కడికి తరలించారు? దీనికి సంబంధించిన డేటా, ఇతర ఫైళ్లు ఇవ్వాలి" అని విచారణ సంస్థ కోరింది. ఈ ప్రశ్నకు ఎండీసీ అధికారులు నీళ్లు నములుతున్నారు. ఆ లిస్టు ఇప్పటి వరకు ఇవ్వలేదని తెలిసింది. కొంత డేటా తమ వద్ద అందుబాటులో లేదని పేర్కొన్నట్లు సమాచారం. డేటా అందుబాటులో లేదంటే కీలక రికార్డులను మాయం చేసి ఉంటారన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గుట్టు బయటకు రాకుండా ఉండేందుకు కొంత డేటాను కంప్యూటర్ల నుంచి, ఆన్‌లైన్‌లో తొలగించినట్లు స్పష్టమవుతోంది. దీన్ని గుర్తించిన దర్యాప్తు సంస్థ.. బెరైటీస్‌ను మైన్ ఏరియా నుంచి స్టాక్‌యార్డ్‌కు, అక్కడి నుంచి వ్యాపారులు తమ స్టాక్‌పాయింట్‌కు తరలించుకు వెళ్లే విధానం, దీనికి సంబంధించిన ఫైళ్లు, ఇతర వివరాలు తమకు సమర్పించాలని కోరింది. "ఈ మొత్తం ప్రాసెస్‌లో కొనుగోలుదారులు స్టాక్‌యార్డ్ నుంచి బెరైటీస్‌ను తమ స్టోర్‌పాయింట్‌కు ఎలా తీసుకెళ్లారు? ఆ వివరాలు ఏయే రికార్డుల్లో పొందుపరిచారు. ఈ ప్రక్రియలో సీపీవో నుంచి కిందిస్థాయి సిబ్బంది వరకు ఎవరి పాత్ర ఏమిటి? ఎవరు ఏ పని చేయాలి? మంగంపేట సీపీవో జాబ్‌చార్ట్‌తో పాటు ఇతర సిబ్బంది వివరాలు సమర్పించండి. అలాగే 2020-23 వరకు గ్రేడ్‌లవారీగా బెరైటీస్ అమ్మకాల్లో ఎవరెవరికి ఎంతెంత అమ్మారు? వాటి ధరలు, స్టాక్ వివరాలు, గ్రేడ్‌ల వారీగా బెరైటీస్‌కు నిర్వహించిన వేలంలో అమ్మకం ధరలు ఏమిటి?" అనే సమాచారం ఇవ్వాలని విజిలెన్స్ కోరింది. అయితే ధరలు, స్టాక్ వివరాలు మాత్రం తెలిపిన ఎండీసీ అధికారులు... మైనింగ్ ఏరియా నుంచి డంపింగ్ యార్డ్‌కు వచ్చిన బెరైటీస్ వివరాలు, స్టాక్‌లో కొన్ని అంశాలపై సరిగ్గా నివేదించలేదని తెలిసింది. వాటికి సంబంధించిన డేటా తమవద్ద అందుబాటులో లేదని, అందువల్ల ఇవ్వలేకపోతున్నామని పేర్కొన్నట్లు సమాచారం. అయితే విచారణలో ఆ అంశాలే కీలకమని దర్యాప్తు సంస్థ భావిస్తోంది.



తిరుమల శ్రీవారిని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుభాష్‌రెడ్డి ఆదివారం దర్శించుకున్నారు. - ఆంధ్రజ్యోతి, తిరుమల



జస్టిస్ శ్యామ్‌సుందర్‌కు స్వామివారి చిత్రపటాన్ని అందజేస్తున్న అధికారులు

పెన్నహోబిలంలో జస్టిస్ శ్యామ్‌సుందర్

ఉరవకొండ, ఫిబ్రవరి 11: శ్రీసత్యసాయి జిల్లా ఉరవకొండ మండలంలో వెలసిన పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామిని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్యామ్‌సుందర్ కుటుంబ సమేతంగా ఆదివారం దర్శించుకున్నారు. ప్రత్యేక పూజల అనంతరం వారికి అర్చకులు ఆలయ విశిష్టతను వివరించారు. స్వామివారి చిత్రపటం, తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఉరవకొండ కోర్టు న్యాయాధికారి దుర్గాకల్యాణి, సిబ్బంది పాల్గొన్నారు.

అతిసారం మరణాలని మీరెలా చెబుతారు?

» ఆరోగ్య శాఖ మంత్రి రజిని వితండవాదం

» గుంటూరు జీజీహెచ్‌లో పెరుగుతున్న డయేరియా కేసులు

» రోగుల కోసం హెల్ప్‌లైన్ సెంటర్ ఏర్పాటు



సమీక్ష నిర్వహిస్తున్న మంత్రి రజిని, పక్కన కలెక్టర్, మేయర్

గుంటూరు(మెడికల్) ఫిబ్రవరి 11: గుంటూరులో అతిసారం మరణాలు జరిగాయని ప్రతిపక్ష పార్టీలు విషప్రచారం చేస్తున్నాయని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని మండిపడ్డారు. గుంటూరులో అతిసారం ప్రబలి ఇద్దరు మృతి చెందగా, పెద్ద సంఖ్యలో రోగులు ప్రైవేటు, ప్రభుత్వ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ఇంత జరిగినా మంత్రి మాత్రం మరణాలకు కారణం అతిసారం కాదని చెప్పడం గమనార్హం. మరో పక్క అతిసారాన్ని అదుపులోకి తెచ్చేందుకు ఉన్నతాధికారులతో ఆమె ఆదివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం మంత్రి విలేకరులతో మాట్లాడుతూ.. ఇంకా వైద్యుల నుంచి పరీక్షల నివేదికలు పూర్తిస్థాయిలో అందకుండానే అతిసారం మరణాలని ప్రచారం చేయడం తగదన్నారు. విపక్షాలు అనవసరంగా యాగీ చేస్తున్నాయని, అవి డయేరియా మరణాలని వారెలా చెబుతారని ప్రశ్నించారు.

పెరుగుతున్న కేసులు...

గుంటూరు నగరంలోని పలు కాలనీల్లో ఆదివారం కూడా డయేరియా కేసులు వెలుగు చూశాయి. వాంతులు, విరేచనాలతో బాధపడుతూ పలువురు నగరంలోని ప్రైవేటు వైద్యశాలల్లో చేరారు. మరో 29 మంది గుంటూరు జీజీహెచ్‌లో చేరారు. ప్రస్తుతం 42 మంది బాధితులకు చికిత్స అందిస్తున్నామని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్‌కుమార్ తెలిపారు. డయేరియా పరిస్థితిపై సమీక్షించేందుకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. టోల్‌ఫ్రీ ఫోన్ నెంబర్ ప్రకటించారు. నగర పాలక సంస్థ కమిషనర్ కీర్తి చేకూరి ఆదివారం డయేరియా ప్రబలిన ప్రాంతాలను సందర్శించారు. పైపులైన్లను పరిశీలించారు. నీటి నాణ్యతపై నివేదికలు వచ్చే వరకు ఆయా ప్రాంతాలకు ట్యాంకుల ద్వారా నీటిని సరఫరా చేస్తామని మేయర్ మనోహర్ ప్రకటించారు.

ప్రభుత్వానిదే బాధ్యత: టీడీపీ వైద్య విభాగం

నెల్లూరు, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): డయేరియాతో గుంటూరులో ఇద్దరు చనిపోవడం బాధాకరమని, ఈ మరణాలకు రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని టీడీపీ వైద్య విభాగం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జెడ్.శివప్రసాద్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన నెల్లూరులో విలేకరులతో మాట్లాడుతూ..మృతుల కుటుంబాలకు రూ. 10 లక్షల చొప్పున పరిహారం అందించాలని డిమాండ్ చేశారు.



భక్తులతో నిండిన గుణదల రోడ్లు

కిక్కిరిసిన గుణదల

» ముగిసిన మేరీమాత 100 వసంతాల వేడుకలు

విజయవాడ (గుణదల), ఫిబ్రవరి 11: మూడు రోజులుగా జరుగుతున్న గుణదల మేరీమాత 100 వసంతాల మహోత్సవాలు ఆదివారంతో ముగియగా, భక్తులు భారీగా తరలివచ్చారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో రావడంతో గుణదల పురవీధులు కిక్కిరిసిపోయాయి. కొండ కింద మేరీమాత ప్రార్థనా మందిరంలో ప్రత్యేక ప్రార్థనలు చేసిన భక్తులు కొండపై గుహలోని మరియమాతను దర్శించుకున్నారు.

స్థానిక ప్రతిభ గుర్తింపుతోనే దేశ ప్రగతి

» దీన్ దయాళ్ సిద్ధాంతాన్ని బీజేపీ పాటిస్తోంది: పురందేశ్వరి

అమరావతి, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రతిభను గుర్తిస్తేనే దేశ ప్రగతి సాధ్యమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి వ్యాఖ్యానించారు. బీజేపీ సిద్ధాంత కర్త పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ వర్ధంతిని విజయవాడలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ అంత్యోదయ అనే మూల సిద్ధాంతాన్ని బీజేపీకి దీన్ దయాళ్ అందించారని చెప్పారు. పదేళ్ల క్రితం వరకూ దేశంలో స్కామ్‌ల గురించి పత్రికల్లో వస్తే, మోదీ ప్రధాని అయ్యాక స్కీమ్‌లు మాత్రమే అమలవుతున్నాయన్నారు. తపన ఉంటే సాధించలేనిది ఏదీ ఉండబోదని నిరూపించడానికి నరేంద్ర మోదీ జీవితమే ఆదర్శప్రాయమని కొనియాడారు. ఈ సందర్భంగా బీజేపీలో చేరిన కృష్ణా జిల్లా పారిశ్రామికవేత్త వాసిరెడ్డి మనోజ్, అనంతపురం జిల్లా ఉరవకొండకు చెందిన దగ్గుబాటి శ్రీరాములు దంపతులతోపాటు పలువురు ఎన్ఆర్ఐలకు పార్టీ కండువాలు కప్పి ఆమె ఆహ్వానించారు. కాగా, రైతు భరోసా కేంద్రాల్లో అవినీతి, ధాన్యం కొనుగోళ్లలో దగా, నకిలీ విత్తనాలు, నకిలీ పురుగు మందులు తదితర సమస్యలపై ఈ నెల 13న విజయవాడలో 'రైతు గర్జన' నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర కిసాన్ మోర్చా అధ్యక్షుడు చిగురుపాటి కుమార స్వామి తెలిపారు.

వైసీపీకి బుద్ధి చెప్పేందుకు 'సిద్ధం': యామినీ శర్మ

వైసీపీ అరాచక పాలనకు చరమగీతం పాడేందుకు ప్రజలు సిద్ధం అని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి యామినీ శర్మ ప్రకటించారు. రాష్ట్రంలోని వనరులు 99శాతం దోచుకోవడంలో విజయం సాధించిన వైసీపీ నేతలు ప్రజలకిచ్చిన హామీలు 99శాతం అమలు చేశామని చెప్పడం దారుణమైన అబద్ధమంటూ మండిపడ్డారు.

ఏపీటీఎఫ్ అధ్యక్షురాలిగా సీహెచ్ మంజుల

ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్(ఏపీటీఎఫ్) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా చెన్నుపాటి మంజుల, కె.భానుమూర్తి తిరిగి ఎన్నికయ్యారు. ఆదివారం విజయవాడలో జరిగిన రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా ఎ.శ్యామ్‌సుందర్‌రెడ్డి, కె.అశోక్‌కుమార్, టి.త్రినాథ, ఎం.అనిత, ఈవీ రామారావు, పి.వెంకటేశ్వర్లు, కార్యదర్శులుగా బి.నరసింహులు, డి.సరస్వతి, బీఏ సాల్మన్‌రాజు, బి.రఘుబాబు, సయ్యద్ చాంద్ బాషా, ఎస్.రవికుమార్, కె.శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా భాస్కర్‌రెడ్డి, ఉపాధ్యాయ పత్రిక సంపాదకులుగా షేక్ జిలాని ఎన్నికైనట్లు ఏపీటీఎఫ్ తెలిపింది.

తిరుమలలో ఏనుగుల గుంపు కలకలం

» పార్వేట మండపం వద్ద ఇనుప కంచె, చెట్లు ధ్వంసం

తిరుమల, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో ఆదివారం ఏనుగుల సంచారం కలకలం రేపింది. పాపవినాశనం మార్గంలోని పార్వేట మండపం సమీపంలో శనివారం రాత్రి ఏనుగులు డ్యాం వైపు వెళ్లాయి. అదే మార్గంలో తిరిగి అడవిలోకి వెళ్లిపోయాయి. ఏనుగుల పాదముద్రలను బట్టి ఐదారు ఏనుగులుండవచ్చని అటవీశాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. ఏనుగుల గుంపు పార్వేట మండపం పక్కనే ఉన్న శ్రీగంధ వనం ఇనుప కంచె, చెట్లను ధ్వంసం చేశాయి. డ్యాంలో నీటిని తాగేందుకే ఏనుగులు వచ్చి ఉంటాయని అధికారులు భావిస్తున్నారు.

బొమ్మలు: అక్బర్

అక్కడికి వెళుతూ...

1

ఎన్నో దుఃఖాలు ఈది, భయాలు దాటి
ఏళ్ళకి ఏళ్ళు నడిచి
ఈ ప్రశాంతమైన ఉదయానికి చేరుకున్నావు
ఈ క్షణం స్వచ్ఛ స్ఫటికంలా
నిలిచిపోతే బావుండును అనిపిస్తుందా
ఇక మెల్లగా మంచులా చెదురుతుంది ప్రశాంతత

2

ఈ బస్సు పైన ఆకాశం
అలసట లేక హాయిగా ఎగురుతూవుంది
కొండలు ఎప్పటిలా దయలోకి ముడుచుకొని
బంగారు ఎండ కాగుతున్నాయి
వాటి ముందు కదిలిన కలలన్నిటిలానే
నువూ మాయమౌతావు

3

నీ జ్ఞాపకాలు
ఈ గాలిలోకి ఇంకా ఆవిరికాకుండా
మిగిలిన అనుభవాల మేఘమాలలు
వాటిని వదిలేస్తే చాలు
జీవితంలో మునిగిపోతావు
కానీ, జీవితమంటే ప్రేమా, కాదా
ఇప్పటికీ తేల్చుకోలేదు కదా

4

తెలీనిభాషలో మాటలు నీ ప్రక్కన
పిట్టల కూతల్లానే కేవలం శబ్దాలు
అర్థం తెలీని మాటలు
అర్థాల నుండి విముక్తినిస్తాయి కాసేపు
అర్థం లేకపోవటంలోకి ఎగరలేక కదా
ఇదంతా ఇంత బరువు

5

ఆ కొండని చూస్తే దేవుడిని చూసినట్టు
తిరిగితే తండ్రి చుట్టూ ఆడుకొంటున్నట్టు
సృజించుకొన్న బంధమో, ఉద్వేగమో కావచ్చు
కొండంత అద్దంలో నువ్వే కనబడటమూ కావచ్చు
ఏ కారణమూ లేదనుకున్నా
దయలోకి కరిగిపోవటం కంటే ఏదీ అనుభవం

6

కారణాల్ని కూడా దాటాలి
ఈ బస్సు చెట్లనీ, కొండల్నీ దాటుతూ
కనబడని మలుపులోకి పదేపదే మాయమైనట్టు
కనబడని ఆనందం లోకి
తిరిగి రాకుండా తప్పిపోవాలి

(అరుణాచలం దారిలో)

బివివి ప్రసాద్
90320 75415

'వినిర్మాణం' ఆవిష్కరణ

సుంకిరెడ్డి నారాయణరెడ్డి రాసిన 'వినిర్మాణం', 'తాత్విక నేపథ్యంలో తెలుగు కవిత్వ పరిణామం' పుస్తకాల ఆవిష్కరణ ఫిబ్రవరి 18న హైద రాబాద్ బుక్‌ఫేర్, ఎన్టీఆర్ స్టేడియం, హైదరాబాద్‌లో జరుగుతుంది. సభా ధ్యక్షత: సంగిశెట్టి శ్రీనివాస్, ముఖ్య అతిథి & అంకిత స్వీకర్త: ఎన్. గోపి, వినిర్మాణం ఆవిష్కర్త: కె. శ్రీనివాస్, వక్త: బాణాల భుజంగ రెడ్డి; 'తాత్విక నేపథ్యంలో తెలుగు కవిత్వ పరిణామం' గ్రంథ ఆవిష్కర్త: గుడిపాటి, వక్త: ఎన్. వేణుగోపాల్.

కవిలె తెలంగాణ రీసెర్చ్ అండ్ రెఫరల్ సెంటర్

'జయజయహే' ఎందుకు?

"**జయజయహే** తెలంగాణ జననీ జయకేతనం
ముక్కోటి గొంతుకలూ ఒక్కటైన చేతనం
తరతరాల చరిత గల తల్లీ నీరాజనం
పదపదాన నీ పిల్లలు ప్రణమిల్లిన శుభతరుణం" ...ఈ పల్లవిలో, తరువాత వచ్చే అనేక చరణాలలో, ప్రతిచరణం చివరా పునరావృత్తమయ్యే జై తెలంగాణ నినాదోచ్చాటనలో ఏ విశేషాలున్నాయని ఉద్యమగీతంగా, సంకల్పగీతంగా, ప్రార్థనాగీతంగా తెలంగాణ సమాజం స్వీకరించింది? రాష్ట్ర అవతరణ తరువాత తొమ్మిదిన్నరేండ్ల పాటు పాలించిన ప్రభుత్వం, ఈ పాటకు అధికార ప్రతిపత్తి ఇవ్వడానికి నిరాకరించినప్పటికీ, పాఠశాలల్లో సభల్లో స్వచ్ఛంద ఆలాపనలు ఎందుకు జరుగుతూ వచ్చాయి?

విశేషాలు అనేకం. ఆ గీతం కలిగించే ఉద్వేగం, ప్రేరణ, ఉత్సాహం, దీక్షాభావం సామాన్యమైనవి కావు. వందల వేలాది మందిని ఒకే గొంతుగా మార్చగలిగే మహిమ ఏదో దానికి ఉన్నది. అట్లాగని అద్భుతమైన కవిత్వమేదో అందులో ఉన్నదని చెప్పలేము. చెప్పకూడదు కూడా. దీని కంటె గొప్ప కవిత్వం ఉన్న పాటలు అందెశ్రీ అనేకం రాశారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో గొప్ప భావుకతను, వ్యక్తీకరణను కలిగిన పాటలు పెద్ద సంఖ్యలో వచ్చాయి. కానీ, 'గీతం' (anthem)గా ఈ ఒక్క పాటనే జనం ఎంచుకున్నారు.



ఈ పాటలో కవిత్వం ముఖ్యం కాదు అంటే, దానికి మరేదో ఘనత ఉన్నదని, తనకు మాత్రమే చెందిన ఒక ప్రత్యేకత ఉన్నదని అర్థం. ఈ పాట జాతీయ గీతాల కోవలోనిది. ప్రజల సమూహ సంస్కృతిలో భాగంగా, ఉద్యమాలలో భాగంగా వెలువడే పాటల్లో కొన్ని జాతీయగీతాల రూపు తీసుకుంటాయి. వాటిలో కొన్ని ప్రభుత్వాల గుర్తింపు కూడా పొందుతాయి, అనేకం ప్రజల నాలుకల మీద మాత్రమే వి ంగులుతాయి. అనధికార జాతీయగీతాలు ప్రపంచమంతా ఉనికిలో ఉన్నాయి.

జాతీయ, ప్రాంతీయ, సామాజిక అస్తిత్వాలకు కొన్ని చిహ్నాలు ఉంటాయి. ఒక జెండా, ఒక ముద్ర, ఒక గీతం. సామూహిక సాంస్కృతిక స్ఫురణలతో ఆ చిహ్నాలు రూపొందుతాయి. ఆయా సమూహాలను ఏకం చేసే గుణం వాటికి ఉంటుంది. ఒకరికొకరు అపరిచితులైనవారు కూడా, ఒకే పాటకు గొంతు కలుపుతారు. సహోదరులుగా మారిపోతారు. ఉద్యమ సందర్భంలో సభల్లో ఊరేగింపుల్లో ఆందోళనల్లో ఇటువంటి గీతాలు ఇంధనంలాగా పనిచేస్తాయి.

ఈ గీతాలకు ఉండవలసిన ప్రధాన లక్షణం, ఎవరైనా పాడగలిగేట్టు ఉండడం. అందుకోసం పాట నడక ఒక మోస్తరు వేగంతో, బాణీ మాధుర్యం అనుభూతమయ్యేట్టుగా ఉండాలి. సులువుగా గుర్తుంచుకునేట్టుగా, పదేపదే ఆలపించాలనిపించేట్టు ఉండాలి. చిన్నచిన్న మాత్రల సంపుటులతో పాదాలు ఉండాలి. మార్చింగ్ బాణీ కానీ, ఆరాధనాత్మక భావం కలిగే బాణీ కానీ అయితే మంచిది. బృందాలుగా పాడడానికి, పాటలో కొన్ని చరణాలు లేదా పునరావృత్త భాగాలు శ్రోతలు గొంతు కలపడానికి అనువుగా ఉండాలి. ఎంత నెమ్మది నడక ఉన్నా, మధ్యలో బాణీ ఎంతో కొంత ఉచ్చస్థాయికి వెళ్లి, దిగాలి. 'జనగణమన'లో ఆ నడక చూడవచ్చు. ప్రపంచంలో ఉన్న జాతీయగీతాలను పరిశీలించి, వి మర్శకులు ఇటువంటి కొన్ని సాధారణ సూత్రాలను గుర్తించారు.

మద్రాసు నుంచి విడిపోవడానికి బ్రిటిష్ ఆంధ్రులు చేసిన ఉద్యమంలో అనేక తెలుగు జాతీయగీతాలు వెలువడ్డాయి. తొలిరోజుల్లో వచ్చిన 'ఆంధ్రదేశపు మట్టి అది మాకు కనకము' దగ్గర నుంచి వేములపల్లి శ్రీకృష్ణ 'చెయ్యెత్తి జైకొట్టు తెలుగోడా!' దాకా ఉద్యమ సందర్భాలలో ఆలపించిన గీతాలు అనేకం. వాటిలో కూడా ఘనచరిత్రను గర్వభావాన్ని కలిగించే అంశాలు, సమష్టి తత్వాన్ని ప్రేరేపించే అంశాలు ఉన్నప్పటికీ, ఆరాధనా భావంతో చేయవలసిన సామూహిక ఆలాపనకు పూర్తిగా అనువుగా లేకపోయాయి. చివరకు శంకరంబాడి సుందరాచారి 'మా తెలుగుతల్లికి మల్లెపూదండ' తెలుగు అభిమానుల ప్రార్థనాగీతంగా స్థిరపడింది. 'వందేమాతరం' గీతం లాగే, 'సారే జహాసే అచ్ఛా' లాగే, 'మా తెలుగు తల్లికి' కూడా అల్లనల్లన నడకతో, మధురమైన బాణీలో సాగుతుంది. బృంద ఆలాపనకు అనువుగా ఉంటుంది.

అందెశ్రీ 'జయజయహే' పాటకు గుర్తింపు ఇవ్వడానికి కె. చంద్రశేఖరరావు విముఖులని, ఆయనకు అభ్యుదయకవి రావెళ్ల వెంకట రామారావు 1950లలో రాసిన సుప్రసిద్ధ గీతం 'నా తల్లి తెలగాణ' వైపు మొగ్గు ఉండిందని చెప్పుకుంటారు.

"కదనాన క్రతువుల కుత్తుకల నవలీల
నుత్తరించిన బలోన్మత్తులేలిన భూమి
ధీరులకు మొగసాలరా!
తెలగాణ వీరులకు కాణాచిరా!"

- అంటూ మొదలయ్యే రావెళ్ల గీతం తెలంగాణపై చారిత్రక గర్వ భావాన్ని, ఉద్వేగాన్ని కలిగించేదే. అయితే, ఆ పాట బాణీ, గాయకుడు పాడితే, శ్రోతలు ఆనందించేట్టు ఉంటుంది తప్ప, సామూహిక గానానికి అనువుగా ఉండదు, ప్రతి చరణమూ ఒకే నడక కలిగిన భిన్నమైన పాదాలతో ఉంటుంది తప్ప, పునరావృత్తమయ్యే పాదాలు లేవు. భాష కూడా కొంత పాతదనంతో ఉంటుంది. అన్నిటికీ మించి, తెలంగాణ ప్రత్యేక అస్తిత్వం రాజకీయ ఉద్యమానికి సంబంధించిన వ్యక్తీకరణ ఆ పాటలో లేదు. రాష్ట్ర సాధన ఉద్యమంలో ఈ పాటను కూడా విరివిగా పాడుకున్నారు. కానీ, అందెశ్రీ పాటకు లభించిన స్వీకరణ వేరు.

పాట మౌలికంగా మౌఖిక కళారూపం కాబట్టి, దానికి లిఖిత రచనకు ఉన్న స్థిరత్వం సహజంగా సంక్రమించదు. పాట రూపొందడమే క్రమానుగతంగా రూపొందుతుంది. పాడిన ప్రతిసారీ కవి గాయకుడైనా, కేవల గాయకుడైనా ఎంతో కొంత భిన్నంగా పాడతారు. 'జయజయహే' గీతం కూడా కొంత కాలవ్యవధిలో క్రమంగా అవతరిస్తూ వచ్చింది. అందెశ్రీ స్వయంగా మెరుగుపరుస్తూ పోయారు. ఉద్యమకాలపు సహచరులు అనేకమందితో సంప్రదిస్తూ వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. అదే క్రమంలో కేసీఆర్ కూడా ఈ పాట రూపొందుతున్న ప్రక్రియలో అందెశ్రీతో రెండడుగులు నడిచారు. ఆ నాడు, ఈ పాటను మెచ్చిన నాయకుడు, తరువాత ఎందుకు భిన్నవైఖరి తీసుకున్నారో తెలియదు.

'జనగణమన' గీతంలో భారతదేశ నైసర్గిక విశేషాలను, వివిధ ప్రాంతాలను ప్రస్తావిస్తే, 'వందేమాతరం'లో భారతమాత చక్కటి మాటను, తియ్యటి పలుకును, స్వచ్ఛరూపాన్ని కీర్తించారు. అందెశ్రీ గీతంలో తెలంగాణ చరిత్రను, ముఖ్యంగా చారిత్రక చిహ్నాలుగా ఉండిన వ్యక్తులను, కవులను, వీరులను పేర్కొంటూ, ప్రాకృతిక వనరులను, అవి ప్రజలకు చెందాలనే ఆకాంక్షను కీర్తిస్తారు. ప్రతి చరణం ముగిసిన వెంటనే -

'జై తెలంగాణ జైజై తెలంగాణ
జై తెలంగాణ జైజై తెలంగాణ' అన్న ఉచ్చాటన మొత్తం పాటను, శ్రోతల భావోద్వేగాలను విద్యుదీకరిస్తుంది. పంపన, బద్దెన, హాలుడు, పాలకుర్కి, పోతన, రామదాసు, మల్లినాథ సూరి, ద్విగుడు మొదలైన తెలుగు, సంస్కృత కవి పండితుల ప్రస్తావనలతో కొన్ని చరణాల పాటు తెలంగాణ ఘనతను వర్ణించిన కవి, తరువాత రాణులు, రాజులు, వీరులు, తిరుగుబాటుదారులు, శిల్ప వాస్తు ప్రతీకలను పూసగుచ్చుతారు. తెలంగాణ కళాజీవనాన్ని చెబుతూ, 'అనునిత్యం నీ గానం అమ్మ నీవె మా ప్రాణం' అన్నప్పుడు, ఒక్కసారిగా శ్రోతల మనసుల్లో 'తెలంగాణ తల్లి' ఆవిష్కృతమవుతుంది. ఆ తరువాత, తెలంగాణకు ఏ శ్రేయస్సు కావాలో, భవితవ్యం ఎట్లా ఉండాలో కవి చెప్పుకునే సంకల్పం, రాష్ట్ర అవతరణ అనంతర పునర్నిర్మాణ ఆశయాలను సూచిస్తుంది. 'బడుల గుడులతో జనవిజ్ఞానం విరియాలని ఆకాంక్షిస్తూ "తడబడకుండా జగాన తల ఎత్తుకొని బ్రతుక ఒక జాతిగ నీ సంతతి ఓ యమ్మా వెలగాలి" అన్న ఆశ్వాసనను ఈ గీతం పలుకుతుంది. సుఖశాంతులతో తెలంగాణ సుభిక్షంగా ఉండాలని, తెలంగాణ ప్రజలల కలలు పండాలని కవి ఇచ్చిన ముక్తాయింపు, ఉద్యమ ఆశయాలను ఆర్ద్రంగా చెబుతుంది.

> **గీతాలాపన జరుగుతున్నప్పుడు, అది భాగస్వామ్య శ్రోతలలో కలిగించిన, కలిగిస్తున్న సామూహిక స్పందనే 'జయజయహే'ను తెలంగాణ రాష్ట్రగీతంగా అవతరింపజేసింది. ఒకప్పుడు ఉద్యమవాతావరణం, గీతం నుంచి ఒక స్వప్నావేశాన్ని, పట్టుదలను గ్రహిస్తే, ఇప్పుడు, ప్రత్యేక రాష్ట్రం అనే వాస్తవం, అదే గీతం నుంచి అస్తిత్వ గర్వాన్ని సంతృప్తి పరుచుకుంటుంది. ఆశించినవి నెరవేరాయా, నిరాశలోనూ జాతిగీతం ఉద్దీపన ఇస్తుందా అన్న సందేహాలు మిగిలే ఉంటాయి. కానీ, ఆకాశాలను అందుకునే ప్రయత్నాలు ఎప్పుడూ ఆగిపోవు.**

ఉద్రూతలూగుతున్న ఉద్యమసమాజంలోకి పాట వెళ్లినప్పుడు, అది ఇక ప్రజల సొత్తు మాత్రమే. మెరుగులు దిద్దుతూ, సవరిస్తూ కవి నుంచి అనేక వెర్షన్లు వచ్చినా, జనం ఏదో ఒకదాన్ని స్థిరపరుస్తారు. సుదీర్ఘం అనుకుంటే క్లుప్తం చేసుకుంటారు. 'వందేమాతరం' వంటి అనేక జాతీయగీతాలు పాడడానికి వీలుగా క్లుప్తరూపాన్ని, సరళరూపాన్ని తీసుకున్నాయి. తన పాట మీద తనకు అధికారం ఉందా లేదా అన్న చర్చ కంటె, ఆ పాట గమనం మీద కవికి ఇక నియంత్రణ ఉండదన్న గ్రహింపు ముఖ్యం.

గీతాలాపన జరుగుతున్నప్పుడు, అది భాగస్వామ్య శ్రోతలలో కలిగించిన, కలిగిస్తున్న సామూహిక స్పందనే 'జయజయహే'ను తెలంగాణ రాష్ట్రగీతంగా అవతరింపజేసింది. ఒకప్పుడు ఉద్యమవాతావరణం, గీతంనుంచి ఒక స్వప్నావేశాన్ని, పట్టుదలను గ్రహిస్తే, ఇప్పుడు, ప్రత్యేక రాష్ట్రం అనే వాస్తవం, అదే గీతం నుంచి అస్తిత్వ గర్వాన్ని సంతృప్తి పరుచుకుంటుంది. ఆశించినవి నెరవేరాయా, నిరాశలోనూ జాతిగీతం ఉద్దీపన ఇస్తుందా అన్న సందేహాలు మిగిలే ఉంటాయి. కానీ, ఆకాశాలను అందుకునే ప్రయత్నాలు ఎప్పుడూ ఆగిపోవు. తపనలున్న పాటలెపుడూ చల్లారిపోవు.

కె. శ్రీనివాస్

సాహిత్య వికాసానికి సరికొత్త అడుగు

ఆధునిక సమాజం పొందుతున్న జ్ఞానాన్ని స్థూలంగా మూడు రకాలుగా విభజించవచ్చు: విజ్ఞాన శాస్త్రాలు, సామాజిక శాస్త్రాలు, మానవీయ శాస్త్రాలు. విజ్ఞాన శాస్త్రాలలో ప్రకృతి శాస్త్రాలు, జీవశాస్త్రాలు ఉంటాయి. రాజనీతి శాస్త్రం, చరిత్ర, అర్థశాస్త్రం మొదలైన అధ్యయనాలను కలిపి సామాజిక శాస్త్రాలు అంటారు. సాహిత్య సంబంధమైన విషయాలన్నీ మానవీయ శాస్త్రంలోకి వస్తాయి. ఆధునిక కాలం పూర్వార్థంలో విజ్ఞాన శాస్త్రాల అభివృద్ధి ప్రపంచ గమనాన్ని మార్చింది. విజ్ఞాన శాస్త్రాలకు సమాంతరంగా ఎదిగిన సామాజిక శాస్త్రాలు విజ్ఞాన శాస్త్రాల ఆలంబనతో కుదురుకొని వికసించాయి.

ఆధునిక విశ్వవిద్యాలయాలు ఉనికిలోకి వచ్చాక శాస్త్రాలన్నీ అధ్యయనాంశాలుగా రూపొందాయి. అకడమిక్ పద్ధతులలో, ప్రమాణాలతో సిలబస్‌ను రూపొందించటం, పరిశోధనలు జరిపించటం విశ్వవిద్యాలయాల స్థాయిలో ప్రారంభమయ్యింది. పరిశోధనల ఫలితాలు ఎక్కువ మేరకు పెట్టుబడిదారుల ప్రయోజనాలను నెరవేర్చేవిగా మారాక, వాటి మీద పెట్టుబడుల శాతం కూడా పెరిగింది. విజ్ఞాన శాస్త్రాల మీద కేటాయించిన బడ్జెట్‌తో పోల్చితే సామాజిక, మానవీయ శాస్త్రాల పరిశోధనకు అనేక పరిమితులు ఏర్పడ్డాయి. మానవీయ శాస్త్రాల మీద జరిగే పరిశోధనలు వ్యక్తుల ఆసక్తుల మీద ఆధారపడి జరిగాయే కానీ వ్యవస్థాగతంగా కాదనే విషయం జరిగిన పరిణామాలను బట్టి తెలుస్తుంది. విజ్ఞాన శాస్త్రాలకు ఉన్న ప్రాధాన్యత సామాజిక శాస్త్రాలకు ఉండదు. ఈ రెండింటి పట్ల ఉన్న మోజు మానవీయ శాస్త్రాల విషయంలో ఉండదు.

విజ్ఞాన శాస్త్రాలు, సామాజిక శాస్త్రాలు ఆయా సందర్భాల్లో సమకాలీన పరిస్థితులకు అనువుగా రూపొందుతూ తమ ఉనికిని కాపాడుకుంటున్నాయి. కానీ మానవీయ శాస్త్రాలకు అనేక పరిమితులు ఏర్పడి, ఆటుపోట్లకు గురయ్యాయి. పరిశ్రమలు అనుసంధానంలో ఉంటూ విజ్ఞాన శాస్త్రాలు కొంత మేరకు నిధులను సమకూర్చుకుంటున్నాయి. దాని కోసం జాతీయంగా సమ్మేళనాలు కూడా జరుపుకుంటున్నారు. ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ లాంటి సందర్భాలు వాటి గమనం, గమ్యం గురించి చర్చించుకోవడానికి దోహదపడుతున్నాయి. సైన్సెస్‌లో ఇప్పటివరకు జరిగిన పరిశోధనలు, చేయవలసిన పరిశోధనాత్మక కృషి మీద చర్చోపచర్చలు చేసి అంతిమ ఫలితాలను రాబట్టడానికి 1914లో మొదలైన సైన్స్ కాంగ్రెస్ వేదికగా ఉంటుంది. ఈ కోవలోనే సామాజిక శాస్త్రాలలో 1935 నుంచి ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్ కూడా చాలా ప్రాచుర్యం పొందింది. చరిత్రలో జరిగిన, జరగవలసిన పరిశోధనల మీద విస్తృత చర్చలు, ప్రతిపాదనలు, నిర్ధారణలు ఈ సమావేశంలో జరుగుతాయి. అదేవిధంగా సోషియాలాజికల్ సొసైటి, ఎకనామిక్స్ కాంగ్రెస్, కామర్స్ ఫోరం లాంటి సంస్థలు ఏర్పడి పనిచేస్తున్నాయి.

అయితే మానవీయ శాస్త్రాలలోని సబ్జెక్టులకు ఇలాంటి వేదికల ఏర్పాటు, నిర్వహణ చాలా తక్కువగా ఉంది. కొన్ని ప్రాంతీయ భాషలు కావటం వలన కూడా వీటి విస్తృతికి పరిమితులు ఏర్పడ్డాయి. తెలుగు లాంటి భాషా సాహిత్యాల పట్ల స్థానిక ప్రభుత్వాల వైఖరి కూడా ఉదాసీనంగానే ఉంది. వేల సంవత్సరాల చరిత్ర కలిగిన తెలుగు సాహిత్యం సమాజ ప్రతిబింబంగా చలనంలో ఉంది. పురాణ, ఇతిహాసాల దశను దాటి కావ్య లక్షణాలను సంతరించుకొని చిక్కటి తెలుగు కవితను చిలకరించింది. మధ్యయుగాలలో సామాజిక అసమానతల మీద, అంధ విశ్వాసాల మీద కవిత్వమై తన అసమ్మతిని, తిరుగుబాటును ప్రకటించింది. ఆధునిక సందర్భంలో మనిషి కేంద్రంగా సాహిత్య సృజన జరుగుతుంది. రాజకీయార్థిక మార్పులకు తక్షణ స్పందనగా చైతన్య దీప్తిని వెలిగిస్తోంది.



గ్లోబలైజేషన్ కాలంలో కుదుపుకు గురైన సాహిత్యం తన అస్తిత్వాన్ని కాపాడుకోవడానికి పెనుగులాడుతుంది, చదువుల క్రమం మారిపోయింది. ఫలితంగా తెలుగు భాష విస్మరణకు గురవుతున్నది. మాతృభాషలో పొందే జ్ఞానం మరే ఇతర భాషలలో పొందలేమనే సత్యాన్ని అందరూ విస్మరించారు. వర్తమాన అవసరాలలో ఆంగ్లం అనివార్యం. ఒక భాషగా అందరికి ఆంగ్లం వచ్చి ఉండాలి. కానీ తల్లిభాష పట్ల నిరాదరణ జ్ఞాన సముపార్జనలో అనేక పరిమితులను విధిస్తుంది. ఇప్పుడిప్పుడే విద్యలోకి ప్రవేశిస్తున్న ఉత్పత్తి వర్గాల పిల్లలకు ఏ భాషలోనూ ప్రావీణ్యం ఉండటం లేదు. ఫలితంగా శ్రవణ, భాషణ, పఠన, లేఖన నైపుణ్యాలు కొరవడుతున్నాయి. బహుళ జాతి కంపెనీలలో ఉద్యోగాలకు కావలసిన సామర్థ్యాలు లేక నిరుద్యోగులుగా మిగిలిపోతున్నారు. మరోవైపు తెలుగు అధ్యయనాంశంగా డిగ్రీ పొందిన వారికి ఉపాధి అవకాశాలు శూన్యమయ్యాయి. ప్రాథమిక పాఠశాలలో భాషా నైపుణ్యాలు అందకపోవటం వలన ఉన్నత విద్యలోకి ప్రవేశించిన తర్వాత విద్యార్థులు అనేక సవాళ్లను ఎదుర్కొంటున్నారు. ఉన్నత పాఠశాల విద్య వరకే తెలుగు అధ్యయనాంశంగా ఉంది. ఇంటర్, డిగ్రీలలో ద్వితీయ భాష సంస్కృతానికి ప్రాధాన్యత పెరిగింది. ఈ స్థాయిలో తెలుగు బోధించే వాళ్లకు ఉపాధి లేదు. పాఠశాల స్థాయి నుంచి ఉన్నత విద్య వరకు మాతృభాషను శాస్త్రీయ పద్ధతులలో బోధించే మెకానిజం లేకపోవటం వలన భాషానైపుణ్యాలు క్షీణస్థాయిలో ఉంటున్నాయి.

ఈ యాభై ఏళ్లలో సాహిత్య రచనలోకి కొత్త కలాలు ప్రవేశంతో సాహిత్య వస్తువులో, శిల్పంలో మార్పు వచ్చింది. వ్యక్తీకరణ నైపుణ్యాలు కూడా కొత్తగా ఉంటున్నాయి. సృజనాత్మక సాహిత్యం మట్టి మనుషుల గాలి తగిలి పులకిస్తుంది. మునుపటి సాహిత్య ప్రమాణాలన్ని పూర్వ పక్షం అవుతున్నాయి. కొత్త ప్రమేయాలు సరికొత్తగా ఆవిష్కరించబడుతున్నాయి. కానీ వారి నైపుణ్యాలను, ప్రతిభాపాటవాలను ప్రదర్శించడానికి సరైన వేదికలు ఉండటం లేదు. తమ వ్యక్తీకరణలో ఉండే లోపాలను సరిదిద్దే శిక్షణ కొరవడుతున్నది. ఫలితంగా సాహిత్య సృజనలోకి అసాహిత్యం ప్రవేశిస్తుంది.

> **తెలుగు లిటరరీ కాంగ్రెస్‌కు విశాల ప్రాతిపదిక, దార్శనిక భావన మూలధాతువుగా ఉంటుంది. మేధో మధనం ద్వారా సాహిత్య ప్రక్రియా వైవిధ్యాన్ని, సృజనాత్మక వికాసాన్ని, మూల్యాంకన పరికరాలను పదును పెట్టుకోవడమే లక్ష్యంగా ఈ కాంగ్రెస్ కొనసాగుతుంది. ఇక నుంచి హిస్టరీ కాంగ్రెస్, విజ్ఞాన శాస్త్రాలకు ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ వలె తెలుగు సాహిత్యానికి లిటరరీ కాంగ్రెస్ చరిత్రలో నమోదవుతుంది.**

కన్నడ, తమిళ భాషలను రక్షించుకోవడానికి నిర్మాణాత్మకమైన సంస్థలు ఏర్పడి పనిచేస్తున్నాయి. భాష పట్ల పట్టింపు ఉంటుంది. కానీ తెలుగు భాష గురించి ఆలోచించే మనుషులే కరువైపోతున్న సందర్భం రానున్నది. దేశవ్యాపితంగా తెలుగు మాట్లాడే ప్రజలు పదిహేను కోట్లకు పైగా ఉంటారు. అనేక సంస్థలు తెలుగు సాహిత్య రంగంలో పనిచేస్తున్నాయి. అకాడమీలు కూడా ఉన్నాయి. పాతికకు పైగా వివిధ విశ్వవిద్యాలయాలలో తెలుగు శాఖలు సాహిత్యాన్ని బోధిస్తున్నాయి. భాషా పరిరక్షణ కోసం కొన్ని సంస్థలు, కొందరు వ్యక్తులు శ్రమిస్తున్నారు. కానీ ఇన్ని పాయలుగా ఉన్న వ్యక్తులకు, సంస్థలకు ఉమ్మడి వేదిక లేదు. ఎవరికి వారుగా విసిరివేసినట్లుగా ఉన్నారు. ఈ అవరోధాలను, పరిమితులను అధిగమించడానికి పూనిక ఉండాలి. దేశ వ్యాపితంగా తెలుగు భాషా సాహిత్యాలలో ఆలోచనాపరులు, సృజనాత్మక రచయితలు, పరిశోధకులు, బోధనా వృత్తిలో ఉన్నవాళ్లు కలిసి అభిప్రాయాలను పంచుకొని అందరికి ఆమోదయోగ్యమైన విషయాల మీద ఆచరణాత్మక ప్రణాళికతో ముందుకు వెళ్లాలి. ఈ నేపథ్యం నుంచి వచ్చిన కొన్ని ఆలోచనల ఫలితంగానే మొదటిసారి తెలుగు లిటరరీ కాంగ్రెస్ జరుగబోతోంది.

దేశవ్యాపితంగా సాహిత్య రంగంలో నిమగ్నమై ఉన్న మూడు వందల మంది ప్రతినిధులు ఈ మహాసభలో పాల్గొంటారు. వందమందికి పైగా ఈ సమావేశంలో సాహిత్య రంగంలో లోతుగా పనిచేస్తున్న పరిశోధకులు, అధ్యాపకులు, విమర్శకులు పాల్గొని పత్రసమర్పణ చేస్తారు. మరో యాభై మంది సృజనకారులు ఈ కాంగ్రెస్‌లో సామూహిక కవితా పఠనం, గానం చేస్తారు. ఇన్నిరకాల సాహిత్య వ్యాఖ్యాతలందరూ ఈ వేదిక మీది నుంచి సారవంతమైన ఆలోచనలు పంచుకుంటారు. వెయ్యేళ్ల తెలుగు సాహిత్యాన్ని మదింపు చేయడానికి నిపుణులైన సాహితీ వేత్తలు మూడు రోజులలో వివిధ అంశాల మీద ప్రసంగిస్తారు. తెలుగు లిటరరీ కాంగ్రెస్‌కు విశాల ప్రాతిపదిక, దార్శనిక భావన మూలధాతువుగా ఉంటుంది. మేధో మధనం ద్వారా సాహిత్య ప్రక్రియా వైవిధ్యాన్ని, సృజనాత్మక వికాసాన్ని, మూల్యాంకన పరికరాలను పదును పెట్టుకోవడమే లక్ష్యంగా ఈ కాంగ్రెస్ కొనసాగుతుంది. ఇక నుంచి హిస్టరీ కాంగ్రెస్, విజ్ఞాన శాస్త్రాలకు ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ వలె తెలుగు సాహిత్యానికి లిటరరీ కాంగ్రెస్ చరిత్రలో నమోదవుతుంది.

ఉస్మానియా విశ్వవిద్యాలయం, తెలుగు శాఖ వందేళ్ల చరిత్రను నమోదు చేసుకున్నాయి. తెలుగు నేల పునరుజ్జీవనంలో వీటి కృషి విస్మరించలేనిది. ఆర్థిక, రాజకీయ, సామాజిక సంవాదంలో ఇవి పాలుపంచుకున్నాయి. సామాజిక, సాహిత్య చరిత్ర పురోగవింపచడానికి ఓయూ, తెలుగుశాఖ తమ జ్ఞానసంపదను జోడించాయి. తెలుగు సాహిత్య బోధన, పరిశోధన, విశ్లేషణ రంగాలలో నూతన ఒరవడిని, కొత్త ప్రమేయాలను సృష్టించిన ఘనత ఓయూ తెలుగుశాఖకు దక్కింది. ఆ ఒరవడిని కొనసాగిస్తూ 15, 16, 17 ఫిబ్రవరి 2024న మూడు రోజుల పాటు జరిగే తెలుగు లిటరరీ కాంగ్రెస్‌కు వేదిక కాబోతుంది. లిటరరీ కాంగ్రెస్ ఆలోచనకు, ప్రణాళికకు, ఆచరణకు తెలుగుశాఖ మూలధాతువు. నిర్దిష్టంగా ఈ మూడు రోజులలో కవిత్వతత్వం, కథా సందర్భం, కవితా వసంతం, నవలా సమయం, విమర్శా దర్శనం, సాహిత్య శిల్పం, కవితాపొద్దు, పరిశోధనా విపంచి, సాహిత్య గమ్యం, గమనం, సాహిత్య మూల్యాంకనం పేర్లతో పది విభాగాలుగా లిటరరీ కాంగ్రెస్ కొనసాగుతుంది. తెలుగుభాష భవిష్యత్ మీద నిర్దుష్ట కార్యక్రమ రూపకల్పన ఈ సమావేశం ప్రధాన లక్ష్యం.

చింతకింది కాశీం
97014 44450



ఊపిరి బిగపట్టిన
కొండల అంచున
విస్తరించి వికసించిన
ఈ దక్కన్ మహానగరం మీదుగా
దిగంతాల దాకా సాగిన నా దృష్టి,
ఆనాడు రక్తమోడిన
తెలంగాణ రైతాంగ శ్రామిక శక్తి-
నిర్మించిన ఇదే నేలలోని
ప్యాలెస్‌లు, హవేలీలు, దేవిడీలు
దర్బార్‌ల విందు విలాసాల కేళిలో
చెమటమూలాలన్నీ
జిగేలుమంటున్నాయి ఇప్పుడు!

ఒకనాడు దీనంగా
దిక్కులేని కొండలపై నిలుచుని
'ఆసఫ్ జాహీ' శిఖర స్థాయి రాచరికాన్ని
అబ్బురంగా చూసిన ఆ క్షణాలన్నీ
ఇప్పుడు నా పాదాల వెంట...

ఈ మొగులు మేడ (ఆకాశహర్మ్యం)లో
అతిఖరీదైన హోటల్ ఆతిథ్య-
విభ్రాంత సంధ్యల ఫ్యూడల్ అవశేషాల
అత్తర్ పరిమళాల మధ్య,
ప్రపంచంలో అతిపెద్ద--
పొడుగాటి డైనింగ్ టేబుల్ చుట్టూ
ఆశీనులై విందు ఆరగించిన
నూటొక్క (101) దేశవిదేశీ అతిథుల్లో
రాచరిక మర్యాదల డాంబికాల్లో
నా చోటు ఎక్కడో వెతుకుతున్నాను.
(ఆ నేను హిందూ - ముస్లిం ఎవరైనా కావచ్చు)
ఇప్పుడిక 'చెరువులో నిండిన చేపల్లా'
(కులీకుతుబ్‌షా)
నిజాం నాటి హవేలీలు కూలిన చోటే,
విద్యుత్ ప్రవాహాల వాహనాల
నిత్యజనజీవన సందడిలో నడయాడుతున్న
ఈ కొత్త నగరాన్ని చూస్తున్నాను!

నిఖిలేశ్వర్
91778 81201

కవితా పురస్కారం

తెలుగు సాహితీవనం కవితా పురస్కారం కోసం ఏదైనా సామాజిక అంశం పైన 25 పంక్తులకు మించకుండా కవితలను ఆహ్వానిస్తున్నాం. వర్డ్‌లో యూనికోడ్‌లో టైప్ చేసి కవితలను, కవితలపై పేరు రాయకుండా, హామీ పత్రం జత చేసి, మార్చి 5లోగా sahitivanam82@gmail.comకు ఈమెయిల్ చేయాలి. నలుగురు విజేతలకు ఒక్కొక్కరికి రూ.1,116 చొప్పున నగదు బహుమతితో పురస్కార ప్రదానం ఉంటుంది. మరిన్ని వివరాల కొరకు ఫోన్: 9490805404.

తెలుగు సాహితీవనం

ఆత్మీయ సత్కారం

స్వాతి పత్రికల అధినేత వేమూరి బలరామ్ 77వ జన్మదినోత్సవం సందర్భంగా ఫిబ్రవరి 12న సాయంత్రం 6గంటలకు విజయవాడ బందరురోడ్‌లో గల ఠాగూర్ గ్రంథాలయంలో ఆత్మీయ సత్కార సభ జరుగుతుంది. ఈ సందర్భంగా ప్రభాకర్ జైనీ నిర్మిస్తున్న 'స్వాతి బలరామ్ - అతడే ఒక సైన్యం' సినిమాలోని ఒక పాట అతిథుల సమక్షంలో ఆవిష్కరించబడుతుంది.

ప్రభాకర్ జైనీ

సేవ సాహితీ సదస్సులు

తెలుగు భాషా సాహితీ, సాంస్కృతిక సంస్థ 'సేవ' ఆధ్వర్యంలో 'అక్షర తోరణం' పేరిట ఫిబ్రవరి 12న అఫ్సర్ సాహితీ అవలోకనం, 13 నుండి 15 దాకా సయ్యద్ సలీం సాహితీ సమాలోచన, ఫిబ్రవరి 16 నుండి 22 వరకు వేంపల్లి గంగాధర్, వేంపల్లె షరీఫ్, జానీ తక్కెడశిల, అప్పిరెడ్డి హరినాథరెడ్డి, పసునూరి రవీందర్, పింగళి చైతన్య, మంత్రి కృష్ణమోహన్, మానస ఎండ్లూరి, గడ్డం మోహన్‌రావు, బాలసుధాకర్ మౌళి, తగుళ్ళ గోపాల్, పల్లిపట్టు నాగరాజు, మెర్సీ మార్గరెట్ రచనలపై యువ సాహితీ సప్తాహం సదస్సులు జరుగుతాయి. ప్రతి సాయంత్రం 7 గంటలకు మీడియా ఛానల్స్, 'సేవ ఆన్ లైవ్' యూట్యూబ్ ఛానల్ ప్రత్యక్ష ప్రసారంగా ఈ సదస్సులు జరుగుతాయి. వివరాలకు 9492666660.

కంచర్ల సుబ్బానాయుడు

'వంశీ మా పసలపూడి కథల కమామిషు'

తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో బోధి ఫౌండేషన్ ఆధ్వర్యంలో కె. రామచంద్రారెడ్డి రచన 'వంశీ మా పసలపూడి కథల కమామిషు' ఆవిష్కరణ సభ ఫిబ్రవరి 17 సా.5.30కి రవీంద్ర భారతి మినీ హాల్, హైదరాబాద్‌లో జరుగుతుంది. ముఖ్య అతిథి, ఆవిష్కర్త: వంశీ, విశిష్ట అతిథి: తనికెళ్ల భరణి, పుస్తక సమీక్ష & ఆత్మీయ వాక్కు: రెంటాల శ్రీవెంకటేశ్వరరావు, మహ్మద్ ఖదీర్ బాబు, కె.ఎన్. మల్లీశ్వరి, పచ్చమట్ల చంద్రశేఖర్, మామిడి హరికృష్ణ.

బోధి ఫౌండేషన్

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
ఎన్.టి.ఆర్ జిల్లా వార్తలు
సోమవారం 12 ఫిబ్రవరి 2024



మహోన్నతంగా..

ముగిసిన గుణదల మాత శతాబ్ది మహోత్సవాలు

- పోటెత్తిన భక్తులు, విశ్వాసులు
- కిక్కిరిసిన పరిసర ప్రాంతాలు


గుణతల చర్చి వద్ద అశేష భక్త జనం

గుణదల మాత నూరు వసంతాల వేడుకలు మహోన్నతంగా సాగాయి. మూడు రోజులపాటు సాగిన ఈ ఉత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ఆఖరి రోజు విశ్వాసులు, భక్తులు పోటెత్తారు. ప్రధాన రహదారి, బిషప్ గ్రాసీ హైస్కూల్ గ్రౌండ్ భక్తులతో కిక్కిరిసి పోయాయి. ముఖ్యఅతిథిగా హాజరైన పోప్ రాయబారి లియోపాల్డో జిరెల్లి ప్రత్యేకంగా అలంకరించిన కళావేదికపై భక్తులకు సందేశమిచ్చారు. ముగింపు సందర్భంగా 108 మంది గురువులు దివ్యపూజాబలి సమర్పించారు. - 6లో..


నిలిచిపోయిన ట్రాఫిక్


చర్చిలో కొవ్వొత్తులు వెలిగిస్తున్న విశ్వాసులు

ఓట్ల అక్రమాలపై చర్యలు మొదలయ్యాయి. చనిపోయిన వారి ఓట్ల గ్యాంబ్లింగ్‌కు పాల్పడిన విజయవాడ సెంట్రల్ నియోజకవర్గం 30వ డివిజన్‌లోని 29వ పోలింగ్ బూత్‌కు చెందిన బీఎల్వో సునీల్ కుమార్‌పై వేటు పడింది. చనిపోయిన వాళ్లు కూడా మరో ప్రాంతానికి షిఫ్ట్ అయ్యారని బూత్‌లను మార్చివేసిన బీఎల్వో సునీల్ కుమార్ వేటుకు గురి కావాల్సి వచ్చింది. విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ ఎన్నికల అధికారిగా వ్యవహరిస్తున్న మునిసిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ వివాదాస్పద బీఎల్వోను సస్పెండ్ చేశారు.

కొమ్ముకాశాడు.. దొరికిపోయాడు!

అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరించిన బీఎల్వో

- డెత్ ఓట్లు మరో డివిజన్‌కు బదిలీ
- సస్పెండ్ చేసిన కమిషనర్ స్వప్నిల్
- విచారణకు ఆదేశించిన కలెక్టర్ ఢిల్లీరావు
- దేవినగర్‌లో పరిశీలించిన తహసీల్దార్ శంకరరావు
- 27 డెత్ ఓటర్లలో 26 మంది చనిపోయినట్టుగా నిర్ధారణ


షిఫ్టింగ్ అయిన డెత్ ఓటర్లను పరిశీలిస్తున్న విజయవాడ నార్త్ తహసీల్దార్ శంకరరావు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ/ సత్యనారాయణపురం) : విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలో దొంగ ఓట్లను చేర్చేందుకు అధికార పార్టీ ఎన్నో అక్రమాలకు పాల్పడింది. టీడీపీ నేతలు ఓటర్ల జాబితాలను బూత్‌ల వారీగా సూక్ష్మ పరిశీలన చేయగా.. బీఎల్వో సునీల్ కుమార్ అడ్డంగా దొరికిపోయాడు. చనిపోయిన వారి ఓట్లను తొలగించాలని టీడీపీ నాయకులు కమిషనర్‌కు ఫిర్యాదు చేసినపుడు ఈ బీఎల్వో అధికార పార్టీ కొమ్ముకాశాడు. ఓట్లను ఆ బూత్ నుంచి తొలగించి వేరే బూత్‌లోకి షిఫ్ట్ చేశాడు. మొత్తం 27 మంది చనిపోయిన ఓట్లను తొలగించకుండా మరో బూత్‌కు షిఫ్ట్ చేశాడు. వీటికి సంబంధించి తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి నవనీతం సాంబశివరావు సాక్ష్యాధారాలతో సహా ఫిర్యాదు చేయటంతో బీఎల్వో అడ్డంగా బుక్ అయ్యాడు. ప్రాథమిక విచారణ చేయించిన కమిషనర్ స్వప్నిల్ బాధ్యుడైన బీఎల్వోను సస్పెండ్ చేశారు.

డెత్ ఓట్లపై విచారణకు కలెక్టర్ ఆదేశం

విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలో వెలుగు చూసిన డెత్ ఓటర్ల షిఫ్టింగ్ వ్యవహారంపై జిల్లా ఎన్నికల అధికారిగా వ్యవహరిస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు విచారణకు ఆదేశించారు. దీంతో ఆదివారం ఏఈఆర్‌వోగా వ్యవహరిస్తున్న విజయవాడ నార్త్ మండల తహసీల్దార్ శంకరరావు విచారణకు వచ్చారు.

నియోజకవర్గంలోని 30వ డివిజన్ పరిధిలోని 29వ పోలింగ్ బూత్ ప్రాంతమైన దేవీనగర్‌లోని 6, 7 రోడ్లలో షిఫ్టింగ్ అయిన డెత్ ఓటర్ల వివరాలకు సంబంధించి విచారించారు. స్థానిక డివిజన్ టీడీపీ అధ్యక్షులు చౌదరి సూర్యనారాయణ, యూనిట్ ఇన్‌చార్జి కనకమేడల అనూరాధ, కనకమేడల కొండలరావు కూడా తహసీల్దార్ పర్యటనలో పాల్గొన్నారు. నవనీతం సాంబశివరావు.. చనిపోయిన వారికి సంబంధించి చాలా వరకు డెత్ సర్టిఫికెట్లను సంపాదించి వాటిని విచారణాధికారికి అందజేశారు. డెత్ సర్టిఫికెట్లు లేనివాటికి సంబంధించి తహసీల్దార్ శంకరరావు స్థానికంగా పంచనామా నిర్వహించారు. పంచనామాలో కూడా చనిపోయిన విషయం వెలుగు చూసింది. మొత్తం 27 డెత్ ఓట్లలో ఒక్కటి తప్ప మొత్తం చనిపోయినట్టుగా ధ్రువీకరణ అయింది.

తిట్లూ.. తోపులాటలు..

రణరంగంగా ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్

రిజిస్ట్రేషన్ల పేరుతో మహిళా లబ్దిదారులపై ఒత్తిడి

- అందరూ సచివాలయాలకు రావాలని ఆదేశాలు
- సచివాలయాలకు పోటెత్తిన మహిళలు..
- క్యూ లైన్లలో సొమ్మసిల్లిన వృద్ధులు
- ఒక విధానం లేకుండా ఒత్తిడి చేయటంతో అదుపు తప్పిన పరిస్థితి


గన్నవరం మండలం కేసరపల్లి గ్రామ సచివాలయం వద్ద బారులుతీరిన లబ్ధిదారులు

ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ వ్యవహారం ఉమ్మడి జిల్లాలో యుద్ధాన్ని తలపిస్తోంది. రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఓటు బ్యాంకు రాజకీయాల కోసం ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ విధానం ఇప్పుడు క్షేత్ర స్థాయిలో రణరంగాన్ని సృష్టిస్తోంది. జిల్లా రెవెన్యూ యంత్రాంగం ఎన్నికల విధుల్లో ఉన్న రెవెన్యూ ఉద్యోగుల మెడపై కత్తి పెట్టి మరీ రిజిస్ట్రేషన్లు చేయాలని టార్గెట్లు నిర్దేశిస్తోంది. దీంతో ఎవరికివారు జగనన్న ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్లపై పడ్డారు. ఆదివారం కూడా రిజిస్ట్రేషన్ల కార్యక్రమాన్ని నిర్వహించటంతో.. గ్రామ, వార్డు సచివాలయాలు లబ్ధిదారులతో పోటెత్తాయి. సచివాలయాల దగ్గర తోపులాటలు జరిగాయి. వృద్ధులు చాలాచోట్ల సొమ్మసిల్లి పడిపోయారు. ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్‌కు సమయం లేదంటూ రెవెన్యూ సిబ్బంది చేసిన హడావిడి కారణంగానే ఈ పరిస్థితి నెలకొంది.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ /గన్నవరం): లబ్ధిదారులకు భూ బదలాయింపు హక్కులను కల్పించే అధికారాన్ని ప్రభుత్వం వీఆర్వోలకు అప్పగించింది. ఈ క్రమంలో తమ పని ముగించుకునేందుకు వీఆర్వోలు సచివాలయాల పరిధిలోని వలంటీర్లకు సమయం లేదంటూ హడావిడి చేయించారు. వాస్తవానికి రిజిస్ట్రేషన్లు ఎప్పుడైనా చేయొచ్చు. గడువు ఏమీ లేదు. ఎన్నికల నోటిఫికేషన్‌లోపు చేయించాలన్న కారణంతో ప్రభుత్వ ఒత్తిళ్ల మేరకు హడావిడిగా జిల్లా యంత్రాంగం వీఆర్వోలపై కత్తిపెట్టడంతో అంతా ఉరుకులు పరుగులు పెట్టాల్సి వచ్చింది. సచివాలయాల పరిధిలో వందల సంఖ్యలో లబ్ధిదారులు ఉంటారు. ఈ విషయాన్ని వీఆర్వోలు మరిచిపోయారు. రోజుకు ఎంత మందికి చేయగలం? ఎంతమందిని రిజిస్ట్రేషన్లకు పిలవొచ్చు? వంటి ఆలోచనలు చేయలేదు. కనీసం టోకెన్ విధానాన్ని కూడా పాటించలేదు. ఏ రోజు ఎవరు రావాలో వలంటీర్లకు టోకెన్ ఇవ్వటం ద్వారా కూడా ఇలాంటి రద్దీని నివారించవచ్చు. ప్రభుత్వం టార్గెట్ పెట్టిందన్న పేరుతో లబ్ధిదారులను ఇబ్బందులు పెట్టే విధంగా చర్యలు చేపట్టారు.

సచివాలయాలకు పోటెత్తిన లబ్ధిదారులు

ఆదివారం ఉమ్మడి జిల్లాలో తలపెట్టిన జగనన్న ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ గన్నవరం, కంకిపాడు, ఉయ్యూరు, మైలవరం, గంపలగూడెం, నందిగామ, తిరువూరు, జీ కొండూరు, విజయవాడ రూరల్, గుడివాడ, పామర్రు, మచిలీపట్నం మండలాల పరిధిలోని గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో నెలకొన్న స్వల్ప ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. సెలవుదినం కావటంతో మహిళా లబ్ధిదారులంతా ఒకేసారి రావటంతో సచివాలయాలు పోటెత్తాయి. రిజిస్ట్రేషన్లు చేయటానికి జాప్యం అవుతుండటంతో గంటల తరబడి నిలుచోవాల్సి రావటంతో లబ్ధిదారుల్లో అసహనం నెలకొంది. మండుటెండలో క్యూలో పడిగాపులు పడాల్సి వచ్చింది. ప్రతి సచివాలయం పరిధిలోనూ క్యూలు రోడ్ల మీదకు వచ్చేశాయి. ఉమ్మడి కృష్ణా జిల్లాలో 3 లక్షల మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చారు. ఆ తర్వాత మరో లక్ష మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చారు. ఇలా మొత్తం నాలుగు లక్షల ఇళ్ల ప్లాట్ల లబ్ధిదా రులు ఉన్నారు. వీరందరికీ ఒకేసారి రిజిస్ట్రేషన్లు చేస్తున్నట్టు చెప్పటంతో.. అందరూ ఒకేసారి రావటంతో సచివాలయాలు కిటకిటలాడాయి. రిజిస్ట్రేషన్ల పేరుతో మ మ్మల్ని ఇబ్బందుల పాలు చేస్తారా అంటూ పలువురు లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేశారు. హడావిడిగా రిజిస్ట్రేషన్లు చేయటమేమిటని, రిజిస్ట్రేషన్లకు గడువు లేనపుడు ఇవాళ రావాలని ఒత్తిడి చేయటం ఎందుకని ప్రశ్నించారు. ఎంత మందికి ఒక రోజులో రిజిస్ట్రేషన్లు చేయగలరని, వందల మందిని సచివాలయాలకు పిలిచారని మహిళా లబ్ధిదారులు ప్రశ్నించారు.


అర్ధరాత్రి దాటాక బైక్‌పై వెళుతున్న దుండగులు

బయట.. భయం..!

ఇళ్ల ముందున్న వాహనాలు మాయం

- అన్నీ ద్విచక్ర వాహనాలే
- అర్ధరాత్రి పూట నేరగాళ్ల సంచారం
- అంతా యువకులే
- వ్యసనాల ఖర్చుల కోసం చోరీలు

(ఆంధ్రజ్యోతి - విజయవాడ) ఉత్తరాంధ్రకు చెందిన ఓ యువకుడు విజయవాడకు వచ్చి ప్రైవేటు ఉద్యోగం చేసుకుంటున్నాడు. సత్యనారాయణపురంలో ఒక గదిని అద్దెకు తీసుకుని ఉంటున్నాడు. కొద్దిరోజుల క్రితం ద్విచక్ర వాహనాన్ని ఇంటి ముందు పార్క్ చేశాడు. అర్ధరాత్రి మెళుకువ రావడంతో బయటకు వచ్చి చూడగా వాహనం కనిపించలేదు.

నగరానికి చెందిన ఓ వ్యక్తి ఊరు వెళ్లడం కోసం పీఎన్‌బీఎస్‌కు వెళ్లాడు. అక్కడ వాహనాన్ని పార్క్ చేసుకుని ఊరు వెళ్లాడు. తిరిగి వచ్చి చూసుకునే సరికి ఇక్కడ వాహనం కనిపించలేదు.

మధ్యతరగతి వర్గాలకు బైక్ ఉంటేనే బతుకు బండి నడుస్తోంది. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో ఉన్న ద్విచక్ర వాహనానికి మరమ్మత్తులు చేయించుకుని ఉపయోగించుకోవడం తప్ప కొత్త వాహనం కొనుగోలు జోలికి వెళ్లలేకపోతున్నారు. ప్రతినెలా బడ్జెట్‌ను కేటాయించుకుని సంసార నావను లాగాల్సి వస్తోంది. వ్యసనపరులు మధ్యతరగతి వర్గాల ప్రణాళికలను చెల్లాచెదురు చేస్తున్నారు. ఈ వర్గాల ప్రజలను టార్గెట్ చేసుకుని వరుస చోరీలు చేస్తున్నారు. ఇళ్ల ముందు పార్క్ చేసిన వాహనాలను దొంగిలిసున్నారు. వ్యసనాల ఖర్చుల కోసం వాకిట్లో ఉంచిన వాహనాలను మాయం చేస్తున్నారు. వరుసగా జరుగుతున్న ఈ చోరీలతో వాహనదారులు భయపడిపోతున్నారు.

ఎవరీ దొంగలు?

ఒక బైక్‌పై ఇద్దరు, ముగ్గురు నగరంలోని టార్గెట్ చేసుకున్న ప్రదేశాల్లో తిరుగుతున్నారు. అర్ధరాత్రి వరకు తిరుగుతూ వీధులను పరిశీలిస్తున్నారు. రాత్రి రెండు, మూడు గంటల ప్రాంతంలో వాహనాలను మాయం చేస్తున్నారు. కొండ ప్రాంతాల్లో వాహనాలు కొంతదూరం వరకు మాత్రమే వెళ్లాయి. కొంతమంది కొండ ప్రాంతానికి దిగువన ఉన్న ప్రదేశంలో వాహనాలను నిలుపుదల చేస్తారు. మరికొందరు రహదారి ఉన్నంత వరకు తీసుకెళ్లి అక్కడ నిలుపుదల చేసుకుంటారు. దీనికి భిన్నంగా నగరంలోని మిగిలిన ప్రాంతాల్లో పరిస్థితి ఉంటుంది. కృష్ణలంక, రాణిగారితోట, రామలింగేశ్వరనగర్, సత్యనారాయణపురం, టూటౌన్, వన్‌టౌన్, భవానీపురంలో కొన్ని ప్రాంతాల్లో వాహనాలను ఇంటి వరండాలో పెట్టుకునే ప్రదేశం ఉండదు. దీంతో వారు వీధుల్లోనే ఇంటి బయట వాహనాలను నిలుపుదల చేసుకుంటారు. కొంతమంది వాహనదారులు ఇంటి ముందే బైకులు పార్క్ చేశామన్న ధీమాతో వాటికి హ్యాండిల్ లాక్‌లు వేయడం లేదు. భౌగోళికంగా ఉన్న పరిస్థితులను నేరగాళ్లు అవకాశంగా మార్చుకుంటున్నారు. మద్యం, గంజాయి, అమ్మాయిలు వంటి వ్యసనాలకు అలవాటు పడిన యువకులు ఈ తరహా నేరాలకు దిగుతున్నట్టు పోలీసులు గుర్తించారు. ఇద్దరు, ముగ్గురు కలిసి ఒక గ్రూపుగా ఏర్పడుతున్నారు. సత్యనారాయణపురం, ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం వద్ద ఉన్న ఫుడ్‌కోర్టులో అర్ధరాత్రి వరకు గడుపుతున్నారు. ఆ తర్వాత ఒక ప్రాంతాన్ని ఎంపిక చేసుకుని అక్కడికి బయలుదేరుతున్నారు. ఆయా వీధుల్లో రెండు, మూడు రౌండ్లు వేసిన తర్వాత పరిస్థితిపై ఒక అంచనాకు వస్తున్నారు. ముందుగా వాహనాలకు తాళాలు వేసి ఉన్నాయో లేదో పరిశీలిస్తున్నారు. ఒకవేళ ఆ వాహనాలకు హ్యాండిల్ లాక్ వేయలేదంటే ఏ మాత్రం కష్టపడకుండా వాహనాన్ని మాయం చేస్తున్నారు. ఒకరు దొంగిలించిన వాహనం ఉంటే, మిగిలిన ఇద్దరూ ఆ వాహనాన్ని లాక్కుంటూ వెళ్లిపోతున్నారు. రెండు, మూడు రోజులపాటు ఒక రహస్య ప్రదేశంలో ఉంచిన తర్వాత ఆ వాహనాలను నగర సరిహద్దుల నుంచి దాటించేస్తున్నారని తెలుస్తోంది. ఇతర జిల్లాలకు తీసుకెళ్లి మెకానిక్‌లకు విక్రయించడమో, తాకట్టు పెట్టడమో చేస్తున్నారు. ఇలా సంపాదించిన డబ్బుతో విచ్చలవిడిగా తిరుగుతున్నారు. చోరీలకు వెళ్లినప్పుడు ఉపయోగించే వాహనాల్లో పెట్రోలును ప్రజల వాహనాల నుంచి దొంగిలిస్తున్నారు.


- 6లో..

సీఎం కార్యాలయ ముట్టడి భగ్నం

- ఏఐవైఎఫ్ నేతల అరెస్టులు.. స్టేషన్‌కు తరలింపు
- సీపీఐ రామకృష్ణ పరామర్శ

తాడోపేడో!


గాంధీ బ్యాంకు చైర్మన్‌పై నేడు అవిశ్వాసం

- మాకు 9 మంది డైరెక్టర్ల మద్దతు ఉంది
- అవిశ్వాసం నెగ్గని పక్షంలో రాజీనామాకైనా సిద్ధమంటున్న అసంతృప్తి వర్గం
- అవిశ్వాసం వీగిపోతుందన్న . ధీమాలో చైర్మన్ వర్గం

(విజయవాడ - ఆంధ్రజ్యోతి) గాంధీ కో-ఆపరేటివ్ బ్యాంకు చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం తుది దశకు చేరుకుంది. సోమవారం సహకార శాఖ జిల్లా రిజిస్ట్రార్ ఆధ్వర్యంలో అవిశ్వాస తీర్మానంపై సమావేశం జరగనుంది. ప్రస్తుతం బ్యాంకు చైర్మన్‌గా ఉన్న వేమూరి వెంకట్రావుపై ఏడుగురు డైరెక్టర్లు అవిశ్వాసం పెట్టారు. మొత్తం 12 మంది సభ్యుల్లో ఏడుగురు అవిశ్వాస తీర్మానంపై సంతకాలు చేయగా మరో సభ్యుడి మద్దతు లభిస్తేనే చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం నెగ్గుతుంది. ఈ నేపథ్యంలో అసంతృప్త డైరెక్టర్లు తమకు మరో ఇద్దరు డైరెక్టర్ల మద్దతు ఉందని, తప్పకుండా అవిశ్వాసం నెగ్గుతుందని ధీమా వ్యక్తం చేస్తున్నారు. అవిశ్వాసతీర్మానం వీగిపోతే ఏడుగురు డైరెక్టర్లు రాజీనామా చేసేందుకు సిద్ధమవుతున్నారు. అదే జరిగితే మెజారిటీ డైరెక్టర్లు రాజీనామా చేసిన కారణంగా మొత్తం పాలకమండలి రద్దయిపోతుంది. అవిశ్వాస తీర్మానం ప్రతిపాదించడమే బ్యాంకు చరిత్రలో మొదటి సారైతే ఇలా డైరెక్టర్ల రాజీనామా కారణంగా పాలకమండలి రద్దు కావడం బ్యాంకు చరిత్రలోనే ఓ మచ్చగా మిగిలిపోతుంది. మరోవైపు చైర్మన్ వర్గం డైరెక్టర్లు కూడా అవిశ్వాసం వీగిపోతుందని ధీమాగా ఉన్నారు.

కిడ్నీ వ్యాధితో గిరిజనుడు మృతి

కాంట్రాక్టు ముగియడంతో నిలిచిపోయిన కృష్ణా జలాలు


మృతుడు చంద్రు (ఫైల్)

ఎ.కొండూరు, ఫిబ్రవరి 11 : ఎ.కొండూరు మండలంలో కిడ్నీ మరణాలు పెరిగిపోతున్నాయి. శాశ్వత పరిష్కారమంటూ హామీ ఇచ్చిన నేతలు, ప్రభుత్వం కిడ్నీ వ్యాధిగ్రస్తుల పట్ల నిర్లక్ష్యం వహిస్తుండటంతో సమస్య తీవ్రమవుతోంది. మండలంలోని కృష్ణారావుపాలెం శివారు మాన్‌సింగ్ తండాకు చెందిన భరోతు చంద్రు (55) గత కొన్నేళ్లగా కిడ్నీ వ్యాధికి గురయ్యాడు. డాక్టర్ల సలహా మేరకు తనకున్న అస్తులు అమ్ముకొని ఇన్ని రోజులు మందులు వాడుతున్నారు. వ్యాధి తీవ్రత పెరిగి ఆదివారం మృతి చెందినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. అనేక పోరాటలు, ప్రజల నిరసనలకు ప్రభుత్వం 2022 అక్టోబర్ నుంచి కాంట్రాక్టు పద్ధతిపై రెడ్డిగూడెం మండలంలోని కుదప నుంచి కిడ్నీ ప్రభవిత గ్రామాలకు ట్రాక్టర్ల ద్వారా కృష్ణా జలాలు సరఫరా చేశారు. గత జనవరి నెలతో కాంట్రాక్టు ముగిసింది. ప్రభుత్వం కాంట్రాక్టర్‌కు రూ.1.50 కోట్లు నిధులు ఇవ్వకుండా ఆపేసింది. దీంతో నీటి సరఫరా నిలిచిపోయింది. సమస్య తీవ్రమైంది. చనిపోయిన కుటుంబాలకు నష్టపరిహారం అందజేసి తక్షణం కృష్ణా జలాలు సరఫరా చేయాలని సీపీఎం నేతలు ఆనందరావు, వెంకటేశ్వరావు డిమాండ్ చేశారు.



భారత్ పచ్చి శనగపప్పు కిలో రూ.60, నిల్వ ఉంచిన శైలజ డాల్ మిల్

భవానీపురం శైలజ డాల్ మిల్‌పై
విజిలెన్స్ దాడులు

- అక్రమంగా నిల్వ ఉంచిన రూ. 16 లక్షల పచ్చిశనగపప్పు సీజ్
- కేసును పక్కదారి పట్టించేందుకు విశ్వ యత్నం

విద్యాధరపురం, ఫిబ్రవరి 11 : కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ ధరకు విక్రయిస్తున్న భారత్ పచ్చిశనగపప్పును అక్రమంగా నిల్వ ఉంచిన భవానీపురం శైలజ డాల్ మిల్‌లో శనివారం అర్ధరాత్రి విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించి సుమారు రూ.16లక్షల సరుకును స్వాధీనం చేసుకున్నారు. మిల్లు నిర్వాహకులు అధికారపార్టీ ఎమ్మెల్యే ద్వారా కేసును పక్కదారి పట్టించేందుకు యత్నించారు. భవానీపురం అకుల రాజేశ్వరరావు వీధిలోని శైలజ డాల్‌మిల్లును కాసుల నారాయణ, వెంకట శ్రీనివాసు, ఆంజనేయులు లీజుకు తీసుకుని గత 40 సంవత్సరాలుగా నిర్వహిస్తున్నారు. వీరికి గొల్లపూడి మహాత్మాగాంధీ హోల్‌సేల్ మార్కెట్లో దుర్గాసాయి డాల్ మర్చంట్ పేరుతో 352 నెంబరు షాపు ఉంది. గతేడాది కేంద్ర ప్రభుత్వం సబ్సిడీతో కిలో పచ్చి శనగ పప్పు రూ.58లకు వ్యాపారస్తులకు అందచేసేందుకు పథకం రూపొందించింది. అయితే రిటైల్‌లో ప్యాకెట్‌పై రూ.2 లాభం వేసుకుని విక్రయించాల్సి ఉంది. ఈ పచ్చి శనగ పప్పును డాల్‌మిల్ నిర్వాహకులు సేకరించి భవానీపురంలోని మిల్లులో కల్తీచేసి కిలో రూ.85కి పైగా విక్రయిస్తున్నారు. సమాచారం తెలుసుకున్న విజిలెన్స్ అధికారులు దాడులు చేసి గుట్టును రట్టు చేశారు. నిర్వాహకులు అధికార పార్టీకి చెందిన ఒక ఎమ్మెల్యేకు ఫోన్ చేసి కేసును పక్కదోవ పట్టించేందుకు ప్రయత్నించినట్టు సమాచారం. శనివారం అర్ధరాత్రి రెండుగంటల వరకు తనిఖీలు కొనసాగాయి. స్వాధీనం చేసుకున్న సరుకును పౌరసరఫరాల శాఖ అధికారులకు అప్పగించారు. సివిల్ సప్లయిస్ సర్కిల్-1 ఏఎస్‌వో శ్రీలక్ష్మి మాట్లాడుతూ, స్వాధీనం చేసుకున్న సరుకును స్వాధీనం చేసుకుని మిల్లు నిర్వాహకులపై కేసు నమోదు చేస్తామని తెలిపారు.

పరస్పర సహకారంతో వ్యాపారాభివృద్ధి

- మాజీ గవర్నర్ కిరణ్ బేడి



లబ్బీపేట, ఫిబ్రవరి 11 : అంకితభావంతో పనిచేస్తూ, పరస్పర సహకారంతో వినూత్న విధానాలను అవలంబించడం ద్వారా వ్యాపారంలో ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని మాజీ గవర్నర్ కిరణ్‌బేడి అన్నారు. లబ్బీపేటలోని ఎస్ఎస్ కన్వెన్షన్‌లో ఆదివారం బీఎన్ఐ విజయవాడ చాప్టర్ సదస్సు జరిగింది. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆమె మాట్లాడుతూ, వ్యాపారవేత్తలు పరస్పర సహకారం ద్వారా వ్యాపారాభివృద్ధి సాధ్యమవుతుందని, అనుబంధం బలపడితే వ్యాపారంలో ఎదురయ్యే సవాళ్లను సులువుగా అధిగమించగలుగుతారన్నారు. అనంతరం బీఎన్ఐ డైరెక్టర్లు జై.దేశాయ్, విశాల్ దేశాయ్‌లు మాట్లాడుతూ, వ్యాపారాభివృద్ధి లక్ష్యంగా రాష్ట్రస్థాయి సదస్సు నిర్వహించామని, ఈ కాన్క్లేవ్ విజయవంతంతో తమ లక్ష్యం నెరవేరిందన్నారు. సమావేశంలో నెట్వర్కింగ్ కాన్క్లేవ్ ఛైర్మన్ మద్దినేని శ్రీనివాస్, ట్రెజరర్ త్రినాథ్ నండూరి, కన్వీనర్ మేఘన ఆచంట, బీఎన్ఐ మెంబర్లు, ఏపి చాంబర్, విజయవాడ చాంబర్, డెంటల్, ఇంటీరియర్స్, ఆర్కిటెక్చర్, రోటరీ, సీఏ, బిల్డర్, ఇంజనీర్స్ అసోసియేషన్స్ తదితర రంగాలకు చెందిన 1500 మంది ప్రతినిధులు పాల్గొన్నారు.

తిరుపతమ్మ సేవలో ఇంటెలిజెన్స్ ఐజీ



పెనుగంచిప్రోలు, ఫిబ్రవరి 11 : రాష్ట్ర ఇంటిలిజెన్స్ ఐజీ రాజేంద్రనాథ్ రెడ్డి ఆదివారం తిరుపతమ్మ అమ్మవారిని దర్శించుకొని అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. దర్శనం అనంతరం వేద పండితులు, అర్చకులు ఆశీర్వచనం చేసి స్వామి వారి శేష వస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు. తిరుపతమ్మకు అవనిగడ్డకు చెందిన విశ్వహిందూ పరిషత్ పాంచజన్య గీతాపారాయణం ఆధ్వర్యంలో కోడూరు మండల భక్త బృందం 10 క్వింటాళ్ల బియ్యాన్ని, పల్నాడు జిల్లా దాచేపల్లికి చెందిన బిరుదు శ్రీనివాసరావు-శారదా దంపతులు రూ.10,016లు, తెలంగాణ రాష్ట్రం సంగారెడ్డి జిల్లా గుమ్మడిదలకు చెందిన బత్తుల శ్రీధర్ రెడ్డి నిత్యాన్నదానానికి రూ.11,121లను అందజేశారు.

రిప్రజెంటేటివ్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ ఎన్నిక

గవర్నర్‌పేట, ఫిబ్రవరి 11 : మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ రాష్ట్ర మహాసభలు ఆదివారం ముగిశాయి. డిమాండ్లపై పలు తీర్మానాలను యూనియన్ కార్యదర్శి ప్రవేశపెట్టగా మహాసభలు ఏకగ్రీవంగా ఆమోదించాయి. మహాసభల్లో యూనియన్ రాష్ట్ర కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సీహెచ్ కుమార్, ఉపాధ్యక్షుడిగా యూవీ కృష్ణయ్య, టీవీఎస్ కోటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా సి.వెంకట్రావు, సహాయ ప్రధాన కార్యదర్శిగా జి.మనోహర్, యుఎస్ రవికుమార్, కోశాధికారిగా డి.ప్రసాద్, కార్యదర్శులుగా కేవీపీ చంద్రమౌళి, శిరీష్, సత్తిరావు, వీవీఎన్ ప్రసాద్, టి.రామకృష్ణ, జి.విశ్వనాథ్‌లు ఎన్నికయ్యారు.

వైభవంగా శ్రీకృష్ణదేవరాయల తెలుగు జైత్ర యాత్ర మహోత్సవం

- ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు


శ్రీకృష్ణదేవరాయులకు పూలమాల వేస్తున్న ఈవో చక్రధరరావు

ఘంటసాల, ఫిబ్రవరి 11 : శ్రీకృష్ణ దేవరాయల తెలుగు జైత్రయాత్ర మహోత్సవ వేడుకలు శ్రీకాకుళం గ్రామంలోని శ్రీకాకుళేశ్వరస్వామి దేవాలయంలో ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయ ఈవో ఎస్.ఎస్.చక్రధరరావు శ్రీకృష్ణదేవరాయల విగ్రహానికి పూలమాల వేసి కార్యక్రమాలను ప్రారంభించారు. ఉదయం 8 గంటలకు సాంప్రదాయ ముగ్గుల పోటీలకు పలు ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. అనంతరం చిన్నారులకు అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. కూచిపూడి నాట్య అకాడమి కెవి.జ్యోతి శిష్య బృందంచే కూచిపూడి నాట్య ప్రదర్శన చేయగా, ఆహూతులను విశేషంగా ఆకట్టుకుంది. చిన్నారులకు ఆటల పోటీలు, వృద్ధ కళాకారులకు సన్మాన కార్యక్రమం జరిగాయి. ఈవో చక్రధరరావు, ఆలయ సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు.

కార్యకర్తలకు అండగా ఉంటా : యార్లగడ్డ

- టీడీపీలోకి భారీగా చేరికలు

హనుమాన్‌జంక్షన్, ఫిబ్రవరి 11 : పార్టీని వెన్నంటి ఉన్న ప్రతి కార్యకర్తకు అండగా ఉంటానని, సమష్టిగా రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ విజయానికి అందరూ కృషి చేయాలని టీడీపీ గన్నవరం ఇన్‌చార్జి యార్లగడ్డ వెంకట్రావు తెలిపారు. బాపులపాడు మండలం సిరివాడ, రామన్నగూడెం, వీరవల్లి, బొమ్ములూరు. ఎ.సీతారాంపురం, మల్లవల్లి, గ్రామాల నుంచి భారీగా 224 కుటుంబాలకు చెందిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు యార్లగడ్డ వెంకట్రావు సమక్షంలో టీడీపీలో ఆదివారం చేరారు. వారందరికి యార్లగడ్డ పార్టీ కండువా కప్పి స్వాగతించారు.



వైసీపీ సీనియర్ నేత దుట్టారామచంద్రరావు అనుచరులుగా ఉన్న చిన్నాల లక్ష్మీనారాయణ, జక్కాచంద్రశేఖర్, సుబ్బారాయుడు, తాడిశెట్టి శ్రీనివాసరావు, కడవకొల్లు నాగరాజు, నత్తా రాజేష్, తూము రాధాకృష్ణ, నారగాని శ్రీనివాసరావు, సింగవరపు చంద్రమౌళి, వడ్లమూడి ప్రసాద్, జువ్వనపూడి రాఘవ తదితరుల నాయకత్వంలో వైసీపీ కార్యకర్తలు టీడీపీలో చేరారు. ముందుగా యార్లగడ్డ వెంకట్రావు ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం సభలో ఆయన మాట్లాడుతూ, రానున్న ఎన్నికల్లో టీడీపీ మేనిఫెస్టోను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లి గన్నవరం సీటును అత్యధిక మెజార్టీతో గెలిపించి చంద్రబాబునాయుడుకు కానుకగా ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పుట్టా సురేష్, చిరుమామిళ్ల సూర్యం, ఆళ్ల గోపాలకృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.



భక్తులను ఉద్దేశించి సందేశమిస్తున్న లియోపొల్డొ జిరెల్లి

దయగల మాతా.. ధన్యులం

పోప్ రాయబారి లియోపాల్డో రిజెల్లి

- విజయవంతంగా గుణదలమాత శతాబ్ది మహోత్సవాలు..
- జనసంద్రంగా పుణ్యక్షేత్రం

గుణదల, ఫిబ్రవరి 11 : గుణదలమాత నిష్కళంక మాతగా భక్తులచేత నీరాజనాలు అందుకొంటుందని.. తల్లి మరియ ద్వారా కారుణ్య రక్షకుడిగా యేసు క్రీస్తు ఉద్భవించారని ఇండియా, నేపాల్ పోప్ వాటికన్ రాయబారి లియోపొల్డొ జిరెల్లి తెలిపారు. గుణదలమాత 100 వసంతాల మహోత్సవాలు ఆదివారంతో విజయవంతంగా ముగిశాయి. చివరిరోజున శతాబ్ది మహోత్సవాలకు ముఖ్యఅతిథిగా హాజరైన పోప్ రాయబారి లియోపొల్డొ జిరెల్లి భక్తులను ఉద్దేశించి సందేశమిస్తూ దేవుని తల్లి అయిన మరియమాతను శ్రీసభ నిష్కళంక ఉద్భవిగా, రక్షకుని తల్లిగా ప్రకటించిందని తెలిపారు. శతాబ్ది మహోత్సవాలకు విచ్చేసిన గుణదలమాత భక్తులందరికీ పోప్ ఫ్రాన్సిస్ శుభాశిస్సులు దీవెనలు అందజేస్తున్నానని చెప్పారు. శతాబ్ది మహోత్సవాలు జరుపుకుంటున్న కేథలిక్ డయోసిస్‌పై దేవుడు చేసిన మేలుకుగాను ఈ 100 వసంతాల దివ్యపూజాబలిలో కృతజ్ఞతలు చెల్లించుదామని భక్తులకు ఆయన పిలుపునిచ్చారు.

గుణదలమాత పుణ్యక్షేత్రం నూరు వసంతాల వేడుకలు జరుపుకుంటున్న తరుణంలో విశ్వశ్రీసభ కూడా పరిశుద్ధ లూర్దుమాత మహోత్సవాన్ని 32వ ప్రపంచ వ్యాధిగ్రస్తుల దినోత్సవాన్ని ఒకే రోజున జరుపుకోవడం చరిత్రపుటల్లో ఒక అధ్యాయంగా నిలిచిపోతుందన్నారు. శతాబ్ది మహోత్సవాల వేడుకల్లో పాలుపంచుకోవడం మిక్కిలి సంతోషంగా ఉందన్నారు. తిరునాళ్లకు వచ్చిన భక్తజనాన్ని చూస్తూ ఉంటే ఆదాం, అవ్వలను సృష్టించిన భావనగా గుణదల పుణ్యక్షేత్ర ప్రాంతం అనిపిస్తుందన్నారు. 100 వసంతాల వేడుకను విజయవంతంగా నిర్వహించిన ఘనత విజయవాడ కతోలిక పీఠం బిషప్, పుణ్యక్షేత్రం రెక్టర్ యేలేటి విలియం జయరాజు విజయవాడ కతోలిక పీఠం పరిధిలో ఉన్న గురువులకే చెల్లుతుందని కొనియాడారు.



శతాబ్ది మహోత్సవాల కళావేదికపై లియోపొల్డొ జిరెల్లి, గౌరవ అతిథి విశాఖపట్నం ఆర్చ్ బిషప్ మల్లవరపు ప్రకాష్, విజయవాడ బిషప్ తెలగతోటి జోసఫ్ రాజారావు, తదితర 180మంది గురువులతో కలిసి ముగింపు శతాబ్ది మహోత్సవాల సమిష్టి దివ్యపూజాబలి సమర్పించారు. అనంతరం వాటికన్ రాయబారి, గురువులు కతోలిక భక్తులకు దివ్య సత్ప్రసాదం అందజేశారు. గుణదల మాత పుణ్యక్షేత్రానికి తెలుగు రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో తరలిరావడంతో గుణదలకొండ మార్గాలన్నీ కిటకిటలాడాయి.

చంద్రబాబు స్వాప్నికుడే కాదు.. శ్రమజీవి



'మహాస్వాప్నికుడు' పుస్తకావిష్కరణ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

- మహాస్వాప్నికుడు పుస్తకావిష్కరణలో వక్తలు

విజయవాడ, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : చంద్రబాబు మహాస్వాప్నికుడే కాకుండా ఒక శ్రమజీవి అని పలువురు వక్తలు వ్యాఖ్యానించారు. విక్రమ్ పూల రాసిన 'మహాస్వాప్నికుడు' పుస్తకావిష్కరణ సభ విజయవాడలోని ప్రైవేటు ఫంక్షన్ హాలులో ఆదివారం సాయంత్రం జరిగింది. వక్తలు చంద్రబాబు, టీడీపీతో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ అధికార ప్రతినిధి గొట్టిపాటి రామకృష్ణప్రసాద్, న్యాయవాది శ్రీపతిరావు, మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు ఫారూక్ షబ్లీ, టీడీపీ రైతు విభాగ అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు చెన్నుపాటి ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

ఇదొక ఉద్వేగ క్షణం : నెట్టెం రఘురాం

'మహాస్వాప్నికుడు' పుస్తక విడుదల ఒక ఉద్వేగకరమైన క్షణం. చంద్రబాబు మహాస్వాప్నికుడు. 1978 నుంచి ఆయన ప్రజాజీవితంలో ఉన్నారు. ఆయన రాజకీయ చతురత, వ్యూహాలను చాలామంది చూశారు. పార్టీలో ఉన్న వారికి ఆయనతో ఎక్కువ అనుబంధం ఉంటుంది. 1984లో ఉమ్మడి రాష్ట్రంలో గవర్నరు రామ్‌లాల్ ప్రభుత్వం పడగొట్టినప్పటి నుంచి టీడీపీ గురించి ప్రజలు ఎంతో ఆసక్తిగా చూస్తున్నారు. చంద్రబాబు టీడీపీ ప్రధాన కార్యదర్శి అయిన తర్వాత పార్టీని పటిష్టపరిచడంలో కీలక భూమిక పోషించారు. దేశంలో ఏ రాజకీయ పార్టీకి ఇంతటి నిబద్ధత కలిగిన కార్యకర్తలు లేరని చెప్పడానికి కారణం చంద్రబాబు దార్శనికతే. ఆయన ముఖ్యమంత్రి అయిన తర్వాత ఆయన దూరదృష్టిని ప్రజలు చూశారు. విజన్ 2020కి అనుగుణంగా బడ్జెట్‌ను కేటాయించుకుని, సంస్కరణలు తీసుకొచ్చారు. ప్రజల వద్దకు పాలన, శ్రమదానం, జన్మభూమి వంటి ఊహకు అందని కార్యక్రమాలు నిర్వహించారు. 2004లో టీడీపీ అధికారంలోకి వచ్చినట్టయితే వ్యవస్థలు ఇంకా పటిష్టంగా రూపుదిద్దుకునేవి. 2019లో మళ్లీ మనకు విఘాతం ఏర్పడింది. దీనితో రాష్ట్రానికి అపారమైన నష్టం కలిగింది. ఇప్పుడు రాజకీయాలు సూత్రాల ప్రకారం కాకుండా అడ్డదిడ్డంగా జరుగుతున్నాయి. వ్యవస్థలను చేతుల్లో పెట్టుకుని ఆటలాడుతున్నా చంద్రబాబు ఎక్కడా సహనం కోల్పోకుండా ఉన్నారు. 53 రోజులు జైల్లో ఉన్నా సహనం కోల్పోలేదు. ప్రజల కోసం ఆయన రూపొందించుకున్న విజన్‌ను ముందుకు తీసుకెళ్తున్నారు.

జెండా ఇలా ఉందంటే.. : గద్దె రామ్మోహనరావు

చంద్రబాబుతో అనుబంధం ఉన్న నేతల్లో నేను ఒకడ్ని. ఎన్టీఆర్‌పై అభిమానంతో రాజకీయాల్లోకి వచ్చా. ఆయన మరణానంతరం చంద్రబాబు శిష్యుడిగా చేరాను. చంద్రబాబు విద్యార్థి దశ నుంచే నాయకుడిగా ఎదిగారు. బలమైన వర్గానికి ఎదురు నిలబడి విజయం సాధించారు. పేదలకు అండగా ఉన్న జెండా టీడీపీ జెండా. టీడీపీ జెండా రెపరెపలాడడానికి కారణం చంద్రబాబు. చంద్రబాబును అరెస్టు చేసినప్పుడు ప్రపంచం మొత్తం ఆయన చేసిన పనులు చెప్తుంటే ఎన్నో విషయాలు మనకు తెలిశాయి. ఒక వ్యక్తి జైలుకు వెళ్తే చేసిన నేరాలు బయటకు వస్తాయి. ఆస్తిలో మహిళలకు సమాన హక్కును ఎన్టీఆర్ కల్పిస్తే, పురుషులతో సమానంగా సంపాదించే స్థాయికి మహిళలను తీసుకెళ్లారు.

చంద్రబాబు కోసం పోరాటం చేద్దాం .. - టీడీ జనార్దన్, పొలిట్‌బ్యూరో సభ్యుడు

కలలు కనడానికి ధైర్యం ఉండాలి. వచ్చిన కలలను సాధించడానికి సాహసం ఉండాలి. ఈ రెండూ ఉన్న వ్యక్తి చంద్రబాబు. ప్రపంచంలో వచ్చిన ఐటీ విప్లవ ఫలితాలు తెలుగుజాతికి అందాలని అంచనా వేసిన వ్యక్తి ఆయన. రైతులు, పేదలు, మధ్యతరగతి వర్గాల కుటుంబాల్లో ఒక ఐటీ ఉద్యోగి ఉన్నాడు. ఎన్టీఆర్ ఎప్పుడో మహిళలకు ఆస్తిలో ఇచ్చిన సమాన వాటా హక్కును కేంద్రం ఇటీవలే అమలు చేసింది. దేశంలో ఉన్న డ్వాక్రా సంఘాల సంఖ్యతో సమానంగా రాష్ట్రంలో డ్వాక్రా గ్రూపులను ఏర్పాటు చేసిన వ్యక్తి చంద్రబాబు. తొలి పంచవర్ష ప్రణాళికలో రాసుకున్న నదుల అనుసంధానం ఏ ప్రభుత్వం అమలు చేయలేదు. ఎన్టీఆర్ కృష్ణా, పెన్నా నదులను అనుసంధానం చేసి రాయలసీమకు సాగునీటి సదుపాయం కల్పించారు. గోదావరి నీటిని పట్టిసీమ ద్వారా కృష్ణా నదికి అనుసంధానం చేశారు. ఇప్పటి వరకు పనిచేసిన సీఎంలు 22వేల మెగావాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తే, ఒక్క చంద్రబాబు మాత్రమే 15వేల మెగావాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేశారు. సీఎం జగన్ ఒక్క మెగావాట్ విద్యుత్‌ను అదనంగా ఉత్పత్తి చేయలేదు. బ్రిటిష్ పాలనలో ఉన్న పరిస్థితులు నేడు రాష్ట్రంలో ఉన్నాయి. బ్రిటిష్ వారు మాదిరిగా ప్రకృతి వనరుల లూటీ జరుగుతోంది. స్వాతంత్ర్యం కోసం ఎలాంటి పోరాటం జరిగిందో అదేవిధంగా చంద్రబాబు పాలన కోసం అలాంటి పోరాటం చేయాలి.

చంద్రబాబు భయపడలేదు.. బాలకోటయ్య, దళిత బహుజన జేఏసీ నేత

దేశంలో ఇలాంటి పుస్తకాలు రాయదగ్గ ఏకైక నాయకుడు చంద్రబాబు. నాయకుడంటే రాబోయే ఎన్నికల కోసం పనిచేసేవాడు కాదు. రాబోయే తరాల కోసం పనిచేసేవాడు. వర్తమానంలో చంద్రబాబు పడిన ఘోష ఈ పుస్తకంలో కనిపించలేదు. చంద్రబాబును అరెస్టు చేసినప్పుడు రాష్ట్రమంతా భయపడింది. ఆయన మాత్రం భయపడలేదు.

రాజధానికి భూములు ఇచ్చిన రైతులు గోపాలగొడను కలిశారు. కార్యక్రమం ముగిసిన తర్వాత ఆయనను మహిళా రైతులు శాలువా కప్పి సత్కరించారు. కొద్దిసేపు ఆయన వారితో ముచ్చటించారు. మహిళా రైతులు చెప్పిన సమస్యలు విన్నారు.

ఓటు ఆయుధంతో జగన్‌ను ఇంటికి పంపేద్దాం

- టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు రాజు

కంకిపాడు, ఫిబ్రవరి 11 : దళితులు యాచకులు కాదని.. రానున్న ఎన్నికల్లో జగన్‌ను ఓటు ఆయుధంతో ఇంటికి పంపేయాలని టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.ఎస్ రాజు పిలుపునిచ్చారు. కంకిపాడులో ఆదివారం నిర్వహించిన దళిత గర్జన మహాసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ కార్పొరేషన్లను ఏర్పాటు చేసి దళితులు


దళిత గర్జన మహాసభకు హాజరైన పార్టీ శ్రేణులు

తమ కాళ్లపై తాము నిలపడే విధంగా తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబునాయుడు కృషి చేశారన్నారు. సీఎం జగన్మోహన్‌రెడ్డి మాత్రం దళితులను యాచికులుగా మారుస్తున్నాడని మండిపడ్డారు. జగన్ అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమించేందుకు దళితులు ఒక కన్నమదాసు, ఒక స్టాలిన్ కావాలని ఆయన పిలుపునిచ్చారు. పెనమలూరు నియోజకవర్గంలో బోడె ప్రసాద్‌ను గెలిపించి జగన్మోహన్ రెడ్డి దుర్మార్గపు ప్రభుత్వాన్ని తరమికొట్టాలన్నారు. సామాజిక సమానత్వాన్ని తీసుకువచ్చేందుకు, మనుషులు అందరూ ఒక్కటే అని చెప్పేందుకు బాబాసాహెబ్ కృషి చేశారని.. 16 నెలలు జైల్లో ఉండి వచ్చిన ఆర్థిక నేరగాడు జగన్ రెడ్డితో అంబేడ్కర్‌ను పోలుస్తావా.. అంటూ వైసీపీ సమన్వయకర్త జోగి రమేశ్‌పై మండిపడ్డారు. మహాసేన రాజేష్ మాట్లాడుతూ, అంబేడ్కర్ రాజ్యాంగాన్ని తు.చ తప్పకుండా అనుసరించింది చంద్రబాబు నాయుడు అన్నారు. అంబేడ్కర్ విద్య పేరు తీసేసి జగన్ రెడ్డి పేరు పెట్టడం ఎంతవరకు సమంజసమన్నారు. రాష్ట్రంలో సుమారు 9 వేల మంది దళితులపై దాడులు జరిగాయన్నారు. చంద్రబాబు నాయుడు ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలను జగన్ రద్దు చేశారన్నారు. బోడె ప్రసాద్‌పై పోటీ చేసేందుకు జగన్ మోహన్‌రెడ్డికి దమ్ముందా అని ప్రశ్నించారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో ఓటు ఆయుధంతో జగన్‌ను రాష్ట్రం నుంచి తరిమికొట్టాలన్నారు. మాజీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్, జనసేన నియోజకవర్గ సమన్వయకర్త ముప్పా రాజా తదితరులు మాట్లాడారు. టీడీపీ కంకిపాడు మండల అధ్యక్షుడు సుదిమళ్ల రవీంద్ర అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అమరావతి ఉద్యమ నాయకుడు కొలికపూడి శ్రీనివాసరావు, టీడీపీ సీనియర్ నాయకులు, జనసేన పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

టీడీపీతో ముస్లింలకు స్వర్ణయుగం

- చంద్రన్నకు మద్దతు పలుకుదాం.. : టీడీపీ నేతల పిలుపు

జగ్గయ్యపేట, ఫిబ్రవరి 11 : తెలుగుదేశం పార్టీ పాలన ముస్లింలకు స్వర్ణయుగమని టీడీపీ నేతలు పేర్కొన్నారు. మళ్లీ అలాంటి మంచి రోజులు తిరిగి రావాలంటే చంద్రన్నను గెలిపించాలని పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని ఓ కల్యాణ మండపంలో 'నారా హమారా- తాతయ్య హమారా' కార్యక్రమంలో విజయవాడ పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు నెట్టెం రఘురాం, మాజీ ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య, సీనియర్ నేత కేశినేని చిన్ని, శాసనమండలి మాజీ ఛైర్మన్ షరీఫ్, పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ నాగుల్ మీరా, శ్రీరాం సుబ్బారావు, ఎం.ఎస్ బేగ్, షేక్ సత్తార్, సయ్యద్ అన్వర్ తదితరులు మాట్లాడారు. చంద్రబాబు హయాంలో రంజాన్ కానుక వంటి అనేక పథకాలు అమలయ్యాయని వివరించారు. ముస్లిం మైనార్టీల ఆత్మీయ సదస్సు సందర్భంగా పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. వేలాది మంది ముస్లిం సోదరులతో పట్టణం కిక్కిరిసపోయింది.


సమావేశంలో పాల్గొన్న నెట్టెం, తాతయ్య తదితరులు


పోలీసులు స్వాధీనం చేసుకున్న బైకులు

కోడిపందేల శిబిరంపై దాడి

- పెద్ద ఎత్తున నగదు, వాహనాలు స్వాధీనం, పందెం రాయుళ్లు అరెస్టు

గన్నవరం, ఫిబ్రవరి 11 : మండలంలోని సూరంపల్లి శివారు మామిడితోటలో శనివారం అర్ధరాత్రి గుట్టు చప్పుడు కాకుండా కోడిపందేలు వేస్తున్న శిబిరంపై స్పెషల్ పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో 44మంది 32 బైకులు, 24కార్లు, 54 కోళ్లు సుమారు రూ. 10.50 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. మామిడి తోటలో ఫ్లడ్‌లైట్లు వెలుతురులో పెద్ద ఎత్తున కోడి పందేలు వేస్తున్నారని సమాచారం జిల్లా ఎస్పీకి తెలియడంతో ప్రత్యేక టీమును ఏర్పాటు చేసి దాడి చేయించినట్లు తెలిసింది. హనుమాన్ జంక్షన్ సర్కిల్ పోలీసులు, నున్న పోలీసులు దాడిలో పాల్గొన్నారు. సుమారు 100 మందికి పైగా పందెం రాయుళ్లతో కోడి పందేలు వేస్తున్నారు. అందరు పందేల్లో నిమగ్నమైపోగా సివిల్‌లో వచ్చిన పోలీసులు మెరుపుదాడి చేయటంతో పందెం రాయుళ్లు ఖంగుతిని పరుగులు తీశారు. ముందు పోలీసులు అని గుర్తించక వారిపైనే పందెం రాయుళ్లు తిరగబడ్డారు. పోలీసులను తెలియడంతో కొందరు పారిపోయారు. ఫెన్సింగ్, ముళ్లతుప్పలు చూడకుండా పారిపోయారు. కొందరికీ ఫెన్సింగ్ గీసుకుని గాయాలు అయినట్లు తెలిసింది. అదుపులోకి తీసుకున్న 44మందిపై కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. వాహనాలను, కోడి పుంజులను సీజ్ చేసి గన్నవరం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఎక్కువ మొత్తంలో నగదు దొరికితే తక్కువ చూపారని, కోడి పందేలు వేసుకునేందుకు అనుమతి గన్నవరం పోలీసులు ఇచ్చినట్లు ఇచ్చి దాడి జరిగిందని జోరుగా ప్రచారం జరుగుతుంది.

సీఎం కార్యాలయ ముట్టడి భగ్నం

- ఏఐవైఎఫ్ నేతల అరెస్టులు.. స్టేషన్‌కు తరలింపు
- సీపీఐ రామకృష్ణ పరామర్శ



ఆందోళనకారులను లాగిపడేస్తున్న పోలీసులు, స్టేషన్‌లో ఏఐవైఎఫ్ నేతలను పరామర్శిస్తున్న రామకృష్ణ

వన్‌టౌన్, ఫిబ్రవరి 11 : ఖాళీగా ఉన్న 25వేల ఉపాధ్యాయ పోస్టుల భర్తీ డిమాండ్‌తో ఏఐవైఎఫ్ తలపెట్టిన సీఎం క్యాంప్ కార్యాలయ ముట్టడి కార్యక్రమాన్ని పోలీసులు భగ్నం చేశారు. ఆదివారం విజయవాడ స్టేట్ గెస్ట్ హౌస్ నుంచి సీఎం కార్యాలయ ముట్టడికి బయలుదేరిన ఏఐవైఎఫ్ నాయకులు, విద్యార్థులను పోలీసులు అడ్డుకుని విచక్షణారహితంగా అరెస్టులు చేసి వన్‌టౌన్ స్టేషన్‌కు తరలించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ పోలీసుల వైఖరిని ఖండిస్తు.. వారిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. శనివారం రాత్రి నుంచే ఏఐవైఎఫ్ నాయకులు, సీపీఐ నాయకుల ముందస్తు అరెస్టులు కొనసాగాయి. ఎక్కడికక్కడ హౌస్ అరెస్టులు చేశారు. స్టేట్ గెస్ట్‌హౌస్ నుంచి ప్రదర్శనగా బయలుదేరిన ఏఐవైఎఫ్ నాయకులు, యువతను పోలీస్ కమిషనర్ బంగ్లా వద్ద అరెస్టు చేశారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు పరుచూరి రాజేంద్ర విజయవాడ కార్యాలయానికి వస్తుండగా అరెస్టు చేశారు. సీఎం క్యాంప్ కార్యాలయానికి బయలుదేరిన మహంకాళి సుబ్బారావు, పలు జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు, ముఖ్యనేతలను ముందస్తుగా అరెస్టు చేశారు. ఆదివారం ఉదయం నాయకులు, కార్యకర్తలను విచక్షణారహితంగా ఈడ్చుకుంటూ పోలీసులు వ్యాన్‌ల్లోకి తోసేయడంతో పలువురికి స్వల్ప గాయాలయ్యాయి.

జగన్ రెడ్డిని ఇంటికి పంపేందుకు సిద్ధం..

నిరుద్యోగులను మోసం చేసిన జగన్‌రెడ్డిని ఇంటికి పంపించేందుకు సిద్ధంగా ఉన్నామని ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ నాయకులు ప్రకటించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ, వైసీపీ ప్రభుత్వం మెగా డీఎస్సీ పేరుతో యువతను దగా చేసిందని విమర్శించారు. 25వేల పోస్టులు ఖాళీగా ఉంటే వాటిలో కేవలం నాలుగో వంతు పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయడం మోసమేనన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి ఖాళీగా ఉన్న టీచర్ల పోస్టులను భర్తీ చేయాలన్నారు. నిబంధనల ప్రకారం పరీక్ష రాయడానికి నోటిఫికేషన్‌కు మధ్య 90 రోజుల గడువు ఉండగా కేవలం 40 రోజుల వ్యవధిలోనే పరీక్ష రాయాలని ఒత్తిడి చేయడం దారుణమన్నారు. జగన్‌రెడ్డిని ఇంటికి పంపించడానికి సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు. షేక్ మున్నా, రణత్‌యాదవ్, వియ్యపు రాజు, లక్ష్మణ్, లంకే సాయి, లంకా గోవిందరాజులు, శింగంశెట్టి మోహన్‌ప్రసాద్, కార్తీక్, అజయ్, అఖిల్, సాయి, ఎస్కే బాబా తదితరులు పాల్గొన్నారు.

మంచి ఆహారం, వ్యాయామంతో గుండె జబ్బుల నియంత్రణ

పటమట, ఫిబ్రవరి 11: మంచి ఆహారం, సరైన వ్యాయామం, యోగా వంటి దైనందిన కార్యక్రమాలతో గుండె జబ్బులు రాకుండా రక్షించుకోవచ్చునని డాక్టర్ శివప్రసాద్ హృదయాలం హాస్పిటల్ చీఫ్ కార్డియాలజిస్ట్ డాక్టర్ పీవీ శివప్రసాద్ తెలిపారు. పటమట సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన గుండె సంబంధిత వ్యాధులపై అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. గుండెపోటు వచ్చిన మొదటి గంటలో దగ్గరలో ఉన్న వైద్య నిపుణుడి దగ్గరకు తీసుకువెళితే రక్షించే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని తెలిపారు. అసోసియేషన్ అధ్యక్షుడు సూర్యదేవర పాపారావు, అసోసియేషన్ సభ్యులు కోనేరు వెంకటేశ్వరరావు, కొండపల్లి మాధవరావు, వసంతం శివశంకరరావు, లోయ నాగేశ్వరరావు, కొల్లిపర రామ్మోహనరావు, కొఠారి సాంబశివరావు, బుడ్డి వెంకట కృష్ణారావు పాల్గొన్నారు.


శ్రీనగర్ కాలనీలో పూర్తికాని ఎల్ అండ్ టీ డ్రెయినేజీ


సెంటినీ హాస్పిటల్ రోడ్డులో దుర్వాసన వెదజల్లుతున్న మురుగు


వెటర్నరీ కాలనీలో లీకవుతున్న మంచినీటిపైపులు


శ్రీనివాసనగర్ బ్యాంక్ కాలనీ మెయిన్ రోడ్డులో పూడుకుపోయిన సైడుకాలువ

నాలుగో డివిజన్‌లో..

అన్నీ సమస్యలే..


ఏపీఐఐసీ కాలనీలోని వీఎంసీ పార్కులో ధ్వంసమైన ఆట పరికరం

కొంతకాలంగా నిలిచిన అభివృద్ధి పనులు ● ఇబ్బంది పడుతున్న స్థానికులు

భారతీనగర్: తూర్పు నియోజకవర్గంలోని ప్రధాన డివిజన్లలో నాలుగో డివిజన్ ఒకటి. కొంతకాలంగా డివిజన్‌లో అభివృద్ధి పనులు జరగకపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పూడికతో నిండిన సైడు కాలువలు, వ్యర్థాలు పేరుకుపోయిన డ్రెయినేజీలు, వీఎంసీ పార్కులో పాడైపోయిన ఆట పరికరాలు, తరచూ మంచి నీటి పైపులకు లీకులు, ఏళ్ల గడుస్తున్నా జరగని కాలనీలోని అంతర్గత రోడ్ల నిర్మాణం వంటి పలు సమస్యలతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. డివిజన్‌లోని వెటర్నరీ కాలనీలోని 4వ రోడ్డు, వాటర్ ట్యాంక్ రోడ్డు, సెంట్రల్ ఎక్సైజ్ కాలనీ 1వ రోడ్డు, శ్రీనివాస నగర్ బ్యాంక్ కాలనీ మెయిన్ రోడ్డులో ఉన్న సైడు కాలువలు పూడికతో నిండిపోయాయి. చిన్నపాటి వర్షం కురిసినా మురుగునీటితో రోడ్డు నిండిపోతోంది. రోజుల తరబడి మురుగు రోడ్డుపైనే నిలిచిపోతోంది. వాననీరు, డ్రెయినేజీ నీరు కలిసిపోవడంతో ప్రజలు బయటకు రావాలంటే నానా అవస్థలు పడుతున్నారు. శ్రీనగర్ కాలనీ మెయిన్ రోడ్డు, వివేకానందరోడ్డు, శ్రీనివాసనగర్ బ్యాంక్ కాలనీ వేములపల్లి పరమేశ్వరరావు రోడ్డు, భారతీనగర్ 6వరోడ్డు నిధులు మంజూరైనా అభివృద్ధికి నోచుకోలేదు. ఏళ్లు గడిచినా అభివృద్ధికి రోడ్డు నోచుకోలేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.

జనసేనలోకి భారీగా చేరికలు

పాతరాజరాజేశ్వరి పేట, ఫిబ్రవరి 11: జనసేన సిద్ధాంతాలు, ఆశయాలు నచ్చి రాష్ట్రానికి మంచి భవిష్యత్తు పవన్‌కల్యాణ్‌తోనే సాధ్యమని అనేకమంది పార్టీలో చేరుతున్నారని జనసేన పార్టీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పోతిన వెంకట మహేష్ తెలిపారు. 56వ డివిజన్ పాతరాజరాజేశ్వరిపేటలో ఆదివారం జనసేన నాయకుడు లక్ష్మీకాంత్ ఆధ్వర్యంలో షేక్ గాలిబ్ మిత్రమండలి, షేక్ రఫీ మిత్రమండలి, మర్తి వసంత మిత్రమండలి, యడ్లపల్లి రాధ మిత్రమండలికి చెందిన 200 మందికి పైగా మహిళలు, యువత పార్టీలోకి చేరారు. మహేష్ వారిని పార్టీలోకి ఆహ్వానించారు. కె.పద్మావతి, కె.కృష్ణవేణి, కె.జ్యోతి, షేక్ నజియా, జె.కల్యాణి, బి.రాణి, డి.గాయత్రి, కనకదుర్గ పాల్గొన్నారు.

వైసీపీ నుంచి..

వన్‌టౌన్: పశ్చిమ నియోజకవర్గంలో పలువురు వైసీపీ కార్యకర్తలు, నాయకులు ఆదివారం జనసేన పార్టీలో చేరారు. పశ్చిమ నియోజకవర్గం జనసేన కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో గూడెల దుర్గారావు ఆధ్వర్యంలో పలువురు పార్టీలో చేరారు. పోతిన మహేష్ వారికి సాదరస్వాగతం పలికారు. శ్రీను, నవీన్, చిన్నా, స్వామి, దుర్గారావు, ఫణికుమార్ చేరారు. అమీర్, బాషా, వెంకటరమణ, గోవింద్, రమేష్ పాల్గొన్నారు.


పశ్చిమ జనసేన కార్యాలయంలో పార్టీలో చేరిన వారితో పోతిన మహేష్

వచ్చేది టీడీపీ-జనసేన ప్రభుత్వమే

భవానీపురం: వైసీపీ ఎన్ని జిమ్మిక్కులు చేసినా వచ్చేది టీడీపీ-జనసేన ప్రభుత్వమేనని, 160 అసెంబ్లీ, 20 ఎంపీ స్థానాలను కూటమి గెలిచి తీరుతుందని పోతిన వెంకట మహేష్ ధీమా వ్యక్తంచేశారు. చెరువు సెంటర్‌లో 44వ డివిజన్ అధ్యక్షురాలు మల్లెపు విజయలక్ష్మి ఆధ్వర్యంలో పార్టీ డివిజన్ కార్యాలయాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. 150 మంది మహిళలకు విజయలక్ష్మి, సురేష్ దంపతులు సమకూర్చిన చీరలను పంపిణీ చేశారు. రాష్ట్ర, నగర కమిటీ, డివిజన్ అధ్యక్షులు పాల్గొన్నారు.

వైసీపీ ప్రభుత్వానికి చరమగీతం పాడుదాం

సత్యనారాయణపురం, ఫిబ్రవరి 11: నిరంకుశపాలన చేస్తున్న వైసీపీ ప్రభుత్వానికి చమరగీతం పాడుదామని ప్రజలకు టీడీపీ పొలిట్‌బ్యూరోసభ్యుడు బొండా ఉమా తనయుడు బొండా సిద్ధార్థ పిలుపు నిచ్చారు. 33వ డివిజన్ ఇన్‌చార్జి గార్లపాటి విజయకుమార్ ఆధ్వర్యంలో ఆదివారం సత్యనారాయణపురంలో బొండా ఉమా అన్నరావాలి సెంట్రల్ గెలవాలి కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. బొండా సిద్ధార్థ ఇంటిం టికీ వెళ్లి టీడీపీ అధికారంలోకి వస్తే అమలు చేసే పథకా లను ప్రజలకు వివరించారు. 33వడివిజన్ ఇన్‌చార్జి గార్లపాటి విజయకుమార్, డివిజన్ అధ్యక్షుడు ఎన్.కోటేశ్వరరావు, చామర్తి రవిబాబు, చిలువేరు శ్రీను, పొట్లూరి కృష్ణప్రసాద్, వేమూరి భానుప్రకాష్, టీఎన్ఎస్ఎఫ్ సెంట్రల్ నియోజకవర్గ అధ్యక్షుడు మనోజ్, ధనలక్ష్మి, తంగిరాల లక్ష్మి, శంకరసాయి, రామలక్ష్మి పాల్గొన్నారు.


సత్యనారాయణపురంలో సమస్యలు తెలుసుకుంటున్న బొండా సిద్ధార్థ

మహిళా చిరువ్యాపారిపై దాడికి యత్నం

● **ఐదుగురిపై కేసు నమోదు**

విద్యాధరపురం, ఫిబ్రవరి 11: భవానీపురం దర్గా ఎదురుగా ఉంటున్న మహిళా చిరువ్యాపారిపై దాడికి యత్నించిన ఐదుగురిపై ఆదివారం భవానీపురం పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. ఇరువూరి గురువర్ధని ఇంటివద్దే బడ్డీ కొట్టు నిర్వహించుకుంటోంది. ఇంటిపక్కనే ఉంటున్న బొల్లా సుజాత రోజూ గురువర్ధని వద్ద పాలు, పెరుగుతో పాటు సరుకులు తీసుకుంటోంది. తనకివ్వాల్సిన మొత్తం రూ.80 వేలు అరువు డబ్బులు ఇవ్వాలని సుజాతను గురువర్ధని శనివారం కోరింది. ఆరోజు రాత్రి 9.30గంటలకు సుజాత, భర్త ఆదినారాయణ, సోదరులు చెరుకూరి సురేష్, సురేంద్ర, సుభాష్‌లు గురువర్ధని నివాసానికి వెళ్లి అంతమొత్తం ఎందుకు ఉంచావంటూ ఆమెను దూషించి కొట్టబోయారు. రాఘవయ్య అనే వ్యక్తి అడ్డుకున్నారు. వారంతా ఆమెను చంపుతా మంటూ బెదిరించారు. దీంతో గురువర్ధని భర్తతో కలిసి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. సుజాత, భర్తను పిలిచి మందలించారు. మళ్లీ ఇంటికి వెళుతుండా వారిద్దరూ గురువర్ధనిని అసభ్యకరంగా దూషించి చంపుతామని బెదిరించారు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు ఐదుగురిపై కేసు నమోదు చేశారు

వృద్ధురాలి అదృశ్యంపై కేసు

వీటీపీఎస్ కూలింగ్ కెనాలలో దుస్తులు ఉతకడానికి వెళ్ళిన గొల్లపూడికి చెందిన పాలవాయి అమ్మాజీ (64)అదృశ్యమైనట్లు భవానీపురం పోలీసు స్టేషన్‌లో ఆదివారం కేసు నమోదైంది. గొల్లపూడి వన్‌సెంటర్ కరకట్ట ప్రాంతంలో ఉంటున్న అల్లుడు ఉప్పల య్య వద్ద అమ్మాజీ ఉంటోంది. ఆమె ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు వీటీపీఎస్ కూలింగ్ కెనాల్‌లో దుస్తులు ఉతకడానికి వెళ్లింది. సాయంత్రం వరకు ఇంటికి రాకపోవడంతో బంధువులు వెతకడానికి కూలింగ్ కెనాల్ వద్దకు చేరారు. కాలువ వద్ద బకెట్ కనిపించింది కానీ ఆమె జాడ తెలియరాలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

19 మద్యం బాటిళ్లు స్వాధీనం

పాయకాపురం, ఫిబ్రవరి 11: నిబంధనలకు విరుద్ధంగా మద్యం కలిగి ఉన్న ఓ వ్యక్తిపై నున్న రూరల్ పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. రోజువారీ తనిఖీల్లో భాగంగా సిబ్బంది పాయకాపురం ప్రాంతంలో తనిఖీలు నిర్వహిస్తున్నారు. చెట్టు సెంటర్ వద్ద గరికపాటి ప్రసాద్ అనే వ్యక్తి వద్ద 19 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

రామలింగేశ్వరనగర్, ఫిబ్రవరి 11: విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం సోమవారం ఉదయం 8గంటల నుంచి 10గంటల వరకు న్యూ బ్రిడ్జి సెక్షన్, న్యూ బ్రిడ్జి విద్యుత్ ఉపకేంద్రం, 11కేవీ ఎస్‌విఎస్ ఫీడర్ పరిధిలో సరఫరా నిలపివేస్తున్నట్లు ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజనీర్ బీవీ సుధాకర్ తెలిపారు. రాఘవ నగర్, సీతారామనగర్, చెన్నుపాటి రామకోటయ్య వీధి, ఎయిర్‌టెల్ హెచ్‌టీ సర్వీస్ ప్రాంతాలలో సరఫరా నిలిపివేస్తామని, వినియోగదారులు సహకరించాలని అయన కోరారు.

ప్రజాకాపునాడు 27వ డివిజన్ కమిటీ ఎన్నిక ఏకగ్రీవం

సత్యనారాయణపురం, ఫిబ్రవరి 11: ప్రజాకాపునాడు 27వ డివిజన్ కమిటీ ఎన్నిక ఏకగ్రీవమైంది. దుర్గాపురంలో ప్రజాకాపునాడు రాష్ట్ర అధ్యక్షుడు యర్రంశెట్టి అంజిబాబు ఆధ్వర్యంలో ఆదివారం డివిజన్ కమిటీ ఎన్నిక నిర్వహించారు. నూతన కమిటీ అధ్యక్షులుగా పసుపులేటి బుచ్చిబాబు, ప్రధాన కార్యదర్శిగా మండా రాము, ఉపాధ్యక్షులుగా కఠారి దుర్గాప్రసాద్, కురిటి శివ, కార్యదర్శిగా మచ్చా శ్రీనివాసరావు, పసుపులేటి మల్లికార్జునరావు, చల్లా శ్రీనివాస్, శ్రీధర్, కనకలింగేశ్వరరావు, సీహెచ్ దుర్గారావు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కూనపురెడ్డి అనిల్‌ను ఎన్నుకున్నారు. ఎన్నికైన డివిజన్ కమిటీ నేతలకు యర్రంశెట్టి అంజిబాబు నియామక పత్రం అందజేశారు. ఐక్యంగా ఉంటేనే కాపులు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించగలరని అంజిబాబు పేర్కొన్నారు. నాయకులు యర్రంశెట్టి వెంకన్న, శెనగశెట్టి హరిబాబు, బండారు అంజనేయులు పాల్గొన్నారు.

ఘనంగా కన్యకాపరమేశ్వరి ఆత్మార్పణ దినోత్సవం

వన్‌టౌన్, ఫిబ్రవరి 11: పూజారి వీధిలోని లక్ష్మీనా రాయణ ఆర్య వైశ్య కల్యాణ మండపంలో విజయవాడ అర్బన్ జిల్లా ఆర్యవైశ్య యువజన సంఘం ఆవోప కృష్ణాజిల్లా మహిళా విభాగం వాసవీ పరివార్ రాష్ట్ర మహిళా విభాగం, ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ విజయవాడ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం వాసవీ కన్యాకా పరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. మేళ తాళాలతో, కృష్ణానది దుర్గాఘాట్ నుంచి ఆకుల ప్రవీణకుమార్, తేజస్వి, లోహిత్, నైషిత ఆధ్వర్యంలో 102 మంది కన్యలు కలశాలను శిరస్సున పెట్టుకుని ఊరేగింపుగా పూజావేదిక వద్దకు తీసుకువచ్చారు. మాజేటి భవానీప్రసాద్, జ్యోతి దంపతులు అమ్మవారికి అభిషేకాలు చేశారు. పోలిశెట్టి లక్ష్మీ సత్యనారాయణశ్రేష్టి, వెంకట శారద దంపతులు అమ్మవారికి కుంకుమార్చన నిర్వహించారు. కొత్తమాసు వంశీధర్, సరిత, చలువాది శ్రీమన్నారాయణ, సరస్వతి ఆధ్వర్యంలో అమ్మవారి మోక్షగుండ సందర్శన కార్యక్రమాన్ని నిర్వహించారు. దింటకుర్తి త్రిమూర్తులు, రేవతి విజయలక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో లలితా సహస్రనామపారాయణ చేశారు. కోపూరి వంశీ శివకృష్ణ శర్మ ఆధ్వర్యంలో పూజలు, పూర్ణాహుతి నిర్వహించారు.


కలశాలు తీసుకొస్తున్న కన్యలు

సత్యనారాయణపురం: జీఎస్‌రాజు రోడ్డులోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారికి పంచామృతములతో అభిషేకం, 108 కలశాలతో అభిషేకం నిర్వహించారు. శ్రీచక్రార్చన, చండీసప్తమశతి హోమములు, విశేష పుష్పార్చన నిర్వహించారు. సాయంత్రం నగరోత్సవం నిర్వహించారు. అమ్మవారిని రథంపైన ఉంచి సత్యనారాయణపురం పురవీధుల్లో మేళతాళాలతో ఊరేగించారు.

నర్సింగ్ వృత్తి పవిత్రమైనది

సత్యనారాయణపురం, ఫిబ్రవరి 11: నర్సింగ్ వృత్తి పవిత్రమైనదని, నైటింగేల్ స్ఫూర్తితో వైద్యసేవలు అందించాలని నర్సింగ్ విద్యార్థినులకు ఏపీ నర్స్ మిడ్‌వైఫ్ కౌన్సిల్ రిజిస్ట్రార్ కె.సుశీల సూచించారు. దుర్గాపురం విజయ నర్సింగ్ కళాశాలలో ఆదివారం సాయంత్రం ల్యాంప్‌లైటింగ్, క్యాపింగ్ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆమె పాల్గొన్నారు. నర్సింగ్‌కు అపారమైన అవకాశాలు ఉన్నాయని విజయ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ ఛైర్మన్ తట్టి అర్జునరావు పభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ జీ.అక్కమ్మ, ప్రభుత్వ నర్సింగ్ ప్రిన్సిపాల్ పి.పుష్పలీల విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. విజయ నర్సింగ్ ఇనిస్టిట్యూట్ మెడికల్ సైన్సెస్ మేనేజింగ్ డైరెక్టర్ టి.శ్రీకాంత్ పాల్గొన్నారు.

యువతలో నేరప్రవృత్తికి అశ్లీలత ఓ కారణం

పటమట, ఫిబ్రవరి 11: యువతలో నేర ప్రవృత్తి పెరగడానికి ప్రధాన కారణం మద్యం, హింస, అశ్లీలత అని ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెనుమత్స దుర్గాభవాని అన్నారు. అశ్లీలత ప్రతిఘటన వేదిక అధ్యక్షుడు, ఈదర గోపీచంద్ సాహిత్య సంకలనం "కామోత్సవ దహనం" పుస్తకావిష్కరణ సభను బెంజ్‌సర్కిల్ లోని సర్వోత్తమ గ్రంథాలయంలో అభ్యుదయ రచయిత సంఘం(అరసం) ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. పెనుమత్స దుర్గాభవాని, రావి శారద పుస్తకాన్ని ఆవిష్కరించారు. దేశంలో, రాష్ట్రంలో సెన్సార్ బోర్డు ఉందా అని దుర్గాభవాని ప్రశ్నించారు. రచయిత గోపీచంద్, ప్రజాసాహితి అధ్యక్షుడు దివికుమార్, ఏపీ ప్రజా నాట్యమండలి అధ్యక్షుడు పి.చంద్రానాయక్, సీహెచ్ విజయ, ఎం.అరుణ్‌కుమార్, పి.అజయ్ కుమార్, జె.కరుణశ్రీ, ఎం. వేణుగోపాలరావు పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతులకు ట్రై సెకిళ్ల పంపిణీ

పాయకాపురం, ఫిబ్రవరి 11: స్పందన సేవా సమితి నాలుగో వార్షికోత్సవాన్ని ఆదివారం సమితి కార్యాలయంలో నిర్వాహకులు ఘనంగా నిర్వహించారు. సమితి అధ్యక్షుడు ఇమ్మానేని కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలను నిర్వహించారు. విభిన్న ప్రతిభావంతులకు నిత్యావసర సరుకులు, రెండు ట్రైసైకిళ్లు పంపిణీ చేశారు. పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు, కేన్సర్ వ్యాధితో బాధపడుతున్న ముగ్గురికి ఒక్కొక్కరికి రూ.3 వేలచొప్పున రూ.9 వేలు పంపిణీ చేశారు. వాకర్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ గవర్నర్ చిన్నం రామకృష్ణ, డాక్టర్ నిఖిల్ పాల్గొన్నారు.

సీఎం సహకారంతో

మైనారిటీల సమస్యలు పరిష్కరించుకుందాం

వన్‌టౌన్, ఫిబ్రవరి 11: ముస్లిం, మైనారిటీల సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి సహకారం అవసరమని ఏపీ హజ్ కమిటీ ఛైర్మన్ బీఎస్ గౌస్ లాజమ్ అన్నారు. మర్కజీ జమాఅతేఅహ్లె హదీస్ మసీదు ప్రాంగణంలో ఆదివారం నిర్వహించిన రాష్ట్ర జమాఅతే అహ్లె హదీస్ రాష్ట్ర కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఐదు నియోజకవర్గాల్లో పోటీ చేసేందుకు ముస్లిం, మైనారిటీల అభ్యర్థులను వైసీపీ ప్రకటించారన్నారు. ఇంకా మరికొన్ని నియోజక వర్గాల్లో చోటు దక్కే అవకాశం ఉందన్నారు. మౌలానాఫలుల్ రెహమాన్ ఉమ్రి, హఫీజ్ అబ్దుల్ గప్పార్ ఉమ్రి, ఫారూఖ్‌ఖాన్ సాహెబ్, మౌలానా నసీర్ అహ్మద్ ఉమ్రి, అతేఖర్, రెహ్మాన్, 13 ఉమ్మడి జిల్లాల ప్రతినిధులు, వైసీపీ పశ్చిమ ఇన్‌చార్జి షేక్ ఆసిఫ్ పాల్గొన్నారు.

టీడీపీకి ఓటేద్దాం..రాష్ట్రాన్ని కాపాడుకుందాం

● **6వ డివిజన్ కార్యాలయం ప్రారంభోత్సవంలో గద్దె రామ్మోహన్**

మాచవరం, ఫిబ్రవరి 11: మన కుటుంబాన్ని, సమాజాన్ని, జిల్లా, రాష్ట్రాన్ని కాపాడుకోవడానికి వచ్చే ఎన్నికల్లో ప్రజలందరూ టీడీపీకి ఓట్లు వేయాలని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ పిలుపునిచ్చారు. 6వ డివిజన్ బ్రహ్మానందరెడ్డి నగర్‌లో డివిజన్ కార్యాలయాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. తన సొంత నిధులు రూ.30 వేలతో కొనుగోలు చేసిన తోపుడు బండ్లను కార్యకర్తలకు పంపిణీ చేశారు. రాబోయే ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి రావడం రాష్ట్రానికి అవసరమన్నారు. డివిజన్ అధ్యక్షుడు పడాల గంగాధర్, గన్నే వెంకటనారాయణప్రసాద్, గురుప్రసాద్, మోహనరావు పాల్గొన్నారు.


తోపుడు బండ్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

మేరీమాత దీవెనలతో ప్రజలు సంతోషంగా ఉండాలి

మేరిమాత దీవెనలతో ప్రజలు సంతోషంగా ఉండాలని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ ఆకాంక్షించారు. గుణదల మేరీమాత ఉత్సవాల సందర్భంగా ఆదివారం మేరీమాత ఆలయంలో ఆయన ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. దేవానంద్‌కుమార్, కృష్ణమోహన్, ఈశ్వర్, బాబూరావు పాల్గొన్నారు.

జగన్‌ను నమ్మని బీసీలు: బొండా ఉమా

అజిత్‌సింగ్‌నగర్, ఫిబ్రవరి 11: "పేద, బడుగు, బలహీన వర్గాల పార్టీ టీడీపీ. మొదటి నుంచి బీసీలకు అధిక ప్రాధాన్యం ఇస్తూ ఎందరినో అత్యున్నత పదవుల్లో కూర్చోబెట్టింది. సీఎం జగన్మోహన్‌రెడ్డిని రాష్ట్రంలో బీసీలు నమ్మరు." అని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బొండా ఉమామహేశ్వరరావు అన్నారు. సెంట్రల్ నియోజకవర్గ బీసీ కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రచారయాత్ర ఆదివారం 50వ రోజుకు చేరింది. మొగల్రాజపురంలోని తన నివాసంలో కమిటీ ఆధ్వర్యంలో బొండా ఉమా కేక్ కట్ చేశారు. లబ్బా వైకుంఠం, పిరియా సోమేశ్వరరావు, బెజవాడ తిరుపతి పాల్గొన్నారు.


బొండా ఉమాకు పుష్పగుచ్ఛం అందిస్తున్న బీసీ నేతలు

కరెంట్ అఫైర్స్ / జనరల్ ఎస్సే

ఐరాసలో సంస్కరణలు అవరోధాలు-పరిష్కారాలు



త్రాసు ముల్లు ఎప్పుడూ సమతౌల్యతను సూచిస్తూ మధ్యస్థంగా ఉండి తీరాలి. అప్పుడే ఆ త్రాసు బేరీజు వేసేందుకు అనుకూలమైనదిగా పరిగణనలో ఉంటుంది. అలా కాకుండా ఎటువైపు ఒరిగినా తూనిక చేసే అర్హత కోల్పోతుంది. నిజానికి ఎంచి చూడాల్సిన ఏ క్రతువుకైనా ఉండాల్సిన ప్రాథమిక లక్షణం ఇది. స్థిరత్వం, శాంతి, సహకారం, ప్రాథమిక సూత్రాలుగా ప్రపంచానికి పెద్ద దిక్కుగా ఏర్పడిన ఐక్యరాజ్య సమితి, కొన్ని దేశాలవైపు మొగ్గిన నేపథ్యంలో దాని విశ్వసనీయతపై సర్వత్రా నిరసనలు వినిపిస్తున్నాయి. అదే సంస్కరణల అవసరాన్ని తెరపైకి వచ్చింది. ముఖ్యంగా ఐక్యరాజ్య సమితిలో అత్యంత ప్రధానమైనదిగా భావించే భద్రతా మండలి విస్తరణ, ప్రజాస్వామికీకరణపై ప్రపంచవ్యాప్తంగా డిమాండ్లు వెల్లువెత్తుతున్నాయి. ఐక్యరాజ్య సమితి సెక్రటరీ జనరల్‌గా పనిచేసిన కోఫీ అన్నన్ సైతం 'భద్రతా మండలిలో సంస్కరణలు చేపట్టడమో లేదా దాని ప్రాబల్యాన్ని కోల్పోయే ప్రమాదాన్ని కొని తెచ్చుకోవడమో తేల్చుకోవాల్సిందే'అని హెచ్చరించారు. ఇటీవల భారత్ వేదికగా జరిగిన జీ-20 సమావేశాల్లో ఏకగ్రీవంగా ఆమోదించిన ఢిల్లీ డిక్లరేషన్‌లో సైతం 'ఐక్యరాజ్య సమితిలో సంస్కరణలు' అంశాన్ని చేర్చారు. ఇటీవల ఎలాన్ మస్క్ సైతం 'అత్యధిక జనాభాగల దేశమైన భారత్‌కు భద్రతా మండలిలో శాశ్వత సభ్యత్వం లేకపోవడం అసంబద్ధం' అని, ఐక్యరాజ్య సమితి అంగాలను సంస్కరించాల్సిన అవసరం ఉందని ట్వీట్ చేశారు. పరిమితికి మించిన అధికారాన్ని అనుభవిస్తున్న దేశాలు దానిని వదులుకోవడానికి సుముఖంగా లేకపోవడం వల్లే ఈ తంటా అని కూడా ఆ ట్వీట్‌లో పేర్కొన్నారు. దాంతో మరోసారి తాజాగా భారత్‌కు భద్రతా మండలిలో శాశ్వత సభ్యత్వం అనే అంశం తెరపైకి వచ్చింది. దరిమిలా ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి, దాని ప్రాముఖ్యం, విస్తరణ, ప్రజాస్వామ్యీకరణల అవసరం, అవరోధాలు, ప్రత్యామ్నాయాల గురించి తెలుసుకుందాం!

ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి

● ఐక్యరాజ్య సమితికి చెందిన ఆరు ముఖ్య అంగాల్లో భద్రతా మండలి ఒకటి. అంతర్జాతీయ శాంతి భద్రతల పరిరక్షణ దాని బాధ్యత. ఐక్యరాజ్య సమితి సాధారణ సభలో కొత్త సభ్య దేశాల ప్రవేశానికి సిఫార్సు చేయడం, ఐక్యరాజ్య సమితి చార్టర్‌కు చేసే మార్పులకు ఆమోదం తెలపడం దీని అధికారాలు. అంతేకాకుండా అంతర్జాతీయ శాంతిని కాపాడేందుకు ప్రపంచంలో ఎక్కడికైనా భద్రతా దళాలను పంపడం, మిలటరీ చర్యలు చేపట్టడం, పరిస్థితులను అనుసరించి దేశాలపై వివిధ ఆంక్షలు(శాంక్షన్స్) విధించడమనే కీలకాధికారాలు కూడా ఉన్నాయి. ఐక్యరాజ్య సమితి అంగాలన్నింటిలో ఒక్క భద్రతా మండలికి మాత్రమే- సభ్య దేశాలకు నిర్బంధంగా పాటించాల్సిన ఆజ్ఞలు జారీ చేసే అధికారం ఉంది. మిగతా అయిదు అంగాలకు కేవలం సభ్య దేశాలకు సిఫార్సులు చేసే అధికారమే ఉంది. భద్రతామండలికి మాత్రమేగల నిర్ణయాలు అమలు చేసే శక్తి దానిని, దానిలోని శాశ్వత సభ్యులను అత్యంత శక్తిమంతంగా మార్చింది.

భద్రతా మండలి కూర్పు

● భద్రతా మండలిలో వీటో అధికారం ఉన్న అయిదు శాశ్వత సభ్య దేశాలు, రెండేళ్ల కాలానికి ఎన్నుకొన్న వీటో అధికారం లేని మరో పది దేశాలు కలిపి మొత్తం 15 సభ్య దేశాలు ఉంటాయి. వీటిలో అమెరికా, రష్యా, చైనా, బ్రిటన్, ఫ్రాన్స్ దేశాలు ఐక్యరాజ్య సమితి చార్టర్ 1946 ప్రకారం శాశ్వత సభ్య దేశాలుగా గుర్తింపు పొందాయి. తాత్కాలిక సభ్య దేశాలకు గల పది స్థానాలకుగాను ఐక్యరాజ్య సమితి సాధారణ సభ ఏటా అయిదు దేశాల చొప్పున రెండేళ్ల కాలానికి ఎన్నుకుంటుంది. రిటైర్ అవుతున్న అయిదు తాత్కాలిక సభ్య దేశాలు వెంటనే ఎన్నిక అవడానికి వీలు లేదు. ఈ పది తాత్కాలిక సభ్య దేశ స్థానాలు ప్రాంతీయ ప్రాతిపదికన పంపిణీ అవుతాయి. ఆఫ్రికా, ఆసియా దేశాలకు 5; తూర్పు యురోపియన్ దేశాలకు 1; లాటిన్ అమెరికా, కరేబియన్ దేశాలకు 2; పశ్చిమ యురోపియన్ దేశాలకు 2 స్థానాలు ఉంటాయి.

● ఈ పది తాత్కాలిక స్థానాల్లో ఎటువంటి నామినేటెడ్ స్థానాలు ఉండవు. అన్ని స్థానాలకూ రహస్య బ్యాలెట్ పద్ధతిన సాధారణ సభలో ఎన్నికలు నిర్వహిస్తారు. 2/3వ వంతు మెజారిటీని సాధించిన దేశాలకు రెండేళ్ల పాటు భద్రతా మండలి తాత్కాలిక సభ్యత్వం లభిస్తుంది. భద్రతా మండలి సభ్య దేశాల మధ్య దాని అధ్యక్ష పదవి నెలనెలా బదిలీ అవుతూ ఉంటుంది.

● శాశ్వత సభ్య దేశాలైన పీ-5 దేశాల్లో ప్రతీ ఒక్క దేశానికి వీటో అధికారం ఉంటుంది. ఈ అధికారంతో వారు భద్రతా మండలిలో ఏ తీర్మానానికి అయినా వ్యతిరేకంగా ఓటు వేసి దానిని అడ్డుకోవచ్చు. ఒక కొత్త దేశాన్ని సభ్య దేశంగా చేర్చుకోవడం లేదా ఐరాస జనరల్ సెక్రటరీగా ఎవరి ఎన్నికనైనా అడ్డుకోవడానికి సైతం చేయవచ్చు. అయిదు శాశ్వత సభ్య దేశాల్లో ఏ ఒక్కటైయినా వ్యతిరేకంగా ఓటు వేసి భద్రతా మండలి ఏ తీర్మానాన్నైనా అడ్డుకోవచ్చు. భద్రతా మండలి ఏ నిర్ణయమైనా అయిదు శాశ్వత సభ్య దేశాల సర్వామోదంతోనే జరగాలి. ఏ ఒక్కరు వ్యతిరేకించినా వీటో అధికారం ఉపయోగించినా అది చెల్లదు.

● శాశ్వత సభ్య దేశాలకు ఉన్న ఈ వీటో అధికారాన్ని వినియోగించి అసంబద్ధ నిర్ణయాలను అడ్డుకోవడానికి బదులు ఇటీవల ఆ దేశాలు తమ స్వప్రయోజనాల కోసం రాజకీయ వ్యూహాల కోసం వినియోగిస్తున్నాయి. దీనితో ఐక్యరాజ్య సమితి, భద్రతా మండలి ఏర్పాటుకు గల మూల ఉద్దేశాలకు గండి పడుతోంది. అంతేకాక భద్రతా మండలిలోని శాశ్వత సభ్య దేశాల దురాగతాలకు వ్యతిరేకంగా భద్రతా మండలి చర్యలు తీసుకోవడానికి అవకాశం లేకుండా పోతోంది.

● అమెరికా ఒకప్పుడు ఇరాక్‌పై దండెత్తినపుడు, రష్యా ప్రస్తుతం ఉక్రెయినపై దాడి చేస్తున్న సందర్భంలోనూ భద్రతా మండలి క్రియాశూన్యంగా మిగిలిపోతోంది.

అంతేకాక శాశ్వత సభ్య దేశాల వ్యూహాత్మక ప్రయోజనాల కోసం వాటి మిత్ర దేశాలను వెనకేసుకు వచ్చే దుశ్చర్యలను నిలువరించలేని దుస్థితికి భద్రతా మండలి చేరుకుంది. ఉదాహరణకు ఇజ్రాయెల్‌కు అమెరికా కొమ్ముకాయడం; చైనా, పాకిస్థాన్‌ల ఉగ్రవాదాన్ని వెనకేసుకు రావడం వంటి ఉదంతాలను చెప్పుకోవచ్చు. అంతేకాక భద్రతా దళాల ప్రయోగం, ఉపసంహరణ, ఆంక్షల విధింపు వంటి చర్యలను ప్రపంచంలోని అశాంతిని నిర్మూలించేందుకు కాక పీ-5 దేశాలు తమ స్వప్రయోజనాలు, చమురు నిల్వలు కొల్లగొట్టేందుకు ఉపయోగిస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో వీటో అధికారంలో సంస్కరణలకు, భద్రతా మండలిలో ప్రజాస్వామ్యీకరణకు, జనాభా ప్రాతినిధ్య సమతౌల్యతకు ప్రపంచవ్యాప్తంగా డిమాండ్లు పెరుగుతున్నాయి.

జీ-4 కూటమి

- ● భారత్ సహా మరో మూడు దేశాలు(జపాన్, జర్మనీ, బ్రెజిల్) కలసి జీ-4 కూటమిగా ఏర్పడి పరస్పర మద్దతుతో భద్రతా మండలిలో శాశ్వత సభ్యత్వానికి కృషి చేస్తున్నాయి. వీరు తమతో పాటు ఆఫ్రికా వంటి ఇతర ప్రాంతాలకు కూడా ప్రాతినిధ్యం దక్కాలని వాదిస్తున్నాయి.
- ● ఈ జీ-4 దేశాల ఆర్థిక, రాజకీయ, సైనిక బలం కొన్ని దశాబ్దాలుగా విస్తరించడం; పీ-5 దేశాలతో సరితూగగల స్థాయిని సాధించడం వంటి అంశాల నేపథ్యంలో జీ-4 దేశాలు తమ ప్రాతినిధ్యానికి మరింత పట్టుపడుతున్నాయి.
- ● శాశ్వత సభ్య దేశ స్థానాలను అయిదు నుంచి పదకొండుకు, తాత్కాలిక సభ్య దేశాల స్థానాలను పది నుంచి పద్నాలుగుకు పెంచాలని డిమాండ్ చేస్తున్నాయి.

కాఫీ క్లబ్

జీ4 ప్రయత్నాలను నిర్వీర్యం చేయడానికి ఆయా దేశాలతో ఆర్థికపరమైన పోటీ, రాజకీయపర శతృత్వం గల దేశాలు 'కాఫీక్లబ్'గా ఏర్పడి జీ4 దేశాలకు భద్రతా మండలిలో శాశ్వత సభ్యత్వాన్ని అడుకొనే ధ్యేయంతో పనిచేస్తున్నాయి. ఈ కాఫీ క్లబ్‌లో పాకిస్థాన్, దక్షిణకొరియా, ఇటలీ, అర్జెంటీనా సభ్యులుగా ఉన్నాయి.

(మిగతా రేపటి దిక్సూచి పేజీలో)




ఎం.బాలలత,
సివిల్స్ మెంటార్

దిక్సూచి
DIKSUCHI

ఏపీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం

బయాలజీ

మానవ ప్రత్యుత్పత్తి వ్యవస్థ



అన్ని జీవులలో ప్రత్యుత్పత్తి అనేది ప్రధాన ధర్మాలలో ఒకటి. ప్రత్యుత్పత్తి విధానంలో జీవులు పాత జీవుల స్థానంలో వాటిని పోలిన లేదా కొద్ది తేడాలతో ఉన్న కొత్త జీవులను ఉత్పత్తి చేస్తాయి. ఒక ప్రజాతి కొనసాగడానికి, జన్యు పదార్థాన్ని పునఃఉత్తేజనం చేయడానికి ప్రత్యుత్పత్తి విధానం అత్యవసరం. వివిధ జంతువులలో వివిధ రకాల ప్రత్యుత్పత్తి జరుగుతుంది.

ప్రత్యుత్పత్తిలో హార్మోన్లు ముఖ్య పాత్రపోషిస్తాయి. ఉదాహరణకు పురుష, స్త్రీ బీజకోశాల హార్మోన్లు.. ప్రాథమిక, ద్వితీయ లైంగిక లక్షణాలు, బీజకోశాల పరిపక్వత, లైంగిక చక్రాల లయబద్ధత, పిండం విడుదల క్షీరోత్పత్తి మొదలైన వాటిలో ప్రధాన పాత్ర పోషిస్తాయి.

జీవులు రెండు రకాలుగా ప్రత్యుత్పత్తి చేసుకుంటాయి. అవి..అలైంగిక ప్రత్యుత్పత్తి, లైంగిక ప్రత్యుత్పత్తి. అలైంగిక ప్రత్యుత్పత్తి జనక జీవిలో లేదా ఒకే జీవిలోనే జరుగుతుంది. ఈ విధానంలో ప్రత్యేకంగా పురుష, స్త్రీ బీజకోశాలు ఉండవు. విచ్ఛిత్తి, కోరకీభవనం, సిద్ధబీజాలు ఏర్పడటం, ముక్కలగుట, పునరుత్పత్తి, క్లోనింగ్, అనుషేకజననము అనే పద్ధతుల ద్వారా జరుగుతుంది. అలైంగిక విధానంలో ప్రతి జీవి ప్రౌఢజీవిగానే జన్యుపరంగా తమను పోలిన జీవులను తయారు చేసే సామర్థ్యం కలిగి ఉంటుంది. లైంగిక ప్రత్యుత్పత్తిలో స్త్రీ, పురుష జీవులు ఏకస్థితిక బీజకణాలను(అండాలు, శుక్ర కణాలు) ఉత్పత్తి చేసి, ఫలదీకరణం చెంది, ద్వయస్థితిక పిల్ల జీవిని తయారు చేస్తుంది.

పురుష ప్రత్యుత్పత్తి వ్యవస్థ

పురుష ప్రత్యుత్పత్తి వ్యవస్థలో ప్రత్యుత్పత్తి ప్రక్రియలో పాల్గొనే అనేక అవయవాలు శ్రోణి ప్రాంతంలో ఉంటాయి. అవి..ఒక జత ముష్కాలు, ఒక జత శుక్రవాహికలు, బాహ్య జననాంగాలు, అనుబంధ గ్రంథులు.

> పురుష ప్రత్యుత్పత్తి వ్యవస్థలో ప్రత్యుత్పత్తి ప్రక్రియలో పాల్గొనే అనేక అవయవాలు శ్రోణి ప్రాంతంలో ఉంటాయి. అవి..ఒక జత ముష్కాలు, ఒక జత శుక్రవాహికలు, బాహ్య జననాంగాలు, అనుబంధ గ్రంథులు.

ముష్కాలు: ఒక జత అండాకార ముష్కాలు, ఉదర కుహరం బయట ముష్క గోణిలో వేలాడుతూ ఉంటాయి. ముష్కగోణులు వెనుక వేలాడుతూ ఉన్న సంచి వంటి నిర్మాణం. ఇది ముష్కాలకు రక్షణ ఇస్తూ, శుక్ర కణోత్పత్తికి కావలసిన ఉష్ణోగ్రత(శరీర ఉష్ణోగ్రత కంటే 2 నుంచి 2.5 డిగ్రీల సెల్సియస్ తక్కువ) ఉండేటట్లు చేస్తుంది. పరిసరాల ఉష్ణోగ్రత తక్కువగా ఉన్నప్పుడు ముష్కగోణిలోని క్రెమాస్టర్ కండరం సంకోచం వల్ల ముష్కగోణి వెచ్చగా ఉన్న దేహానికి దగ్గరగా అవుతుంది. డార్టోస్ కండర సంకోచం వల్ల ముష్కగోణి ముకుళించుకుంటుంది. ఉష్ణోగ్రత సాధారణంగా ఉన్నప్పుడు పై రెండు కండరాలు విరామస్థితిలో ఉంటాయి. అందువల్ల ముష్కగోణి వెచ్చటి దేహానికి దూరంగా వేలాడుతూ ఉంటుంది. కొన్ని అసాధారణ సందర్భాల్లో ముష్కాలు శుక్ర కణాలను, టెస్టోస్టిరాన్ అనే హార్మోన్‌ను ఉత్పత్తి చేస్తాయి. ఈ ముష్కాలలో అధిక సంఖ్యలో మిలియన్ల కొద్దీ శుక్ర కణాలు ఉత్పత్తి అవుతాయి. సంపర్క సమయంలో 200-300 మిలియన్ల శుక్రకణాలను పురుషుడు స్ఖలిస్తాడు. ప్రతి ముష్కంలో చాలా లంబికలు ఉంటాయి. ప్రతి లంబికలో ఎక్కువ సంఖ్యలో మెలి తిరిగిన చిన్న చిన్న నాళికలు ఉంటాయి. వీటినే శుక్రోత్పాదక నాళికలు అంటారు. ఈ నాళికలు 80 సెం.మీ. పొడవును కలిగి శుక్రనాళికలోకి తెరచుకొని ఎపిడిడిమిస్‌ను ఏర్పరస్తుంది. ఎపిడిడిమిస్ అనేది చుట్టలు చుట్టలుగా ఉం డే నాళం వంటి నిర్మాణం. ఇది శుక్ర కణాలను తాత్కాలికంగా నిల్వ చేస్తుంది, శుక్ర కణాలు పరిపక్వతకు రావడానికి కావలసిన సమయాన్ని కలుగజేస్తుంది.

శుక్ర వాహికలు: ఎపిడిడిమిస్ నుంచి శుక్రవాహిక బయలు దేరుతుంది. ఇది శుక్ర కణాలను ఎపిడిడిమిస్ నుంచి సంగ్రహిస్తుంది. శుక్రవాహిక శుక్రాశయం నుంచి వచ్చే వాహికతో కలిసి స్ఖలన నాళాన్ని ఏర్పరుస్తుంది. శుక్రాశయం శుక్రద్రవాన్ని స్రవిస్తుంది. రెండు వైపుల నుంచి వచ్చే స్ఖలన నాళాలు పౌరుష గ్రంథి మధ్య భాగంలో కలిసి ప్రసేకంలోకి తెరచుకుంటాయి.

బాహ్య జననాంగాలు: పురుషులలో ప్రసేకం అనేది మూత్ర జననేంద్రియ వాహికలు కలిసి ఏర్పడిన అంత్యనాళం. ప్రసేకము మూత్రాశయం నుంచి ప్రారంభమై మేహనం ద్వారా వ్యాపించి యూరెత్రమీటస్ అనే రంధ్రం ద్వారా బయటకు తెరచుకుంటుంది. మూత్రం, స్ఖలించిన శుక్రం రెండూ కూడా ప్రసేకం ద్వారా ప్రయాణించి బయటకు వస్తాయి. పురుషులలో మేహనం, ముష్కగోణులు అనే బాహ్యజననాంగాలు ఉంటాయి. మేహనం అనేది మూత్రనాళంగానే కాకుండా, స్త్రీ జీవి యోనిలో శుక్రద్రవాన్ని విడుదల చేసే ప్రవేశాంగముగా పనిచేస్తుంది. మేహనంలోని పృష్ఠభాగంలో కార్పోరా కావెర్నోసా, ఉదరభాగంలో కార్పస్ స్పాంజియోజమ్ అనే స్తంభాకార కణజాలల వలన మేహనం నిటారుగా, కడ్డీలాగా మారి శుక్రమును విడుదల చేయడంలో సహాయపడుతుంది. మేహనం చివర ఉబ్బి బల్బుగా ఉన్న భాగాన్ని గ్లాన్స్ మేహనం అంటారు. గ్లాన్స్ మేహనాన్ని ఆవరించి వదులుగా ఉన్న చర్మాన్ని ప్రెప్యూస్ అంటారు.

అనుబంధ గ్రంథులు: పురుష అనుబంధ గ్రంథులు వరుసగా..ఒక జత శుక్రాశయాలు, ఒక పౌరుషగ్రంథి, ఒక జత కౌపర్ గ్రంథులు

శుక్రాశయాలు: ఇవి ఒక జత మూత్రాశయం కింది భాగంలో ఉంటాయి. ఇందులో ఉండే శుక్ర కోశాలు శుక్రద్రవాన్ని స్రవిస్తుంది. శుక్ర ద్రవం చిక్కగా జిగటగా ఉంటుంది. 65 శాతం క్షారయుతంగా ఉంటుంది. శుక్రద్రవం క్షారం కావడం వలన యోనిలో ఉండే ఆమ్లత్వాన్ని తటస్థీకరిస్తుంది. శుక్రకణాలకు పోషక పదార్థాలను అందించడంలో, శుక్ర కణాల కదలికలకు శుక్ర ద్రవం ఉపయోగపడుతుంది. శుక్రద్రవంలో ఫ్రక్టోజ్, ప్రోటీన్లు, సిట్రిక్ ఆమ్లం, అకర్బన పదార్థాల పాస్ఫేట్, పొటాషియం, ప్రోస్టాగ్లాండిన్స్, విటమిన్-సి వంటి పదార్థాలు ఉంటాయి.

పౌరుష గ్రంథి: మూత్రాశయం కింద పౌరుష గ్రంథి ఉంటుంది. ఇది ప్రసేకము మొదటి భాగాన్ని ఆవరించి దాని స్రావాలను అనేక వాహికల ద్వారా ప్రసేకంలోకి పంపుతుంది. దీని స్రావం స్వల్ప ఆమ్ల స్థితిలో ఉంటుంది. శుక్ర కణాలను ఉత్తేజపరచడంలో, పోషణ అందించడంలో సహాయపడుతుంది.

కౌపర్ గ్రంథులు: వీటిని బల్బోయురెత్రల్ గ్రంథులుగా కూడా పేర్కొంటారు. ఇవి ఒక జత మేహనం మొదలయ్యే చోట, పౌరుష గ్రంథికి కింద, ప్రసేకానికి ఇరువైపులా ఉంటాయి. వీటి స్రావం తేటగా, జారేట్లుగా, క్షారయుతంగా ఉండి సంపర్కంలో రాపిడిని తగ్గించి శుక్రాన్ని ప్రసేకం ప్రసేకం ద్వారా సులభంగా జారేటట్లుగా చేస్తుంది. ఇవి బఠాణీ గింజ పరిమాణంలో ఉంటాయి.



కె. నాగశేషులు
బయాలజీ ఫ్యాకల్టీ



రంగా కాంస్య విగ్రహం శంకుస్థాపనలో కాపు నేతలు, కార్పొరేటర్లు

ప్రజల హృదయాల్లో కొలువైన వంగవీటి

భవానీపురం, ఫిబ్రవరి 11: బడుగు, బలహీనుల హృదయాల్లో కొలువైన వ్యక్తి మాజీ ఎమ్మెల్యే వంగవీటి మోహన్ రంగా అని పలువురు వక్తలు కొనియాడారు. ఎస్వీ రంగారావు కాపు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో విద్యాధరపురంలోని వీఎస్ రంగా జంక్షన్ (సితార) ప్రాంతంలో రంగా నిలువెత్తు కాంస్య విగ్రహానికి ఆదివారం శంకుస్థాపన చేశారు. కార్పొరేటర్లు మైలవరపు రత్నకుమారి, మాధురి లావణ్య, కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపాశేషు, నేతలు ఎం.కృష్ణ, దుర్గారావు, కాపు నేతలు ఆకుల శ్రీనివాస్‌కుమార్, సంఘం అధ్యక్షుడు పదిలం రాజశేఖర్, లింగం శివప్రసాద్, గంధం అంజిబాబు, ఎర్రంశెట్టి అంజిబాబు, కొప్పిశెట్టి వెంకటేశ్వరరావు, పత్తి నాగేశ్వరరావు పాల్గొన్నారు.




ఎంపికైన అథ్లెట్లతో అసోసియేషన్ ప్రతినిధులు

జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్స్‌కు 18 మంది

విజయవాడ స్పోర్ట్సు, ఫిబ్రవరి 11: మహారాష్ట్రలోని పూణేలో ఈ నెల 13 నుంచి 17 వరకు జరిగే జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో ఉమ్మడి కృష్ణా జిల్లా నుంచి 18 మంది క్రీడాకారులు బరిలో దిగనున్నారు. నగరంలోని ఐజీఎంసీలో జిల్లా మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన అభినందన సభలో వక్తలు మాట్లాడుతూ ఏడుగురు మహిళలు, 11 మంది పురుష అథ్లెట్లు పాల్గొంటున్నారని, వీరంతా పతకాలతో తిరిగి రావాలని ఆకాంక్షించారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు కంది గంగాధరరావు, కార్యదర్శి జీవీ ప్రసాదరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్.కృష్ణప్రసాద్, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎం.సత్యనారాయణ, ట్రెజరర్ ఎస్.బాలగంగాధర్‌రావు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాలో మృతుల పేర్లు ప్రత్యక్షం

విద్యాధరపురం, ఫిబ్రవరి 11 : పారదర్శక ఓటర్ల జాబితాకు ఉన్నతాధికారులు ఎన్ని చర్యలు తీసుకున్నప్పటికీ బూత్‌లెవల్ అధికారుల తీరు లో మార్పు రావడంలేదు. తాజాగా ప్రచురించిన జాబితాలో మృతుల పేర్లు ప్రత్యక్షమయ్యాయి. తాజాగా ఒకే ఇంటిలో 26 ఓట్లు నమోదైన విష యం నియోజకవర్గంలో తీవ్ర చర్చనీయాంశమైం ది. ఇది మరువకముందే 40వ డివిజన్‌లోని బాలభాస్కర్‌నగర్ 45వ బూత్ పరిధిలో చనిపోయిన వారి పేర్లను ఓటర్ల జాబితాలో గుర్తించారు. జాబితా 632 నెంబర్‌లో కిర్లా ఈశ్వరమ్మ, 207 నెంబర్‌లో పడాల ఏసు, 1099 నెంబర్‌లో చక్కా పద్మావతిల పేర్లు కనిపించాయి. వీరంతా మృతి చెందిన వారు కావడం విశేషం. ఓటర్ల జాబితాలో అవకతవకలను సరిచేయాలని టీడీపీ, జనసేన నేతలు అధికారులను కోరుతున్నారు. దొంగ ఓట్ల కోసమే అధికారపార్టీ నేతలు దందాలకు పాల్పడున్నారని స్థానిక ప్రజలు విమర్శిస్తున్నారు.



ఈశ్వరమ్మ



ఏసు



పద్మావతి

ఇంద్రకీలాద్రిపై భక్తుల రద్దీ

వన్‌టౌన్, ఫిబ్రవరి 11: మాఘమాసం ప్రారంభం రోజు, ముఖ్యంగా విశిష్టమైన ఆదివారం కావడంతో ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ దర్శనానికి భక్తుల రద్దీ ఏర్పడింది. వివిధ ప్రాంతాల నుంచి అమ్మవారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. క్యూలైన్లు భక్తులతో నిండిపోయాయి. భక్తులు వేలాదిగా రావడంతో అధికారులు శీఘ్రదర్శనం ఏర్పాట్లు చేశారు. భక్తులు పలువురు చండీహోమం, లక్ష కుంకుమార్చన, శ్రీ చక్రనవావరణార్చనలో పాల్గొని మొక్కులను తీర్చుకున్నారు. మాఘమాసం ఆదివారం సందర్భంగా ప్రత్యేకంగా లోక కల్యాణం కోరుతూ అర్చక బృందం అరుణపారాయణ, సూర్యనమస్కారాలు నిర్వహించింది.



దుర్గమ్మ అంతరాలయం వద్ద బారులు తీరిన భక్తులు

నిత్యాన్నదానం, పెన్నుల పంపిణీకి విరాళాలు

దుర్గగుడిలో ఈనెల 14న శ్రీపంచమి సందర్భంగా అమ్మవారికి సరస్వతిదేవి అలంకారం చేయనున్నారు. ఇదే సమయంలో హోమం, అర్చన జరుగుతాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు విద్యార్థులకు ఉచిత దర్శనం సహా అమ్మవారి ప్యాకెట్ సైజ్ ఫొటో పెన్ను, కంకణం, ప్రసాదం పంపిణీ చేయనున్నారు. విద్యార్థులు పరీక్షల్లో విజయం సాధించేందుకుగాను అమ్మవారి పాదాల చెంత ఉంచిన పెన్నులను విద్యార్థులకు ఉచితంగా పంపిణీ చేయనున్నారు. గుంటూరు కృష్ణానగర్, బృందావన్ గార్డెన్‌కు చెందిన పద్మనాభుని జయరామ్ ఆదివారం ఆలయానికి విచ్చేసి 6వేల పెన్నులను ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కర్నాటి రాంబాబు ద్వారా విరాళంగా ఇచ్చారు. అమ్మవారి దర్శనానంతరం దాతకు ప్రసాదం, శేషవస్త్రం, ఆశీస్సులు అందజేశారు. విశాఖపట్నం సీతమ్మపేటకు చెందిన సంపంగి శ్రీనివాసరావు, కుటుంబ సభ్యులు ఆదివారం ఆలయానికి విచ్చేసి ఆలయంలో జరుగుతున్న అన్నవితరణకు రూ.1,01,116 విరాళంగా ఇచ్చారు. అమ్మవారి దర్శనానంతరం దాతకు శేషవస్త్రం, ప్రసాదం, ఆశీస్సులు అందజేశారు.


దుర్గమ్మ సన్నిధిలో వైవీ సుబ్బారెడ్డి దంపతులు

ఆదివారం దుర్గమ్మను టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి దంపతులు దర్శించుకున్నారు. ఆలయంలో ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కర్నాటి రాంబాబు, అధికారులు సాదర స్వాగతం పలికారు. అమ్మవారి సన్నిధిలో అర్చకులు ప్రత్యేక అర్చనలిచ్చి హారతులు సమర్పించారు. అమ్మవారి దర్శనానంతరం శేషవస్త్రం, ప్రసాదం, ఆశీస్సులు అందజేశారు.

అలరించిన కన్నడ 'అయోధ్య కాండ'

విజయవాడ కల్చరల్, ఫిబ్రవరి 11: కర్ణాటక రాష్ట్రం మైసూర్‌కు చెందిన ఇండియన్ థియేటర్ ఫౌండేషన్ బృందం ప్రదర్శించిన అయోధ్య కాండ కన్నడ నాటకం ఆద్యంతం అలరించింది. భారత ప్రభుత్వ సాంస్కృతిక శాఖ, అనుబంధ సంస్థ నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా, రాష్ట్ర ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అంతర్జాతీయ నాటక ప్రదర్శనలో భాగంగా చివరి రోజు ఆదివారం 'ప్రసన్న' రచనాదర్శకత్వంలో సాగిన అయోధ్య నాటకం నేటి సమాజం మేథోపరంగా నడుస్తుందని, ఆచారాలు, మతాల మధ్య విభేధాల సమస్యలో చిక్కుకుపోయిందని, మితిమీరిన ఆధునీకరణ కారణంగా దేశీయ సంస్కృతులు శిథిలమవున్నాయనే సందేశాన్ని తెలుపుతూ ఈ నాటకం ప్రదర్శించారు. పలు సన్నివేశాలు నవరసభరితంగా సాగి ప్రేక్షకుల హృదయాన్ని హత్తుకున్నాయి. మందర పాత్రధారి సి.ఆర్.పద్మశ్రీ నటన హైలెట్‌గా నిలిచింది. పదీప్ ఉడుపి, రాజ్యలక్ష్మి, అనూషశెట్టి, సుందరేష్ దేవప్రియం, విశ్వాస్ అద్భుతంగా నటించి మెప్పించారు. సంగీతం అనూషశెట్టి అందించగా, కాస్ట్యూమ్స్ నందిని కె.ఆర్ వ్యవహరించారు. కళాకారులను నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా రిజిస్ట్రర్ ఓం ప్రకాష్ సాగర్, రాష్ట్ర ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ ఆర్.మల్లిఖార్జునరావు కళాకారులను సత్కరించారు.





టీడీపీకి అఖండ విజయాన్ని అందించేందుకు ప్రజలు సిద్ధం

● టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బొండా ఉమా

పాయకాపురం, ఫిబ్రవరి 11: వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి అఖండ విజయాన్ని అందించడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు బొండా ఉమామహేశ్వరరావు అన్నారు. 64వ డివిజన్ కండ్రికలో 100 మంది పార్టీలోకి చేరారు. ఈ సందర్భంగా కండ్రికలో ఆదివారం ఏర్పాటు చేసిన సభలో పాల్గొన్న బొండా ఉమా వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. నేతలు పరుచూరి ప్రసాద్, సూరవరపు నాగరాజు, పలగాని శివ, ఘంటా కృష్ణమోహన్, నవనీతం సాంబశివరావు పాల్గొన్నారు.



దళిత ద్రోహి సీఎం జగన్

అజిత్‌సింగ్‌నగర్: దళిత ద్రోహిగా సీఎం జగన్ చరిత్రలో నిలిచిపోతారని బొండా ఉమా అన్నారు. నియోజకవర్గంలోని ఎస్సీ సామాజికవర్గానికి చెందిన 100 మంది ఆదివారం టీడీపీలో చేరారు. మొగల్రాజపురంలోని తన నివాసంలో ఆయన వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. నేతలు నవనీతం సాంబశివరావు, బంగారు నాయుడు పాల్గొన్నారు.

ఇచ్చిన మాట తప్పిన నేత మోదీ

● అమరావతి బహుజన జేఏసీ అధ్యక్షుడు పోతుల

ధర్నాచౌక్, ఫిబ్రవరి 11: తండ్రి మాట తప్పని నేతగా శ్రీరామచంద్రుడు పరిపాలన చేస్తే ఇచ్చిన మాట తప్పిన నేతగా మోదీ పరిపాలన చే స్తున్నారని అమరావతి బ హుజన జేఏసీ అధ్యక్షుడు పోతుల బాలకోటయ్య విమర్శించారు. శ్రీరాముడి పేరెత్తే అర్హత మోదీకి లేదన్నారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. రాష్ట్ర విభజన గాయాలను మోదీకి వినిపించేలా ఢిల్లీలో 4రోజుల పాటు ఆందోళన చేపట్టినట్టు చెప్పారు. రాష్ట్రానికి ప్రత్యేకహోదా, పోలవరం, రాజధాని అమరావతిని నిధులు, వెనుకబడ్డ ప్రాంతాలకు ప్యాకేజీని కేంద్ర ప్రభుత్వ కాలరాసిందని ధ్వజమెత్తారు. వి శాఖ ఉక్కు కార్మికులు, వామపక్ష పార్టీలు, హోదా సాధనకారులు, దళిత సంఘా లు ఆంధ్రభవన్, జంతర్‌మంతర్‌లో దీక్షలు నిర్వహించనట్టు తెలిపారు. కోడి కత్తి శ్రీను విడుదలకు పోరాడిన వామపక్ష పార్టీలు, దళిత సంఘాలు, న్యాయవాదులకు కృతజ్ఞతలు తెలిపారు. 56 నెలల వైసీపీ పాలనలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు పూ ర్తిగా అన్యాయానికి గురయ్యారని, వీరిని చట్టసభలకు పంపాలని కోరారు.

సుప్రీంకోర్టు విశ్రాంత జడ్జి జస్టిస్ గోపాలగౌడకు ఘనస్వాగతం

గన్నవరం, ఫిబ్రవరి 11 : సుప్రీం కోర్టు విశ్రాంత జడ్జి జస్టిస్ గోపాలగౌడకు గన్నవరం విమానాశ్రయంలో ఘనస్వాగతం లభించింది. విజయవాడలో జరిగే పుస్తకావిష్కరణ కార్యక్రమంలో పాల్గొనేందుకు విమానంలో ఆయన ఆదివారం ఇక్కడికి వచ్చారు. జస్టిస్ గోపాల గౌడ్‌కు టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు టీడీ జనార్దన్ తదితరులు స్వాగతం పలికారు. అనంతరం రోడ్డు మార్గాన విజయవాడ వెళ్లారు.

షర్మిలను విమర్శించే స్థాయి ఊసరవెల్లి వెలంపల్లికి లేదు

గవర్నర్‌పేట: ఊసరవెల్లి రంగులు మార్చినట్టు పూటకో పార్టీని, రోజుకో జెండాను మార్చే వెలంపల్లి శ్రీ నివాస్‌కు కాంగ్రెస్ పార్టీ, పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వై ఎస్ షర్మిలారెడ్డిని విమర్శించేస్థాయి లేదని, నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడితే మంచిదని ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేముల శ్రీనివాసరావు అన్నా రు. ఆదివారం కాంగ్రెస్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ షర్మిల కాంగ్రెస్ పార్టీలో చేరగానే వైసీపీ లో గందరగోళం నెలకొందని, నేతలకు పిచ్చిపట్టి వ్యక్తిగత విమర్శలకు దిగుతున్నారన్నారు.

స్కూల్ గేమ్స్ జాతీయ సైక్లింగ్‌లో సురేష్‌కు పతకాలు

విజయవాడ స్పోర్ట్సు: ఝార్కండ్ రాష్ట్రంలోని రాంచీలో జరుగుతున్న 67వ జాతీయ స్కూల్ గేమ్స్ సైక్లింగ్ పోటీల్లో ట్రాక్ సైక్లింగ్ విభాగంలో రాష్ట్రానికి పతకాలు లభించాయి. అండర్-19లో కె.సురేష్‌బాబు టైం ట్రైల్‌లో స్వర్ణం, వ్యక్తిగత పర్సూట్‌లో కాంస్యం సాధించాడు. తొలిసారిగా ఏపీకి 2పతకాలు రావడం అభినందనీయమని రాష్ట్ర పాఠశాలల క్రీడా సమా ఖ్య కార్యదర్శి కె.భానుమూర్తి, సమగ్ర శిక్ష పీడీ శ్రీనివాసరావు అన్నారు. సురేష్‌బాబుకు స్కూల్ గేమ్స్ తరపున రూ.5వేలు కోచ్ సత్యప్రసాద్ అందజేశారు.

పాలిటెక్నిక్ రిటైర్డ్ టీచర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక

భారతీనగర్: ప్రభుత్వ పాలిటెక్నిక్ రిటైర్డ్ టీచర్స్ అసోసియేషన్ కార్యవర్గ సమావేశం ఆదివారం కళాశాలలో జరిగింది. 2024 పాలిటెక్నిక్ రిటైర్డ్ టీచర్స్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడు ఎస్.పి శ్రీకాంత్, ఉపాధ్యక్షుడి ఎం.శేషగిరిరావు, సెక్రటరీ వై.భార్గవ్, జాయింట్ సెక్రటరీ కె.ఎన్.ఎస్ ప్రకాశ్‌రావు, ట్రెజర ర్ కె.చంద్రశేఖర్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నా రు. పలువురు అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ముదిరాజ్‌ల సమస్యలను మ్యానిఫెస్టోలో చేర్చండి

ధర్నాచౌక్: దశాబ్దాలుగా అన్ని రంగాల్లో వెనకబ డి, అభివృద్ధికి దూరంగా నెట్టబడి దారిద్ర్యరేఖకు ది గువన జీవిస్తున్న ముదిరాజ్ కులస్థుల సమస్యలను తమ ఎన్నికల ప్రణాళికలో చేర్చి పరిష్కరించాలని ముదిరాజ్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చప్పిడి కృష్ణమోహన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీల అధ్యక్షులకు లేఖలను పం పామన్నారు. గాంధీనగర్‌లో ఆదివారం మీడియాతో మాట్లాడారు. రాజకీయ పార్టీల వైఖరితోనే ముదిరాజ్‌లకు తీరని అన్యాయం జరుగుతుందన్నారు.

ముగిసిన మహా పాదయాత్ర

ధర్నాచౌక్: వెనకబడి ఉన్న రజకులను ఎస్సీ జా బితాలో చేర్చాలని, ఎన్నికల మ్యానిఫెస్టోలో పొందుపరచాలని జాతీయ దోబీ మహాసంఘం అధ్యక్షుడు అన్నవరపు నాగమల్లేశ్వరరావు అన్ని రాజకీయ పార్టీలను డిమాండ్ చేశారు. రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని తిరుపతి నుంచి విజయవాడ వరకు సాగి న మహాపాదయాత్ర ఆదివారం ముగిసింది. గాంధీనగర్‌లోని ఓ హోటల్‌లో మీడియాతో మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 75ఏళ్లయినా ఒక్క ఎమ్మెల్యే, ఎం పీ, ఐపీఎస్, ఐఏఎస్ లేరని ఆవేదన వ్యక్తం చేశారు. లక్నో జ్వాలాంబిక పీఠాధిపతి అశోక్ జి.మహారాజ్, బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శంకర్రావు పాల్గొన్నారు.





హైదరాబాద్ నడిబొడ్డున జ్ఞాన్‌బాగ్ ప్యాలెస్.. అందులో ఒక రాజకుమారి. ఆమె పేరు **ఇందిరాదేవి ధనరాజ్ గిరి**. ఆమె పూర్వీకులు మహారాష్ట్రను పాలించేవారు. వారికి హైదరాబాద్ సహా అనేక ప్రాంతాల్లో ప్యాలెస్‌లు ఉండేవి. ఇందిరాదేవి నాన్న రాజా ధన్‌రాజ్ గిరి హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. ఆయన హైదరాబాద్‌కు చెందిన హిందీ, ఉర్దూ, ఆంగ్ల సాహితీ ప్రపంచంతో మమేకమయ్యారు. ఆ బాటలోనే నడిచిన ఇందిరాదేవి... ప్రముఖ కవి గుంటూరు శేషేంద్రశర్మను వివాహం చేసుకొన్నారు. అవిభాజ్య ఆంధ్రప్రదేశ్‌లో హిందీ అకాడమీకి ఛైర్‌పర్సన్‌గా కూడా వ్యవహరించారు. గత వైభవపు చిహ్నాలకు, అనేక చారిత్రక ఘటనలకు ప్రత్యక్ష సాక్షి అయిన 94 ఏళ్ల ఇందిరాదేవి 'నవ్య'కు ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు.

సీవీఎల్ఎన్ ప్రసాద్



"రాజకుమారినే కానీ.. మామూలు మహిళనే...

శేషేంద్ర జీవితంపై సినిమా!

శేషేంద్ర అంటే దర్శకుడు కె. విశ్వనాథ్‌కు విపరీతమైన ప్రేమ ఉండేది. శేషేంద్ర జీవితంపై ఒక సినిమా తీయాలనేది ఆయన కోరిక. ఒక సారి మేము గుప్తా ఫౌండేషన్ అవార్డు తీసుకోవటానికి ఊరు వెళ్లాం. సభకు వెళ్లేముందు శేషేంద్ర కారిడార్‌లోకి వెళ్లాడు. అక్కడ ఒక వ్యక్తి వచ్చి శేషేంద్ర కాళ్లకు దండం పెడుతున్నాడు. ఎవరా అని చూస్తే- కె. విశ్వనాథ్. ఒక గొప్ప వ్యక్తి మరొక గొప్ప వ్యక్తి కాళ్లకు దండం పెట్టిన సందర్భం అది. కె. విశ్వనాథ్ తరచు ఇంటికి వస్తూ ఉండేవారు.

చరిత్రలో అనేక సంఘటనలకు మీరు ప్రత్యక్ష సాక్షి. ప్రస్తుతం మీ దినచర్య ఏమిటి?

అవును. ఎన్నో చూశా. చరిత్రలో నిలిచిపోయిన అనేక మందిని దగ్గరగా చూశా. నెహ్రూ, సర్వేపల్లి రాధాకృష్ణన్, నిజాం, సాలార్‌జంగ్, మౌంట్ బాటెన్, పిఠాపురం మహారాణి, విశ్వనాథ, శ్రీశ్రీ, బెజవాడ గోపాలరెడ్డి, సి. నారాయణరెడ్డి, ముఖ్దుం, అడిగ, సర్దార్ జఫ్రీ, ఖైఫీ ఆజ్మీ- ఇలా



చెప్పుకుంటూ పోతే ఎంతో మంది. ఇప్పుడు ఆ జ్ఞాపకాల నీడలో నిలబడి ఉన్నా. ఇక దినచర్య అంటారా.. ఉదయాన్నే లేచి కాలకృత్యాలు తీర్చుకున్న తర్వాత- ముందు సూర్యభగవానుడిని, ఆ తర్వాత కులదేవతను ప్రార్థిస్తా. నా చిన్నప్పటి నుంచి ఇదే అలవాటు నేర్పారు. ఆ తర్వాతే మిగిలిన పనులన్నీ. మధ్యాహ్నం భోజనం చేసే లోపులో కనీసం ఒక గంట చదువుతా! ఇది చిన్నప్పటి అలవాటు. ఇప్పటికీ కొనసాగుతోంది. ఇంతకు ముందు ఏడాదికి కనీసం ఒక సారి ప్రయాణం చేసేదాన్ని. మాకు ముంబాయి, పూణే, ఊటీలలో ఇళ్లు ఉన్నాయి. అక్కడికి వెళ్లేదాన్ని. ఇక విదేశాలలో బ్యాంకాక్ అంటే ఇష్టం. ఎందుకంటే వీసా అవసరం లేదు. అంతే కాకుండా మూడున్నర గంటల ప్రయాణమే!

మీ చిన్నతనమంతా జ్ఞానభాగ్‌లోనే గడించి కదా.. ఇక్కడ మీకు ఇష్టమైన ప్రదేశాలేమిటి?

మాది పేష్వాల వంశం. షోలాపూర్ సమీప ప్రాంతాలను మా పూర్వీకులు పాలించేవారు. మాకు ముంబాయి, పూణే, హైదరాబాద్, ఊటీ- ఇలా అనేక ప్రాంతాల్లో ప్యాలెస్‌లు ఉండేవి. నేను పుట్టింది.. కొద్ది కాలం పెరిగింది ముంబాయిలో. తాతగారు చనిపోయిన తర్వాత మేము హైదరాబాద్‌కు వచ్చేసాం. మేము జ్ఞాన్ బాగ్ ప్యాలెస్‌లో.. చిన్నాన్నగారి కుటుంబం కోఠిలోని ప్యాలెస్ (ప్రస్తుతం ఈఎన్‌టీ ఆసుపత్రి)లో స్థిరపడ్డాం. నా చిన్నతనమంతా జ్ఞాన్‌బాగ్‌లోనే గడిచింది. ఒకటా.. రెండా.. చెప్పుకుంటూ పోతే ఎన్నో జ్ఞాపకాలు. ఒకో ప్రదేశంతో ఒకో జ్ఞాపకం ముడిపడి ఉంది. ఇంటి వెనక చిన్న జూ ఉండేది. అందులో పులులు, చిరుతలు, గుర్రాలు ఉండేవి. వెనక ఒక హెర్క్యులెస్ విగ్రహం ఉంది. దాని చుట్టూ పరిగెడుతూ ఆడుకొనేదాన్ని. ముంబాయి నుంచి వచ్చేసిన తర్వాత హైస్కూలు దాకా మెహబూబియా గర్ల్స్ స్కూల్‌లో చదివా. ఆ తర్వాత కాలేజీకి పంపలేదు. ఆ రోజుల్లో అమ్మాయిలను కాలేజీలకు ఎక్కువగా పంపేవారు కాదు. మా ఇంట్లో ఒక యూరోపియన్ నానీ ఉండేది. ఉదయాన్నే లేచి ఇంట్లో ఉన్న ఫ్లవర్‌వాజ్‌లలో పూలు పెడుతూ ఉండేది. అమ్మ నన్ను ఆవిడ వెనకే పంపేది. నేను కూడా పూలు ఎలా పెట్టాలో నేర్చుకొనేదాన్ని. ఇక్కడ ఒక విషయం చెప్పాలి. నాకు ఆ రోజుల్లోనే మంచి లైబ్రరీ ఉండేది. మంచి సాహిత్యాన్ని చదువుతూ ఉండేదాన్ని. బహుశా అలాంటి లైఫ్‌ను ఈ తరం వాళ్లు ఊహించలేరు కూడా. ఒక ఫెయిరీటైల్ లైఫ్. నా జీవితమంతా అలాగే సాగింది.

ఈ రాజకుమారి జీవితంలో అన్నీ సంతోషాలేనా? దుఃఖాఃలేమి లేవా?

ప్రతి వ్యక్తి జీవితంలోను ఉంటాయి. నా జీవితంలోనూ ఉన్నాయి. నేను రాజకుమారి కావచ్చు. కానీ నేను ఒక సాధారణ మహిళనే. ఒక అమ్మగా.. భార్యగా.. సోదరిగా.. స్నేహితురాలిగా- ఇలా అనేక పార్శ్వాలు ఉంటాయి. ఇవన్నీ నాలోను ఉన్నాయి. నాకు 14 ఏళ్లు ఉన్నప్పుడు అమ్మ చనిపోయింది. దానితో చెల్లిని.. తమ్ముడిని నేనే పెంచాను. నాన్న(మహరాజా ధన్‌రాజ్‌గిరీ)కి అనేక వ్యాపకాలు ఉండేది. ఆయన కదిలే ఒక ట్రైన్‌లాంటివారు. ఎప్పుడూ ఆగేవారు కాదు. ఇంటికి ప్రతి రోజు కనీసం 40 మంది అతిధులు వచ్చేవారు. వారందరినీ చూసుకోవాల్సి వచ్చేది. కొందరు వచ్చి- "హుజూర్ డబ్బులు నీళ్లల్లా ఖర్చు చేస్తున్నారు" అంటూ ఉండేవారు. అందరిని సంతృప్తిపరచటంలో ఆయనకు ఆనందం కలిగేది. ఆ కోణం నుంచి చూస్తే ఆయన సంతోషంగానే బతికారు. ఇక్కడ ఇంకో మాట చెప్పాలి. రాజకుటుంబాలంటే- అపరిమితమైన డబ్బులు ఉంటాయనుకుంటారు. కానీ అది నిజం కాదు. నాకు చిన్నప్పుడు నెలకు రూ. 10లు పాకెట్ మనీ ఇచ్చేవారు. నా ఖర్చులన్నీ దానిలోనే! ఏడాదికి రెండు, మూడు సార్లు బట్టలు కుట్టించేవారు. నేను యుక్తవయస్సుకు వచ్చిన తర్వాత పాకెట్ మనీ రూ. 300లకి పెరిగింది. అమ్మ చనిపోయిన తర్వాత రూ.1500కి పెరిగింది. దీనితోనే నా ఖర్చులు పెట్టుకొనేదాన్ని. ఒక్క మాటలో చెప్పాలంటే- మా నాన్నకు డబ్బులు ఉన్నాయి కానీ మాకు లేవు.

రాధాకృష్ణన్‌తో...

సర్వేపల్లి రాధాకృష్ణన్ మా ఇంటికి చాలా సార్లు వస్తూ ఉండేవారు. ఒక సారి ఒక పని కోసం ఆయకు విరాళం అవసరం వచ్చింది. ఆయన హైదరాబాద్‌కు వచ్చి నేరుగా నిజాం దగ్గరకు వెళ్లారు. అక్కడ నుంచి ఆయన నేరుగా నాన్నదగ్గరకు వచ్చారు. నాన్నకు ఆయనను కలవటం ఇష్టం లేదు. కానీ ఆయన వస్తే కాదనలేకపోయారు. నేను వారిద్దరూ ఏం మాట్లాడుకుంటారా? అని బాల్కనీ నుంచి చూస్తున్నా. రాధాకృష్ణన్ వచ్చి నాన్న ఎదురుగా కూర్చున్నారు. ఏమి మాట్లాడకుండా- భగవద్గీతను గట్టిగా చదవటం మొదలుపెట్టారు. కొద్ది సేపు పోయిన తర్వాత నాన్న తన సెక్రటరీని పిలిచి - "లక్ష రూపాయల చెక్కు తీసుకురా!" అన్నారు. ఆ చెక్కును రాధాకృష్ణన్‌కు ఇచ్చారు.

గుంటూరు శేషేంద్రశర్మగారిని పెళ్లి చేసుకున్న తర్వాత మీ జీవితంలో వచ్చిన మార్పులేమిటి?

శేషేంద్రను పెళ్లి చేసుకోవటం నాన్నగారికి ఇష్టం లేదు. రాజకుటుంబాలలోని వారిని పెళ్లి చేసుకోవటం నాకు ఇష్టం లేదు. నాన్న మాట వింటే- ఆయనలాంటి మరో వ్యక్తినే చేసుకోవాల్సి వచ్చేది. ఇంటికి వచ్చిన అతిధులను చూసుకుంటూ.. రాజవిధులు నిర్వర్తిస్తూ ఇంకో రాజకుమారిలా మిగిలిపోయేదాన్ని. అలా ఉండటం నాకు ఇష్టం లేదు. నాకు నచ్చిన రీతిలో ప్రశాంతమైన జీవితాన్ని గడపాలనేది నా ఉద్దేశం. అందుకే నేను, శేషేంద్ర ఎవరికీ చెప్పకుండా హలిబీడ్ వెళ్లిపోయాం. అప్పుడు నా దగ్గర 14 వేలు మాత్రమే ఉన్నాయి. ఏం జరుగుతుందో తెలియదు. హలిబీడ్‌లో ఒక గుడిలో పెళ్లి చేసుకున్నాం. ఒకరే అతిధిగా వచ్చారు. గుడిలో జరుగుతున్న హడావిడిని చూసి - చుట్టుపక్కల గ్రామస్తులు ఏం జరుగుతోందని అడిగారట. గుడిలో వారు- మహారాణి పెళ్లి చేసుకుంటోంది అని చెప్పారట. దాంతో ఆ రాత్రికి చుట్టుపక్కల ఊళ్లలో ఉన్న అనేక మంది లాంతర్లు పట్టుకొని వచ్చారు. చిమ్మ చీకటి.. మినుక్కుమినుక్కు మంటూ నక్షత్రాల్లా వందల లాంతర్లు.. ఆ రోజును ఇప్పటికీ నా కళ్ల ముందు కదలాడుతూనే ఉంటుంది.

ప్రస్తుత సాహిత్యంపై మీ అభిప్రాయమేమిటి?

సాహిత్యం ఒక జీవధార. ప్రవాహ వేగం తగ్గవచ్చు. కానీ ఎప్పటికీ చావదు. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో ఎక్కువ మంది సాహిత్య రంగంలోకి రావాలనుకోవటం లేదు. ప్రోత్సాహం లేకపోవటమే దీనికి కారణం. సాహిత్యం గురించి తెలిసిన రాజకీయ నాయకులు లేకపోవటం కూడా దీనికి ఒక కారణం. ఉదాహరణకు కర్ణాటకకు ముఖ్యమంత్రిగా చేసిన రామకృష్ణ హెగ్డే మంచి సాహిత్యకారుడు. రాజకీయాల్లోకి రాకముందు సాహిత్యంలో చాలా కృషి చేశారు. గతంలో అలాంటి వారు ఉండేవారు. ఇక్కడ ఇంకో విషయం కూడా చెప్పాలి. నా ఉద్దేశంలో అసలైన సాహిత్యం ప్రాంతీయ భాషల్లోనే ఉంది. మన భారతీయ భాషల నుంచి ఇంగ్లీషులో అనువాదం చేస్తే అసలు అర్థం రాదు. కానీ ఒక భారతీయ భాష నుంచి వేరే భాషకు అనువాదం చేస్తే అర్థం చెడిపోదు.

శేషేంద్రగారితో సాహితీజీవితం ఎలా గడిచింది?

అనేక జ్ఞాపకాలు. అన్నింటినీ ఒక చోట ఎలా పెట్టగలను? మా నాన్నగారు సాహిత్యాభిమాని. ఉర్దు, పర్షియన్, మరాఠీ ఇలా అనేక భాషలకు చెందిన కవులు, కళాకారులు మా ఇంటికి వస్తూ ఉండేవారు. కానీ తెలుగువారు ఉండేవారు కాదు. శేషేంద్ర వల్ల ఆ లోటు తీరింది. ఇక శేషేంద్రకు ఎటువంటి గర్వం లేని వ్యక్తి. చాలా సున్నితమైన కవి. ఎటువంటి ఆడంబరాలు కోరుకొనేవాడు కాదు. జీవితమంతా రాస్తూనే ఉన్నాడు. ఎవరైనా 50 పుస్తకాలు రాయాలంటే ఎంత కష్టమో ఊహించుకోండి. ఆయన అనేక అవమానాలకు కూడా గురయ్యారు. వాటి నుంచి గొప్ప కవిత్వం కూడా పుట్టింది. 'నా దేశం.. నా ప్రజలు' అలా వచ్చిందే! ఆ రోజుల్లో శేషేంద్ర ఆఫీసుకు మెర్సిడిస్‌లో వెళ్లేవాడు. ఆఫీసులో ఉన్నవారు అసూయ పడతారని- మెర్సిడిస్‌లో వెళ్లవద్దని చెప్పేదాన్ని. కానీ తను వినేవాడు కాదు. మెర్సిడిస్ చాలా మందిలో కడుపుమంట రగిల్చింది. శేషేంద్ర పుస్తకాలు కొన్ని ఉర్దులోకి అనువాదమయ్యాయి. వాటిని తీసుకువెళ్లి అక్కడున్న స్పెషల్ ఆఫీసర్‌కు చూపించాడు. ఆయన కోపంతో రగిలిపోయి- వాటిని శేషేంద్ర మొహం మీద విసిరి కొట్టాడు. దాంతో శేషేంద్రకు విపరీతమైన కోపం వచ్చింది. అవమానంగా భావించాడు. ఇంటికి వచ్చేశాడు. ఆ పరిస్థితుల్లో ఏం చేయాలో తెలియక- తన బాధ చల్లార్చటానికి ఊటీకి వెళ్దామన్నా. వారం రోజులు సెలవు పెట్టించా. ముందు బెంగుళూరు వెళ్లాం. అక్కడా తను రాస్తూనే ఉన్నాడు. అక్కడి నుంచి ఊటీ వెళ్లాం. ఒక రోజు ఉదయాన్నే దూరంగా ఉన్న కొండ మీదకు వెళ్లాడు. కిందకు రమ్మంటే రాలేదు. సాయంత్రం తిరిగి వచ్చాడు. ఆ రాత్రి కోపంతో కాగితాల మీద ఇంగ్లీషులో రాసి విసిరేశాడు. వాటిని నేను చదివాను. "నీ జీవితంలో అద్భుతమైన కవితను రాశావు" అన్నా. తను వినిపించుకోలేదు. ఆ ర్వాత వాటిని ముందు హిందీలోకి అనువాదం చేయించా. అక్కడ తనకు విపరీతమైన పేరు వచ్చింది. ఆ తర్వాతే అవి తెలుగులోకి వచ్చాయి. ప్రతి కవి జీవితంలోను ఇలాంటి అనుభవాలన్నే ఉంటాయి.



శేషేంద్రగారి సాహితీ సౌరభాలను భవిష్యత్ తరాలకు ఎలా అందించాలనుకుంటున్నారు?

శేషేంద్ర ఒకప్పుడు పోస్ట్‌కార్డుల మీద ఉత్తరాలు రాసేవారు. ఆయనకు కూడా కార్డులే వచ్చేవి. ఒక స్టేషన్ మాస్టర్, ఒక రిక్షా కార్మికుడు, ఒక సాధరణ టీచర్- ఇలాంటి వారందరికీ ఉత్తరాలు రాస్తూ ఉండేవారు. వారే నా సాహిత్యానికి పాఠకులు అనేవారు. అలా శేషేంద్ర రాసిన 10 వేల ఉత్తరాలతో ఒక గ్యాలరీ ప్రారంభించాం. దీనిలో 4 వేలు పోస్ట్‌కార్డులే ఉన్నాయి. నా భర్తకు నేను ఇచ్చే గొప్ప నివాళి ఇదే! అంతే కాదు. అది నా బాధ్యత కూడా. నేను వెళ్లిపోయిన తర్వాత వీటిని ఎవరు భద్రపరుస్తారు? నేను కట్టిన కోటను నేనే కూలగొట్టగలనా? చాలా మంది గ్యాలరీ ఎక్కడ ఉంది అని అడుగుతున్నారు. నాచారంలో గ్యాలరీ కోసం ప్రత్యేకంగా ఒక ప్లాట్ తీసుకున్నాం. దీనిలో శేషేంద్ర సాహిత్యాన్ని భద్రపరుస్తున్నా. నా ఉద్దేశంలో ఆ గ్యాలరీ జ్ఞాన్‌భాగ్ కన్నా పెద్దది. అంతే కాదు. జ్ఞాన్‌బాగ్‌లో ఒక గెస్ట్‌హౌస్‌ను నిర్మిస్తున్నా. రచయితలు వచ్చి పది రోజులో.. పదిహేను రోజులో నివసించాలి. తమకు నచ్చింది రాయాలి. ఆ రచనలు పుస్తక రూపంలో రావాలి. అంతే కాకుండా కనీసం ఏడాదికొకసారి సాహితీ సమావేశాలు జరపాలనుకుంటున్నా.

శేషేంద్ర గారి రచనల కాపీరైట్‌పై వివాదం నెలకొని ఉంది కదా..

దాని గురించి మాట్లాడటం నాకు ఇష్టం లేదు. శేషేంద్ర పుస్తకాలన్నీ నేనే ప్రచురించాను. కాపీరైట్ కూడా ఆయన నాకే రాసిచ్చారు. కానీ మా లాయర్ సరిగ్గా రిప్రజెంట్ చేయకపోవటం వల్ల ఆ కేసు వీగిపోయింది. శేషేంద్ర, నేను కలిసి 36 ఏళ్లు బతికాం. తను వెళ్లిపోయిన తర్వాత ఇలాంటి సంఘటనలు జరగటం చాలా దుఃఖం కలిగిస్తోంది. కొందరు ఈ కేసును పోరాడమని నాకు సలహా ఇస్తున్నారు. నేను దేని కోసం పోరాడాలి? పోరాడే ఉద్దేశం లేదు. కానీ వారి దగ్గర వీరి దగ్గర డబ్బులు తీసుకొని శేషేంద్ర పుస్తకాలు వేయటమే నాకు అవమానంగా అనిపిస్తోంది.

మీరు మంచి రచయిత్రి, పెయింటర్ కూడా కదా.. కానీ ఆ వ్యాసాంగం ఎందుకు కొనసాగించలేదు?

మంచి రచయితనో కాదో నాకు తెలియదు. 9 ఏళ్ల వయస్సులో నా తొలి కవిత స్కూల్ మ్యాగజైన్‌లో ప్రచురించారు. ఆ తర్వాత విపరీతంగా పుస్తకాలు చదివేదాన్ని. ఆ తర్వాత నా జీవితమంతా సాహితీకారుల సాంగత్యంలోనే గడిచింది. నేను రాసిన ఇంగ్లీషు కవితలను ముఖ్దుం ఉర్దులోకి ట్రాన్స్‌లేట్ చేశారు. కానీ నేను ఎప్పుడూ కవియిత్రిగా స్థిరపడాలనుకోలేదు. ఎందుకంటే- ఒక ఇంట్లో ఇద్దరు కవులు ఉండకూడదు. అనేక అపార్థాలు వచ్చే అవకాశముంది. ఆ తర్వాత అంజయ్య ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో హిందీ అకాడమీ ఛైర్‌పర్సన్‌గా పనిచేశా. అంతే కాదు. ఒక ఉర్దు పత్రికకు పన్నెండున్నరేళ్లు ఒక కాలమ్ రాశా. వాటిలో 750 పేజీల పుస్తకం వేశారు. ఇక పెయింటింగ్ వేయటం ఎప్పుడో మానేసా. ముంబాయిలో నా తొలి పెయింటింగ్ ఎగ్జిబిషన్ ఎంఎఫ్ హుస్సేన్‌తో కలిసి నిర్వహించా.

విశ్వనాథ చెమక్కు

ఒక రోజు నేను, విశ్వనాథ (సత్యన్నారాయణ) ఒక సమావేశానికి వెళ్లాం. అక్కడ వేదికపై కవులు - ఆధునిక కవిత్వం చదువుతున్నారు. విశ్వనాథ నన్ను- వాళ్లు ఏం చేస్తున్నారు? అని అడిగారు. "ఆధునిక కవిత్వం చదువుతున్నారు.. ఇప్పుడు అందరూ ఇష్టపడుతున్నారు" అన్నా. అప్పుడు విశ్వనాథ- " అందరూ మనని వచ్చి గడ్డి తినమంటారు. తింటామా?" అని చెమక్కు విసిరారు.

ఉదయం అయితే రావద్దన్నా!

శేషేంద్ర, ఎన్టీఆర్ గుంటూరు ఏసీ కాలేజీలో కలిసి చదువుకున్నారు. మంచి మిత్రులు. ఒక సారి ఎన్టీఆర్ సెక్రటరీ ఫోన్ చేసి- "ఉదయాన్నే ఆరుగంటలకు రావాలనుకుంటున్నారు" అని నాకు చెప్పాడు. "మరీ అంత ఉదయం అయితే కష్టమవుతుంది. 11 గంటలకు రాగలరా?" అని అడిగాను. "సార్‌కి వేరే అపాయింట్‌మెంట్ ఉంది" అన్నాడు. ఇలా నాలుగైదు సార్లు జరిగింది. చండశాసనుడు సినిమా షూటింగ్ జ్ఞాన్‌బాగ్ ప్యాలెస్‌లోనే జరిగింది. సినిమా పూర్తయిన తర్వాత ప్రివ్యూకి పిలిచారు. నేను, శేషేంద్ర వెళ్లాం. మగవాళ్లు వేరుగా.. ఆడవాళ్లు వేరుగా కూర్చున్నారు. నాకు ఆశ్చర్యమనిపించింది. ఇక ఎన్టీఆర్ ముఖ్యమంత్రి అయిన తర్వాత ఒక రోజు మా ఇంటికి వస్తానని కబురు పంపారు. నాకు ఏం చేయాలో తెలియలేదు. శేషేంద్ర వచ్చి- "ఆయన ముఖ్యమంత్రి. ఉదయాన్నే వస్తానంటే రావద్దని ఎలా చెప్పగలవు.. పైగా మీ ఆస్తులన్నీ ఇక్కడే ఉన్నాయి.. ఆ విషయాన్ని గుర్తుంచుకో!" అన్నాడు.

చాలా కష్టం..

ఒక కవికి ప్రభుత్వం తరపున అవార్డు రావటం చాలా కష్టం. రకరకాల సమీకరణాలు పనిచేస్తూ ఉంటాయి. శేషేంద్రకు గొప్ప ప్రజాదరణ ఉండేది. కానీ ఆయనకు చివరి వరకు అవార్డులు రాలేదు. సాహిత్య అకాడమీవారు ఆయనకు అవార్డు ప్రకటించినప్పుడు- తను చాలా హర్ట్ అయ్యాడు. "వాళ్లకి ఫోన్ చేసి అవార్డు వద్దు అని చెప్పు" అన్నాడు. నేను ఊరుకున్నా. ఈ లోపులో బీబీసీ ఛానెల్ శేషేంద్రతో ఇంటర్వ్యూ చేసింది. దాంట్లో అవార్డు వచ్చినందుకు ఆనందంగా ఉందన్నాడు. ఆ మర్నాడు ముఖ్యమంత్రి ఎన్టీఆర్ ఒక సందేశాన్ని కూడా పంపారు. ఒక సారి ఆనందంగా ఉందన్నతర్వాత అవార్డు తీసుకోక తప్పదు కదా!

నిజాంతో...

నిజాం.. ఆయన కుటుంబ సభ్యులు మాకు చిన్నప్పటి నుంచి బాగా తెలుసు. నాకు నా మొదటి గుర్రాన్ని బహుకరించింది సలార్‌జంగ్! నాకు 14 ఏళ్ల వయస్సు ఉన్నప్పుడు- నన్ను నిజాంకు పరిచయం చేశారు. ఆయన గొంతుకు చాలా పెద్దగా ఉండేది. ఆ తర్వాత అనేక సందర్భాలలో ఆయనను కలిసాను. నిజాం వారసులు కూడా నాకు మంచి స్నేహితులు. ప్రిన్సెస్ ఇస్రాతో నాకు చిన్నప్పటి నుంచి స్నేహం ఉంది. వాళ్లు మా ఇంటికి వచ్చి పోతూ ఉంటారు.

తాజాగా ఇందిరాదేవిపై ఒక పుస్తకం విడుదలయింది. ఈ పుస్తక వివరాలు
రాజకుమారి ఇందిరాదేవి
రచయిత: మహేష్ విశ్వనాథ
ప్రతులకు: 7997994678



శ్రీశ్రీ మాకు మంచి స్నేహితుడు. తనను కలవక ముందే ఆయన సాహిత్యం చదివాను. చాలా నచ్చి ఉర్దు కవులకు పరిచయం చేశాను. వారు కూడా శ్రీశ్రీ గురించి బాగా రాయటం మొదలుపెట్టారు. వెంగళరావు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో జ్ఞాన్‌భాగ్‌లో తెలుగు కవుల సమావేశం జరుగుతోంది. సమావేశం జరుగుతున్నప్పుడే- శ్రీశ్రీని అరెస్ట్ చేశారు. నాకు ఎవరో చెబితే వెంగళరావుకు ఫోన్ చేశా. "సమావేశం జరుగుతున్నప్పుడు అరెస్ట్ చేయటం సరికాదు. వాళ్లందరు ధర్నా చేస్తే బావుండదు. వదిలేయండి. రేపు సాయంత్రం ఆయన ముగింపు సమావేశంలో మాట్లాడాలి" అన్నా. వెంగళరావు- "రేపు సాయంత్రం - నాలుగు గంటలకు వదిలేస్తాం" అన్నాడు. అలాగే పోలీసులు శ్రీశ్రీని వదిలేశారు. శ్రీశ్రీ, వరవరరావు కలిసి జ్ఞాన్‌భాగ్‌కు వచ్చారు. వచ్చిన వెంటనే శ్రీశ్రీ నేరుగా బార్ కౌంటర్ దగ్గరకు వెళ్లాడు. అక్కడున్నవారు వచ్చి- "ఆయన ఇప్పుడు మాట్లాడాలి. తాగనివ్వకండి" అని చెప్పారు. కానీ నేను పెద్దగా పట్టించుకోలేదు. ఆ సాయంత్రం శ్రీశ్రీ మంచి ప్రసంగం చేశాడు.




నామ్‌తో సునా హోగా

రవితేజ, దర్శకుడు హరీశ్‌శంకర్ కాంబినేషన్‌లో పీపుల్ మీడియా ఫ్యాక్టరీ నిర్మిస్తున్న 'మిస్టర్ బచ్చన్' చిత్రం షెడ్యూల్ పూర్తయింది. రవితేజతో పాటు ముఖ్య తారాగణం పాల్గొన్న కీలకమైన సన్నివేశాలను ఈ షెడ్యూల్‌లో చిత్రీకరించారు. ఈ సెట్‌లోనే 'మిస్టర్ బచ్చన్' టీమ్ రవితేజ ఇటీవల నటించిన 'ఈగల్' సక్సెస్‌ను సెలబ్రేట్ చేసింది. రవితేజ పూర్తిగా డిఫరెంట్ లుక్‌లో కనిపించే 'మిస్టర్ బచ్చన్' సినిమాకు 'నామ్‌తో సునా హోగా' అన్నది ట్యాగ్‌లైన్. భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రాన్ని టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు. వివేక్ కూచిబొట్ల సహ నిర్మాత. మిక్కీ జే మేయర్ స్వరాలు సమకూరుస్తున్న ఈ చిత్రానికి ఆయనంక బోస్ సినిమాటోగ్రాఫర్., సమర్పణ: పనోరమా స్టూడియోస్, టీ సిరీస్.

హీరోయిన్ గుర్రపు స్వారీ

నవ్య | చిత్రజ్యోతి



నిఖిల్ తన 20వ చిత్రం 'స్వయంభూ'లో లెజెండరీ యోధుడి పాత్ర పోషిస్తున్నారు. అద్భుతమైన వార్ సీన్లు ఉండే ఈ సినిమా కోసం ఆయన మార్షల్ ఆర్ట్స్, గుర్రపు స్వారీలో శిక్షణ తీసుకున్నారు. ఈ చిత్రంలో కథానాయికగా సంయుక్త నటిస్తున్నారు. కొన్ని యాక్షన్ దృశ్యాల్లో తను పాల్గొనడం కోసం ప్రస్తుతం గుర్రపు స్వారీ నేర్చుకుంటున్నారు సంయుక్త. భరత్ కృష్ణమాచారి దర్శకత్వం వహిస్తున్న ఈ పాన్ ఇండియా మూవీ అత్యున్నత సాంకేతిక విలువలతో రూపొందుతోంది. ప్రస్తుతం హైదరాబాద్‌లో వేసిన భారీ సెట్‌లో షూటింగ్ జరుగుతోంది. నిఖిల్‌తో పాటు ఇతర ముఖ్య తారాగణం పాల్గొంటున్నారు. రవి బస్రూర్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రానికి మనోజ్ పరమహంస సినిమాటోగ్రాఫర్. ఠాగూర్ మధు సమర్పణలో భువన్, శ్రీకర్ నిర్మిస్తున్నారు.



యూనిక్ ఎలిమెంట్స్‌తో..

శివ కందుకూరి హీరోగా రూపొందిన యూనిక్ క్రైమ్ థ్రిల్లర్ 'భూతద్దం భాస్కర నారాయణ'. రాశీ సింగ్ కథానాయిక. పురుషోత్తం రాజ్ దర్శకత్వంలో స్నేహాల్, శశిధర్, కార్తీక్ ముడుంబై నిర్మించారు. మార్చి ఒకటిన ఈ సినిమా విడుదలవుతున్న సందర్భంగా చిత్రం ట్రైలర్‌ను హీరో విశ్వక్ సేన్ విడుదల చేశారు. హీరో శివ కందుకూరి మాట్లాడుతూ 'పురాణాలతో ముడిపడిన ఎలిమెంట్స్ ప్రేక్షకులకు కొత్త అనుభూతిని కలిగిస్తాయి. మా దర్శకుడికి పురాణాల మీద మంచి పట్టు ఉంది. యూనిక్ ఎలిమెంట్స్‌తో రూపొందిన ఈ సినిమా మీద మంచి నమ్మకం ఉంది' అన్నారు. 'ప్రతి ఒక్కరి ఇంటి ముందు దిష్టి బొమ్మ ఉంటుంది. ఆ బొమ్మ గురించే ఈ కథ. సినిమాలో చాలా ట్విస్టులు ఉన్నాయి' అన్నారు దర్శకుడు పురుషోత్తం. మంచి థ్రిల్లర్ ఇదనీ, సినిమా బాగా వచ్చిందని నిర్మాతలు చెప్పారు.

నిజంగానే అభినవ్‌లో చాలా షేడ్స్ ఉన్నాయి



అభినవ్ గోమఠం హీరోగా, వైశాలి రాజ్ హీరోయిన్‌గా నటించిన 'మస్తు షేడ్స్ ఉన్నాయిరా' చిత్రం ఈ నెల 23న విడుదల కానుంది. తిరుపతిరావు ఇండ్ల దర్శకత్వంలో భవాని కాసుల, ఆరెమ్ రెడ్డి, ప్రశాంతి నిర్మించారు. ఈ సినిమా ట్రైలర్‌ను ఇటీవల హీరో నిఖిల్ విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ 'అభినవ్‌లో నిజంగానే చాలా షేడ్స్ ఉన్నాయి. సెట్‌లో అందర్నీ నవ్విస్తుంటాడు. నాకు మంచి స్నేహితుడు. ఈ సినిమా బాగుందని కొందరు చెప్పడంతో ఈ ఫంక్షన్‌కు వచ్చాను. అభినవ్‌కు ఈ సినిమా హీరోగా మంచి బిగినింగ్ అందించాలని కోరుకుంటున్నాను' అన్నారు. 'నా లైఫ్‌లో ఇది స్పెషల్ మూమెంట్. హీరోగా నాకు చాలా ఆఫర్లు వచ్చాయి కానీ నాకు తగ్గ కథ కోసం ఎదురు చూసి ఈ సినిమా ఎంచుకున్నాను. నిఖిల్ నాకు మంచి స్నేహితుడు. ఆయన ఈ సినిమా ట్రైలర్ విడుదల చేయడం ఆనందంగా ఉంది. ఈ చిత్రం తప్పకుండా అందరికీ నచ్చుతుందనే అనుకుంటున్నాను' అన్నారు అభినవ్. చిన్న సినిమా అయినా కంటెంట్ బాగుంటే ప్రేక్షకులు ఆదరిస్తారు కనుక మా సినిమా విజయంపై నమ్మకం ఉందని దర్శకుడు తిరుపతిరావు చెప్పారు. అందరూ ఫ్యామిలీతో చూడతగ్గ చిత్రం ఇదని నిర్మాత కాసుల భవాని చెప్పారు.

రెండున్నరేళ్ల కష్టం



సందీప్‌కిషన్ నటిస్తున్న మ్యాజికల్ ఫాంటసీ అడ్వెంచర్ 'ఊరు పేరు భైరవకోన'. కావ్య థాపర్, వర్ష బొల్లమ్మ హీరోయిన్లుగా నటించిన ఈ చిత్రానికి విఐ ఆనంద్ దర్శకత్వం వహించారు. రాజేశ్ దండా నిర్మాత. అనిల్ సుంకర సమర్పకుడు. ఈ నెల 16న ఈ చిత్రం విడుదలవుతున్న సందర్భంగా ఆదివారం చిత్ర యూనిట్ పాత్రికేయుల సమావేశం ఏర్పాటు చేసింది. ఇందులో సందీప్ మాట్లాడుతూ 'రెండున్నర ఏళ్లు ఈ సినిమా కోసం దర్శకుడు ఆనంద్ ఎంతో కష్టపడ్డారు.సూపర్ నేచురల్ ఎలిమెంట్స్ ఉన్న మంచి కమర్షియల్ సినిమా ఇది. సినిమా మీద చాలా నమ్మకంగా ఉన్నాం' అన్నారు. 'చాలా మంచి సినిమా ఇది. దీంతో సందీప్ నెక్స్ట్ లెవెల్‌కు వెళతాడు. సినిమా అద్భుతంగా వచ్చింది' అన్నారు అనిల్ సుంకర. దర్శకుడు ఆనంద్ మాట్లాడుతూ 'అద్భుతమైన జర్నీ ఈ సినిమా. ఇందులో ప్రతి మూమెంట్ మాకు ఓ కొత్త అనుభవం. ఆడియన్స్ తప్పకుండా ఎంజాయ్ చేస్తారు' అన్నారు.

సుమిత్‌దే చెన్నై ఓపెన్



టాప్-100 ర్యాంకింగ్స్‌లో చోటు

చెన్నై: సూపర్‌ఫామ్‌తో దూసుకెళ్తున్న భారత టెన్నిస్ సింగిల్స్ టాప్ ఆటగాడు సుమిత్ నగల్ స్వదేశంలో జరిగిన టోర్నీలోనూ అదరగొట్టాడు. చెన్నై ఓపెన్‌లో సింగిల్స్ చాంపియన్‌గా అవతరించాడు. ఆదివారం ఇక్కడ జరిగిన ఫైనల్లో రెండోసీడ్ సుమిత్ 6-1, 6-4తో ఇటలీకి చెందిన టాప్‌సీడ్ లుకా నార్డిని చిత్తు చేశాడు. ఈ ప్రదర్శనతో 26 ఏళ్ల సుమిత్ కెరీర్‌లోనే తొలిసారిగా అత్యుత్తమ ర్యాంక్‌ను అందుకోనున్నాడు. ప్రస్తుతం 121వ ర్యాంకులోనున్న సుమిత్.. సోమవారం ప్రకటించే ఏటీపీ ర్యాంకింగ్స్‌లో ఏకంగా 98వ స్థానానికి చేరుకుంటాడు. సుమిత్‌కు ఇది కెరీర్‌లో 5వ ఏటీపీ చాలెంజర్ ట్రోఫీ కాగా.. సొంతదేశంలో 2వది.

'బెల్జియం' మీట్‌లో తేజస్విన్‌కు స్వర్ణం



న్యూఢిల్లీ: భారత హైజంప్ స్టార్ తేజస్విన్ శంకర్ అంతర్జాతీయ వేదికపై మెరిశాడు. బెల్జియంలో జరిగిన గాలా ఎల్మోస్ అథ్లెటిక్స్ మీట్‌లో తేజస్విన్ చాంపియన్‌గా నిలిచాడు. తేజస్విన్ హైజంప్‌లో 2.23 మీటర్లు దూకి స్వర్ణ పతకం కొల్లగొట్టాడు. గ్రీస్ అథ్లెట్ ఆంటోనియోస్ (2.20 మీ.) రెండో స్థానానికి పరిమితమయ్యాడు.

నిఖత్.. రజతంతో సరి



అమిత్, సచిన్‌కు స్వర్ణాలు
స్ట్రాంజా బాక్సింగ్

సోఫియా (బల్గేరియా): స్ట్రాంజా మెమోరియల్ బాక్సింగ్ టోర్నీలో డిఫెండింగ్ చాంపియన్‌గా పోటీపడ్డ తెలంగాణ స్టార్ నిఖత్ జరీన్ ఈసారి రజత పతకంతో సరిపెట్టుకుంది. మహిళల 50 కిలోల ఫైనల్లో వరల్డ్ చాంపియన్ నిఖత్ 2-3తో ఉజ్బెకిస్థాన్‌కు చెందిన 20 ఏళ్ల సబీనా బొబొకులోవా చేతిలో ఓటమి చవిచూసింది. ఇక, మహిళల 66 కిలోల కేటగిరీలో భారత బాక్సర్ అరుంధతి 1-4తో ప్రపంచ చాంపియన్ లియు యాంగ్ (చైనా) చేతిలో, పురుషుల 48 కేజీలలో బరుణ్ సింగ్-ఖోడ్జీ (కిర్గిస్థాన్) చేతిలో, 67 కిలోలలో రజత్-దులత్ (కజకిస్థాన్) చేతిలో ఓడి రజత పతకాలతో సరిపెట్టుకున్నారు. 2019 ప్రపంచ చాంపియన్‌షిప్ రజత పతక విజేత పంగల్ 51 కిలోల తుది పోరులో 5-0తో సన్‌ఝర్ (కజకిస్థాన్)ను చిత్తుచేసి స్వర్ణ పతకం సాధించాడు. 57 కిలోల అంతిమ సమరంలో సచిన్ సివాచ్ 5-0తోనే షఖ్‌జోద్ (ఉజ్బెకిస్థాన్)పై ఘన విజయంతో పసిడి పతకం కొల్లగొట్టాడు.

ఒత్తిడికి చిత్తయ్యారు

ఫైనల్లో భారత్ ఓటమి
ఆస్ట్రేలియాదే అండర్-19 వరల్డ్‌కప్

వరుసగా ఆరు విజయాలు.. భీకరఫామ్‌తో దూసుకెళుతున్న బ్యాటర్లు.. బంతితో బెదరగొడుతున్న బౌలర్లు.. ఇంకేముంది రికార్డు స్థాయిలో ఆరో టైటిల్‌ను ఎగరేసుకు పోదామనుకున్న మన కుర్రాళ్లకు ఆస్ట్రేలియా గట్టి షాకిచ్చింది. గతేడాది తమ సీనియర్ జట్టు మాదిరే అంతిమ సమరంలో భారత్‌ను చిత్తుచేసి అండర్-19 ప్రపంచకప్ చాంపియన్‌గా నిలిచింది.



కెప్టెన్ ఉదయ్ (8)

1 అండర్-19 వరల్డ్‌కప్ ఫైనల్లో అత్యధిక స్కోరు (253) సాధించిన జట్టుగా ఆస్ట్రేలియా

4 ఆస్ట్రేలియాకిది నాలుగో వరల్డ్‌కప్ టైటిల్



బెనోని: భారత సీనియర్ జట్టునే కాదు.. యువ ఆటగాళ్ల ఆశల్ని కూడా ఆస్ట్రేలియా చెల్లాచెదురు చేసింది. ఆదివారం జరిగిన అండర్-19 వరల్డ్‌కప్ ఫైనల్లో భారత్‌ను 79 పరుగుల తేడాతో ఓడించిన కంగారూలు విశ్వవిజేతలుగా నిలిచారు. టోర్నీలో ఒక్క ఓటమి లేకుండా ఫైనల్‌కు దూసుకువచ్చిన భారత్ కీలక పోరులో అన్ని విభాగాల్లోనూ విఫలమైంది. గతేడాది నవంబరులో రోహిత్ సేన సైతం వరుస విజయాలతో వన్డే వరల్డ్‌కప్ ఫైనల్‌కు చేరి ఆసీస్ చేతిలోనే ఓడడం గమనార్హం. ఆదివారం జరిగిన ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ఆసీస్ 50 ఓవర్లలో 7 వికెట్లకు 253 పరుగులు చేసింది. మిడిలార్డర్ బ్యాటర్ హర్జాస్ సింగ్ (55), హర్యాజ్ వీబ్జెన్ (48), ఒలివర్ పీక్ (46 నాటౌట్), హ్యారీ డిక్సన్ (42) కీలక ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్నారు. పేసర్ రాజ్ లింబానికి మూడు, నమన్ తివారికి రెండు వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఛేదనలో భారత్ 43.5 ఓవర్లలో 174 పరుగులకు ఆలౌటైంది. ఆదర్శ్ (47), అభిషేక్ (42) ఫర్వాలేదనిపించారు. బీర్డ్‌మన్, మెక్‌మిలన్‌కు మూడేసి, వీడ్లెర్‌కు రెండు వికెట్లు దక్కాయి. మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు బీర్డ్‌మన్‌కు దక్కగా.. 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్'గా దక్షిణాఫ్రికా పేసర్ మఫాకా నిలిచాడు.

బ్యాటింగ్ వైఫల్యం

భారీ ఛేదనలో భారత్ దారుణంగా తడబడింది. వరుస విరామాల్లో వికెట్లు కోల్పోతూ తీవ్ర ఒత్తిడిలో పడిపోయింది. టెయిలెండర్ అభిషేక్ పోరాటం కాస్త ఆశలు రేపినా మరో ఎండ్‌లో వికెట్లు లేకపోవడం దెబ్బతీసింది. అయితే తొమ్మిదో వికెట్‌కు తివారి (14 నాటౌట్)తో కలిసి అందించిన 46 పరుగులే ఇన్నింగ్స్‌లో అత్యధికం. సూపర్ ఫామ్‌లో ఉన్న కీలక బ్యాటర్లు ఉదయ్, సచిన్ కనీసం పది పరుగులైనా సాధించలేకపోయారు. ఆరంభంలో ఓపెనర్ ఆదర్శ్ ఓపికను ప్రదర్శించాడు. మూడో ఓవర్‌లోనే సాగిన వికెట్ల పతనం ఎక్కడా ఆగలేదు. పేసర్ బీర్డ్‌మన్, స్పిన్నర్ మెక్‌మిలన్ సంయుక్తంగా భారత్ పతనాన్ని శాసించారు. రెండో వికెట్‌కు ఆదర్శ్, ముషీర్ 37 పరుగులు జత చేశారు. ఓ దశలో భారత్ 122/8 స్కోరుతో ఇబ్బందికరపరిస్థితిలో ఉండగా అభిషేక్, తివారి దాదాపు తొమ్మిది ఓవర్లపాటు ఆసీస్ బౌలర్లను ఎదుర్కొన్నారు. మరో 57 బంతుల్లో 86 రన్స్ కావాల్సిన వేళ అభిషేక్‌ను వీడ్లర్ అవుట్ చేయడంతో ఇక ఎలాంటి ఆశలు లేకపోయింది.

స్కోరుబోర్డు

ఆస్ట్రేలియా: డిక్సన్ (సి) అభిషేక్ (బి) తివారి 42; కొన్‌స్టాస్ (బి) లింబాని 0; వీబ్జెన్ (సి) ముషీర్ ఖాన్ (బి) తివారి 48; హర్జాస్ (ఎల్బీ) సౌమీ 55; రియాన్ (ఎల్బీ) లింబాని 20; పీక్ (నాటౌట్) 46; మెక్‌మిలన్ (సి అండ్ బి) ముషీర్ ఖాన్ 2; ఆండర్సన్ (ఎల్బీ) లింబాని 13; స్ట్రాకర్ (నాటౌట్) 8; **ఎక్స్‌ట్రాలు: 19; మొత్తం: 50 ఓవర్లలో 253/7. వికెట్ల పతనం:** 1-16, 2-94, 3-99, 4-165, 5-181, 6-187, 7-221. **బౌలింగ్:** లింబాని 10-0-38-3; తివారి 9-0-63-2; సౌమీ 10-0-41-1; ముషీర్ 9-0-46-1; అభిషేక్ 10-0-37-0; మోలియా 2-0-17-0.

భారత్: ఆదర్శ్ (సి) హిక్స్ (బి) బీర్డ్‌మన్ 47; అర్షిన్ (సి) హిక్స్ (బి) వీడ్లెర్ 3; ముషీర్ (బి) బీర్డ్‌మన్ 22; ఉదయ్ (సి) వీబ్జెన్ (బి) బీర్డ్‌మన్ 8; సచిన్ దాస్ (సి) హిక్స్ (బి) మెక్‌మిలన్ 9; మోలియా (సి) వీడ్లెర్ (బి) ఆండర్సన్ 9; అవనీష్ (సి అండ్ బి) మెక్‌మిలన్ 0; అభిషేక్ (సి) వీబ్జెన్ (బి) వీడ్లెర్ 42; లింబాని (బి) మెక్‌మిలన్ 0; తివారి (నాటౌట్) 14; సౌమీ (సి) హిక్స్ (బి) స్ట్రాకర్ 2; **ఎక్స్‌ట్రాలు:18; మొత్తం: 43.5 ఓవర్లలో 174 ఆలౌట్; వికెట్ల పతనం:** 1-3, 2-40, 3-55, 4-68, 5-90, 6-91, 7-115, 8-122, 9-168, 10-174. **బౌలింగ్:** వీడ్లెర్ 10-2-35-2; ఆండర్సన్ 9-0-42-1; స్ట్రాకర్ 7.5-1-32-1; బీర్డ్‌మన్ 7-2-15-3; మెక్‌మిలన్ 10-0-43-3.

మ్యాక్స్‌వెల్ 'రికార్డు' సెంచరీ



రెండో టీ20లో ఆసీస్ గెలుపు
విండీస్‌తో సిరీస్ కైవసం

అడిలైడ్: ఆల్‌రౌండర్ గ్లెన్ మ్యాక్స్‌వెల్ రికార్డు మెరుపు సెంచరీ (55 బంతుల్లో 12 ఫోర్లు, 8 సిక్సర్లతో 120 నాటౌట్)తో విరుచుకుపడడంతో వెస్టిండీస్‌తో ఆదివారం జరిగిన రెండో టీ20లో ఆస్ట్రేలియా 34 పరుగులతో గెలుపొందింది. దీంతో మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను మరో టీ20 ఉండగానే సొంతం చేసుకుంది. మొదట ఆసీస్ 20 ఓవర్లలో 4 వికెట్లకు 241 పరుగులు చేసింది. స్వదేశంలో పొట్టి ఫార్మాట్‌లో ఆసీస్‌కిదే అత్యధిక స్కోరు. అలాగే మ్యాక్సీకిది టీ20లలో ఐదో శతకం కావడం విశేషం. ఈ నేపథ్యంలో పొట్టి ఫార్మాట్‌లో అత్యధిక శతకాలు చేసిన రోహిత్ శర్మ రికార్డును అతడు సమం చేశాడు. ఇంకా..టీ20లలో నాలుగో నెంబర్, ఆ కింది స్థానంలో రెండో అత్యధిక స్కోరు చేసిన బ్యాటర్‌గానూ గ్లెన్ రికార్డు అందుకున్నాడు. ఛేదనలో కెప్టెన్ పావెల్ (36 బంతుల్లో 63), రస్సెల్ (16 బంతుల్లో 37) పోరాడినా.. విండీస్ 20 ఓవర్లలో 207/9 స్కోరుకే పరిమితమైంది.

ఉష, మేరీ..మౌనమేల?

సాక్షి మాలిక్

తిరువనంతపురం: లైంగిక వేధింపుల విషయంలో దిగ్గజ అథ్లెట్లు పీటీ ఉష, మేరీ కోమ్ మహిళా రెజ్లర్ల ఆందోళనకు అండగా నిలవలేదని ఒలింపిక్ పతక విజేత సాక్షి మాలిక్ విమర్శించింది. భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ) మాజీ అధ్యక్షుడు బ్రిజ్‌భూషణ్ లైంగిక వేధింపులకు గురి చేస్తున్నాడంటూ వినేష్ ఫొగట్, బజ్‌రంగ్ పూనియా, మాలిక్ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన చేసిన సంగతి తెలిసిందే. దీంతో ప్రభుత్వం మేరీ నేతృత్వంలో విచారణ ప్యానెల్‌ను ఏర్పాటు చేసింది. 'విచారణ సమయంలో రెజ్లర్ల బాధలను విన్న మేరీ.. మాకు తన మద్దతు ఉంటుందని తెలిపింది. ఐవోఏ అధ్యక్షురాలు ఉష కూడా బాధితుల పక్షానే నిలుస్తానని చెప్పింది. కానీ, ఆ ఇద్దరూ ఇప్పుడు నోరు మెదపడం లేద'ని ఓ కార్యక్రమంలో పాల్గొన్న సాక్షి వాపోయింది.

రికీ భుయ్ సెంచరీ
ఆంధ్రకు భారీ ఆధిక్యం

విజయనగరం: కెప్టెన్ రికీ భుయ్ అజేయ సెంచరీ (180 బంతుల్లో 100)తో రాణించడంతో ఉత్తరప్రదేశ్‌తో జరుగుతున్న రంజీలో ఆంధ్ర భారీ ఆధిక్యం అందుకుంది. మూడో రోజైన ఆదివారం 19/1తో రెండో ఇన్నింగ్స్‌ను కొనసాగించిన ఆంధ్ర, ఆటచివరికి 271/5 స్కోరు చేసింది. విహారి ఒక్కడే (48) రాణించాడు. ఈ క్రమంలో రషీద్ (42 నాటౌట్)-రికీ కలిసి ఆరోవికెట్‌కు 87 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. తొలి ఇన్నింగ్స్‌లో లభించిన 63 పరుగుల ఆధిక్యంతో కలిపి ఆంధ్ర 334 పరుగుల లీడ్‌తో కొనసాగుతుంది. సోమవారం ఆటకు చివరిరోజు. తొలి ఇన్నింగ్స్‌లో ఆంధ్ర 261, యూపీ 198 రన్స్ చేశాయి.

వాలీబాల్ విజేత రంగారెడ్డి



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): గచ్చిబౌలి స్టేడియంలో జరిగిన విజయ్ దేవరకొండ (వీడీ) వాలీబాల్ ఓపెన్‌లో రంగారెడ్డి జట్టు విజయం సాధించింది. ఫైనల్లో ఆ జట్టు 15-7, 15-11తో నెల్లూరును ఓడించింది. వాలీబాల్ లీగ్‌లోని హైదరాబాద్ బ్లాక్ హాక్స్ జట్టు జెర్సీని ఆ టీమ్ సహ యజమాని, సినీ హీరో విజయ్ దేవరకొండ ఆవిష్కరించారు. విజయ్, బ్లాక్‌హాక్స్ యజమాని అభిషేక్ రెడ్డి విజేతలకు ట్రోఫీలు బహూకరించారు.

లీచ్‌కు గాయం.. సిరీస్‌కు దూరం

లండన్: భారత పర్యటనలో ఉన్న ఇంగ్లండ్‌కు గట్టిదెబ్బ తగిలింది. సీనియర్ స్పిన్నర్ జాక్ లీచ్.. గాయం కారణంగా టీమిండియాతో మిగిలిన మూడు టెస్ట్‌లకు దూరమయ్యాడు. హైదరాబాద్ టెస్ట్‌లో అతని ఎడమ మోకాలికి దెబ్బ తగిలింది. దీంతో విశాఖలో జరిగిన రెండో మ్యాచ్‌కు 32 ఏళ్ల లీచ్ అందుబాటులో లేడు. జాక్ స్థానాన్ని భర్తీ చేయకపోవడంతో.. మిగిలిన సిరీస్‌లో స్పిన్ త్రయం హార్ట్‌లీ, రెహాన్, బషీర్‌లపైనే ఇంగ్లండ్ ఆధారపడాల్సి ఉంటుంది. ఐదు టెస్ట్‌ల సిరీస్‌లో భాగంగా రాజ్‌కోట్‌లో ఈనెల 15 నుంచి మూడో మ్యాచ్ జరగనుంది.

బిజినెస్

14 % తగ్గిన ఓఎన్‌జీసీ లాభం

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగంలోని ఓఎన్‌జీసీ డిసెంబరుతో ముగిసిన త్రైమాసికంలో నిరుత్సాహకర ఫలితాలను ప్రకటించింది. అక్టోబరు-డిసెంబరు త్రైమాసికానికి గాను స్టాండ్‌ఎలోన్ ప్రాతిపదికన నికరలాభం 14 శాతం క్షీణించి రూ.9,536 కోట్లుగా నమోదైంది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో లాభం రూ.11,045 కోట్లుగా ఉంది. త్రైమాసిక కాలంలో గ్యాస్, చమురు ధరలు పడిపోవటం పనితీరును దెబ్బతీసిందని పేర్కొంది. కాగా ఈ కాలంలో మొత్తం ఆదాయం కూడా 10 శాతం క్షీణించి రూ.34,789 కోట్లకు చేరింది. కాగా ఒక్కో షేరుకు 80 శాతం (రూ.4) రెండో మధ్యంతర డివిడెండ్‌ను కంపెనీ బోర్డు ఆమోదించింది. డివిడెండ్ చెల్లింపులకు గాను కంపెనీ రూ.5,032 కోట్లు కేటాయించింది. గత ఏడాది నవంబరులో ఒక్కో షేరుకు రూ.5.75 మధ్యంతర డివిడెండ్‌ను కంపెనీ ప్రకటించింది. కాగా డిసెంబరుతో ముగిసిన తొమ్మిది నెలల కాలానికి గాను కంపెనీ నికర లాభం 24 శాతం క్షీణించి రూ.29,767 కోట్లుగా నమోదైంది.

పబ్లిక్ ఇష్యూకు అకుమ్స్ డ్రగ్స్

న్యూఢిల్లీ: అకుమ్స్ డ్రగ్స్ అండ్ ఫార్మాస్యూటికల్స్ పబ్లిక్ ఇష్యూకు వస్తోంది. ఈ మేరకు మార్కెట్ నియంత్రణ మండలి సెబీకి ముసాయిదా పత్రాలు సమర్పించింది. ఇష్యూలో భాగంగా కొత్తగా రూ.680 కోట్ల విలువైన ఈక్విటీ షేర్లను జారీ చేయనుండగా ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) ద్వారా ప్రమోటర్లు, ప్రస్తుత ఇన్వెస్టర్లు 1.86 కోట్ల షేర్లను విక్రయించనున్నారు. ఓఎఫ్ఎస్ ద్వారా ప్రమోటర్లు సంజీవ్ జైన్, సందీప్ జైన్, రూబీ క్వాసీ ఇన్వెస్ట్‌మెంట్ హోల్డింగ్స్ పీటీఈ లిమిటెడ్ తమ వాటాలను విక్రయించనున్నట్లు సెబీకి సమర్పించిన డీఆర్‌హెచ్‌పీలో కంపెనీ వెల్లడించింది. కాగా ప్రీ-ఐపీఓ ప్లేస్‌మెంట్ ద్వారా కంపెనీ రూ.136 కోట్లు సమీకరించాలని భావిస్తోంది. ఇష్యూ ద్వారా సమీకరించిన నిధులను రుణాల చెల్లింపుతో పాటు మూలధన అవసరాల నిమిత్తం వినియోగించనుంది.

గోల్డ్ ప్లస్ గ్లాస్ ఇండస్ట్రీ కూడా..: ఫ్లోట్ గ్లాస్ తయారీదారు గోల్డ్ ప్లస్ గ్లాస్ ఇండస్ట్రీ పబ్లిక్ ఇష్యూ ద్వారా రూ.500 కోట్లు సమీకరించాలని భావిస్తోంది. ఈ మేరకు సెబీకి ముసాయిదా పత్రాలు సమర్పించింది. ఇష్యూ ద్వారా కొత్త ఈక్విటీ షేర్లను జారీ చేయటంతో పాటు ప్రమోటర్లు, ప్రస్తుత ఇన్వెస్టర్లు 1.56 కోట్ల ఈక్విటీ షేర్లను విక్రయించనున్నారు.

పేటీఎంలో చైనా పెట్టుబడులు!

పరిశీలించనున్న ప్రభుత్వం

న్యూఢిల్లీ: వన్ 97 కమ్యూనికేషన్స్ లిమిటెడ్ (ఓసీఎల్) అనుబంధ సంస్థ అయిన పేటీఎం పేమెంట్స్ సర్వీసెస్ లిమిటెడ్‌లో (పీపీఎస్ఎల్) చైనా నుంచి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల (ఎఫ్‌డీఐ) వ్యవహారాన్ని కేంద్ర ప్రభుత్వం చురుగ్గా పరిశీలిస్తోంది. పేమెంట్ అగ్రిగేటర్లు, పేమెంట్ గేట్‌వేల నియంత్రణ మార్గదర్శకాలకు అనుగుణంగా పేమెంట్ అగ్రిగేటర్‌గా పని చేయడానికి లైసెన్సు కోసం పీపీఎస్ఎల్ 2020 నవంబరులో భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ)కి దరఖాస్తు చేసింది. అయితే 2022 నవంబరులో ఆర్‌బీఐ ఆ దరఖాస్తును తిరస్కరిస్తూ ఎఫ్‌డీఐ నిబంధనల్లోని ప్రెస్‌నోట్ 3 నిబంధనలకు కట్టుబడుతూ మరోసారి దరఖాస్తు సమర్పించాలని పీపీఎస్ఎల్‌ను ఆదేశించింది. వాస్తవానికి ఓసీఎల్‌లో చైనాకు చెందిన యాంట్ గ్రూప్ పెట్టుబడులున్నాయి. ఈ మేరకు ప్రెస్‌నోట్ 3కి కట్టుబడుతూ ఓసీఎల్ నుంచి తమకు అందిన పెట్టుబడులకు ఆమోదముద్ర పొందడం కోసం 2022 డిసెంబరు 14వ తేదీన పీపీఎస్ఎల్ కేంద్ర ప్రభుత్వానికి దరఖాస్తు చేసింది. ఈ అంశాలన్నింటినీ పరిగణనలోకి తీసుకుని పీపీఎస్ఎల్‌లో చైనా పెట్టుబడుల వ్యవహారం అంతటినీ ఇంటర్ మినిస్టీరియల్ కమిటీ ఒకటి పరిశీలనకు చేపట్టింది. కొవిడ్-19 అనంతర కాలంలో దేశీయ కంపెనీల అవకాశవాద టేకోవర్లను నిరోధించడం లక్ష్యంగా ఏ రంగంలోని కంపెనీలో అయినా భారతదేశ సరిహద్దులను పంచుకునే దేశాల నుంచి ఎఫ్‌డీఐలు స్వీకరించడానికి ప్రభుత్వం నుంచి ముందస్తు అనుమతి తీసుకోవడం తప్పనిసరి అని ప్రెస్‌నోట్ 3 నిర్దేశిస్తోంది. చైనా, బంగ్లాదేశ్, పాకిస్థాన్, భూటాన్, నేపాల్, మయన్మార్, అఫ్ఘనిస్థాన్.. మన దేశంతో భూసరిహద్దు పంచుకునే దేశాలు.

ఇది ఎవరి విషయంలో అయినా జరిగేదే...

కాగా ఈ వ్యవహారంపై పీపీఎస్ఎల్ ప్రతినిధి ఒకరిని సంప్రదించగా పేమెంట్ అగ్రిగేటర్ లైసెన్సుకు ఎవరు దరఖాస్తు చేసినా ఎఫ్‌డీఐ అనుమతి తీసుకోవడం తప్పనిసరి అని, తమ విషయంలో కూడా ప్రస్తుతం జరుగుతున్నది రెగ్యులర్ ప్రాసెస్‌లో భాగమేనని వ్యాఖ్యానించారు. పీపీఎస్ఎల్ అన్ని మార్గదర్శకాలను అనుసరించిందని, అవసరమైన పత్రాలన్నింటినీ నిర్దిష్ట కాలపరిమితిలోగా రెగ్యులేటర్‌కు సమర్పించిందని ఆయన చెప్పారు. "అప్పటి నుంచి యాజమాన్య నిర్మాణంలో మార్పు వచ్చింది. పేటీఎం వ్యవస్థాపకుడు కంపెనీలో అతి పెద్ద వాటాదారుగా ఉన్నారు.

2023 జూలైలో ఓసీఎల్‌లో తన వాటాను యాంట్ ఫైనాన్షియల్ 10 శాతం కన్నా తగ్గించుకుంది. ఈ కారణంగా ఇది ప్రయోజనం పొందిన కంపెనీ యాజమాన్యం వర్గీకరణలోకి రాదు. ఓసీఎల్ వ్యవస్థాపక ప్రమోటర్‌కు ప్రస్తుతం 24.3 శాతం వాటా మాత్రమే ఉంది. అందువల్ల చైనా నుంచి ఎఫ్‌డీఐ అన్న మీ అవగాహన పూర్తిగా తప్పు" అని ఆయన స్పష్టం చేశారు. ఓసీఎల్ అసోసియేట్ కంపెనీ అయిన పీపీబీఎల్‌పై గత నెలలో ఆర్‌బీఐ కొన్ని ఆంక్షలు విధించిన నేపథ్యంలో దీనికి ప్రాధాన్యత ఏర్పడింది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



11వ తేదీ		విజయవాడ	530
హైదరాబాద్	545	విశాఖపట్నం	555
12వ తేదీ		వరంగల్	547
చిత్తూరు	583		
గోదావరి	530	డజను గుడ్లు రూ.72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. **వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్**



హైదరాబాద్	122	గోదావరి	127
వరంగల్	122	విజయవాడ	127
కరీంనగర్	122	గుంటూరు	127
మహబూబ్‌నగర్	122	ఒంగోలు	127
కర్నూలు	122	చిత్తూరు	133
విశాఖపట్నం	122		

పన్ను వసూళ్లలో 20 శాతం వృద్ధి

ఫిబ్రవరి 10 నాటికి రూ.15.60 లక్షల కోట్లు వసూలు

న్యూఢిల్లీ: ప్రత్యక్ష పన్నుల నికర వసూళ్లు శనివారం నాటికి (10 ఫిబ్రవరి) 20 శాతం పెరిగి రూ.15.60 లక్షల కోట్లకు చేరాయి. పూర్తి ఆర్థిక సంవత్సరానికి ప్రభుత్వం సవరించిన బడ్జెట్ అంచనాల్లో ఇది 80 శాతంతో సమానం. "అందుబాటులో ఉన్న గణాంకాల ప్రకారం ప్రత్యక్ష పన్ను వసూళ్లలో నిలకడ వృద్ధి నమోదైంది. 2024 ఫిబ్రవరి 10వ తేదీ నాటికి స్థూల వసూళ్లు రూ.18.38 లక్షల కోట్లకు చేరాయి. గత ఏడాది ఇదే కాలంలో నమోదైన వసూళ్లతో పోల్చితే ఇది 17.30 శాతం అధికం" అని సీబీడీటీ ఒక ప్రకటనలో తెలిపింది. రిఫండ్లు మినహాయించగా ఇది రూ.15.60 లక్షల కోట్లుగా ఉన్నాయని, గత ఏడాది ఇదే కాలంలో వసూళ్లతో పోల్చితే ఇది 20.25 శాతం అధికమని ఆ ప్రకటన వివరించింది. సవరించిన బడ్జెట్ అంచనాల్లో ఇది 80.23 శాతంతో సమానమని పేర్కొంది. సీబీడీటీ అందించిన గణాంకాల ప్రకారం గత ఏడాది ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి ఈ ఏడాది ఫిబ్రవరి 10వ తేదీ వరకు రూ.2.77 లక్షల కోట్లు రిఫండ్లుగా చెల్లింపు జరిగింది. ఇదే కాలంలో కార్పొరేట్ ఆదాయపు పన్నులో (సీఐటీ) 9.16 శాతం, వ్యక్తిగత ఆదాయపు పన్నులో (పీఐటీ) 25.67 శాతం వృద్ధి నమోదైంది. రిఫండ్లు సద్దుబాటు చేసిన అనంతరం నికర వృద్ధి సీఐటీలో 13.57 శాతం, పీఐటీలో 26.91 శాతం ఉంది.

నష్టాల బాటలోనే..!

గత వారం మార్కెట్లు నష్టాల్లో ముగిశాయి. అంతర్జాతీయ పరిణామాలు, మార్కెట్లో నెలకొన్న బేరిష్‌నెస్ దృష్ట్యా ఈ వారం కూడా నష్టాల బాటలోనే సాగే అవకాశాలు కనిపిస్తున్నాయి. నిఫ్టీకి 21,600 వద్ద ప్రధాన మద్దతు ఉంది. ఒకవేళ డౌన్‌ట్రెండ్‌ను సూచిస్తే 21,450/21,250 స్థాయిల వరకు సూచీ పతనం కావచ్చు. నిఫ్టీ 22,000 స్థాయిని అధిగమిస్తే మాత్రం బుల్లిష్‌నెస్ వస్తుంది. ఈ వారం ఎఫ్ఎంసీజీ, ఫైనాన్స్, ఆటోమొబైల్స్, లోహ రంగాల్లోని షేర్లు లాభపడే అవకాశం ఉంది.

స్టాక్ రికమండేషన్స్

గ్రాసిమ్ ఇండస్ట్రీస్: గత ఏడాది అక్టోబరు నుంచి అప్‌ట్రెండ్‌లో కొనసాగిన ఈ షేరు డిసెంబరు నుంచి కన్సాలిడేటెడ్ అవుతోంది. రెండు నెలలుగా రూ.2,050 స్థాయిలో మంచి బేస్ ఏర్పడింది. ఆర్థిక ఫలితాలు మార్కెట్ అంచనాలకు తగట్టుగా ఉండటంతో శుక్రవారం ఈ షేరు 5.41 శాతం లాభంతో రూ.2,168 దగ్గర క్లోజైంది. ట్రేడర్లు ఈ కౌంటర్‌లోకి రూ.2,150/2,170 శ్రేణిలో ప్రవేశించి రూ.2,250/2,290 టార్గెట్ ధరతో పొజిషన్ తీసుకునే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.2,120 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

బ్యాంక్ ఆఫ్ బరోడా: డిసెంబరు త్రైమాసికంలో మంచి లాభాలను ఆర్జించటంతో ఈ షేరు దూకుడు కనబరుస్తోంది. జనవరి చివరి వారం నుంచి ఈ షేరుకు డిమాండ్ పెరిగింది. గత శుక్రవారం ఈ షేరు రూ.265.85 వద్ద క్లోజైంది. పొజిషనల్ ఇన్వెస్టర్లు ఈ కౌంటర్‌లోకి రూ.260 శ్రేణిలో ప్రవేశించి రూ.290/310 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.250 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

అంబుజా సిమెంట్స్: నిఫ్టీతో పోలిస్తే ఈ షేరు మెరుగ్గా ట్రేడవుతోంది. కొన్ని నెలలుగా కన్సాలిడేట్ అయిన ఈ కౌంటర్‌లో నవంబరు నెల చివరలో బుల్లిష్‌నెస్ మొదలైంది. ఇప్పటికీ అదే జోరును కనబరుస్తోంది. ఇది ఇలాగే కొనసాగితే సమీప నిరోధ స్థాయి రూ.600ను బ్రేక్ చేసే అవకాశం ఉంది. గత శుక్రవారం ఈ షేరు రూ.576.60 వద్ద క్లోజైంది. ఇన్వెస్టర్లు ఈ కౌంటర్‌లోకి రూ.570 శ్రేణిలో ప్రవేశించి రూ.620/690 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.558 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

భారత్ ఫోర్జ్: సుదీర్ఘకాలంగా అప్‌ట్రెండ్‌లో కొనసాగుతున్న ఈ కౌంటర్‌లో ఈ మధ్య స్వల్ప దిద్దుబాటు జరిగింది. జనవరి నుంచి ఇప్పటి వరకు రౌండింగ్ బాటమ్ ఏర్పడింది. పైగా ఫలితాలు బాగుండటంతో షేరు దూసుకుపోతోంది. గత శుక్రవారం ఈ షేరు రూ.1,319.45 వద్ద క్లోజైంది. ట్రేడర్లు ఈ కౌంటర్‌లోకి రూ.1,300 స్థాయిల్లో ప్రవేశించి రూ.1,450/1,525 టార్గెట్ ధరతో పొజిషన్ తీసుకునే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.1,275 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

థెర్మాక్స్ లిమిటెడ్: గత ఏడాది నవంబరు 30న ఈ కౌంటర్‌లో భారీగా కొనుగోళ్లు జరిగాయి. అప్పటి నుంచి ఈ షేరు అప్‌ట్రెండ్‌ను ప్రదర్శిస్తోంది. గత శుక్రవారం ఈ షేరు రూ.3,345 వద్ద క్లోజైంది. మదుపరులు ఈ కౌంటర్‌లోకి రూ.3,330/3,300 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.3,500 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.3,275 స్థాయిని కచ్చితమైన స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.



- మూర్తి నాయుడు పాదం,
మార్కెట్ నిపుణులు, నిఫ్టీ మాస్టర్
niftymasterlive@gmail.com

22,100 పైన బుల్లిష్

(ఫిబ్రవరి 12-16 తేదీల మధ్య వారానికి)



డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

గత వారం నిఫ్టీ: 21,783 (-71)

నిఫ్టీ గత వారం 22,127-21,727 పాయింట్ల మధ్యన కదలాడి 71 పాయింట్ల నష్టంతో 21,783 వద్ద ముగిసింది. ఈ వారాంతంలో 22,100 కన్నా పైన ముగిస్తే స్వల్పకాలానికి బుల్లిష్ అవుతుంది.

- 20, 50, 100, 200 రోజుల చలన సగటు స్థాయిలు 21,677, 21,407, 20,182, 19,757 వద్ద ఉన్నాయి. ఇవి నిరోధ, మద్దతు స్థాయిలుగా నిలుస్తాయి. 50 డీఎంఏ 200 డీఎంఏ కన్నా పైన ఉండడం దీర్ఘకాలిక బుల్లిష్ ట్రెండ్ సంకేతం.

బ్రేకౌట్ స్థాయి : 22,100 **బ్రేక్‌డౌన్ స్థాయి:** 21,475
నిరోధ స్థాయిలు: 21,975, 22,075, 22,175
(21,875 పైన బుల్లిష్)
మద్దతు స్థాయిలు: 21,675, 21,575, 21,475
(21,675 దిగువన బేరిష్)

టెక్ వ్యూ
గరిష్ఠ స్థాయిల్లో నిలకడ



వి. సుందర్ రాజా

నిఫ్టీ గత వారం చారిత్రక గరిష్ఠ స్థాయి 22,000 వరకు వెళ్లి రియాక్షన్‌లో పడింది. శుక్రవారంనాడు 21,700 పైన రికవరీ సాధించి 21,780 వద్ద ముగిసింది.. టెక్నికల్‌గా గత కొద్ది వారాల సైడ్‌వేస్ ధోరణిని కొనసాగిస్తున్నప్పటికీ మద్దతు స్థాయిల కన్నా పైనే ఉండడం వల్ల ట్రెండ్ ఇప్పటికీ పాజిటివ్‌గానే ఉంది. అలాగే మద్దతు స్థాయిల కన్నా దిగజారకుండానే కరెక్షన్ పూర్తి చేసుకున్నట్టు కూడా కనిపిస్తోంది. ఫలితంగా పాజిటివ్ కన్సాలిడేషన్ కూడా పూర్తయింది. అందువల్ల మరింత ర్యాలీని ధ్రువీకరించాలంటే చారిత్రక గరిష్ఠ స్థాయి వద్ద ఉన్న నిరోధాన్ని బ్రేక్ చేయాలి. ఇక మిడ్‌క్యాప్ 100 సూచీ మరో 400 పాయింట్ల మేరకు లాభపడినా స్మాల్ క్యాప్ సూచీ మాత్రం ఫ్లాట్‌గా ముగిసింది. శుక్రవారం అమెరికన్ మార్కెట్లలో పాజిటివ్ ధోరణి కారణంగా ఈ వారం మార్కెట్ పాజిటివ్‌గానే ప్రారంభమై 22,000 వద్ద పరీక్షకు గురి కావచ్చు. ఫిబ్రవరిలో ఇలా పరీక్ష ఎదుర్కొనడం మూడో సారి.

బుల్లిష్‌స్థాయిలు: పాజిటివ్ ధోరణిలో ట్రేడయినట్టయితే మరింత అప్‌ట్రెండ్ కోసం మానసిక అవధి 22,000 కన్నా పైన నిలదొక్కుకోవాలి. ప్రధాన నిరోధం 22,150. ఆ పైన మాత్రమే మరింత ర్యాలీకి అవకాశం ఉంటుంది.

బేరిష్ స్థాయిలు: మైనర్ మద్దతు స్థాయి 21,650 కన్నా దిగజారితే మరింత బలహీనపడుతుంది. ప్రధాన స్వల్పకాలిక మద్దతు స్థాయి 21,400. ఇక్కడ కూడా విఫలమైతే స్వల్పకాలిక బలహీనత ఏర్పడుతుంది.

బ్యాంక్ నిఫ్టీ: ఈ సూచీ కూడా గత వారం 46,000 వద్ద రియాక్షన్‌లో పడినా 45,000 స్థాయిలో రికవరీ సాధించి 45,630 వద్ద ముగిసింది. మరింత అప్‌ట్రెండ్ కోసం నిరోధ స్థాయి 46,200 కన్నా పైన నిలదొక్కుకోవాలి. ప్రధాన నిరోధం 47,000. ఒకవేళ 46,000 వద్ద విఫలమైతే అప్రమత్తతను సూచిస్తుంది.

పాటర్న్: మార్కెట్ గత వారం స్వల్పకాలిక 25, 50 డీఎంఏల కన్నా పైన బౌన్స్‌బ్యాక్ సాధించింది. 22,150 వద్ద నిఫ్టీ ట్రిపుల్ టాప్ ఏర్పరచుకుంది. మరింత అప్‌ట్రెండ్ కోసం దీన్ని బ్రేక్ చేయాలి.

టైమ్: ఈ సూచీ ప్రకారం మంగళ, శుక్ర వారాల్లో తదుపరి రివర్సల్స్ ఉండవచ్చు.

సోమవారం స్థాయిలు	
నిరోధం	21,940, 22,000
మద్దతు	21,800, 21,730

www.sundartrends.in

నోట్ : పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే ముందు మదుపరులు తమ ఫైనాన్షియల్ అడ్వైజర్ల సలహాలు తీసుకోవాలి.

జగన్‌ను గద్దె దించుతాం

- ఓటుకు రూ.10 వేలిస్తే తీసుకోండి.. కానీ జగన్‌కు ఓటేయొద్దు
- దళిత సింహగర్జనలో హర్షకుమార్





తూర్పుగోదావరి జిల్లా వేమగిరిలో జరిగిన దళిత సింహగర్జన సభకు భారీగా హాజరైన దళితులు
సభలో కత్తి పట్టిన మాజీ ఎంపీ హర్షకుమార్

రాజమహేంద్రవరంసిటీ/కడియం, ఫిబ్రవరి 11: దళితులను దారుణంగా అణగదొక్కిన సీఎం జగన్‌రెడ్డిని గద్దె దించడమే దళిత సింహగర్జన సభ ముఖ్యోద్దేశమని మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ అన్నారు. ఇది అహంకారానికి, దళితుల ఆత్మగౌరవానికి జరుగుతున్న పోరాటమని, ఎట్టి పరిస్థితుల్లో జగన్‌ను గద్దె దించే వరకు పోరాటం ఆగదని చెప్పారు. ఓటుకు రూ.10 వేలు ఇస్తే తీసుకోండి కానీ జగన్‌కు మాత్రం ఓటేయద్దన్నారు. తూర్పుగోదావరి జిల్లా కడియం మండలం వేమగిరి జాతీయ రహదారి పక్కన ఆదివారం జరిగిన దళిత సింహగర్జన సభలో ఆయన మాట్లాడారు. జగన్ సీఎం అయిన నాటినుంచి రాష్ట్రవ్యాప్తంగా ఎంతోమంది దళితులు హత్యలు, అత్యాచారాలు, దోపిడీలకు గురయ్యారన్నారు. ప్రశ్నించిన ప్రతి గొంతును అణచివేశారని మండిపడ్డారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ పథకాలను నిర్వీర్యం చేశారని విమర్శించారు. ఎన్నికల సీటు కోసమే ఈ రోజు సభ పెట్టినట్టు కొందరు దుష్ప్రచారం చేస్తున్నారని, ఈ సభ దళితుల ఆత్మగౌరవ సభ అని, దగా పడ్డ దళితుడు తిరగబడకపోతే ఇంకా నష్టపోతామని తెలియజేయడానికే సభను పెట్టామన్నారు. హర్షకుమార్ తనయులు జీవీశ్రీరాజ్, సుందర్ పర్యవేక్షించారు. ఆలిండియా క్రిస్టియన్ ఫెడరేషన్ నేత జార్జి సీమంతుల, దళిత సంఘాల నేతలు, ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన దళిత నాయకులు పాల్గొన్నారు.

జగన్‌కు జేజేలపై బీసీల సభలో రభస!

- పలువురు నేతలు నిష్క్రమించే యత్నం.. సీఎంకు వ్యతిరేకంగా నినాదాలు

తాడేపల్లిగూడెం రూరల్, ఫిబ్రవరి 11: పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం మండలం పెదతాడేపల్లిలో బీసీల భారీ బహిరంగ సభలో జగన్ పేరెత్తి జైకొట్టిన సందర్భంలో అక్కడకు వచ్చినవారు వ్యతిరేక నినాదాలు చేయడంతో మంత్రి కారుమూరి నాగేశ్వరరావు అసహనం వ్యక్తం చేశారు. దీంతో నిర్వాహకులు సభ నిర్వహించేందుకు నానా తంటాలు పడ్డారు. వివరాలిలా ఉన్నాయి. బీసీలకు రాజ్యాంగాధికారం కోసం ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభకు హాజరైన ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ పి. వీరన్న మాట్లాడుతూ బీసీలకు వైసీపీ ప్రభుత్వం పెద్దపీట వేసిందని మళ్లీ వైసీపీనే గెలిపించాలని.. జై జగన్ అంటూ నినాదాలు చేశారు. దీంతో అక్కడ ఉన్న బీసీ సంఘ నాయకులు ఆ విషయంపై ఆందోళన చేసి సభ నుంచి వెళ్లేందుకు ప్రయత్నించగా నిర్వాహకులు వారించడంతో ఆగిపోయారు. దీంతో మంత్రి కారుమూరి నాగేశ్వరరావు అసహనంతో వేదిక దిగి వెళ్లే ప్రయత్నం చేయగా నిర్వాహకులు సర్దిచెప్పి సభావేదిక వద్దకు తీసుకొచ్చారు. సభలో బీసీ చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వీరవల్లి శ్రీనివాస్, వివిధ పార్టీల నేతలు తదితరులు మాట్లాడారు.

ఆసరా సొమ్ము అడిగితే బెదిరిస్తున్నారు!

- సీఎస్‌కు డ్వాక్రా సాధికార నేత సునీత లేఖ

అమరావతి, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): డ్వాక్రా మహిళలకు ఆసరా పథకం కింద 4వ విడత సాయానికి సీఎం జగన్ బటన్ నొక్కి 20 రోజులవుతున్నా.. ఇంత వరకు అందరికీ జమ కాలేదని తెలుగునాడు అంగన్వాడీ, డ్వాక్రా సాధికార కమిటీ రాష్ట్ర అధ్యక్షురాలు ఆచంట సునీత ఆరోపించారు. సంక్షేమ పథకాలు అమలు కాక ఇబ్బందులు పడుతున్న డ్వాక్రా మహిళలకు వెంటనే ఆసరా సాయం అందేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డికి ఆమె ఆదివారం బహిరంగ లేఖ రాశారు.

ఆడుదాం ఆంధ్రలో ఇష్టారాజ్యం

- కబడ్డీ పోటీల్లో నిబంధనలకు పాతర
- రెండో రౌండ్‌లో విశాఖ జట్టులోకి బయటి వ్యక్తులు
- అనకాపల్లి జట్టు క్రీడాకారుల తీవ్ర అభ్యంతరం
- గుర్తింపు కార్డులు చూపిస్తేనే ఆడతామంటూ మ్యాచ్ బహిష్కరణ



మ్యాచ్‌ను బహిష్కరించి నిరసన తెలుపుతున్న అనకాపల్లి జిల్లా కబడ్డీ జట్టు సభ్యులు

విశాఖపట్నం, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వం మితిమీరి ప్రచారం చేసుకుంటున్న 'ఆడుదాం ఆంధ్ర' క్రీడా పోటీల్లో నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. క్రీడా స్ఫూర్తికి విరుద్ధంగా, నిబంధనలను పాటించకుండా ఆటలాడిస్తూ తమకు కావాల్సిన జట్లకు మేలు చేకూర్చేందుకు ప్రయత్నిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. నిర్వాహకుల తీరుకు నిరసనగా ఆదివారం అనకాపల్లి జిల్లా కబడ్డీ జట్టు ఆటగాళ్లు రెండో రౌండ్‌లో ఆడాల్సిన గేమ్‌ను బాయ్‌కాట్ చేశారు. 'ఆడుదాం ఆంధ్ర' కబడ్డీ, ఖోఖో రాష్ట్రస్థాయి ఫైనల్ పోటీలను ఆంధ్రా యూనివర్సిటీలోని మైదానంలో నిర్వహిస్తున్నారు. ఆదివారం ఉదయం కబడ్డీ రెండోత రౌండ్ గేమ్ అనకాపల్లి, విశాఖ జిల్లా జట్ల మధ్య నిర్వహించేందుకు ఆటగాళ్ల గుర్తింపు కార్డుల పరిశీలన చేపట్టారు. విశాఖ జిల్లా జట్టు సభ్యులు ఐడీ కార్డులు తీసుకురాలేదు. అయినా, అధికారులు ఈ విషయాన్ని పక్కనపెట్టి మ్యాచ్‌కు సిద్ధం కావాలంటూ అనకాపల్లి జట్టు సభ్యులకు సూచించారు. అయితే, గుర్తింపు కార్డులు చూపించని జట్టుతో ఎలా మ్యాచ్ ఆడిస్తారంటూ అనకాపల్లి జట్టు సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు. విశాఖ జిల్లా సమర్పించిన జట్టు సభ్యుల వివరాలు, వారి గుర్తింపు కార్డులు చూపిస్తే తప్ప మ్యాచ్ ఆడేది లేదంటూ మ్యాచ్‌ను బాయ్‌కాట్ చేశారు.

దుర్గగుడిలో వైవీ డాబు!

- రెడ్‌కార్పెట్ పరిచిన దుర్గగుడి అధికారులు
- 15 నిమిషాల పాటు దర్శనాలు నిలిపివేత



దుర్గగుడి చిన్న రాజగోపురం నుంచి తిరిగి వెళ్తున్న వైవీ సుబ్బారెడ్డి కారు



వైవీ సుబ్బారెడ్డి దంపతులకు అమ్మవారి చిత్రపటం, ప్రసాదం ఇస్తున్న చైర్మన్ రాంబాబు

విజయవాడ, ఫిబ్రవరి 11: ఆయన రాష్ట్రపతి కాదు.. ప్రధానమంత్రి అంతకంటే కాదు.. కనీసం రాష్ట్ర మంత్రి కూడా కాదు. ఆయన సీఎం జగన్‌కు మేనమామ, టీటీడీ మాజీ చైర్మన్. ఆయన పేరు ప్రొటోకాల్‌లోనూ లేదు.. అయినా కాన్వాయ్‌తో పాటు వచ్చిన ఆయన రెండు కార్లు ఆదివారం నేరుగా దుర్గగుడి చిన్న రాజగోపురం వద్దకు దూసుకొచ్చాయి. ఇంకేముంది దుర్గగుడి అధికారులు, సెక్యూరిటీ పెద్ద హడావుడి చేశారు. రెడ్ కార్పెట్ పరిచారు. ఇదంతా చూసిన భక్తులు ఎవరో వీవీఐపీ వస్తున్నారని అనుకున్నారు. కానీ, కారులో నుంచి వైసీపీ నాయకుడు వైవీ సుబ్బారెడ్డి దంపతులు దిగారు. వారిని ఆలయ మర్యాదలతో లోపలికి తీసుకెళ్లారు. ఆయన అంతరాలయ దర్శనం చేసుకుంటున్న సమయంలో సాధారణ భక్తులను అనుమతించలేదు. 15నిమిషాలకు పైగా క్యూలను నిలిపేశారు. విశిష్ట అతిథిగా గుర్తించి మేళతాళాలు, వేదమంత్రాలతో ఆలయ లాంఛనాలు సమర్పించారు. రాష్ట్రపతి, ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి, సుప్రీంకోర్టు ప్రధానన్యాయమూర్తి వంటి వీవీఐపీల కార్లనే చిన్న రాజగోపురం వద్దకు అనుమతిస్తారు. కనీసం మంత్రి హోదా కూడా లేని సుబ్బారెడ్డి కారును అక్కడి వరకూ అనుమతించడం చర్చనీయాంశమైంది.

మేమొస్తే ఏటా డీఎస్సీ



- టీడీపీ కార్యకర్తలను ఇబ్బందిపెట్టిన వారిపై జ్యుడీషియల్ ఎంక్వైరీ వేస్తాం. వారందరినీ జైలుకు పంపిస్తామని హామీ ఇస్తున్నా. - లోకేశ్

(మొదటి పేజీ తరువాయి)

ఆదివారం ఆయన ఇచ్ఛాపురం, పలాస, టెక్కలి నియోజకవర్గాల్లో సభలు నిర్వహించారు. జగన్ ప్రభుత్వ అరాచక పాలనపై విరుచుకుపడ్డారు. నాలుగేళ్లు పడుకొని ఇప్పుడు డీఎస్సీ అంటున్నారని ఆక్షేపించారు. 'ప్రభుత్వంలో 2.30 లక్షల పోస్టులు భర్తీ చేస్తానని చెప్పి జగన్ మడమ తిప్పాడు. డీఎస్సీలో కేవలం 6వేల పోస్టులు మాత్రమే ఉన్నాయని చెబుతున్నారు. టీడీపీ పాలనలో లక్షా 30 వేల పోస్టులు భర్తీ చేశాం. మళ్లీ వస్తే ఏటా డీఎస్సీ నిర్వహిస్తాం' అని ప్రకటించారు. ఆయన ఇంకా ఏమన్నారంటే..

ఎవరు పేదవాడు..?

సొంత చానల్, పేపర్, సిమెంట్ ఫ్యాక్టరీ పెట్టుకున్నవాడు పేదవాడు అవుతాడా? రూ.లక్ష చెప్పులు వేసుకునేవాడు, రూ.వెయ్యి వాటర్ బాటిల్ తాగేవాడు పేదవాడు అవుతాడా? సొంత తల్లి, చెల్లిని బయటకు గెంటేశాడు జగన్. సొంతింట్లో మహిళలకే భద్రత లేదంటే రాష్ట్ర మహిళల పరిస్థితి ఎలా ఉందో ఒక్కసారి ఆలోచించాలి. తొమ్మిదిసార్లు కరెంట్ చార్జీలు, మూడుసార్లు ఆర్టీసీ, ఇంటిపన్ను, చెత్తపన్ను, క్వార్టర్ బాటిల్‌ను కూడా వదల్లేదు. టీడీపీ హయాంలోని వంద సంక్షేమ కార్యక్రమాలను రద్దుచేసిన వ్యక్తి జగన్‌రెడ్డి పదేపదే సిద్ధం అంటున్నారు. ఆయన జైలుకు వెళ్లడానికి సిద్ధంగా ఉన్నారు. మరి పంపడానికి మీరు (ప్రజలను ఉద్దేశించి) సిద్ధంగా ఉన్నారా?

గంజాయి రాజధానిగా మార్చేశారు

దివంగత గిరిమెళ్ల సత్యన్నారాయణ, గౌతు లచ్చన్న వంటి యోధులు, శ్రీకాకుళం కీర్తిని జాతీయస్థాయిలో చాటిన ఎర్రన్నాయుడు వంటి వ్యక్తులను అందించిన గడ్డ శ్రీకాకుళం జిల్లా. నాకు ఉత్తరాంధ్ర అమ్మలాంటిది. అమ్మ ప్రేమకు కండిషన్స్ ఉండవు. చంద్రబాబు హయాంలో ఉత్తరాంధ్రను అభివృద్ధి పథంలో నిలిపితే.. జగన్ గంజాయి కేంద్రంగా మార్చారు. జగన్‌రెడ్డి మూడు రాజధానులు పేరుతో మూడు ముక్కలాట ఆడుతున్నాడు. విశాఖకు ఒక్క కంపెనీ తీసుకురాలేదు. టీడీపీ హయాంలో ఎన్నో పరిశ్రమలకు భూములు కేటాయించాం. జగన్ మాత్రం విశాఖలో రూ.500 కోట్లతో ప్యాలెస్ కట్టుకున్నాడు. రైల్వేజోన్‌కు భూమి కేటాయించలేదు. టీడీపీ అధికారంలోకి వస్తే విశాఖ ఉక్కును రాష్ట్ర ప్రభుత్వమే కొనుగోలు చేసి కాపాడేలా చర్యలు తీసుకుంటాం. తాడిపత్రిలో జేసీ ప్రభాకర రెడ్డిపై ఏకంగా వంద కేసులు నమోదయ్యాయి. నాపై 22 కేసులు పెట్టారు. తగ్గేదే లేదు. అక్రమ కేసుల పెట్టిన వారిని వదిలే ప్రసక్తే లేదు. చంద్రబాబును 53 రోజులు జైలులో బంధించారు. శంఖారావం కార్యక్రమం ద్వారా మనం ప్రతి గడపకు వెళ్లాలి. జగన్ లేని ఆంధ్రప్రదేశ్‌గా లక్ష్యం పెట్టుకుంటాం. కేసుల గురించి భయపడొద్దు. ఎవరిపైన ఎక్కువ కేసులుంటాయో.. వారికే నామినేటెడ్ పదవులు ఇస్తాం.

గొడవలు పెట్టే యత్నం..

రూ.5పేటీఎం బ్యాచ్ మనకు, జనసేన కేడర్‌కు గొడవలు పెట్టేందుకు ప్రయత్నిస్తోంది. ఇరు పార్టీల కార్యకర్తలు అప్రమత్తంగా వారి కుట్రలను తిప్పికొట్టాలి. రాబోయే రెండు నెలలు కష్టపడండి. రాబోయే ఐదేళ్లలో కార్యకర్తల బాధ్యత నేను చూసుకుంటాను. లేని కేసులో.. చంద్రబాబును అరెస్టు చేశారని తెలిసి జనసేన అధినేత పవన్ కల్యాణ్ వెనువెంటనే ఆయన్ను చూసేందుకు ప్రత్యేక విమానంలో వచ్చేందుకు ప్రయత్నిస్తే అనుమతి ఇవ్వలేదు. రోడ్డుపై 3గంటలు ఇబ్బందిపెట్టారు. ఆయన లక్ష్యం ఒక్కటే.. వైసీపీని ఇంటికి పంపించేయడమే. హలో ఏపీ.. బైబై వైసీపీ. కష్టకాలంలో నాకు అన్నగా.. అండగా పవన్ నిలిచారు.

కొండలను మింగేస్తున్న మంత్రి

పలాసలో కొండలను మింగే అనకొండ అప్పలరాజు.. మంత్రిగా పలాసకు ఒక్క పని కూడా చేయలేదు. అహంకారానికి మానవ రూపం.. ఆయన పేరుకే డాక్టర్. వాస్తవంలో ఆయన మంచి యాక్టర్. ఆయన కొండలరాజు. కొండలు కొండలే తవ్వేస్తున్నారు. మంత్రిగారికి ఒకటే చెబుతున్నా.. రెండు నెలలు ఓపిక పట్టు బ్రదర్. వచ్చేది తెలుగుదేశం ప్రభుత్వమే. మొత్తం ఎంక్వైరీ వేసి వడ్డీతో కక్కిస్తాం. సొంత పార్టీ నాయకులు, కార్యకర్తలనే వేధిస్తున్నాడు ఈ మంత్రి తాను కూడా పేదవాడినని అంటున్నాడు. రూ.12 కోట్ల విలువైన లాడ్జి ఎలా కొన్నాడో చెప్పాలి. బర్రెల కొనుగోళ్లలో కూడా కుంభకోణం చేయవచ్చని నిరూపించాడు. రూ.2 వేల కోట్లు ప్రజాధనాన్ని లూటీ చేశాడు. నువ్వలరేవులో నగేశ్ అనే మత్స్యకారుడు అక్కడ కాలేజీలో ఎలా చనిపోయాడో తెలియదు. మంత్రి లాలూచీపడి కనీసం ఆ కుటుంబానికి ఇప్పటివరకు న్యాయం చేయలేదు. పలాస నియోజకవర్గంలో ఐదుగురు మహిళల శవాలు దొరికాయి. వారి కుటుంబాలకు న్యాయం చేయలేదు. టీడీపీ-జనసేన ప్రభుత్వం వచ్చాక మొదటి వంద రోజుల్లో ఆయా కుటుంబాలకు న్యాయం చేసే బాధ్యత వ్యక్తిగతంగా నేను తీసుకుంటా.

యువనేతకు ఉద్దానం పంటల కావడి

లోకేశ్‌కు పలాస నియోజకవర్గ టీడీపీ నాయకులు ఉద్దానం జీవధార పంటలైన జీడి, కొబ్బరి చెట్లను కావడిలో వేసి ఇచ్చారు. వాటిని ఆయన తన భుజంపై పెట్టుకుని వేదిక వద్దకు వచ్చారు. ఎక్స్‌కవేటర్ సహాయంతో గజమాలను లోకేశ్‌కు వేశారు. పలాస జీడిపప్పు గుచ్చాన్ని వ్యాపారులు అందజేశారు.

సీపీఎస్ రద్దు చేయాలన్న సంఘాలు..

సీపీఎస్ రద్దు చేయాలని కోరుతూ ఉపాధ్యాయ సంఘాల నాయకులు లోకేశ్‌కు వినతిపత్రం అందించారు. తమ ప్రభుత్వం వస్తే ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తామని, కొత్త నోటిఫికేషన్లు ఇచ్చే బాధ్యత తానే తీసుకుంటానని ఆయన హామీ ఇచ్చారు.

ఏపీ గంజాయి గుప్పు గుప్పు

(మొదటి పేజీ తరువాయి)

వ్యాపారులు రైతు దగ్గరకే వచ్చి తీసుకువెళతారు. రవాణా బాధ్యత కూడా రైతుది కాదు. వ్యాపారులదే.

తొమ్మిది రెట్ల ఆదాయం..

ఏవోబీలో శీలావతి, రాజహంస, కాలపత్రి.. అనే మూడు రకాల గంజాయి ఎక్కువగా సాగు చేస్తున్నారు. వీటిలో శీలావతి రకానికే డిమాండ్ ఎక్కువ. దీని సాగుతో ఎక్కువ ఆదాయం వస్తుంది. అందుకే పెద్ద సంఖ్యలో రైతులు పండిస్తున్నారు. ఒక ఎకరాలో గంజాయి సాగుకు రూ.లక్ష లోపే ఖర్చవుతుండగా, 500 కిలోల మేలైన శీలావతి (నాణ్యమైన రకం) దిగుబడి వస్తోంది. స్మగ్లర్లు సైతం గిరిజనుల ఇళ్ల వద్దకే వచ్చి కిలో రూ.10 వేలు (ప్రస్తుతం) చొప్పున చెల్లించి ఎండు గంజాయిని తీసుకువెళతారు. వాటి ప్యాకింగ్, మైదాన ప్రాంతాలకు తరలింపు స్మగ్లర్లే చూసుకుంటారు. ఎకరా భూమిలో రూ.లక్ష పెట్టుబడి పెట్టి గంజాయి సాగు చేస్తే కేవలం ఆరు నెలల వ్యవధిలో రూ.9లక్షల లాభం చేతికందుతుంది. అందుకే ఎక్కువ మంది గంజాయి సాగువైపు మొగ్గుచూపుతున్నారు. చాలామంది వ్యాపారులు ఆదివాసీలకు డబ్బు ఎర చూపి వారితో శీలావతి పండిస్తున్నారు. గిరిజనుల వద్ద నుంచి కిలో రూ.10 వేలకు కొనుగోలు చేస్తున్న ఈ ముఠాలు ఎంత ఎక్కువ దూరానికి రవాణా చేస్తే అంతమేర ధరను పెంచుతున్నారు. విశాఖ నుంచి తెలంగాణకు చేరుకునే సరికి దాని ధర రూ.50వేలకు పెరిగి.. ముంబై, కోల్‌కతాల్లో రూ.80 వేల నుంచి రూ.1.2లక్షలు పలుకుతోంది. విశాఖ మన్యం, ఒడిశాలోని కోరాపుట్ నుంచి వివిధ రాష్ట్రాలకు గంజాయి రవాణా అవుతోంది. పలు రాష్ట్రాల నుంచి వ్యాపారులు నేరుగా వచ్చి గంజాయి కొని, తీసుకెళ్తున్నారు. కొందరైతే గిరిజనులకు సాగు కు అవసరమైన డబ్బు కూడా ముందే ఇచ్చేసి.. పంట వచ్చాక మొత్తం తీసుకెళ్తున్నారు. వీరి ద్వారా.. తెలంగాణ, తమిళనాడు, ఢిల్లీ, మహారాష్ట్ర, బిహార్, ఉత్తరప్రదేశ్, పశ్చిమబెంగాల్, గోవా, ఈశాన్య రాష్ట్రాలకు గంజాయి సరఫరా అవుతున్నట్టు సమాచారం. అక్కడ ఈ గంజాయిని పోలీసులు పట్టుకుంటే.. మూలాలు ఎక్కువగానే ఏపీలోనే తేలుతుండడం రాష్ట్రానికి చెడ్డపేరు తెస్తోంది.

శాటిలైట్ చిత్రాలుతీసి..

గంజాయి సాగును కట్టడి చేయాలని కేంద్రం ఎన్‌సీబీని ఏర్పాటు చేసింది. సదరన్ సెక్టార్‌లోని ఐదు రాష్ట్రాల (ఏపీ, ఒడిశా, తెలంగాణ, చత్తీస్‌ఘడ్, మధ్యప్రదేశ్)లో గంజాయిని ఎక్కువగా పండిస్తుండడంతో ఇటువైపు దృష్టి పెట్టింది. గంజాయి సాగును కట్టడి చేసే కార్యక్రమాల్లో భాగంగా అక్టోబరు నుంచి శాటిలైట్ సాయంతో ఫొటోలు తీస్తున్నారు. ఎక్కడైనా గంజాయి సాగు అవుతున్నట్టు కనిపిస్తే.. గ్రేహౌండ్స్, స్పెషల్ పార్టీలను పంపుతున్నారు. వారు నిర్ధారించిన తరువాత పోలీసులు, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో, రెవెన్యూ అధికారులు బృందాలుగా వెళ్లి పంటను నాశనం చేస్తారు. గంజాయి కేసులో మూడుసార్ల కంటే ఎక్కువసార్లు దొరికితే వారిపై పీడీ యాక్ట్ కింద కేసులు పెడుతున్నారు. విశాఖ సెంట్రల్ జైలులో 1,770 మంది ఖైదీలు ఉన్నారు. వారిలో 70శాతం మంది గంజాయి కేసుల్లో దొరికినవారే. రిమాండ్ ఖైదీలలో ఎన్‌డీపీఎస్ చట్టం కింద అరెస్టయినవారు 1,300 మంది వరకు ఉన్నారు. వీరిలో 90 శాతం మంది గిరిజనులే. ఈ కేసుల్లో నిందితుడికి ఆరు నెలల వరకు బెయిల్ ఇవ్వరు. బెయిల్ కోసం ఏ లాయర్ వద్దకు వెళ్లినా రూ.50 వేల నుంచి లక్ష వరకూ ఇవ్వాల్సి ఉంటుంది. అంత డబ్బులు ఖర్చుపెట్టే స్థోమత లేకపోవడంతో చాలామంది బెయిల్ పిటిషన్లు కూడా వేయలేక జైళ్లలోనే మగ్గిపోతున్నారు.

టికెట్ ఇవ్వకుంటే ప్రేమ పోరాటం: బుద్దా వెంకన్న

విజయవాడ(వన్‌టౌన్), ఫిబ్రవరి 11: తనకు టికెట్ ఇవ్వకుంటే చంద్రబాబుతో వైరం ఉండదని, కేవలం ప్రేమ పోరాటమే ఉంటుందని టీడీపీ ఉత్తరాంధ్ర జిల్లాల ఇన్‌చార్జి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్దా వెంకన్న చెప్పారు. విజయవాడలోని తన కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ తరఫున పోటీ చేయడానికి ఒక్కో స్థానం నుంచి 10 మంది పోటీ పడుతుంటే, వైసీపీలో పోటీ చేస్తామనే వారే లేరన్నారు. తనకు విజయవాడ పశ్చిమ, లేదా అనకాపల్లి లోక్‌సభ టికెట్ కానీ ఏదో ఒకటి ఇస్తారని చెప్పారు. సోషల్ మీడియాలో వచ్చే కథనాలను నమ్మవద్దన్నారు. మరో మూడు దశాబ్దాలపాటు లోకేశ్‌కు అండగా నిలబడతానని చెప్పారు. తన నాలుక కోసినా సరే చంద్రబాబును ఏనాడూ విమర్శించనన్నారు. చంద్రబాబు ఢిల్లీ పర్యటనతో జగన్ వెన్నులో వణుకు పుట్టిందన్నారు.

జగన్ అన్ని రంగాలను భ్రష్టు పట్టించారు

- ప్రాజెక్టులకు అరకొర నిధులు: కొణతాల రామకృష్ణ



కొత్తూరు(అనకాపల్లి జిల్లా), ఫిబ్రవరి 11: రాష్ట్రంలో అన్ని రంగాలను భ్రష్టు పట్టించిన ఘనత సీఎం జగన్‌దేనని మాజీ మంత్రి, జనసేన నేత కొణతాల రామకృష్ణ విమర్శించారు. వ్యవసాయ రంగాన్ని వైసీపీ ప్రభుత్వం పూర్తిగా నిర్వీర్యం చేసిందన్నారు. సాగునీటి ప్రాజెక్టులకు అరకొర నిధులు కేటాయించిందని విమర్శించారు. ఉత్తరాంధ్రలోని బాబూ జగ్జీవన్‌రామ్ సుజల స్రవంతి, పోలవరం ఎడమ కాలువ, జంఝావతి, తోటపల్లి, రామతీర్థ సాగరం తదితర ప్రాజెక్టుల పనులు ఒక్క అడుగు కూడా ముందుకు కదల్లేదన్నారు. కొత్తగా తెచ్చిన ల్యాండ్ టైటిలింగ్ ట్రాన్స్‌ఫర్ చట్టం వల్ల రైతులు తమ భూమిపై హక్కు కోల్పోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 25 వేల ఉపాధ్యాయ పోస్టులు ఖాళీ ఉండగా, అధికారంలోకి వచ్చిన నాలుగున్నరేళ్ల తరువాత 6 వేల పోస్టులు భర్తీ చేస్తామని ప్రకటించడం సిగ్గుచేటన్నారు.

తిరుపతి ఉప ఎన్నిక తంతులో..

ఈసారి ఖాకీలపై ఈసీ వేటు

- ఇద్దరు సీఐలు, ఎస్ఐ సస్పెన్షన్
- ఓ హెడ్ కానిస్టేబుల్ కూడా.. ఇంకో ఇద్దరు సీఐలు వీఆర్‌కు

తిరుపతి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ ధర్మాన్ని విస్మరించి.. తిరుపతి లోక్‌సభ ఉప ఎన్నికలో అధికార పక్షం విజయానికి అక్రమాలకు పాల్పడిన అధికారులు, పోలీసులపై కేంద్ర ఎన్నికల కమిషన్ (ఈసీ) వరుసగా చర్యలు తీసుకుంటోంది. ఇప్పటికే ఐఏఎస్ అధికారి గిరీషా, రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోగా.. తాజాగా పోలీసు అధికారులపై కొరడా ఝళిపించింది. ఓటర్ ఐడీ కార్డులు అక్రమంగా డౌన్‌లోడ్ చేసిన వ్యవహారంలో ఇద్దరు సీఐలు, ఓ ఎస్ఐతో పాటు హెడ్ కానిస్టేబుల్‌పై సస్పెన్షన్ వేటు వేసింది. కేసు దర్యాప్తులో నిర్లక్ష్యంగా వ్యవహరించిన అప్పటి తిరుపతి వెస్ట్ సీఐ శివప్రసాద్, ఈస్ట్ సీఐ శివప్రసాదరెడ్డి, ఎస్ఐ జయస్వాములు, హెడ్ కానిస్టేబుల్ ద్వారకానాథరెడ్డిలను ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు సస్పెండ్ చేస్తూ డీఐజీ అమ్మిరెడ్డి ఉత్తర్వులు జారీచేశారు. అదేవిధంగా ప్రస్తుత అలిపిరి సీఐ అబ్బన్నను, అప్పటి అలిపిరి సీఐ దేవేంద్రకుమార్‌ను వీఆర్‌కు బదిలీ చేశారు. ఉప ఎన్నికల కోసం వాడిన నకిలీ ఎపిక్ కార్డులను, ఆధార్ కార్డులను సాక్ష్యాధారాలతో విపక్షాల నేతలు పోలీసులకు అప్పగించగా.. దర్యాప్తు జరిపి చర్యలు తీసుకోకపోగా కాలక్రమంలో ఆయా కేసులను మూసివేయడాన్ని ఈసీ తీవ్రంగా పరిగణించింది. నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో పాటు, విపక్షాల ఫిర్యాదులపై విచారించలేదని నిర్ధారించుకుంది. దొంగ ఓట్లపై వచ్చిన ఫిర్యాదుల మేరకు ఎపిక్ కార్డులు, ఆధార్ కార్డుల వివరాలను సేకరించి భద్రపరచాల్సి ఉండగా, అవేమీ చేయలేదని గుర్తించింది. ఎలాంటి విచారణా లేకుండా వైసీపీ పెద్దల ఒత్తిడితో ఆయా కేసులను మూసివేసినట్లు తేల్చింది. ఈ కేసులో తొలి వేటు ఐఏఎస్ అధికారి గిరీషా మీద పడగా మలివేటు తహశీల్దార్, డిప్యూటీ తహశీల్దార్‌పై పడిన విషయం తెలిసిందే. తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ కమిషనర్‌గా పనిచేసిన చంద్రమౌళీశ్వర్‌రెడ్డిపై కూడా ఈసీ గత శుక్రవారం వేటు వేసింది. ఈ వ్యవహారంలో ఇంకొందరు సస్పెన్షన్‌కు గురయ్యే అవకాశం కనిపిస్తోంది.

టీడీపీ నేతలపై రౌడీ షీట్లు

- పుంగనూరు ఇన్‌చార్జి చల్లా సహా కీలక నాయకులపై నమోదు
- మంత్రి పెద్దిరెడ్డి నియోజకవర్గంలో పోలీసుల స్వామి భక్తి

పుంగనూరు, ఫిబ్రవరి 11: టీడీపీ నేతలను ఎన్నికల సమయంలో కట్టడి చేయాలనే కుట్ర ఇప్పటి నుంచే ప్రారంభమైంది. చిత్తూరు జిల్లాలోని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి నియోజకవర్గమైన పుంగనూరులో టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డిపాటు పలువురు ముఖ్యనేతలపై పోలీసులు రౌడీ షీట్లు తెరిచినట్లు తెలిసింది. గత ఏడాది డిసెంబరు 4న టీడీపీ అధినేత చంద్రబాబు ప్రాజెక్టుల సందర్శన పేరిట చిత్తూరు జిల్లా పర్యటనకు వచ్చారు. ఈ నేపథ్యంలో పోలీసులు పుంగనూరులోకి అనుమతి లేదని నిరాకరించడంతో టీడీపీ శ్రేణులు నిరసనకు దిగారు. ఈ క్రమంలో టీడీపీ శ్రేణులు, పోలీసులకు మధ్య రాళ్ల రువ్వుకోవడం, లాఠీచార్జి తదితర ఘటనలు జరిగాయి. దీనికి సంబంధించి చల్లాపై హత్యాయత్నం, విధులకు ఆటంకం తదితర సెక్షన్ల కింద పుంగనూరు పోలీసులు ఏడు కేసులు నమోదు చేశారు. దాదాపు 500 మంది టీడీపీ కార్యకర్తలను కూడా ఈ కేసుల్లో ఇరికించారు. టీడీపీ నేతలు, కార్యకర్తలు జరగనున్న ఎన్నికల్లో పోలింగ్ ఏజెంట్లుగా ఉండకుండా పెద్దిరెడ్డికి, వైసీపీకి అనుకూలంగా ఉండేలా సుమారు 120 మందిపై రౌడీ షీట్లు తెరవాలని పోలీసులు ప్రతిపాదించినట్లు సమాచారం. పుంగనూరు సీఐ రాఘవరెడ్డి ప్రతిపాదనల మేరకు పలమనేరు డీఎస్పీ సుధాకర్‌రెడ్డి జనవరిలో 12 మందిపై, కొద్ది రోజుల క్రితం బదిలీపై వెళ్లే సమయంలో 29 మందిపై రౌడీ షీట్లు తెరిచినట్లు తెలిసింది. చల్లాపై 755 నెంబరుతో రౌడీ షీట్ ఓపెన్ చేశారని సమాచారం. దీనిపై చల్లా స్పందిస్తూ.. పెద్దిరెడ్డికి అనుకూలంగా, ప్రజాస్వామ్యాన్ని తుంగలో తొక్కేలా పోలీసులు ఏకపక్షంగా వ్యవహరిస్తే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామన్నారు.

బీజేపీపై పంజా ఎప్పుడు?

(మొదటి పేజీ తరువాయి)



నగరి సభలో మాట్లాడుతున్న షర్మిల

ప్రకటించుకుంటారు కదా... మరి ప్రత్యేక హోదా హామీని అమలు చేయని బీజేపీపై మీ పంజా ఎప్పుడు విసురుతారు సార్' అని జగన్‌ను నిలదీశారు. వైఎస్ హయాంలో రైతులకు ప్రాధాన్యం కల్పించిన విషయాన్ని ప్రస్తావిస్తూ "రూ.3వేల కోట్లతో ధరల స్థిరీకరణ నిధి అన్నారు. రూ.4వేల కోట్ల తో విపత్తులు సంభవించినప్పుడు రైతులను ఆదుకుంటామని వాగ్దానం చేశారు. ఒక్క ఏడాదైనా పంట నష్టపోయిన రైతులను ఆర్థికంగా ఆదుకున్నారా?" అని ప్రశ్నించారు. రాజధాని అడిగితే క్యాపిటల్ పేరుతో ఒక మద్యం బ్రాండ్, నిరుద్యోగ యువత డీఎస్సీ అడిగితే అదే పేరుతో మరో మద్యం బ్రాండ్.. ఇలా ఎన్నికల ముందు మీరు ఇచ్చిన హామీలు బ్రాందీ షాపుల్లో మాత్రమే అమలయ్యాయని ఎద్దేవా చేశారు.

సొంత చెల్లెలనే ఇంగితం లేదా

"సొంత చెల్లి అనే ఇంగితజ్ఞానం లేదా నీకు. నాపైన, కుటుంబసభ్యులపైన, సన్నిహితులపైన సోషల్ మీడియాలో అసభ్యకరంగా పోస్టులు పెట్టిస్తావా? మీకు ఇళ్లలో ఆడవాళ్లు లేరా?" అంటూ షర్మిల ఆవేదన వ్యక్తంచేశారు. ఎన్ని విమర్శలు చేసినా హోదా, పోలవరం పూర్తి, రాజధాని నిర్మాణం, ఉద్యోగాల కల్పన తదితర హామీలన్నీ నెరవేరే వరకు రాష్ట్రం విడిచిపెట్టే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు.

రోజా జబర్దస్త్ దోపిడీ

నగరి ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి రోజా దోపిడీని కూడా జబర్దస్త్‌గా చేస్తున్నారని షర్మిల ఆరోపించారు. రాత్రికి రాత్రే కొండలు మాయమవుతున్నాయని, గ్రావెల్, మట్టి, ఇసుక, ఆఖరికి చిన్న చిన్న ఉద్యోగాల్లో సిఫారసులకు కమీషన్లు, హౌసింగ్ స్కీంలో రూ.కోట్ల స్కాం, వెంచర్లు వేయాలంటే రియల్టర్ల నుంచి కప్పం, సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు, తహసీల్దార్ కార్యాలయాల నుంచి నెలవారీ ముడుపులు... అంటూ మంత్రి రోజాపై అవినీతి ఆరోపణలు చేశారు. తనపై పిచ్చివాగుడు వాగితే తెలంగాణలో బీఆర్ఎస్ మంత్రులకు పట్టిన గతే రోజాకు కూడా పడుతుందనే విషయం గుర్తుపెట్టుకోవాలన్నారు.

దేనికి మీరు సిద్ధం?

"మరో రూ.8 లక్షల కోట్లు అప్పులు చేసేందుకా.. ఆంధ్ర రాష్ట్ర ప్రజలను బీజేపీకి బానిసలుగా మార్చేందుకా... మీ స్వార్థ ప్రయోజనాల కోసం ప్రత్యేక హోదాను బీజేపీకి తాకట్టు పెట్టినందుకా... 25లక్షల ఇళ్లు అని చెప్పి ఒక్క ఇల్లూ నిర్మించనందుకా... సంపూర్ణ మద్యపాన నిషేధం చేసిన తరువాతే ఓట్లు అడుగుతానని మహిళలను ఏమార్చినందుకా... 25వేల ఉద్యోగాలతో మెగా డీఎస్సీ అని ఎన్నికల ముందు 6వేల పోస్టులతో దగా డీఎస్సీ ప్రకటించినందుకా.. అధికారంలోకి వచ్చిన వారంలో ఓపీఎస్ ను పునరుద్ధరిస్తానని ఉద్యోగులను నట్టేట ముంచినందుకా... దేనికి మీరు సిద్ధం అని ఊరూరా పోస్టర్లు వేసుకుంటున్నారు" అని సీఎం జగన్‌పై షర్మిల ప్రశ్నలు కురిపించారు.




మాట్లాడుతున్న హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ జి.భవాని ప్రసాద్

కూరగాయల వ్యాపారంలా ఎన్నికలు!

- ప్రజాస్వామ్య వ్యవస్థకు ఓటు పునాదిరాయి
- హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ భవాని ప్రసాద్
- కర్నూలులో 'ప్రజాస్వామ్య పరిరక్షణ' సమావేశం

కర్నూలు(న్యూసిటీ), ఫిబ్రవరి 11: ఓటర్ల క్రియాశీలత, భాగస్వామ్యం ప్రజాస్వామ్య వ్యవస్థకు పునాదిరాయి అని సిటిజన్స్ ఫర్ డెమొక్రసీ చైర్మన్, ఏపీ హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ జి.భవాని ప్రసాద్ అన్నారు. కర్నూలు నగరంలోని ఓ హోటల్‌లో ఆదివారం 'ఓటు వేద్దాం.. ప్రజాస్వామ్య పరిరక్షణ' సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి గాడిచర్ల సర్వోత్తమరావు ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కల్కూర చంద్రశేఖర్, తెలంగాణ రాష్ట్ర విశ్రాంత ప్రధాన ఎన్నికల కమిషనర్ వి.నాగిరెడ్డి, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ మాజీ చీఫ్ సెక్రటరీ ఎల్వీ సుబ్రహ్మణ్యం, ఏపీ రాష్ట్ర విశ్రాంత ఎన్నికల కమిషనర్ నిమ్మగడ్డ రమేష్‌కుమార్, ఏపీ ఎన్జీఓ అసోసియేషన్ మాజీ ప్రధాన కార్యదర్శి పోలంకి సుబ్బారాయన్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జస్టిస్ జి.భవాని ప్రసాద్ మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతి పౌరుడికి ఎలాంటి వివక్షా లేకుండా ఓటు హక్కును రాజ్యాంగం కల్పించిందన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థ రానురాను నైతికంగా పతనం కావడం ఆందోళనను కలిగిస్తోందని వ్యాఖ్యానించారు. గొప్ప మహనీయులను, నిజాయితీపరులను స్వేచ్ఛగా ఎన్నుకున్న దేశం మనదన్నారు. కానీ నేడు డబ్బు, మద్యానికి బానిసలై కొందరు ఓటు హక్కును నైతికంగా వినియోగించుకోలేని దుస్థితిలో పడ్డారని ఆవేదన చెందారు. ఎన్నికలు అంటేనే కూరగాయల వ్యాపారంలా తయారైందని ఆవేదన వ్యక్తం చేశారు. ఐదేళ్లు మార్గదర్శకులైన నాయకులను ఎన్నుకోవడానికి పౌరులందరికి ధైర్యం కల్పించాల్సిన అవసరం ఏర్పడిందన్నారు.


ఓటేయకుంటే వ్యవస్థలు దిగజారుతాయి



నగర, పట్టణ ప్రాంతాల్లో ఓటింగ్ శాతం తగ్గుతోంది. లిథియా లాంటి సంపన్న దేశంలో అందరూ చదుకున్న వారు కావడంతో అక్కడ ఓటింగ్ శాతం తక్కువగా ఉంది. దీంతో ప్రజాస్వామ్య వ్యవస్థ పూర్తిగా పతనం కావడంతో అక్కడ కూడా వెనుజులా పరిస్థితే వచ్చింది. ఓటు వేయడం వల్ల ఎలాంటి మార్పు రాదనే భావనతోనే చదువుకున్న వారు, సంపన్నులు ముందుకు రాకపోవడం సరికాదు. ఓటు హక్కును వినియోగించుకోకుంటే వ్యవస్థలు దిగజారిపోతాయి.

- వి.నాగిరెడ్డి

ఎమ్మెల్యేల్లో జవాబుదారీతనం ఉండాలి



ఎన్నుకున్న ఎమ్మెల్యేలు, ఎంపీలు ఐదేళ్లు ప్రజలకు ఏం చేశారో సమాధానం చెప్పేవిధంగా ఓటర్లలో చైతన్యం రావాలి. ఎన్నికైన ప్రజాప్రతినిధులు ఆరునెలలకు ఒక్కసారి తాము చేసిన అభివృద్ధి పనులను ప్రజలకు వివరించాలి. శాసనసభలో ప్రవేశపెట్టిన బిల్లులు, చట్టాల గురించి అడిగితే చెప్పలేని పరిస్థితుల్లో మన ఎమ్మెల్యేలు, మంత్రులు ఉన్నారు. రాష్ట్ర ప్రజల జీవితాల్లో గుణాత్మక మార్పులు తెచ్చేందుకు సిటిజన్స్ ఫర్ డెమొక్రసీ, ఇతర సంస్థలతో కలిసి రాజకీయాలకు అతీతంగా చేస్తున్న కృషికి పౌర సమాజం స్పందించి, సహకరించాలి.

- ఎల్వీ సుబ్రహ్మణ్యం

రాష్ట్రంలో నిశ్శబ్ద విప్లవం



ఏపీలో నిశబ్ద విప్లవం ప్రారంభమైంది. ఫ్యాక్షన్ నేపథ్యం ఉన్న కర్నూలు జిల్లాలో త్వరలో భారీ మార్పులు చోటు చేసుకుంటాయి. ఎన్నికలు రాష్ట్ర భవిష్యత్తును నిర్దేశిస్తున్న తరుణంలో పౌరులందరూ క్రియాశీలకంగా వ్యవహరించాలి. రాష్ట్రంలో జరుగుతున్న కొన్ని పరిణామాలను డెమొక్రసీ సంస్థ ద్వారా రాష్ట్ర ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకెళ్తున్నాం. జాబితాలో ఓటు లేనిపక్షంలో అప్పీలు చేసుకోవడానికి 15 రోజుల చట్టబద్ధమైన గడువు ఉంది. అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరు లిస్టులో తమ పేరును సరిచూసుకోవాలి. ఫారం-6 ద్వారా ఓటు హక్కు కోరేందుకు నామినేషన్ దాఖలు చేసే రోజు వరకు అవకాశం ఉంటుంది.

- నిమ్మగడ్డ రమేశ్ కుమార్

జగన్ భక్త ఐపీఎస్‌లు

(మొదటి పేజీ తరువాయి)

ఎంపిక చేసి పోస్టింగ్స్ ఇచ్చారు. రాయలసీమలో రిశాంత్ రెడ్డి, ప్రకాశంలో పరమేశ్వర రెడ్డి, ఇంటెలిజెన్స్‌లో ఆనంద్ రెడ్డి.. మొత్తం రాష్ట్ర వ్యాప్తంగా విపక్ష నేతలపై గురిపెట్టేలా రఘురామిరెడ్డికి కీలక బాధ్యతలు అప్పగించింది. ఈ పోస్టింగ్‌లు, అధికారుల చర్యలు చూసి... వ్యవస్థను ఇంతలా స్వార్థానికి వాడుకోవచ్చా అని నిష్పక్షపాతంగా పనిచేసే కొందరు ఐపీఎస్‌లను సైతం ఆశ్చర్యానికి గురి అవుతున్నారు.

ఆ ఎస్పీలు వైసీపీ రక్షకులు..


రిశాంత్ రెడ్డి

చంద్రబాబు తన నియోజకవర్గం కుప్పం వెళ్లకుండా అడ్డుపడటం... టీడీపీ శ్రేణులే లక్ష్యంగా అక్రమ కేసులు.. వంటి ఘనతలు వారం క్రితం చిత్తూరు జిల్లా నుంచి బదిలీ అయిన రిశాంత్ రెడ్డి సొంతం. ఎన్నికల కమిషన్ నుంచి తప్పించుకోవడానికి ఆయనను జిల్లా నుంచి తప్పించి ఎర్ర చందనం టాస్క్‌ఫోర్స్‌కు బదిలీ చేసినట్లు చూపిస్తున్నారు. కానీ, అసలు లక్ష్యం.. ఎర్ర చందనం స్మగ్లింగ్ తనిఖీల పేరుతో రాయలసీమ, నెల్లూరు జిల్లాల్లో ఆయన విస్తృతంగా పర్యటిస్తారు. ప్రతిపక్ష పార్టీల వాహనాలను తనిఖీ చేయడం, వారిని అడ్డుకోవవచ్చు. పైకి ఎర్రచందనం పేరు చెప్పినా లోపల మాత్రం ఆయన ఎన్నికల డ్యూటీయే చేస్తారని ప్రచారం జరుగుతోంది. ఇక... చిత్తూరు జిల్లాకు ఎస్పీగా వచ్చిన జాషువా కృష్ణా జిల్లాలో అధికార పార్టీ పట్ల వీరవిధేయత చాటుకున్నారు. చంద్రబాబు సొంత నియోజకవర్గం కుప్పంలోనూ గెలుస్తామని వైసీపీ నేతలు చెబుతున్న మాటల మేరకు పని చేయాలంటే జాషువా సరైన అధికారి అనే కోరి తెచ్చుకున్నారని చిత్తూరులో వినిపిస్తున్న మాట. అదే జిల్లాలో డీఎస్పీగా పనిచేసిన జాషువాపై గతంలో రికవరీ బంగారం దుర్వినియోగం కేసులో విచారణ జరిగింది. పల్నాడు ఎస్పీ రవిశంకర్ రెడ్డిపై ఉన్న ఆరోపణలు ఎన్నో. ఆయన హయాంలో ప్రతిపక్ష నేతల ఇళ్లల్లోకి దూరి వైసీపీ చేసిన అరాచకాలు, పార్టీ కార్యాలయాల్ని తగుల బెట్టిన దృశ్యాలు ఇలా.. ఎంత చెప్పినా తక్కువే. అటువంటి అధికారిని బదిలీ చేయకుండా ఫ్యాక్షన్ ప్రాంతమైన పల్నాడులో కొనసాగించడం జగన్ ఎన్నికల ఎత్తుగడలో భాగమేనని భావిస్తున్నారు.

వ్యూహాత్మకంగానే ఏపీకి రఘురామిరెడ్డి

వైసీపీ అధికారంలోకి రాక ముందు కేంద్ర సర్వీసుల్లో ఉన్న కొల్లి రఘురామి రెడ్డి కావాలనే రాష్ట్రానికి తిరిగొచ్చి నిఘా విభాగంలో చేరారు. ఆ వెంటనే జగన్ ప్రభుత్వం కక్షపూరితంగా ఏర్పాటు చేసిన అమరావతి భూముల ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) హెడ్‌గా రఘురామి రెడ్డి నియమితులయ్యారు. అప్పటి నుంచి గత ఏడాది సెప్టెంబరులో చంద్రబాబును అరెస్టు చేయడం వరకూ ప్రభుత్వం ఏది చేయమంటే అదే చేశారు. దీంతో ఆయనకు ఏకంగా డీజీ ర్యాంకు(విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్) చీఫ్ పోస్టు ఇచ్చారు. రాష్ట్రంలో పొద్దుటూరు, నంద్యాల, పల్నాడు తదితర ప్రాంతాల్లో డ్రగ్ కేసులు ఎక్కువగా నమోదవుతుంటాయి. ఇతర ప్రాంతాల్లోనూ నకిలీ మందుల విక్రయాలు, ఇతరత్రా కేసులు డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు నమోదు చేస్తున్నారు. గత ఏడాది డ్రగ్ కంట్రోల్ డీజీగా పూర్తిస్థాయి అదనపు బాధ్యతలు స్వీకరించిన కొల్లి రఘురామి రెడ్డి సంచలన కేసులు ఛేదించింది లేదు. కానీ అధికార వైసీపీ తనను ఎందుకు ఉపయోగించుకోవాలి అనుకుందో బాగా తెలిసిన ఆయన మాజీ మంత్రి నారాయణకు చెందిన మెడికల్ కాలేజీతోపాటు ఇళ్లు, కార్యాలయాల్లో శుక్రవారం సోదాలు చేయించారు. ఇంతకూ అసలు విషయం ఏంటని ఆరా తీస్తే నెల్లూరు జిల్లాలోని ఒక వస్త్ర వ్యాపారి.. నారాయణకు రూ.వందల కోట్లు సమకూర్చినట్లు నిఘా పోలీసులకు సమాచారం అందింది. అది నిజమే అనుకుని వేసిన స్కెచ్‌లో భాగంగా డ్రగ్ కంట్రోల్ అధికారులతో పాటు బందోబస్తు పేరు తో తనిఖీలు చేశారు. తాము అనుకున్నది లభించకపోవడంతో నిరాశతో వెనుదిరిగిన పోలీసులకు డ్రగ్ కంట్రోల్ అధికారులు ఒక మాట చెప్పారట! 'మేం చాలా సంవత్సరాలుగా చూస్తున్నాం.. ఈ మెడికల్ కాలేజీలో మందుల విక్రయాల్లో అక్రమాలు ఎప్పుడూ మా దృష్టికి రాలేదని!. కాగా కర్నూలు డీఐజీగా నియమితులైన విజయారావు నెల్లూరు ఎస్పీగా ఉంటూ వైసీపీ నేతలకు అందించిన సహకారం రాష్ట్రంలో తెలియని వారుండరు. అనంతపురం ఎస్పీగా ఉంటూ సీబీఐ ఎస్పీపైనే కేసు పెట్టిన ఫక్కీరప్పకు విశాఖపట్నం సిటీలో కమిషనర్ తర్వాతి పోస్టు ఇవ్వడం ఎన్నికల ఎత్తుగడలో భాగమేనని తెలుస్తోంది. అదే రేంజ్ డీఐజీగా నియమితులైన విశాల్‌గున్నీ గుంటూరు జిల్లా ఎస్పీగా ఉన్నప్పుడు అమరావతి దళిత రైతులపై అట్రాసిటీ కేసులు పెట్టారు.

కావాలనే 'అనంత'కు అన్బురాజన్

రాయలసీమలో టీడీపీకి బలమైన జిల్లా అనంతపురం. అక్కడి ఎస్పీ అన్బురాజన్ నాలుగేళ్లు ఏకధాటిగా కడపలో జగన్ కుటుంబానికి చేసిన సేవ రాష్ట్ర చరిత్రలో గతంలో ఏ ఐపీఎస్ అధికారీ చేయలేదు. వివేకా హత్యకేసులో నిందితుడిని విచారించేందుకు సీబీఐ అధికారులు తీసుకెళుతుంటే, వారిపై కిడ్నాప్ కేసు నమోదు చేసిన ఘనత ఆయనది. పులివెందుల ఏఎస్పీగా పనిచేసినప్పటి నుంచి జగన్ కుటుంబంతో ఉన్న సంబంధం ఆయనను అనంతపురం ఎస్పీగా మరోసారి నియమించేందుకు కారణమైంది. వచ్చే ఎన్నికల్లో రుణం తీర్చుకోవడానికి ఆయన సిద్ధంగా ఉన్నారు.

డీఎస్పీల బదిలీల్లో ఇలా...

ఎన్నికల సమయంలో ఎంతో కీలకమైన సబ్ డివిజనల్ పోలీసు పోస్టుల్లోకి అధికార పక్షానికి అనుకూలంగా లేదా జగన్ సామాజిక వర్గానికి చెందిన వారినే నియమించారు. ఇటీవల 104మంది డీఎస్పీలను బదిలీ చేశారు. అందులో 42సబ్ డివిజన్లలో తమ వారిని కూర్చోబెట్టారు. వీరిలో పది మంది ఏమి చేసేందుకైనా సిద్ధం అనేవారు ఉండగా, మిగతావారు ఏదో రూపంలో ఒత్తిళ్లకు తలొగ్గడం, పోస్టింగ్ ఇచ్చిన కృతజ్ఞత లాంటివి చూపేవారే. పలమనేరు డీఎస్పీగా పనిచేసిన సుధాకర్ రెడ్డికి ఐపీసీని పక్కన బెట్టి మంత్రి పెద్దిరెడ్డి ఆదేశాలను పాటిస్తారనే పేరుంది. అందుకు బహుమతిగా రాయలసీమలో కీలకమైన ఆళ్లగడ్డ డీఎస్పీగా పోస్టు దక్కించుకున్నారు. అనంతపురం డీఎస్పీగా గతంలో పనిచేసి ప్రతిపక్ష పార్టీలకు చెందిన మహిళల ఇళ్లల్లోకి దూరి హింసించిన వీరరాఘవ రెడ్డి, పట్టుబట్టి అనంతపురం డీఎస్పీగా వచ్చారు.

ఉద్యోగులపై 'నిఘా' కోసమే ఆనంద్ రెడ్డి..

విశాఖపట్నం సిటీలో డీసీపీగా పనిచేస్తున్న ఆనంద్‌రెడ్డి ఎన్నికల నిబంధనల ప్రకారం ఉత్తరాంధ్రలో పనిచేయడానికి వీల్లేదు. అందుకని గత నెల 29న విజయవాడ డీసీపీగా ప్రభుత్వం బదిలీ చేసింది. ఆ మరుసటి రోజే మనోడిని అలా పంపడం ఏంటని ఉత్తరాంధ్ర వైసీపీ పెద్దలు.. తాడేపల్లి ప్యాలెస్‌కు ఆనంద్‌రెడ్డి సేవల గురించి చెప్పారు. ఆ వెంటనే ఆయనను జగన్ ప్రభుత్వం ఇంటెలిజెన్స్‌కు బదిలీ చేసింది. ముఖ్యంగా ఉత్తరాంధ్ర జిల్లాల్లో అధికార పార్టీకి వ్యతిరేకంగా ఉండే ప్రభుత్వ ఉద్యోగులపై గురిపెట్టేలా ఆయనను సిద్ధంచేశారు. ఏకంగా 18మంది డీఎస్పీ, సీఐ స్థాయి అధికారులను ఆయనకు ఇచ్చి ఉత్తరాంధ్రతోపాటు గోదావరి జిల్లాల్లో సమాచారం సేకరిస్తున్నారు. టీడీపీ, జనసేనకు అనుకూలంగా ఉండే ప్రభుత్వ అధికారులు, ప్రభావం చూపగల ఉద్యోగుల జాబితా ఆనంద్‌రెడ్డి బృందం సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. అధికార పక్షానికి వ్యతిరేకి అయితే చాలంటూ ఆదాయానికి మించిన ఆస్తుల(డీఏ) కేసులు నమోదుకు సిద్ధమైంది. ఆ పని చేయడానికి ఇటీవలే పశ్చిమగోదావరి నుంచి ఏసీబీ జేడీగా బదిలీ అయిన రవిప్రకాశ్‌ను సిద్ధం చేసినట్లు సమాచారం.

చెవిరెడ్డిని గెలిపించేందుకే..

ప్రకాశం జిల్లాకు ఎస్పీగా వచ్చిన పరమేశ్వర రెడ్డి తిరుపతి ఉప ఎన్నికల్లో నమోదైన కేసుల దర్యాప్తులో వ్యవహరించిన తీరు, ఎఫ్ఐఆర్‌లు ఏకపక్షంగా మూసేసిన వైనాన్ని ఎన్నికల సంఘం తప్పుబట్టింది. అయినా ఆయనను ప్రకాశం జిల్లాకు తెచ్చుకున్న వైసీపీ ప్రభుత్వం ఆ జిల్లాలోని ప్రతిపక్ష పార్టీ ఎమ్మెల్యేలు, నేతలను లక్ష్యంగా చేసుకోమంటూ దిశానిర్దేశం చేసింది. జగన్ ముఖ్యమంత్రి అయిన కొత్తలో ఆయన చీఫ్ సెక్యూరిటీ అధికారిగా పరమేశ్వరరెడ్డి పనిచేశారు. ఈ క్రమంలో పొందిన పెద్దల ఆశీర్వాదంతో తిరుపతి పోస్టు సంపాదించారు. దీనికిగాను తిరుపతిలో ఆయన చూపించిన కృతజ్ఞత ప్రకాశంలోనూ చూపించబోతున్నట్లు తెలుస్తోంది. ఒంగోలు సిట్టింగ్ ఎంపీ స్థానంలో చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని తెచ్చింది. ప్రభుత్వం ఎన్ని ఇబ్బందులు పెట్టినా ఒంగోలులో రెండేళ్ల క్రితం టీడీపీ మహానాడును సక్సెస్ చేసిన ఆ పార్టీకి చెందిన కీలక ఎమ్మెల్యేలు ఇద్దరిపై అధికార పార్టీ పెద్దలు గుర్రుగా ఉన్నారు. పరమేశ్వర రెడ్డిని ఒంగోలుకు తెచ్చుకుంటే వారిని ఇబ్బంది పెట్టడంతోపాటు చెవిరెడ్డిని గెలిపించుకోవచ్చనే ఎత్తుగడ వేశారని సమాచారం.


ముమ్మిడివరం పోలీసుస్టేషన్‌లో సంతకం చేస్తున్న శ్రీనివాసరావు

ఇంటికి చేరిన కోడికత్తి శ్రీను

▸ కోర్టు ఆదేశాలతో పోలీసు స్టేషన్‌కు హాజరు

ముమ్మిడివరం, ఫిబ్రవరి 11: కోడికత్తి కేసులో నిందితుడు జనిపల్లి శ్రీనివాసరావుకి హైకోర్టులో బెయిల్ లభించడంతో ఆదివారం స్వగ్రామం కోనసీమ జిల్లా ముమ్మిడివరం మండలం ఠాణేలంక పెదపేటలోని తమ ఇంటికి చేరుకున్నాడు. శ్రీనివాసరావుకు ఈ నెల 8న బెయిల్ లభించడంతో 9న విశాఖ సెంట్రల్ జైలు నుంచి విడుదలయ్యాడు. న్యాయవాది సలీమ్, తల్లిదండ్రులు సావిత్రమ్మ, తాతారావు, సోదరుడు సుబ్బరాజులతో కలిసి శ్రీనివాసరావు ఆదివారం తెల్లవారుజామున ఇంటికి చేరుకున్నాడు. కాగా, ప్రతి ఆదివారం ముమ్మిడివరం పోలీసుస్టేషన్‌కు హాజరుకావాలని కోర్టు ఆదేశించడంతో ఆదివారం మధ్యాహ్నం పోలీసుస్టేషన్‌కు వెళ్లి ఎస్ఐ డి. సురేశ్‌బాబు ఎదుట సంతకం చేశారు.

మహీ... మనోడే!

(మొదటి పేజీ తరువాయి)

రాకముందు, ఆ తర్వాత కూడా ప్రతి ఏటా వేసవిలో ఆయన హార్సిలీహిల్స్‌కు వెళ్లే వారు. కొద్ది రోజులు బస చేయడం అలవాటుగా చేసుకున్నారు. ఆ ప్రదేశంలో తనకూ కొంత స్థలం ఉంటే ఎంత హాయో అని అప్పుడే కలలు కనేవారు. ఆయన చిన్నప్పటి నుంచి కంటున్న కల ఇప్పటికి సాకారమవుతోంది. జగన్‌తో మహీకి 'క్విడ్ ప్రో కో' తరహా డీల్ కుదిరింది. వీరిది 'యాత్ర-2'తో మొదలైన బంధం కాదు. 2019లోనే ఇది మొదలైంది. అప్పట్లో ఎన్నికల ప్రచారానికి సిద్ధమవుతున్న సమయంలో... జగన్‌ను, వైఎస్‌నూ కీర్తిస్తూ తీసిన 'యాత్ర' చిత్రానికి మహీ దర్శకత్వం వహించారు. జగన్ ఎన్నికల ప్రచారంలో పంచ్ డైలాగులను కూడా రాసిచ్చారు. 'నేను విన్నాను.. నేను ఉన్నాను' అంటూ జగన్ తీసిన దీర్ఘాలు గుర్తున్నాయి కదా! ఆ మాటలు మహీ వి.రాఘవ సృష్టించినవే. ఇప్పుడు.. 2024 ఎన్నికల ముందు 'యాత్ర-2' పేరుతో మరో సినిమా తీశారు. 'యాత్ర'కు మహీ దర్శకుడు మాత్రమే! అచ్చంగా జగన్‌ను కీర్తిస్తూ తీసిన సీక్వెల్ సినిమా నిర్మాణంలో ఆయన కూడా భాగస్వామి అయ్యారు. యాత్ర-2 ప్రకటన, షూటింగ్, విడుదల ఒక అంకం! హార్సిలీహిల్స్‌లో పదెకరాల స్థలం కోసం నేరుగా సీఎం జగన్‌కు దరఖాస్తు, దీనిపై ఫైల్ పెట్టాలంటూ సీఎం కార్యదర్శి ధనుంజయ రెడ్డి ఆదేశాలు, జిల్లా కలెక్టర్‌కు లేఖ, అక్కడి తహసీల్దార్‌కు ఆదేశాలు, శుక్రవారం స్థల పరిశీలన... ఇది మరో అంకం! ఇవి రెండూ ఒకేకాలంలో ముందుకు కదిలాయి. యాత్ర-2కు ముందు దరఖాస్తు పెట్టుకోగా... సినిమా విడుదలైన శుక్రవారమే మదనపల్లె ఆర్డీవో ఈ స్థలాన్ని పరిశీలించి, లైన్ క్లియర్ చేశారు. ఈ రెండెకరాలు తీసుకున్నందుకు.. 2029 ఎన్నికల్లోనూ మహీ వైసీపీకి తన సేవలు అందించాల్సి ఉంటుందని సమాచారం!


'మహాస్వాప్నికుడు' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న జస్టిస్ గోపాలగౌడ తదితరులు

రాష్ట్రంలో ప్రజాప్రభుత్వం రావాలి

▸ అర్జునుడికి కృష్ణుడిలా.. జనమే బాబుకు సారథులవ్వాలి

▸ రాష్ట్ర రాజకీయ చరిత్ర మార్చాలి.. జస్టిస్ గోపాలగౌడ పిలుపు

▸ మాజీ సీఎంపై విక్రమ్ పూల రాసిన 'మహాస్వాప్నికుడు' పుస్తకావిష్కరణ

విజయవాడ, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): 'మహాభారత యుద్ధం 18 రోజులు నడిచింది. అర్జునుడికి కృష్ణుడు సారథిలా పనిచేశాడు. రాబోయే ఎన్నికల్లో చంద్రబాబుకు ప్రజలంతా సారథుల్లా పనిచేయాలి' అని సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ గోపాలగౌడ పిలుపిచ్చారు. రాష్ట్రంలో ప్రజాప్రభుత్వం రావాలని ఆకాంక్షించారు. రైతులు, మహిళల రక్షణకు, వారి భూముల సంరక్షణకు ఇది చాలా అవసరమని చెప్పారు. ప్రస్తుతం జరుగుతున్న చంద్రబాబు సభలు మహాసముద్రాన్ని తలపిస్తున్నాయని.. అయితే ఎన్నికల్లో గెలుపునకు ఇదొక్కటే సరిపోదన్నారు. ప్రజలంతా సారథుల్లా పనిచేసి రాష్ట్రంలో రాజకీయ చరిత్రను మార్చాలని సూచించారు. ఎన్ఆర్ఐ కోడూరి వెంకట్ ప్రచురణకర్తగా, పాత్రికేయుడు విక్రమ్ పూల.. మాజీ సీఎం చంద్రబాబుపై రాసిన 'మహా స్వాప్నికుడు' పుస్తకావిష్కరణ ఆదివారమిక్కడ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన గోపాలగౌడ తొలుత జ్యోతిప్రజ్వలన చేశారు. సదరు పుస్తకాన్ని ఆవిష్కరించి ప్రసంగించారు. 'రాష్ట్రంలో ప్రజాప్రభుత్వం ఏర్పడినప్పుడే రాష్ట్రానికి, దేశానికి మంచి భవిష్యత్ ఉంటుంది. చంద్రబాబు రాష్ట్రానికే కాకుండా.. దేశానికే మంచి రాజకీయ నాయకత్వాన్ని అందించారు. రాజకీయ మేధావి. ప్రజలు, యువకులు, రైతుల అభివృద్ధి కోసం ఎంతో పాటుపడ్డారు. దేవెగౌడ, ఐకే గుజ్రాల్ వంటి వారిని ప్రధానులను చేయడంలో ఎంతో కీలకంగా వ్యవహరించారు. ఐటీ విప్లవం వచ్చినప్పుడు దాని ఫలితాలను యువతకు అందించవచ్చని అప్పటి ప్రధాని వాజపేయికి వివరించి సైబరాబాద్‌కు శ్రీకారం చుట్టారు. ప్రపంచపటంలో సైబరాబాద్‌కు గుర్తింపు తీసుకురావడంలో ఆయన పాత్ర ఎంతో ఉంది. ఈ విషయాన్ని తెలుగు ప్రజలు గుర్తుంచుకోవాలి. ఆయన దేశ రాజకీయ భవిష్యత్‌కు దిక్సూచి. కార్మికులు, మహిళల శ్రేయోభిలాషి. మహాస్వాప్నికుడు పుస్తకంలో చంద్రబాబు రాజకీయ ప్రయాణంలో ఎలాంటి కష్టాలు అనుభవించారో రచయిత విక్రమ్ చాలా స్పష్టంగా రాశారు. ఎస్సీలు, గిరిజనులకు సామాజిక న్యాయం ఇవ్వాలని ఆలోచించిన వ్యక్తి. అన్ని వర్గాలకు సమాన న్యాయం చేయడానికి కృషి చేశారు. దళిత వర్గానికి చెందిన జీఎంసీ బాలయోగిని లోక్‌సభ స్పీకర్‌ను చేశారు. ఆయన మహాస్వాప్నికుడే కాదు.. ఒక మానవతావాది. ఒడిసాలో 1999లో ప్రకృతి విలయతాండం చేసినప్పుడు సరిహద్దులో ఉన్న శ్రీకాకుళం జిల్లాలో పది రోజులు బస చేసి అక్కడ మామూలు పరిస్థితి వచ్చే వరకు విశ్రాంతి తీసుకోలేదు' అని వివరించారు. రచయిత విక్రమ్ పూల మాట్లాడుతూ.. చంద్రబాబు విశ్వనరుడని చెప్పారు. ఆయనకు కులం, మతం, ప్రాంతం ఉండవన్నారు. తాను రాసిన పుస్తకాల్లో ఇది నాల్గోదని.. 'అధినాయకుల అంతరంగాలు', 'ఎన్టీఆర్ అసెంబ్లీ ప్రసంగాలు, రాజకీయ ప్రసంగాలు', 'శకపురుషుడు' సావనీర్‌ను ప్రజల ముందుకు తెచ్చామని చెప్పారు. 1997లో టీడీపీతో అనుబంధం మొదలైందని.. అప్పటి నుంచి చంద్రబాబును దగ్గరగా చూశానని తెలిపారు.

పాఠ్య పుస్తకాల ముద్రణలో భారీ స్కామ్!

▸ రూ.120కోట్ల ప్రజాధనం దోపిడీకి స్కెచ్: టీడీపీ నేత పట్టాభి

అమరావతి, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): పాఠ్య పుస్తకాల ముద్రణ టెండర్లకూ వైసీపీ అవినీతి చీడ పురుగులు పట్టాయని టీడీపీ నేత కొమ్మారెడ్డి పట్టాభిరామ్ ఆరోపించారు. '2022లో పేపర్ ధర టన్ను రూ.లక్ష ఉన్నప్పుడు ఒక్కో పేజీ ముద్రణతో కలిపి 23పైసలుగా నిర్ణయించగా, ప్రస్తుతం పేపర్ ధర తగ్గినా, ఒక్కో పేజీకి ముద్రణతో 34.2పైసలుగా జగన్ సర్కార్ ధర నిర్ణయించింది. 4.78కోట్ల పుస్తకాలు, 739.58కోట్ల పేజీల ముద్రణకు రూ.253కోట్లకు టెండర్ పెట్టారు. తగ్గిన పేపర్ ధర ప్రకారం పాఠ్య పుస్తకాల ఖర్చు రూ.155కోట్లు మాత్రమే అవుతుంది. కానీ టెండర్ రేటు పెంచి, ప్రభుత్వ ఖజానాకు గండి కొట్టి, రూ.120 కోట్లు కాజేసేందుకు విద్యామంత్రి బొత్స భారీ స్కామ్‌కు తెరలేపారు' అని ఆరోపించారు. ఇదంతా సీఎం కనుసన్నల్లోనే జరుగుతోందని, ఇందులో మంత్రి సత్తిబాబు, ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్‌ప్రకాశ్, సీఎంవో కార్యదర్శి ధనుంజయ్‌రెడ్డి ముఖ్య భూమిక పోషించారని ఆరోపించారు.

'చలో విజయవాడ'కు సిద్ధం!

▸ ఈ నెల 27నే ముహూర్తం

▸ సమస్యలు పరిష్కరించకపోతే సమ్మే

▸ గతంలో ఏ ప్రభుత్వానికీ ఉద్యోగులు ఇంతగా సహకారం అందించలేదు

▸ ఇక మావల్ల కాదు.. ఆందోళన తప్పదు

▸ ఈ నెల 14 నుంచి ఉద్యమ శంఖారావం

▸ ఏపీజేఏసీ అధ్యక్షుడు బండి శ్రీనివాసరావు


ఉద్యోగుల ఆందోళన పోస్టర్లను విడుదల చేస్తున్న బండి

విజయవాడ, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): నాలుగున్నరేళ్లుగా ఉద్యోగుల సమస్యలను గాలికి వదిలేసిన జగన్ ప్రభుత్వ తీరుకు నిరసనగా ఈ నెల 14 నుంచి ప్రత్యక్ష ఆందోళనకు సిద్ధమవుతున్నట్టు ఏపీజేఏసీ అధ్యక్షుడు బండి శ్రీనివాసరావు తెలిపారు. ప్రభుత్వం ఇప్పటికైనా దిగిరాకపోతే ఈ నెల 27న 'చలో విజయవాడ'కు సిద్ధమని ప్రకటించారు. సమ్మెకు కూడా వెనుకాడబోమని హెచ్చరించారు. విజయవాడలోని ఏపీఎన్జీవో భవన్‌లో ఆదివారం జరిగిన ఏపీఎన్జీవో రాష్ట్ర విస్తృతస్థాయి సమావేశం అనంతరం బండి మీడియాతో మాట్లాడారు. ఉద్యోగులు దాచుకున్న వివిధ రకాల కాంపొనెంట్స్ డబ్బుతో పాటు పీఆర్సీ డీఏ బకాయిలు, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ వంటి ప్రధాన ఆర్థిక సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. వాయిదాల పద్ధతిలో చెల్లిస్తామని నెలలు గడుస్తున్నా రూపాయి కూడా ఇవ్వలేదన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చి ఐదేళ్లవుతున్నా సమస్యలు పరిష్కరించకపోవటంతో ఉద్యోగుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొందన్నారు. 12వ పీఆర్సీకి సంబంధించి కమిషనర్‌ను నియమించినా పనిచేయటానికి సిబ్బంది, కార్యాలయం వంటివి ఇవ్వలేదన్నారు. ఐఆర్‌ను కూడా ప్రకటించలేదని చెప్పారు. తాము 30 శాతం ఐఆర్‌ను డిమాండ్ చేస్తున్నట్టు చెప్పారు. సీఎం జగన్ స్వయంగా హామీ ఇచ్చిన కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణకు జీవోలు ఇచ్చినా అమలుకు నోచుకోవటం లేదన్నారు. 2004, సెప్టెంబరు 1కి ముందు నోటిఫికేషన్‌లో ఎంపికై, ఆ తర్వాత ఉద్యోగాల్లో చేరిన వారికి పాత పెన్షన్ వర్తింపు, రిటైర్మెంట్ వయసు 62 ఏళ్లకు పెంపు వంటివి ఇప్పటికీ యూనివర్సిటీ తదితర ఉద్యోగులకు అమలు కావడం లేదని తెలిపారు. సోమవారం ప్రభుత్వంతో చర్చలు ఫలించకపోతే డిమాండ్లతో కూడిన నోటీసును చీఫ్ సెక్రటరీకి ఇవ్వనున్నట్టు చెప్పారు. అనంతరం, ఈ నెల 14 నుంచి 27వ తేదీ వరకు నిర్వహించే కార్యాచరణతో కూడిన 'ఉద్యమ శంఖారావం' వాల్ పోస్టర్‌ను బండి ఆవిష్కరించారు. ఈ సమావేశంలో ఏపీజేఏసీ సెక్రటరీ జనరల్ బి. హృదయరాజు తదితరులు పాల్గొన్నారు.

ఏపీజేఏసీ డిమాండ్లు ఇవీ..

12వ పీఆర్సీలో ఐఆర్ 30 శాతం తక్షణమే ప్రకటించాలి. పెండింగ్‌లో ఉన్న రెండు కొత్త డీఏలు(జనవరి, జూలై-2023) తక్షణం ఇవ్వాలి. సీపీఎస్ వారీగా 90 శాతం నగదు రూపంలోనే డీఏలు చెల్లించాలి. పీఎఫ్, ఏపీజీఎల్ఐ లోన్లు-క్లెయిమ్స్, 11వ పీఆర్సీ అరియర్స్ సరెండర్ లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్, మెడికల్ రీయింబర్స్‌మెంట్ చెల్లించాలి. అన్ని నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో ఈహెచ్ఎస్ కార్డు ద్వారా నగదు రహిత వైద్యం అందించాలి. ఇంటి స్థలాలు ఇవ్వాలి. టీచర్లకు అప్రెంటిస్ విధానాన్ని రద్దుచేయాలి. జీవో 11 రద్దు చేయాలి. కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి. స్థానిక సంస్థలు, జడ్పీ యాజమాన్యంలో కారుణ్య నియామకాలు చేపట్టాలి. సీపీఎస్, జీపీఎస్‌లను రద్దు. ఓపీఎస్ అమలు చేయాలి. ప్రతి నెలా 1నే జీతాలు, పెన్షన్లు ఇవ్వాలి.

ఉద్యమ కార్యాచరణ ఇదీ..

ఈ నెల 14: నల్లబ్యాడ్జీలతో విధులకు రావడం, తహసీల్దార్, సబ్ కలెక్టర్, ఆర్డీవోలకు మెమొరాండం. 15, 16: మధ్యాహ్న సమయంలో తాలూకా, పాఠశాలల్లో నిరసనలు. 17: తాలూకా కేంద్రాల్లో ర్యాలీ-ధర్నాలు. 20: కలెక్టరేట్ల వద్ద ధర్నాలు. 21-24 వరకు: జిల్లా కేంద్రాల్లో పర్యటనలు. 27: చలో విజయవాడ.

ప్రభుత్వం కోసం ఉద్యమం చేస్తారా?

ప్రస్తుత ప్రభుత్వం సమస్యలు పరిష్కరిస్తుందన్న నమ్మకం లేదని, ఎన్నికల షెడ్యూల్ విడుదల కాబోతున్న సమయంలో ఉద్యమం దిశగా వెళ్లి ఏం సాధిస్తామని ఏపీఎన్జీవో విస్తృత స్థాయి సమావేశంలో నేతలు అభిప్రాయపడ్డారు. ఇప్పుడు ఉద్యమం చేస్తే ఒనగూరే ప్రయోజనాలు ఏమీ లేవని మెజారిటీ ఏపీజేఏసీ నాయకులు అభిప్రాయపడ్డారు. ఈ ప్రభుత్వం ఏమీ చేయదన్న విషయం తమకు అర్థమవుతున్నా మీకెందుకు అర్థం కావట్లేదని పలువురు ప్రశ్నించారు. ఉద్యమానికి వెళ్దామని, కొన్నయినా సాధించుకుందామని అతి తక్కువ మంది చెప్పారు.

చర్చించుకుందాం రండి!

▸ ఉద్యోగ సంఘాలకు ప్రభుత్వం ఆహ్వానం

ఉద్యోగ సంఘాలతో ప్రభుత్వం మరోసారి చర్చల డ్రామాకు తెరతీసింది. సోమవారం ఉద్యోగ సంఘాల నేతలు చర్చలకు రావాలని ఆహ్వానించింది. ఆర్థిక శాఖ కార్యాలయంలో మధ్యాహ్నం 3.30 గంటలకు మంత్రివర్గ బృందం ఈ సమావేశాన్ని నిర్వహించనున్నట్టు ఏపీజీఏడీ శాఖ 13 సంఘాల నేతలకు లిఖిత పూర్వక ఆహ్వానం పంపింది. ఏపీజేఏసీ, ఏపీజేఏసీ అమరావతి సంఘాలు ఉద్యమం దిశగా కదిలిన నేపథ్యంలో ప్రభుత్వం చర్చలకు పిలవడం గమనార్హం. కాగా, 2022, ఫిబ్రవరి 3న జరిగిన 'చలో విజయవాడ' నేపథ్యంలో గ్రూప్ ఆఫ్ మినిస్టర్స్ దాదాపు 15 సార్లు చర్చలు జరిపారు. అయితే, ఏ ఒక్క దానిలోనూ పరిష్కారం చూపలేకపోయారు. అలాగే, సీఎం జగన్ అధ్యక్షతన కూడా రెండుసార్లు ఉద్యోగ సంఘాల నేతలతో చర్చలు జరిగాయి. ఆయా సమావేశాల్లో ఇచ్చిన హామీలు ఇప్పటికీ నెరవేరలేదు. ఆ తర్వాత ఉద్యోగ సంఘాలు ఉద్యమానికి శ్రీకారం చుట్టగా, సమస్యల పరిష్కారానికి సంబంధించి ప్రభుత్వం షెడ్యూల్‌ను ప్రకటించినా అమలు కాలేదు. విజయవాడలో జరిగిన ఏపీఎన్జీవో రాష్ట్ర మహాసభల్లో సీఎం జగన్ ఇచ్చిన హామీలు కూడా నెరవేరలేదు. ఇటీవల విశాఖలో ఏపీజేఏసీ అమరావతి నిర్వహించిన సమావేశాల్లో పాల్గొన్న మంత్రులు బొత్స సత్యనారాయణ, ఆదిమూలపు సురేశ్ సైతం సమస్యలన్నీ కొద్ది రోజుల్లోనే పరిష్కారమవుతాయని చెప్పటంతో పాటు 12వ పీఆర్సీపై కూడా సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈసారి ఐఆర్ కాదని, ముందే అన్నీ సెటిల్ చేస్తామని చెప్పారు. ఇలా నమ్మిస్తూ వచ్చిన ప్రభుత్వం మళ్లీ చర్చలకు పిలవటం గమనార్హం.

అవినీతి రామ.. కృష్ణ కృష్ణా!

▸ వరుస విజయాలతో చెలరేగుతున్న అక్రమాల రాముడిది అంతులేని చరిత్ర

(అమరావతి-ఆంధ్రజ్యోతి)



అది.. పల్నాడు జిల్లాలో ఓ మూలకు విసిరేసినట్టుగా ఉండే నియోజకవర్గం. ఇక్కడ నుంచి ఒకే నాయకుడు గత కొన్నాళ్లుగా వరుస విజయాలు దక్కించుకుంటున్నారు. ఈ విజయాలు ప్రజలకు మేలు చేస్తాయని అనుకుంటే పొరపాటే.. సదరు నేత అక్రమాస్తులు పోగేసుకునేందుకు, ప్రత్యేక సామ్రాజ్యాన్ని నిర్మించుకుని అవినీతిని సాగించేందుకు మాత్రమే కలిసి వస్తున్నాయని పెద్ద ఎత్తున చర్చసాగుతోంది. నియోజకవర్గంలో ఆ నేత చెప్పిందే రామ వాక్కు! ఆయన నోటి నుంచి వచ్చిందే వేదవాక్కు!! అన్నతరహాలో పని జరిగిపోతుంది. కాదూ.. కూడదని ఎవరైనా అడ్డొస్తే ఇక, అంతే! అంతుచూసే దాకా వదలరు. పోలీసులు సైతం వీరితో చేతులు కలపడంతో అక్రమ కేసులతో అంతులేకుండా పోయింది. నడిరోడ్డుపై ప్రతిపక్ష నేతల గొంతుల కోసేసినా ఖాకీలు కిమ్మనరు. స్టేషన్ల నుంచి కాలు కూడా కదపరు. అంతలా ఆ నేత వీరిని మేనేజ్ చేసేస్తారు. ప్రతిపక్షమనేదే లేకుండా చేసేందుకు ఎంతకైనా తెగిస్తారు. వీరి అకృత్యాలపై ప్రశ్నిస్తే దుకాణాలు, వాహనాలు, కార్యాలయాలనూ తగులబెట్టేస్తారు. ప్రధాన ప్రతిపక్ష పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జిపై అక్రమ కేసులు పెడుతూ పైశాచిక ఆనందం పొందేస్తారు.

దాడి చేసి పదవి తీసుకో!

సిట్టింగ్ ఎమ్మెల్యే ప్రత్యర్థులపై దాడి చేసే వారికి నజరానాలుగా స్థానిక పదవుల ముట్టజెప్పడం ఈ నియోజకవర్గంలో సంప్రదాయంగా మారింది. ఇటీవల ఈ నియోజకవర్గంలోని ఓ మండల అధ్యక్షుడిపై హత్యాయత్నం కూడా జరిగింది. ఇక, లోకల్ బాడీ ఎన్నికల్లో టీడీపీ మద్దతుదారుల నామినేషన్లు తీసుకోవడం లేదన్న విషయం తెలుసుకొని అక్కడకు వచ్చిన ఆ పార్టీ నేతలపై ఎమ్మెల్యే మద్దతు దారుగా ఉన్న ఒక యువనేత కర్రలు, కత్తులతో విరుచుకుపడ్డాడు. దీంతో టీడీపీ నేతలు బతుకు జీవుడా అంటూ ప్రాణాలు ఉగ్గబట్టి పారిపోయారు. ఇంత ఘనత సాధించిన సదరు యువనేతకు లోకాభిరాముడని జేజేలు కొట్టించుకునే ఆ ఎమ్మెల్యే.. ఓ పదవిని కానుకగా ఇచ్చారు. తదుపరి మున్సిపల్ చైర్మన్ పదవి బహుమతిగా ఇచ్చారు.

మాటే శాసనం!

ఆ నియోజకవర్గంలో అధికార పార్టీ ప్రజాప్రతినిధి, ఆయన సోదరుడు చెప్పిందే శాసనం. కాంట్రాక్టులు, రియల్ ఎస్టేట్ వంటి వ్యాపారాలు వీరి అనుచరులు మాత్రమే చేయాలి. మద్యం అక్రమ వ్యాపారం పూర్తిగా వీరి కనుసన్నల్లోనే నడుస్తోంది. ప్రభుత్వ నుంచి వచ్చిన మద్యం సీసాల్లోని మంచి బ్రాండ్లను తమ బెల్ట్ షాపులకు తరలించుకొని అధిక ధరలకు విక్రయిస్తున్నా.. అధికారులు కిమ్మనరు. దీనికి కారణం.. వారిని డబ్బులతో కొడతారు.. కాదంటే.. భౌతికంగా తంతారు. ఇక, తమ సొంత వాహనాల్లో తెలంగాణ నుంచి యథేచ్ఛగా మద్యం రవాణా నిరంతరాయంగా జరుగుతూనే ఉంది. గ్రానైట్ లారీలు ఆ నియోజకవర్గం మీదుగానే ఇతర రాష్ట్రాలకు తరలిపోవాలి. లారీ డ్రైవర్లు వీరికి కప్పం చెల్లిస్తేనే ఆ వాహనాలు నియోజకవర్గం దాటి పోతాయి లేదంటే లక్షలాది రూపాయల జరిమానా కట్టాల్సిందే. దీనిపై పొరుగు నియోజకవర్గ ప్రజాప్రతినిధితో విభేదాలు కూడా వచ్చాయి. ప్రభుత్వ పోరంబోకు భూములను అధికారుల సాయంతో ప్రైవేటు భూములుగా మార్చి బినామీ పేర్లతో రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. నియోజకవర్గానికి సరిహద్దుగా ఉన్న ప్రపంచ పర్యాటక కేంద్రం ప్రాంతంలో వందల ఎకరాలను బినామీ పేర్లతో దోచేశారన్న విమర్శలు ఇప్పటికీ ఉన్నాయి.

అధినేత వద్దే ఆర్భాటం

వినయ విధేయ రాముడినని చెప్పుకొనే ఆ ఎమ్మెల్యేకు దౌర్జనాలపై ఉన్న శ్రద్ధ నియోజకవర్గ అభివృద్ధిపై లేదని విమర్శలు వస్తున్నా ఏమాత్రం తొణకరు, బెణకరు. ఆ నియోజకవర్గంలోని ఓ మండలంలో లిఫ్ట్ ఇరిగేషన్ పథకం ఊసే లేకుండా పోయింది. నియోజకవర్గ కేంద్రంలో ప్రజలకు ఇంటింటికీ తాగునీటిని అందిస్తామని చేపట్టిన పథకం ఏడాది గడుస్తున్నా సాగుతూనే ఉంది. ఇన్నేళ్లుగా గుర్తుకు రాని పథకాలు ఆ ప్రజాప్రతినిధికి తమ అధినేత, సీఎం నియోజకవర్గ కేంద్రానికి వచ్చినప్పుడు గుర్తొచ్చింది. అక్కడి రైతులు, ప్రజలు ఎన్నో దశాబ్దాల కల నెరవేర్చేందుకు కృషి చేస్తున్నట్లు ముఖ్యమంత్రి వద్ద ఆర్భాటం చేసి శిలాఫలకం ఆవిష్కరణ అయితే చేయించారు. అదే సందర్భంలో తన నియోజకవర్గానికి అది కావాలి.. ఇది కావాలి అంటూ కోర్కెలు ఏకరువు పెట్టారు. ఇదంతా నిజమేనని ప్రజలను మభ్య పెట్టారు. అయితే ఆయన కోర్కెలు తీరేందుకు తీసుకున్న చర్యలు, వేసిన అడుగులు భూతద్దం పట్టుకుని చూసినా కనిపించవని సొంత పార్టీ నేతలే అంటారు.

రామ లీలలు ఇవీ

- ప్రజాప్రతినిధి సొంత మండలంలో జరిగిన హత్య కేసులో ఏకంగా బాధితుల మీదే కేసులు పెట్టించి సొంత ఊరికి వెళ్లకుండా వేధించారనే ఆరోపణలు ఉన్నాయి.
- మరో మండలంలో ఒకే సామాజికవర్గం మధ్య వేర్వేరు ఊళ్లలో జరిగిన ఘర్షణలను ఆసారా చేసుకొని టీడీపీ కార్యకర్తలను ఊళ్లలోకి రాకుండా చేస్తూ పొలాలను బీడు పెట్టారు. దీనిపై సాక్షాత్తు టీడీపీ అధినేత ఆ ఊరికి వచ్చి భరోసా కల్పిద్దామనుకున్నా జరగలేదు.
- మైనారిటీ యువకుడిపై హత్యాయత్నం కేసు వివరాలను ఓ వ్యక్తి సోషల్ మీడియాలో పోస్టు చేయడంతో అతనిని పిలిపించి చితకబాది పంపారు.
- అధికార పార్టీ నేతల కార్యక్రమాలే అక్కడ జరుగుతాయి. ప్రతిపక్ష పార్టీల ర్యాలీలు, సభలు జరగనివ్వరు.
- తమ పార్టీ సానుభూతిపరులకు పరామర్శలు, వివాహాది శుభకార్యాలకు హాజరవ్వాలన్నా ప్రతిపక్ష పార్టీల నేతలను పోలీసులు అనుమతించరు.
- ఏడాది కిందట వైసీపీ నిర్వహించిన గడపగడపకు కార్యక్రమంలో జరిగిన వైసీపీ, టీడీపీ ఘర్షణలో ప్రతిపక్ష పార్టీ ఇన్‌చార్జితోపాటు దాదాపు 30 మందికి పైగా టీడీపీ నేతలపై కేసులు పెట్టి కొన్ని నెలలపాటు వారిని నియోజకవర్గంలోకి అడుగు పెట్టకుండా చేశారు.
- టీడీపీకి బలంగా ఉన్న ఓ సామాజికవర్గానికి చెందిన కాంట్రాక్టర్లకు బిల్లుల ఎరవేసి పార్టీలోకి చేర్చుకున్నారు.

జగన్ బోర్డులు పెట్టలేదని!

▸ చిరువ్యాపారులపై జీవీఎంసీ ప్రతాపం

▸ రేపు సీఎం జగన్ పర్యటన

ఎండాడ(విశాఖసిటీ), ఫిబ్రవరి 11: 'మా నమ్మకం నువ్వే జగన్' పేరుతో ఉన్న సైన్ బోర్డులను ఏర్పాటు చేసేందుకు నిరాకరించిన చిరువ్యాపారులపై జీవీఎంసీ అధికారులు ప్రతాపం చూపించారు. సీఎం పర్యటనను సాకుగా చూపించి రోడ్డు పక్కనున్న దుకాణాలను తొలగించేందుకు యత్నించారు. అయితే, టీడీపీ, జనసేన నాయకులు అడ్డుకోవడంతో దుకాణాలపై ఉన్న రేకుల షెడ్లను తొలగించి వెనక్కు వెళ్లిపోయారు. విశాఖపట్నం జిల్లాలో చిరువ్యాపారుల దుకాణాలపై గత కొద్ది రోజులుగా 'మా నమ్మకం నువ్వే జగన్' పేరుతో ఉన్న గ్లో సైన్ బోర్డులను వైసీపీ నేతలు ఏర్పాటు చేయిస్తున్నారు. దుకాణ యజమానులకు ఇష్టం లేకపోయినా.. అధికార పార్టీ నేతలతో తలనొప్పి ఎందుకనే ధోరణిలో చాలా మంది మిన్నకుండిపోతున్నారు. దీనిలో భాగంగా ఎండాడ నుంచి రుషికొండకు వెళ్లే రహదారిలో ఉన్న దుకాణాలపై బోర్డులు పెట్టేందుకు వైసీపీ నేతలు నెల రోజులుగా ప్రయత్నిస్తున్నారు. దీనిని టీడీపీ నేత చెట్టుపల్లి గోపి ఆధ్వర్యంలో నాయకులు అడ్డుకున్నారు. జగన్ బోర్డులు ఎందుకు పెట్టాలంటూ కొంతమంది చిరువ్యాపారులు కూడా నిలదీయడంతో తీవ్ర అసహనానికి గురైన వైసీపీ నేతలు.. ఎలాగైనా బోర్డులు పెట్టించాలని, లేకపోతే అధికారులతో దుకాణాలను తీసేయించాలని నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో జీవీఎంసీ అధికారులు ప్రతాపం చూపించారనే విమర్శలు వస్తున్నాయి.

సీఎం పర్యటనను సాకుగా చూపి...: నగర శివారులోని వీసీఏ-ఏడీసీఏ క్రికెట్ స్టేడియంలో మంగళవారం నిర్వహించనున్న 'ఆడుదాం ఆంధ్రా' ముగింపు వేడుకలకు సీఎం జగన్ రానున్నారు. దీనిని సాకుగా చూపి జగన్ బోర్డులు లేని చిరు దుకాణాలను తొలగించేందుకు జీవీఎంసీ అధికారులను రంగంలోకి దించారు. ఆదివారం దుకాణాలను తొలగించడానికి జీవీఎంసీ సిబ్బంది వెళ్లగా, జనసేన నేత శాఖరి శ్రీనివాస్ సహా టీడీపీ నేతలు అడ్డుకున్నారు.


ఎండాడ-రుషికొండ రోడ్డులో చిరు వ్యాపారుల దుకాణాలు, కౌంటర్లు తొలగిస్తున్న జీవీఎంసీ సిబ్బంది

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.